ఎమ్బీయస్ - గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2011 Q3 జులై - సెప్టెంబరు ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక


**ఆషాఢపు జల్లులేనా...?**
**నగారా మోగించిన నగరవాదం**
**తెరాస యిలా వుంటే తెలంగాణా ఎలా..?**
**రోకో, రోకో రోకో, ఫిర్‌సే రోకో..**
**బిర్ర బిగిసిన సోనియా**
**కాంగ్రెస్ - డిఎంకె**
**డాన్సు చేసే సీనుందా?**
**అయినను పోయి రావలెను హస్తినకు...**
**హస్తినలో హరివిలాసం**
**ఇలా అయితే చర్చలు ఎప్పటి కవుతాయి?**
**రోశయ్యపై ఉక్రోషం దేనికి?**
**శభాష్ సుష్మా**
**14 ఎఫ్ రద్దుపై నిరసనెందుకు?**
**వైయస్ వారసత్వం**
**అన్నా... అన్నన్నా...**
**సకలమా?... వికలమా?**
**జగన్ వర్గం రాజీనామా**
**అవినీతీ - మనమూ**
**నయనతార మతపరివర్తన**
**నెహ్రూ - నిజామాబాద్**
**ఉరి తీయాలా వద్దా?**
**జగన్ ఢిల్లీ యాత్ర**
**జగన్ - యుపిఏ**
**కమ్మలందరూ చౌదర్లు కారా?**
**సకల జనుల సమ్మె**
**ఇంకో నివేదిక...**
**ఆఖరి బంద్..?**
**రాయల్ తెలంగాణ**


**జూన్ 44** **ఎమ్బీయస్ : ఆషాఢపు జల్లులేనా...?**

సంగీత విభావరులలో 'ఏ శామ్ ఆప్ కే నామ్' అంటూంటారు శ్రోతల నుద్దేశించి. అలాగ జులై నెలను తెలంగాణా కే నామ్ అనుకోవచ్చు మనం. ఆగస్టులో పార్లమెంటు సమావేశాలు జరగబోతున్నాయి కాబట్టి ఆ లోపున ఏదో ఒకటి తేల్చకపోతే తెలంగాణా ఎంపీలు పార్లమెంటులో గతంలో లాగ ఏదైనా అట్టహాసం చేసి హై కమాండ్‌ను యిరుకున పెడతారన్న భయం వుంది కాబట్టి జులైలోనే అమీ, తుమీ తేల్చేస్తారని అందరం అనుకుంటూ వచ్చాం. అందుకే క్యాక్ట్‌వారు కూడా జూన్ వరకు గడువు పెట్టారు. తెలంగాణ జాక్ వారు ఓ గడువు పెట్టి మళ్లీ జయశంకర్‌గారు మరణించిన కారణంగా వారి పెద్దకర్మ వరకు గడువు పెంచారు.

(హస్తినాపురికి, దశాహానికి లింకేమిటని అడగకండి).

గడువు దాటిందో మేం గీత దాటినట్టే ఖబడ్దార్ అని క్యాఫ్ట్‌వాళ్లు సాక్షాత్తూ తమ అధిష్టానాన్నే బెదిరించారు. డిసెంబరు 31 న కృష? కమిటీ రిపోర్టు సబ్మిట్ చేసిన తర్వాత నోస్ట్రాడమస్ చెప్పిన ప్రళయం వచ్చేస్తుందని గతంలో ఉద్యమకారులు యిలాగే హెచ్చరించారు. అది పట్టుకుని రిపోర్టర్లు 'డిసెంబరు 31 తర్వాత ఏమవుతుంది?' అని గవర్నర్ నరసింహన్‌గార్ని అడిగితే ఆయన 'డిసెంబరు 31 తర్వాత జనవరి 1 వస్తుంది' అని ఈ మాత్రం తెలియదా? ఎవడయ్యా నీకు ఎలిమెంటరీ స్కూల్లో పాఠాలు చెప్పినవాడు అన్నట్టు ఫేస్ పెట్టారు. 'హత్తెరీ అంతమాట అంటారా? జనవరి 1 ఒంటరిగా వస్తుందా? దానితో బాటు భూకంపం, అగ్నివర్షం, రక్తప్రవాహం వెంటబెట్టుకుని రాదా? వాటి గురించి చెప్పి జనాల్ని అదలేయద్దా?' అని ఉద్యమకారులు మండిపడ్డారు.

జనవరి 1 వచ్చింది, వెళ్లింది. కూడా రావలసినవి మొహం చాటేశాయి. దరిమిలా అక్కడెక్కడో జపాన్‌లో వేరే కారణాల వలన వచ్చాయి తప్ప క ృష?కమిటీ పేరు చెప్పుకుని యిక్కడ రాలేదు. అలాగే జూన్ 30 వెళ్లింది. జులై 1 వచ్చింది. హై కమాండ్ కదిలినట్టు కనిపించలేదు. కదలడం కాదు కదా, తొణికినట్టు కనబడలేదు. ''వరుడు కావాలి''లో పెళ్లి చూపులకు వచ్చినవాణ్ని ఏడిపిస్తూ భానుమతి పాడిన పాట వుంది ''చూడవయ్యా, చూడవయ్యా, తొణక్క, బెణక్క, సణక్క, గొణక్క చూడవయా..'అని. అది గుర్తుకు వచ్చింది. జులై 1న ఆజాద్, అభిషేక్ సింఘ్వి స్టేటుమెంట్లు చూస్తూ వుంటే. ఇవతల క్యాఫ్ట్‌వాళ్లు వీరాధివీరుడు, శూరాధిశూరుడు, ఏకకాల ఉభయభాషాప్రవీణ, తీవ్రావేశప్రతీక – కేకే గారి అధ్యక్షతన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మీటింగు పెట్టుకున్నారని తెలుసు. సోమవారానికి రాజీనామా పత్రాలు స్పీకరుకి యిస్తామని ప్రకటించారనీ తెలుసు. అయినా వరుడుకావాలిలో వరుడిలా మొద్దు రాచ్చిప్పలా కూర్చుని అరిగిపోయిన రికార్డే మళ్లీ వేశారు.

జూన్‌లో పెట్టిన భోజనాల సెగ ఢిల్లీకి తగిలిందన్న నమ్మకంతోనే తెలంగాణ జాక్ జులై 10 నుండి గ్రామాల్లో కూడా సామూహిక భోజన కార్యక్రమం పెట్టబోతోంది. బోయినాల (భోజనాల) జూన్ తెలంగాణను తేలేదు. బోనాల జులై తెస్తుందా? విజయశాంతి సికింద్రాబాద్ మహంకాళి గుడికి వెండిబోనాలతో వస్తుందా? రాదా? ఆషాఢమాసం వర్షపుజల్లుల మాసం. పైనుండి తెలంగాణ కురుస్తుందా? లేక ఆషాఢమేఘాలలా ఆరాటేం చేసి, నాలుగు జల్లులు కురిపించి వూరుకుంటుందా? ఈ ప్రశ్నలకు జవాబులు వెతుకుదాం.

ఏ మాట కా మాట చెప్పాలంటే జూన్ నెల కాస్త యాక్టివ్‌గానే నడిచింది. జయశంకర్ మ ృతి తెలంగాణా వాదులను ఒక్కసారి జాగ ృతం చేసింది. నాగం జనార్దన రెడ్డి టిడిపినుండి బయటపడి ముందెన్నడూ విననంత ఉచ్చస్వరంతో తెలంగాణ గురించి మాట్లాడుతున్నారు. కెసియార్ యింటికి వెళ్లారు. కెసియార్ జానారెడ్డి యింటికి వెళ్లారు. ఆ పాపానికి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ మీటింగులో రాజీనామాల భారాన్ని జానారెడ్డిపై పెట్టారు తక్కిన నాయకులు. ''సాక్షాత్తూ కెసియారే మీ యింటికి వచ్చిన పెద్ద లీడరు మీరు. మీ యింటికి వచ్చి మీరు పెట్టిన టిఫెన్లు సేవించి, అక్కణ్నుంచే స్పీకరు వద్దకు వెళ్లి రాజీనామాలు సమర్పిద్దాం.'' అని ప్రతిపాదించారు. జానారెడ్డి మారు మాట్లాడలేకపోయారు. హై కమాండ్ తనపైనే కన్నేసి వుంచుతుందని తెలిసినా, బొత్సను తనే ఎదుర్కోవాల్సి వుంటుందని తెలిసినా జానాకు గత్యంతరం లేకపోయింది. అసలే వెయిట్ చెయ్యంగా చెయ్యంగా మంత్రి పదవి వచ్చింది. వీళ్ల ధర్మాన అదీ వూడేట్టుంది. ఇంకేం చేయలేక సరే కానీయండి అన్నారు. లోపల ఏ గుణకారాలు, భాగారాలు వేస్తున్నారో దేవుడికి తెలియాలి.

ఇంత కార్యక్రమం అయిన తర్వాత కూడా ఆజాద్ పాతపాటే పాడారు – ''తొందరపడి రాజీనామాలు చేసి జటిలం చేయవద్దు. తెలంగాణా పరిష్కారం యితర రాష్ట్రాలతో ముడిపడి వుంది. సెంటిమెంటు తెలంగాణ సొత్తు మాత్రమే కాదు. కోస్తా, సీమవాసులకూ సెంటిమెంటు వుంటుంది. మూడు ప్రాంతాల ప్రజల, రైతుల, కూలీల (చివరి రెండు వర్గాలూ ప్రజల్లోకి రావా!?) ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలి. రాష్ట్రంలోని అన్ని పార్టీలతోను, దేశంలోని అన్ని పార్టీలతోను, ముఖ్యంగా ప్రాంతీయపార్టీలతోను మాట్లాడాలి. రాజకీయంగా ఎటువంటి నష్టం జరగని రీతిలో నిర?యం జరగాల్సి వుంది.'' అన్నారు.

అన్నీ అక్షరసత్యాలే. అయితే ప్రశ్న ఏమిటంటే – ఈ పని 2004 నుండి ఎందుకు మొదలు పెట్టలేదని? ఎంత పెద్ద ప్రయాణమైనా చిన్న అడుగుతోనే ప్రారంభమవుతుంది. ఆ అడుగైనా పడకపోతే ఎలా? ప్రణబ్ కమిటీ అన్నదే బోగస్. ఏదీ సిన్సియర్‌గా చేయలేదు. పోనీ గతం గతః. కృష? కమిటీ రిపోర్టు యిచ్చిన తర్వాతైనా అది దగ్గర పెట్టుకుని చర్చ ప్రారంభించాలిగా. ప్రారంభిస్తే ఎప్పటికో అప్పటికి చర్చ ముగుస్తుంది. కానీ ఏం చేశారట? ఏమీ చేయలేదు. ఖాతరు చేయకుండా, మొండిగా, బండరాయిలా కూర్చున్నారు.

ఈ బండరాయిని కదల్చడానికి క్యాఫ్ట్ వాళ్ల దగ్గరున్న అస్త్రం ఏమిటి? రాజీనామా! తెరాసవారు వారికి నిరంతరం ఉపదేశం చేసే తారకమంత్రం కూడా అదే ! పాపం వాళ్ల తప్పు లేదు. వాళ్ల దగ్గరున్న మంత్రమూ అదే. అదే పాచిక విసురుతూ వచ్చారు. విసిరినప్పుడల్లా సగం సీట్లు వస్తూ వచ్చాయి. ఈ మంత్రం పారని మంత్రంరా అనుకుంటూండగా మొన్నసారి మాత్రం కళ్లు తిరిగేటంత గొప్ప ఫలితాలు వచ్చాయి. దానితో మళ్లీ అదే మంత్రాన్ని ఆశ్రయించారు తెరాస వారు. తక్కినవాళ్లకూ అదే ఉపదేశిస్తున్నారు.

రాజీనామాల వలన లాభం ఏమిటి? అన్న ప్రశ్న అందర్నీ దొలిచేస్తోంది. ముఖ్యంగా అధికారంలో వున్న కాంగ్రెస్ వారిని. టిడిపివారు పెద్దగా బుర్ర పెట్టటం లేదు. తద్దినం పెట్టేవాడి తమ్ముడి పాత్ర వాళ్లది. కాంగ్రెసన్న తద్దినం పెడుతూ వుంటే పక్కనే కూర్చుని వాడు తిప్పినట్టుగా చేతులు తిప్పడమే. 'మీరు రాజీనామా చేస్తున్నారా? పదండి, మేమూ మీ వెనక్కాలే..'అంటారు తప్ప,

‘తెలంగాణలో సహజనాయకులం మేం, మాకున్న క్యాడర్ మీకెవరికీ లేదు, తెలంగాణను అభివృద్ధి చేసినవాళ్లగా మా హక్కునుపయోగించి, మేం ముందెళతాం, మీరు వెనక్కాల రండి’ అనరు. కాంగ్రెసు వాళ్లు అడ్డదిడ్డంగా రాంగ్ డైరక్షన్‌లో చేతులు తిప్పరని, అందువలన తామూ చేతులు తిప్పే అవసరం పడదని వాళ్ల నమ్మకం.

నిన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ మీటింగులో వున్నది 30 మంది ఎమ్మెల్యేలు. అంటే ఉన్న 53 మందిలో 60% అన్నమాట. ఈ 30 మందిలో మంత్రులు 9 మంది. 6 గురు రాలేదు. అనగా సగం జిల్లాల మంత్రులు రాలేదు. ఎంపీలు 12 మంది వుంటే 6 గురు వచ్చారు. వచ్చినవాళ్లందరూ కూడా వెంటనే రాజీనామాకు సిద్ధపడలేదు. ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ రిజైన్ చేశాక అప్పుడు చేస్తాం అని మంత్రులు గునిశారు. ఉపముఖ్యమంత్రి కాబోయి తప్పిపోయి రగులుతున్న గీతారెడ్డి మాత్రం చర్చ మధ్యలో నిలబడి “నేను రెడీ” అనడంతో తక్కినవాళ్లూ ఔననక తప్పలేదు. ఇక 21 మంది ఎమ్మెల్యేలలో సగం మంది బిక్కుబిక్కుమంటూనే వున్నారు. జగ్గారెడ్డి బయటకు వచ్చాక రిజైన్ చేయను పొమ్మన్నారు. రాజ్యసభ ఎంపీలు చేస్తే లాభం ఏమిటని లాజిక్ లాగారు హనుమంతరావు. సోమవారం లోపున యిలాటి స్వరాలు ఎన్ని వినబడతాయో తెలియదు. విద్యార్థులు చుట్టుముట్టి రిజైన్ చేయాలని ఒత్తిడి చేసినపుడు డైలాగులు కొట్టి సరే చేస్తాననడం వేరు. తాపీగా కూర్చుని రిజైన్ చేయాలా వద్దా అని తర్జనభర్జన పడి తేల్చుకునే నిర?యం వేరు.

ఎందుకీ తర్జనభర్జన? తెరాసవారు రాజీనామాలు ఏం సాధించారు అన్నది మొదటి ప్రశ్న. ఆంధ్రప్రదేశ్ అన్న కాన్సెప్టే యిష్టపడక బయటకు వెళ్లిపోయి మళ్లీ అదే ఆంధ్రప్రదేశ్ ఎసెంబ్లీ సభ్యుడిగా ప్రస్తుతం వున్న రాష్ట్ర ప్రయోజనాలను కాపాడతానని ప్రమాణస్వీకారం చేయడం దేనికి? రిజైన్ చేశాక తెలంగాణ వచ్చేవరకు మళ్లీ పోటీ చేయం అంటే అదో దారి. (మోత్కుపల్లి నర్సింలు అదే అడిగారు). పునరపి జననం, పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనం అన్నట్టు – అసెంబ్లీలో కూర్చోవడం, రాజీనామా చేయడం, నెగ్గడం, మళ్లీ అదే అసెంబ్లీలో సీటు దులుపుకుని కూర్చోవడం.. దీనివలన ప్రజలకు ఒనగూడే ప్రయోజనం యిసుమంతైనా లేదు, నియోజకవర్గానికి ఏవైనా ప్రాజెక్టులు తెప్పించుకుంటే కలిగే వ్యక్తిగత లాభాలలో యిప్పుడు యిసుకంతైనా రాలదు.

మామూలుగా మంచి మెజారిటీతో నెగ్గితే గొప్పగా చెప్పుకోవచ్చు. ఇప్పుడో? లక్షలాది మెజారిటీ వచ్చినా రిజైన్ చేశారన్న సింపతీతో వేసిన ఓట్లు అని కొట్టి పారేస్తారు. క్రెడిట్ అంతా ఉద్యమానిదే. తెలంగాణకు చెందిన అన్ని పార్టీల ఎమ్మెల్యేలు రిజైన్ చేసి మళ్లీ ఎన్నికై వచ్చి అదే స్థానాల్లో కూర్చున్నారనుకోండి. పార్టీ బలాబలాలలో మార్పు లేనప్పుడు ఏం లాభం? ఈ ఆరేడు నెలల వ్యవధిలో సోనియా మారతారా? బాబు మారతారా?  కాదు, వాళ్లకు తెలంగాణ సెంటిమెంటు బలం తెలిసి వస్తుంది అనుకుంటే మొన్న ఉపయెన్నిక ఫలితాలు చూశాక ఏమైనా మారారా? ఇది పూర్తిగా తాత్కాలికం అనే నమ్మకంతో వున్నారు వాళ్లు.

రాజీనామా చేయ్ అని కెసియార్ వూదరగొట్టేస్తున్నారు. మిమ్మల్ని రెట్టింపు మెజారిటీతో గెలిపించే భారం నాది. ఖర్చులు కూడా భరిస్తాను అని కూడా చెప్పారట మొన్న జానారెడ్డి యింటికి వచ్చి. అంటే రిజైన్ చేసి మళ్లీ గెలిచే కాంగ్రెస్‌వారు, అయితే గియితే టిడిపివారు కెసియార్ దయాధర్మంతో గెలిచినట్టే అనుకోవాల్సి వస్తుంది. ‘పాండవ వనవాసం’లో దుర్యోధనుడు పాండవులను ‘ఆడదాని కన్నీటితో గెలుచుకున్న రాజ్యం ఓ రాజ్యమేనా?’ అని ఉడికించినట్టు రేపట్నుంచి కెసియార్ కూడా వీళ్లను అలాగే తీసి పారేయవచ్చు. వీళ్లు నోరెత్తడానికి లేదు. కెసియార్ ఏం చేసినా మాబాగే అనుకునే కేకే వంటి వాళ్లకు అది బాగానే వుంటుంది కానీ తక్కినవాళ్లకు ఎలా వుంటుందో తెలియదు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ మీటింగుకి కెసియార్ కోదండరాంను కొందరితో అక్కడికి పంపించారు. కేకే రండి రండి అన్నారు కానీ పొంగులేటి వంటివారు కోదండరాంను సమావేశానికి వస్తే మేం వెళ్లిపోతాం అని బెదిరించడంతో కేకే వాళ్లను ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఆఫీసులో కూర్చోబెట్టి తర్వాత వచ్చి సమావేశంలో జరిగినది విన్నవించుకున్నారు.

అందుకే ముఖేష్ గౌడ్ అడిగారు – ‘కాంగ్రెస్ టిక్కెట్టుపై గెలిచిన వీళ్లు సోనియా చెప్పినట్టు వినాలా? కెసియార్ చెప్పినట్టు వినాలా?’ అని. కెసియార్ కాంగ్రెస్‌లో కలిసిపోబోతున్నారు కాబట్టి ఆయన మాట విన్నా తప్పు లేదని కేకే చెప్పుకోవచ్చు. మొన్న జానారెడ్డి యింటికి వచ్చినపుడు కొందరు కాంగ్రెస్ నాయకులు మెలిక పెట్టబోయారట – తెరాసను కాంగ్రెస్‌లో విలీనం చేస్తే రాజీనామాలు చేస్తామని. కెసియార్ ఏం చెప్పారో తెలియదు కానీ విలీనం మాట ఎత్తకుండానే వాళ్లు రాజీనామాలు ప్రకటించారు. కెసియార్‌ను విలీనానికి ఒప్పించడం మాటలు కాదు. చిరంజీవికి జరుగుతున్న సన్మానం చూసినవాడెవడు కాంగ్రెస్‌లో విలీనం కావడానికి ఉబలాటపడడు. అందునా కెసియార్ తెలంగాణలో ఇంత బలంగా వున్నపుడు వెళ్లి సోనియా వద్ద చేతులు కట్టుకుని ఎందుకు నిలబడతాడు?

క్యాఫ్ట్ వాళ్లకు యిదే అనుమానం. కెసియార్‌కు స్వయంగా బలం వున్నపుడు రాజీనామాలు చేసి వచ్చిన తమను ఎందుకు నిలబెడతాడని..? పార్టీలోంచి బయటకు వచ్చేంతవరకు వూరించడం వేరు, తర్వాత కథ వేరు. చరణ్‌సింగ్‌ను మొరార్జీ నుండి విడదీసేదాకా ఇందిరా గాంధీ చాలా ప్రామిస్ చేసింది. చరణ్ బయటకు వచ్చి, మొరార్జీ ప్రభుత్వం పడిపోయాక, ఇందిర మద్దతు ఉపసంహరించింది. దాంతో చరణ్ పడిపోయాడు. ఇందిర 1980 ఎన్నికల్లో గెలిచింది. తర్వాత పదేళ్ల తర్వాత రాజీవ్ కూడా అదే చేశాడు. చంద్రశేఖర్‌కు మద్దతు యిచ్చి విపి సింగ్‌ను గద్దె దింపించి, తర్వాత ఓ సిల్లీ రీజన్ చెప్పి చంద్రశేఖర్‌కు మద్దతు వుపసంహరించి, మళ్లీ ఎన్నికలు తెచ్చాడు. ఇప్పుడు కెసియార్ అదే చేస్తే  ? అసలు యిదే కాంగ్రెస్ వాళ్లనూ, టిడిపి వాళ్లనూ స్వంత ఖర్చులతో మళ్లీ నెగ్గిస్తే నాకేం లాభం అని కెసియార్ అనుకుంటే..?

కెసియార్‌ను ఎంతవరకు నమ్మాలి? అన్న సందేహం క్యాఫ్ట్‌వాళ్లకు రాదా? మహాకూటమి విషయంలో కెసియార్ ఎంత నిజాయితీ

గల భాగస్వామో టిడిపిని, లెఫ్ట్‌ను అడగండి చెప్తారు. ఇప్పుడు ఉపయెన్నికల్లో ఎవణ్నో నిలబెట్టి వాడెవడో స్వతంత్రంగా పోటీ చేశాడు నాకేం సంబంధం లేదు అంటే..! అసలు అనడానికీ, మానడానికీ కనబడితే కదా ! టిక్కెట్ల రంధి ప్రారంభం కాగానే ఆయన మాయం అయిపోతాడు. తెరాస నిలబెట్టినా నిలబెట్టకపోయినా కొద్దిమంది వాళ్లంతతట వాళ్లే నామినేషన్లు పడేయవచ్చు. ఈ కాంగ్రెస్ వాళ్లు, టిడిపివాళ్లు తెలంగాణా ద్రోహులని మొన్నటిదాకా కోడిగుడ్లు విసిరినవాళ్లు, కార్ల అద్దాలు పగలకొట్టినవాళ్లు యీ రోజు వాళ్లకు ఓట్లు కురిపిస్తారా?

'తెరాసవారి కథంటే వేరు. వాళ్లు స్వఛ్ఛందంగా రిజైన్ చేసినవారు. వీళ్లు గతిలేక, ఏడ్చుకుంటూ రిజైన్ చేస్తున్నవాళ్లు. ఉద్యమం చేసి దెబ్బలు తిన్నది మేము. అందలాల్లో వూరేగి యిప్పుడు తగుదునమ్మా మళ్లీ నిల్చుంటున్నది వీళ్లు. రిజైన్ చేశాం, జాలి చూపండి అంటూ యిలా ఎల్లకాలం వీళ్లే నిలబడుతూ వుంటే యిక మాకు ఛాన్సెక్కడ? వీళ్లకు ఓట్లేయమని కెసియార్ యివాళ చెప్తాడు. రేపు తనే కాంగ్రెస్‌లో చేరిపోవచ్చేమో ! ఆయనకేదో లాభం వుండవచ్చు. మనకేం వుంది?' ఈ విధంగా సాగవచ్చు ఉద్యమకారుల ఆలోచనలు. వారిలో కొందరు అమరవీరుల కుటుంబాల వారు కూడా వుంటే వాళ్లకనిపిస్తుంది కదా – 'ఉద్యమం పట్ల చిత్తశుద్ధి లేని వీళ్లకు యిచ్చేకంటె మాకే టిక్కెట్టు యివ్వవచ్చు కదా' అని. ఇవన్నీ ఆలోచిస్తే యిప్పుడు పోటీ చేసేవారందరూ గెలిచి తీరతారని చెప్పడం కష్టం కదూ !

ఈ ఆలోచనలు మీకూ నాకే కాదు, కాంగ్రెస్ వారికీ వున్నాయి. అందుకే కనీసం 12 మంది లోకసభ సభ్యుల్లో ఐదుగురు, 5 గురు రాజ్యసభ సభ్యుల్లో 4 గురు, మంత్రుల్లో నలుగురు, ఎమ్మెల్యేలలో 21 మంది రాజీనామాలకు విముఖంగా వున్నారట. కొంతమంది బయటకు చెప్తున్నారు. మరి కొందరు ప్రస్తుతానికి చెప్పలేక యిప్పుడు వూరుకుంటున్నారు. సోమవారం పొద్దున్న ఫోన్ చేసి 'సోనియమ్మ కలలో కనబడి వద్దంది' అని చెప్పవచ్చు, అర్జంటు ప్రయాణాలు పెట్టుకోవచ్చు. మంచిరోజు కాదనవచ్చు. జానారెడ్డి యింట్లో టిఫిన్ తిన్నాక కడుపులో తిప్పిందని నిమ్స్‌లో ఎడ్మిట్ కావచ్చు. ఏదైనా జరగవచ్చు. ఇవన్నీ వూహించి కేకే, జానా వైస్రాయ్ హొటల్ టైపు క్యాంపులు నడుపుతారేమో చూడాలి. కేకే మాస్ లీడర్ ఎప్పుడూ కాదు. నాయకులకూ లీడర్ కాదు. సాటి రాజ్యసభ సభ్యులని ఒప్పించే దమ్ము కనబడటం లేదు. అసలాయన ఎప్పుడు ఏం మాట్లాడతారో, ఎప్పుడు మాట వెనక్కి తీసుకుంటారో మనకే కాదు, ఆయనకీ తెలియదు. జానారెడ్డి ఆచితూచి వ్యవహరించే మనిషి. ఎప్పుడు వెనక్కి తగ్గినా మనం ఆశ్చర్యపడనక్కరలేదు.

పైగా పోటీ చేసిన ప్రతివాడూ మళ్లీ ఎన్నికవాలంటే తెలంగాణ ఉద్యమ తీవ్రతే వాళ్లను గెలిపించాలి. కానీ తెలంగాణ ఉద్యమతీవ్రత అన్ని చోట్లా ఒకేలా లేదని అందరికీ తెలిసిన సత్యమే. అందుకే మొన్నటి ఉపయెన్నికలలో బిజెపి నుండి యిద్దరు ఎమ్మెల్యేలుంటే ఒకాయనే రిజైన్ చేశారు. రెండో ఆయన, అంతకంటె పెద్ద నాయకుడు అయినా రిజైన్ చేయలేదు. ఎందుకంటే ఆయన నియోజకవర్గం సిటీలో వుంది. రిజైన్ చేస్తే మళ్లీ గెలుస్తామన్న నమ్మకం లేదు. ప్రత్యేక తెలంగాణా ఉద్రేకం ఉన్నచోటే ఓట్లు కురుస్తాయి కాని తక్కిన చోట్ల నియోజకవర్గానికి చేసిన సేవ, డబ్బు, కులం, ప్రత్యర్థి బలం, పలుకుబడి యిత్యాది అనేక కారణాలు లెక్కలోకి తీసుకోవాలి. ఫలితం యిలా వుంటుందని ఖచ్చితంగా చెప్పలేరు.

వీళ్లంతా ఢిల్లీ వెళ్లి "తెలంగాణ యివ్వకపోతే మా నియోజకవర్గాలలో తిరిగే పరిస్థితి లేదు" అని చెప్పేసి వస్తూ వుంటారు. ఈ ముక్క రెండేళ్లగా చెప్తున్నారు. అంటే రెండేళ్లగా నియోజకవర్గాలలో తిరగడమే లేదా? ఊళ్లో పెళ్లిళ్లకు, చావులకు, ఆస్తులు చూసుకోవడానికి, ప్రారంభోత్సవాలకు వెళ్లి తమ పేరు కింద వుందనో, చిన్న అక్షరాలనో పోట్లాడడానికి వెళ్లి రావటం లేదా? నిజానికి ఫలానా మంత్రిని విద్యార్థులు అడ్డుకున్నారు అని వచ్చే వార్తలు, ఫోటోలు జాగ్రత్తగా చూడండి. 20, 30 మంది వుంటారంతే. వాళ్లను చూసే ఎమ్మెల్యే దడిసిపోతాడా? ఒక నియోజకవర్గంలో ఎంతమంది కండల వీరులను మేన్‌టేన్ చేయకపోతే ఒక లీడరవుతాడు? వాళ్లలో నలుగుర్ని బెత్తాయిస్తే యీ కుర్రాళ్లు నిలుస్తారా? ఏదో ముచ్చటపడుతున్నారు, పోనీ అని వదిలేస్తున్నారు. టీవీల వాళ్లు వెళ్లిపోగానే వాళ్లూ ఎవరి దారిన వాళ్లు పోతారు తప్ప మంత్రినే పట్టుకుని పీడించరు. రేపు ఏదైనా అవసరం పడవచ్చు. ఇవన్నీ యింటెలిజెన్సు ద్వారా హై కమాండ్‌కు చేరుతూనే వుంటాయి. అందుకని వీళ్లు యీ అరిగిపోయిన రికార్డు వేయగానే నవ్వి వదిలిస్తారు. మరీ తిక్కరేగితే 'అయితే యీ సారి ఎన్నికలలో ప్రచారం చేసుకోలేవు కాబట్టి టిక్కెట్టు వేరే వాళ్లకు యిస్తాలే' అని వుడికించవచ్చు.

'అసలీ రాజీనామాలే పెద్ద బోగస్. ఇక్కడి స్పీకరూ, పై నున్న స్పీకరూ కాంగ్రెస్ వాళ్లే కాబట్టి వాటిని సీటుకింద వేసుకుని కూర్చుని ఎప్పటికీ అంగీకరించకుండా తాత్సారం చేయవచ్చు' అని కొన్ని పత్రికల ఊహాగానాలు. మీ వెంటే రాజీనామా చేస్తాం అంటూ వచ్చిన టిడిపికి యిదో గుబులు. స్పీకరు గారు కాంగ్రెస్ రాజీనామాలు తొక్కి పెట్టి తమవి అంగీకరించేస్తే..? అని. అందరూ త్యాగాలకే సిద్ధపడేవాళ్లే కానీ పక్కవాడి కంటె ఎక్కువ త్యాగానికి మాత్రం ఎవరూ సిద్ధం కాదు. టిడిపివారిలో నాగం అండు కో మాత్రం రాజీనామాలు చేసేయవచ్చు. వాళ్లకు అర్జంటుగా హీరోలమై పోదామని తెగ వుంది. అసలు నాగం గారి గేమ్ ప్లాన్ ఏమిటో అర్థం కావటం లేదు. కెసియార్ అంటే ఆయనకు ఎప్పుడూ పడలేదు. ఈ రోజు ఆయన యింటికి వెళ్లి స్నేహం కలిపారు. 'తెరాసలో రెడ్లు తక్కువగా వున్నారు కాబట్టి, నాగంను కూడా కలుపుకుందామని కెసియార్ ఆయనను ప్రోత్సహించారు' అంటున్నారు. తెలంగాణ రెడ్లందరూ నాగం చెప్పినట్టు వింటారా? అన్నది మొదట ఆలోచించాలి. పైన సోనియా దయవలన, ఇక్కడ బాబు దయవలన మనకు జిల్లా నాయకులు తప్ప రాష్ట్ర నాయకులు లేరు. ఏ నాయకుడూ మొత్తం కులానికి ప్రాతినిధ్యం వహించే స్థితి లేదు. ఈ విషయం అర్థమై కాబోలు కెసియార్ నాగంకు మంచి ప్యాకేజి యిచ్చినట్టు లేరు. నాగం ఏ పార్టీలోనూ చేరను అన్నారు. దేవేందర్ గౌడ్ కయితే

డబ్బుంది కాబట్టి స్వంతపార్టీ పెట్టారు. ఈయనకూ అదీ లేనట్టుంది. మరి ఆయన గమ్యం ఏమిటో మనకు అగమ్యగోచరంగా వుంది. ఆయనకు తెలుసనే అనుకుందాం. రాజీనామా చేసి హీరో అవుదామనుకుంటే యిప్పటికే గత ఉపయెన్నికల తాలూకు 12మంది హీరోలున్నారు. వారితో బాటు వీరూను. వారి నెత్తి మీద ఏం కిరీటం వుందని కనుక? **ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**

**జులై 07** **ఎమ్బీయస్ : నగారా మోగించిన నగరవాదం**

రాజీనామా చేసిన ఎమ్మెల్యేలెందరో కాస్సేపటిలో ఖచ్చితంగా తెలిసిపోతుంది. పొద్దుటి పేపర్లు చూస్తే చేయబోయేవారు అంటూ ఒక్కోళ్లు ఒక్కో అంకె యిచ్చారు. జ్యోతివారు తెలంగాణకోసం రాజీనామాలు చేసే మొత్తం ఎమ్మెల్యేలు (టిడిపితో సహా) 60-70 మంది వుండవచ్చు అన్నారు. అంటే కాంగ్రెస్‌వారు 37 మంది వుండవచ్చన్నమాట. మంత్రులతో సహా కాంగ్రెస్‌వారు 33 మంది చేయవచ్చని సాక్షి అంది. నమస్తే తెలంగాణ 12 మంది మంత్రులు, 30 మంది ఎమ్మెల్యేలు మొత్తం 42 అంది. ఇక ఆంధ్రభూమి అయితే (ఈ మధ్య బిజెపివారు జై తెలంగాణ అని గట్టిగా అన్నదగ్గర్నుంచీ అది గతంలోని బాలన్స్‌డ్ ఇమేజి పోగొట్టుకుని నమస్తే తెలంగాణకు మించిన తెలంగాణ పేపరై పోయింది) 11 మంది మంత్రులు, 40 మంది ఎమ్మెల్యేలు మొత్తం 52 మంది రెడీ అంది. ఫైనల్ అంకెలు (ప్రస్తుతానికి వింటున్నది 11 మంది మంత్రులు ప్లస్ 25 మంది ఎమ్మెల్యేలు మొత్తం 36 మంది) బయటకు వచ్చాక వీరిలో ఎవరు కరక్టో మీరే తెలుసుకోండి.

ఇక్కడింత జరుగుతూంటే కాంగ్రెస్ హై కమాండ్ నిమ్మకు నీరెత్తినట్టు కూర్చోవడం ఏమిటన్న సందేహం అందర్నీ పీడిస్తోంది. తాము పాలించే రాష్ట్రంలో కావాలని రాష్ట్రపతి పాలన విధించే పరిస్థితి తెచ్చుకుంటుందని అనుకోనక్కరలేదు. ఇలా కావాలనే హై కమాండ్ కోరుకుంటోందేమో, యిప్పటిదాకా ప్రారంభించని చర్చలపర్వం మొదలుపెట్టడానికి భూమిక తయారుచేస్తోందేమో అన్న అనుమానం వస్తోంది. అలా అయితే రాజీనామాలు మనకి మేలు చేసినట్టే. తెలంగాణ పై ఏదో ఒకటి తేల్చేయాలనే రాష్ట్రంలోని ప్రతివారూ - ప్రత్యేకవాది కానీయండి, సమైక్యవాది కానీయండి - కోరుకుంటున్నారు. ఏదో ఒకటి తేల్చేయాలని అనుకుంటూనే ఆ నిర?యం తాము కోరుకున్నది కావాలని ఆశపడుతున్నారు. సహజం. గూరా?లాండ్ తరహా ప్యాకేజి కూడా ఆఫర్ చేయకుండా తాత్సారం చేస్తూ పోవడం ఎవరికీ రుచించడం లేదు. సంప్రదింపుల ప్రక్రియకు సమయం ఆసన్నమైందని హై కమాండ్ అనుకుని, ఆ యినీషియేటివ్ తమ పార్టీ వాళ్ల నుండి రావాలని యిదంతా ప్లాన్ చేసిందేమో !? ఈ రాజీనామాలందగానే రేపే కేంద్రం తెలంగాణ పరిష్కార అన్వేషణా కమిటీ అని ఎనౌన్సు చేసిందనుకోండి జానారెడ్డి వాళ్లూ కెసియార్ ముందు కాలరెగరేయవచ్చు - 'పదేళ్లగా తెరాస ఏమీ చేయలేకపోయింది, మేము గట్టిగా తలచుకోగానే జగన్నాథ రథం కదిలింది. చెప్పాంగా, తేవాలన్నా, మానాలన్నా మాకే తగును' అని. అప్పటినుండి ఉద్యమం యినీషియేటివ్ కాంగ్రెస్ చేతికి వచ్చేస్తుంది.

ఇదేదో స్టేజ్ మానేజ్‌డ్ వ్యవహారం అన్న అనుమానం ఉస్మానియా విద్యార్థులకు కూడా వుందేమో అందుకనే వాళ్లు యీ రాజీనామాల ప్రహసనంలో ఉత్సాహంగా పాలు పంచుకోవడం లేదు. అదే తెరాసదో, జాక్‌దో అయితే మేమూ వున్నాం అని ప్రకటించేవారు. కనీసం కంకర్రాళ్ల వర్షమైనా వుండకపోతుందా అని మీడియావారందరూ అటు పరుగెట్టేవారు. ఇప్పుడదేమీ లేదు, జానారెడ్డి యింటి చుట్టూనే కెమెరాలు పరిభ్రమిస్తున్నాయి. సోమవారం పొద్దున్న టీవీలలో స్క్రోలింగ్స్ - ఢిల్లీ నుండి ఎమ్మెల్యేలకు పిలుపు, ఢిల్లీ విమానం రిజైన్ చేసి ఎక్కాలా చెయ్యకుండా ఎక్కాలా అని తర్జనభర్జన- అని. అసలు ఢిల్లీనుండి ఎవరు పిలిచారో స్క్రోలింగ్స్‌లో లేదు. అసలు పిలవలేదో, పిలిచినవారు తగిన స్థాయి వారు కారో ఏమో, జానారెడ్డి గారు కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేత చెప్పించారు - మాకు పిలుపే లేదని. అంటే హై కమాండ్ ఆ మాత్రం పట్టించుకోలేదా, మనవాళ్లు మరీ అంత కేవలంగా, గడ్డిపోచప్రాయంగా వున్నారా? అన్న సందేహం వచ్చింది.

మధ్యాహ్నం చిదంబరంగారి స్టేటుమెంటు చూడండి - 'రాజీనామా చేస్తామని ముందే చెప్పారు, చేశారు, యిందులో వింతేముంది' అన్నట్టు మాట్లాడారు. వాళ్ల పని పట్టడానికి ఆజాద్ వున్నారుగా అన్నారు. నేను ఆషాఢమాసపు.. వ్యాసంలో రాసినదే ఆయనా అన్నాడు - 'ఎంతసేపూ డిసెంబరు 9 పట్టుకు వేళ్లాడతారేం? డిసెంబరు 23 స్టేటుమెంటు గురించి కూడా ఆలోచించండి. అన్ని పక్షాలనూ కలుపుకుని పోతే తప్ప సమస్య తేలదు.' అని. అంటే ఇదేదో కాంగ్రెస్ వాళ్లు కావాలని చేస్తున్నది కాదన్నమాట అనిపిస్తోంది. దాని అర్థం - కాంగ్రెస్ యివన్నీ తాటాకు చప్పుళ్ల కిందే తీసి పారేస్తోందని ! ఢిల్లీ వెళ్లే ముచ్చటే లేదంటూనే జానారెడ్డి మధ్యాహ్నానికి ఢిల్లీకి బయలుదేరారు. మంత్రులు రిజైన్ చేస్తే యింటికి వెళ్లిపోవడమే అని గట్టిగా చెప్పి పంపిస్తారో ఏమో ఖర్మ. వీళ్లు ఎందుకైనా మంచిదని గవర్నరు ఎపాయింట్‌మెంట్ ముందే తీసుకోకుండా జాగ్రత్తపడ్డారు. చూదాం ఎంతమంది మినిస్టర్లు చివరిదాకా నిలుస్తారో !

ఈ రాజీనామాల వ్యవహారంలో ఒక విషయం స్పష్టంగా బయటకు వచ్చింది - తెలంగాణ వేరు, గ్రేటర్ హైదరాబాదు వేరు అని. మీరూ రిజైన్ చేస్తారా అని అడిగితే దానం నాగేందర్ అన్నారు - "రాజీనామాలకు, హైదరాబాదుకూ ఏమిటి సంబంధం?" అని. ఆయన అన్నట్టుగానే గ్రేటర్ హైదరాబాదు ఎమ్మెల్యేలు, మంత్రులూ ఎవరూ రిజైన్ చేయడానికి ముందుకు రామన్నారు. ఒక్క విషు?వర్ధన్‌రెడ్డి మాత్రం నేను రెడీ అన్నారు. అదీ సోమవారం పొద్దున్నదాకా ! అప్పటిదాకా ఆయనా గుణకారాలూ, భాగారాలూ

వేస్తూనే వున్నారు. చివరకు రిజల్టు ఏమొచ్చిందో ఏమో రిజైన్ అన్నారు. ఆయన్ని తప్పిస్తే తక్కిన అందరూ వీటిపట్ల నిర్లిప్తంగానే వున్నారు. టిడిపికి గ్రేటర్ హైదరాబాదులో ఎవరూ వున్నట్టు లేదు. ఇక మజ్లిస్‌కున్న 7గురు, లోకసత్తా కున్న ఒకరూ, ఎలాగూ రిజైన్ చేయరు. ఉద్యమానికి సపోర్టు చేయరు. దీని అర్థం హైదరాబాదు ప్రాంతపు ప్రజాప్రతినిధులు తమను తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములుగా లెక్కించుకోవడం లేదు. ప్రతిపక్షంలో వున్న టిడిపి నాయకులు తలసాని, తీగల వంటి గట్టి నాయకులు కూడా సమైక్యవాదులే. నా ఉద్దేశంలో యిది రాబోయే చీలికను సూచిస్తోందని.

మెట్రో వ్యవహారంలో దానం, ముఖేష్ స్టేటుమెంట్లు చూడండి. సుల్తాన్ బజార్‌లో వర్తకులు మెట్రోకు అడ్డుపడుతున్నారు. మెట్రో ప్రాజెక్టు యిప్పటిదా? 2004 నుండి నలుగుతోంది. మరి అప్పణ్నుంచి వీళ్లు చేసిన ప్రయత్నాలేమిటో ! ప్రయత్నించి విఫలమయ్యారేమో. ఇక అలాటప్పుడు ఊరుకోవాలి. దానికి రాజకీయపరమైన రంగు పులిమడానికి కెసియార్‌ను పిలిచారు. ఆయన రెచ్చిపోయారు. కిరణ్‌కుమార్‌ను తిట్టారు, ఎల్ అండ్ టిని తిట్టారు, హైదరాబాదు సంస్కృతి అన్నారు, అడ్డుకుంటామన్నారు, మరోటన్నారు. సాధారణంగా యిలాటి కేసుల్లో హాకర్స్ పెద్ద అల్లరి పెడతారు. మెట్రో స్టేషన్ వచ్చాక ఆ కాంప్లెక్సులో మీకు కొన్ని దుకాణాలు తక్కువధరకు కేటాయిస్తామని కాంట్రాక్టర్లనుండి హామీ రాబట్టి చల్లారిపోతారు. కానీ యిక్కడ కెసియార్ రావడంతో ఆయన ఆంధ్ర, తెలంగాణ యిస్యూ తెచ్చాడు. మెట్రో రానీయకుండా చేస్తానన్నాడు.

దాంతో నాగం, ముఖేష్ మండిపడ్డారు. కెసియార్‌కు హైదరాబాదుతో ఏం పని అన్నారు. మెట్రో పట్టాలమీద వేసి నలిపేస్తామన్నారు. 'ఎక్కణ్నుంచో వచ్చి యిక్కడ అధికారం చెలాయిస్తే ఎలా?' అని కోస్తావాళ్ల గురించి కెసియార్ అన్నట్టే కెసియార్ గురించి ఈ హైదరాబాద్ బ్రదర్స్ అంటున్నారు. 'మెదక్‌నుండి వచ్చినవాడివి యిక్కడ పుట్టి పెరిగిన మా మీద అధికారం చెలాయిస్తే ఎలా?' అని అడుగుతున్నారు. "నీది తెలంగాణ, నీది నువ్వు చూసుకో. హైదరాబాదు మా యిలాకా. మేం చూసుకుంటాం" అని వారి అర్థం. తెలుగుదేశంది ప్రాంతీయవాదం అయితే, తెరాసది ఉపప్రాంతీయవాదం అయితే, హైదరాబాద్ బ్రదర్స్‌ది నగరవాదం. వాళ్లు ఎప్పణ్నుంచో వినిపిస్తున్నారు కానీ యిప్పుడు రాజీనామాల సందర్భంగా నగరనాయకులందరూ ఏకమవడంతో నగారా మోగించినట్టయింది.

ఉపప్రాంతీయవాదాన్ని ఎదుర్కోవడానికి కాంగ్రెస్ హై కమాండ్ కానీ, బాబు కానీ, రేపు జగన్ కానీ యీ నగరవాదాన్ని వాడుకోవచ్చు. అది చూసి తెలంగాణా వాదులు నగరవాదులపై తిరగబడవచ్చు, 'మీరూ రిజైన్ చేయండ'ని డిమాండ్ చేయవచ్చు. అప్పుడు వీళ్ల దగ్గరున్న సమాధానం ఒకటే – "రిజైన్ చేయకపోతే మీ ప్రాంతాల్లో తిరగడం కష్టమని నువ్వు చెప్పుకుంటున్నావు. రిజైన్ చేస్తే మా ప్రాంతాల్లో తిరగడం కష్టం" అని. తన పార్టీ యింకో సభ్యుడు రిజైన్ చేసినా, బిజెపి నాయకుడు కిషన్ రెడ్డి రిజైన్ చేయడానికి సాహసించలేదని యీ సందర్భంలో గుర్తు పెట్టుకోవాలి. అంతేకాదు, 2009 ఎన్నికలలో టిడిపి తెరాసతో పొత్తు పెట్టుకోవడంతో ఒళ్లు మండిన నగరవాసులు (యావన్మందీ అని కాదు, వారిలో అత్యధికులు అని) లోకసత్తాకు ఓటేసి టిడిపిని ఓడించారు. హైదరాబాదు మునిసిపల్ ఎన్నికలు వచ్చేసరికి టిడిపి తెరాసతో తెంపుకోవడంతో వాళ్లందరూ లోకసత్తాను వదిలేసి టిడిపివైపు మొగ్గి వాళ్లను గెలిపించారు. ప్రతీవాళ్లూ మళ్లీ మళ్లీ ఎన్నిక కావాలని చూస్తారు కాబట్టి సిద్ధాంతాల మాట ఎలా వున్నా, స్థానికుల అభీష్టానికి వ్యతిరేకంగా వెళ్లకూడదని చూస్తారు. ఆ అభీష్టం ఏమిటో కూడా యితమిత్థంగా తెలియదు. ఇలా వుంటుంది అనే వూహతోనే ముందుకు సాగుతారు.

సమస్యను వాయిదా వేయడానికి చూసేవారికి ఇలాటి పరిస్థితులు అనువుగా వుంటాయి. 'నువ్వు తెలంగాణా సెంటిమెంటు అంటున్నావు, హైదరాబాదుతో సహా తెలంగాణా విడిగా యిమ్మంటున్నావ్. మరి హైదరాబాదుకి వేరే సెంటిమెంటు వుందట. వాళ్లంతా చెప్తున్నారు. వాళ్లు ఎవరితోనూ కలవకుండా విడిగా వుంటారట. ఏం చేయమంటావ్?' అని తెలంగాణ ఉద్యమకారులను ప్రశ్నిస్తారు. హైదరాబాదు లేకుండా వట్టి తెలంగాణ అంటే వాళ్ల వూళ్లో వూరుకోరు. ఇక్కడ హైదరాబాదు కలపమంటే వీళ్లు వూరుకోరు. ఈ యిరకాటంలోంచి ఎలా బయటపడతారో ఏమో. ఈ నగరవాదుల వుద్యమం బలపడితే "సేవ్ హైదరాబాద్" అనో "అమ్చీ ముంబయ్"లాగ "హమారా హైదరాబాద్" అనో ఓ ఉద్యమం మొదలుపెట్టి హంగామా చేయవచ్చు. 'హైదరాబాద్ యీజ్ ఫర్ హైదరబాదీస్, ఎక్కడెక్కడి గొడవలూ యిక్కడకు తెచ్చి నగర అభివృద్ధిని నాశనం చేస్తున్నారు' అంటూ యిక్కడ స్థిరపడిన పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, యితర భాషీయులూ అందర్నీ ఒక తాటిపై తెచ్చి సదస్సులు, సమావేశాలూ మొదలుపెడితే దీనికి ఆంధ్రప్రాంతీయులు కూడా వెనుకనుండి సహాయపడవచ్చు.

భవిష్యత్తు యిలాగే వుంటుందని చెప్పలేము కానీ గ్రేటర్ హైదరాబాదువారు రాజీనామా చేయకపోవడం మాత్రం ఒక గుర్తించదగిన , గుర్తుపెట్టుకోదగిన పరిణామం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**

**జులై 09** **ఎమ్బీయస్ : తెరాస యిలా వుంటే తెలంగాణా ఎలా..?**

గత వ్యాసం రాసేనాటికి యిప్పటికీ చాలా మార్పులు వచ్చాయి. మొదట్లో అనుకున్నదాని కంటె ఎక్కువ మంది రాజీనామా చేశారు. అంకె 99 అని జ్యోతి అంటే 100 అని కొందరంటున్నారు. (మంగళవారం భూమి 45 మంది కాంగ్రెస్ వాళ్లు చేశారంటే తక్కినవాళ్లు 44 మందే చేశారని రాశారు. ఈ గందరగోళం ఎలా వస్తోందో మరి) నగర ఎమ్మెల్యేలు కూడా కొందరు చేశారు.

అందువలన నా 'నగరవాదం' ప్రతిపాదన తప్పా? కాకపోవచ్చు. ఎందుకంటే రిజైన్ చేయనివారిలో నగర ప్రతినిథులే ఎక్కువమంది వున్నారు. పైగా ఆజాద్ ఆర్గ్యుమెంట్స్ చూశారా ? 'తెలంగాణ యిస్తే హైదరాబాదు మాటేమిటి? అక్కడి ప్రజలు తెలంగాణ కోరుకుంటున్నారా?' అని అడిగారట. ప్రణబ్ 'హైదరాబాదు కోసం మీరూ మీరూ కొట్టుకుంటారా?' అని అడిగారట.

అందువలన హైదరాబాదు సమస్యను హైదరాబాదు నాయకులతో కలిసి కూర్చుని చర్చించనిదే ఉద్యమనాయకులు ఢిల్లీ వెళ్లి సాధించబోయేది ఏమీ లేదని తేల్తోంది. నగర ఎమ్మెల్యేలలో జయసుధ వంటి జగన్ అనుయాయులున్నారు. వాళ్లు రిజైన్ చేయడం వెనుక ఏం మతలబు వుందో? జయసుధ ఒక్కరే కాదు, రిజైన్ చేసినవారిలో జగన్ అనుయాయులు యింకా వున్నారు. వాళ్లు రిజైన్ చేయడం వెనుక ప్రభుత్వం కూలదోసే ఆలోచన వుందేమో తెలియదు. అసలు ఇంతమంది రిజైన్ చేస్తారని ఎవరూ అనుకుని వుండరు. కాంగ్రెస్‌లోని అతివాదులు కొందరు చేస్తారని, తక్కినవాళ్లు గోడమీదే వుంటారని అనుకున్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమావేశంకు కూడా అందరూ హాజరు కాలేదు. అక్కడా తర్జనభర్జన లయ్యాయి. చేయని వాళ్ల పేరు చెప్పి టిడిపి కూడా చేయదని అనుకున్నారు.

కానీ పరిస్థితి గబగబా మారింది. వీళ్లంతా తెలంగాణ కోసం తపించిపోతున్నారని, త్యాగమూర్తులనీ నేను నమ్మను. 1969 లో 1972లో యిలాటి రాజీనామాలు చాలా చూశాను. అధినాయకత్వం హామీ యిచ్చిందంటూ అంత స్పీడుగానూ వాపస్ తీసుకోవడం చూశాను. మరి యిన్ని రాజీనామాలు ఎందుకు చేశారు? అంటే నా అనుమానం – రాజీనామా చేసినా ఫర్వాలేదులే అనే సంకేతం పైనుండి వచ్చి వుంటుందని. వీళ్లలో ఎవరో వెళ్లి 'ఉద్యమం మా చేతిలోకి తెచ్చుకోవాలంటే యిది తప్పదు, మీరు ఏదో ఒకటి యివ్వకపోరు, మేం వెనక్కి తీసుకోక పోం' అని బతిమాలి, ఒకే చేయించుకుని వుంటారు. వాళ్లు ఒకే అన్నదాకా వుండి చూస్తే టిడిపి కూడా రిజైన్ చేసేసింది. ఎవరూ చేయనప్పుడు తెరాస వాళ్లు, బిజెపివాళ్లు చేస్తే త్యాగమూర్తులన్నాం. 'మేం పాండవులం, కాంగ్రెస్, టిడిపివారు కౌరవులు. మైనారిటీలో వున్నా ధర్మం మా పక్షాన వుంది. మాదే గెలుపు' అన్నారు. ఇప్పుడు అందరూ ఒకేసారి రిజైన్ చేసేస్తే పాండవులూ, కౌరవులూ అందరూ కలిసిపోయినట్టయింది. ఇక ధర్మం ఎవరిది? గెలుపెవరిది?

ఎన్ని పార్టీలు రిజైన్ చేసినా ఒత్తిడి మాత్రం కాంగ్రెస్ మీదే ! ఎందుకంటే పైనా కిందా అధికారంలో వున్నది వాళ్లే కాబట్టి. వాళ్లు ఏదో ఒక నిర?యం తీసుకుందామని అనుకున్నా తెరాసవాళ్లు చెడగొట్టేశారు. ఎలా అంటారా, చెప్తాను. ఏ పార్టీ అయినా తనకు లాభం వచ్చే పని చేద్దామని అనుకుంటుంది. కదా !? 'వీళ్లకు తెలంగాణ యిచ్చినా ఏం లాభం? కెసియార్ చెప్పినట్టల్లా ఆడుతున్నారని అందరికీ తెలిసిపోయింది. అందువలన ఆ ఘనత కెసియార్‌కే దక్కుతుంది' అని హై కమాండ్ ఎప్పణ్నుంచో అనుకుంటోంది. సమైక్యవాదులు కూడా అదే చెప్తూ వున్నారు. దానికి భిన్నంగా, మేమే బలంగా వున్నాం అనే సంకేతం యిప్పటిదాకా వీళ్లు ఎన్నడూ యివ్వలేకపోయారు. ఇవ్వకపోగా 'అదేం కాదు, తెలంగాణ యిస్తే కెసియార్ కాంగ్రెస్‌లో విలీనమై పోతారు. మేం 100 సీట్లకు పైగా గెలిచి చూపిస్తాం' అని వీళ్లు హై కమాండ్‌కి చెప్తూ వచ్చారు. కెసియార్ అంత నమ్మదగ్గ వ్యక్తి కాదని హై కమాండ్ వుద్దేశం. పేకాటలో ఒక్కో పరిస్థితిలో ముక్క వేసినా ఆట చెడుతుంది, వేయకపోయినా చెడుతుంది. అలాటి యిరకాటంలో వున్నాం మనం అని హై కమాండ్ అవగాహన.

'చూసుకోండి. ఈ మూకుమ్మడి రాజీనామాలతో లీడర్‌షిప్ ఒక్క దెబ్బతో మన చేతిలోకి వచ్చేస్తుంది' అని ఊదరగొట్టి వీళ్లు రాజీనామాలకు లోపాయికారీ అనుమతి తెచ్చుకుని అప్పుడు చేసి వుంటారు. లోపాయికారీ అనుమతి తీసుకున్నారని మీరెలా చెప్పగలరు అంటే నిజంగా నిస్పృహతో, కోపంతో రాజీనామా చేసేవాళ్లయితే యింట్లో కూర్చుంటారు. అవతలివాళ్లు ఢిల్లీ నుండి వచ్చి బతిమాలతారు. స్వయంగా రాలేకపోతే రాయబారులను పంపుతారు. ఇదేమిటి? రాజీనామా ముందూ తర్వాతా కూడా వీళ్లే ఢిల్లీలో ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం. అర్ధరాత్రి ఎపాయింట్‌మెంట్లు, సాయంత్రానికల్లా ఒక నిర?యం వెలువడుతుందని ఆశిస్తున్నాం అనే ఆశాభావాలు, 'మేం చెప్పేశాం – తెలంగాణ యివ్వకపోతే మేం తిరగలేమ'ని అని మైకు దగ్గరకు వచ్చి చెప్పడాలూ... మీరేం చెప్పారో మేం వందలసార్లు విన్నాం, స్వామీ, వాళ్లేమన్నారన్నది మాకు యింపార్టెంటు... 'మా మనసు కరిగింది. సంచీ పట్టు, యిదిగో నువ్వడిగిన ఫలం అని అన్నార'ని మీరు చెప్తారని కళ్లల్లో వత్తులు వేసుకుని చూస్తున్నాం.

ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే వీళ్లు రాజీనామాలు చేయగానే జరిగినదేమిటి? కెసియార్‌గారు 'రండి, మీరే మెజారిటీలో వున్నారు, మీదే నాయకత్వం, మీరు ఎలాగోలాగ తెలంగాణ తెస్తే చాలు. మాకేమీ అక్కరలేదు, బొంతపురుగునైనా ముద్దాడడానికి రెడీగా వున్నవాణ్ని మీలో నీట్‌గా వున్నవాణ్ని ఎవరో ఒకరిని చూసి ముద్దాడతాను' అన్నారా? 'రాజీనామాలు చేసినా ఢిల్లీ స్పందించలేదు కాబట్టి రెండు రోజుల తెలంగాణ బంద్ ప్రకటిస్తున్నాం' అన్నారు. నాకు తెలియక అడుగుతాను, ఢిల్లీ స్పందన యింకెలా వుంటుందనుకున్నారండి? ఇటు వీళ్లు రాజీనామాలో 'రా..' అనగానే వాళ్లు వరాల కుంభవృష్టి కురిపించేస్తారా? కార్మికులు సమ్మె నోటీసు యిచ్చిన గంటల్లో వాళ్ల కోర్కెలు తీర్చేసే మేనేజ్‌మెంట్‌ను నేను యిప్పటిదాకా చూడలేదు. మేనేజ్‌మెంట్ అంత రుణాంతరంగ అయితే అసలు సమ్మె దాకా వ్యవహారం ముదరనే ముదరదు. కెసియార్ యిన్నాళ్లూ "మీరు రాజీనామా చేసి చూడండి, ఢిల్లీలో జేజెమ్మ దిగి వచ్చి మీ కాళ్ల కాడికి తెలంగాణ తెస్తుంది" అని చెబుతూ వుంటే యీయన వాళ్లని వూరికే బులిపిస్తున్నాడ్రా అనుకున్నాను. చూడబోతే కెసియార్ కూడా తన మాటల వుచ్చులో తానే పడ్డట్టుంది.

కాంగ్రెస్ వాళ్లు యిప్పటిదాకా చేసింది ఏమీ లేదు. ఇన్నాళ్లకు ఉద్యమ తపస్సు చేయడానికి కృషా?జినం అటకమీద నుండి తీసి దులిపారు, కమండలం తోముకుంటున్నారు. అంతలోనే దేవుడు ప్రత్యక్షమై పోతాడా? సిరికిం జెప్పడు లెవెల్లో దేవుడు రావాలంటే

ప్రత్యేకవాది కరిరాజు సమైక్యవాది మకరిరాజుతో ఎన్ని వేల సంవత్సరాలు భీకరంగా పోట్లాడాలో? 'లావొక్కింతయు లేదు..' అని వాపోవాలో ! ఏమీ లేకుండా కరుణించేస్తే దేవుడెందుకవుతాడు? దేవుళ్లలో కూడా వెరైటీలుంటాయి. శివుడైతే బూడిద పూసుకుని భూతగణాల మధ్య డాన్సు చేస్తూ వుంటాడు. కాస్త తపస్సు చేస్తే డాన్సుకి మధ్యలో యింటర్వెల్ దొరికినట్టుంటుంది కదాని పరిగెట్టుకుని వచ్చేస్తాడు. కొద్దిపాటి పొగడ్తకే ఉబ్బిపోయి వరాలు గుప్పిస్తాడు. అందుకే అతణ్ని అశుతోషుడు (వెంటనే తృప్తిపడేవాడు) అన్నారు.

మన ఢిల్లీ ప్రభువులు అశుతోషులు కాదు, ఆదిశేషుడి మార్కు ఫోంబెడ్‌పై విలాసంగా పవ్వళించి భార్యామణిచే (సాక్షాత్తూ లక్ష్మీదేవి) పాదాలు ఒత్తించుకుంటూ దేవతల విన్నపాలు వింటూ విశ్రాంతిగా వుండే రకం. లేచి వద్దామంటే కాస్త బద్ధకంగానే వుంటుంది. పైగా ఆయన వాహనం గరుత్మంతుడు కూడా అదో రకం. 'ఖగరాజు నీ ఆనతి వినలేదో, గగనానికి ఇలకూ బహుదూరం బనినాడో' అని త్యాగరాజస్వామే వాపోయాడు. అంతదూరమైతే రాను అనే ఆటోవాడిలా, 'వెళ్దాం లెద్దురూ, యిప్పుడే ఎగేసుకుంటూ అంతదూరం వెళ్లాలా, చేయనీయండి, మరి కొన్ని కల్పకాలు తపస్సు చేయనీయండి, చుట్టూ పుట్టలూ అవీ దట్టంగా కట్టనీయండి, వాటిల్లో పాములు చేరనీయండి, నాకు టిఫెన్‌కు పనికొస్తాయి' అనగలడు.

కెసియార్‌గారు సంస్కృతాంధ్రాలలో దిట్టే కానీ పురాణపురుషుల స్వభావాలు వంటపట్టించుకున్నట్టు లేదు. అది అసలే హస్తినాపురం. రాయబారానికి వెళ్లినవాణ్ని కూడా తాళ్లతో కట్టిపడేసే రకం. అక్కడున్నవాళ్లు అధికారంతో విర్రవీగుతూంటారు. సింహాసనంపై ధృతరాష్ట్రుడులాటి బలహీనుల్ని కూర్చోబెట్టి, వెనుకనుండి దుర్యోధనుడిలా అధికారం చలాయిస్తారు. వాళ్లు ఏం చేసినా కిమ్మనకుండా గడ్డాలు సవరించుకునేవారినే సలహాదారులుగా కూర్చోబెడతారు. ఐదూళ్లడిగితే 'ఇవాళ ఐదూళ్లయింది, అక్కడితో ఆగుతావని నమ్మకం ఏమిటి? రేపు పక్కవాడిది కబళిస్తే..? అర్ధరాజ్యం అంటే..? నిన్ను చూసి మరోడు నాకూ అయిదంటే..?" అని నానా రకాల లాజిక్‌లు లాగుతారు. వాళ్ల దగ్గరకు వెళ్లి వాదించాలంటే శ్రీకృష్ణుడు లాటి టక్కరి, ఫోర్సయిన పద్యాలు సరైన రాగాలతో పాడి మెప్పించగల గాత్రశుద్ధి వున్నవాడు వెళ్లాలి. పాండవులే వెళ్లి కౌరవసభలో ఐదూళ్లు అడిగితే ఎంత వికారంగా వుండేదో ఆలోచించండి.

కెసియార్‌గారు కాస్త నిదానంగా ఆలోచించి వుంటే యివన్నీ తట్టేవి. కానీ ఆయనకు ఒకటే ఆతృత. గబుక్కున ఏదో ఒకటి ప్రకటించకపోతే ఇకపై కాంగ్రెస్‌వాళ్లదే నాయకత్వం అని జనాలు అనుకుని పోతారేమోనని. 1969లో ఉద్యమం మొదలుపెట్టింది విద్యార్థులు. కాంగ్రెస్‌లోంచి బయటకు వచ్చి చెన్నారెడ్డి వచ్చి దాన్ని హైజాక్ చేశారు. దాంట్లో కాంగ్రెస్‌వారే చేరి ఆయన్నే హైజాక్ చేసి కాంగ్రెస్‌లో కలిపేశారు. 1972లో ఉద్యమం మొదలుపెట్టినవారు ప్రతిపక్షంలో వున్న తెన్నేటి విశ్వనాథం గారు, ఆయనకు తోడుగా వెంకయ్యనాయుడు. కాంగ్రెస్‌వారు ఉద్యమంలో చేరి నానా కంగాళీ చేసేసి, మొత్తానికి ఉద్యమానికి మంగళం పాడేశారు. తెన్నేటికి మిగిలిందేమీ లేదు. అలాగే యిప్పుడూ అవుతుందని కెసియార్ బెంగ. అందుకని 'ఢిల్లీ స్పందన బాగా లేదు కాబట్టి రేపు, ఎల్లుండి బంద్' అని తెలంగాణ జాక్ తరఫున ప్రకటించారు.

తెలంగాణ జాక్ తరఫున అంటే కోదండరాం ప్రకటిస్తే చాలు. కానీ అబ్బే ఆ క్రెడిట్ ఆయనకు పోతే ఎలా? అందువలన కెసియారే ప్రకటించారు. బంద్, రైల్ రోకో, పల్లెల్లో వంట అంటూ.. అన్నీ ఒకేసారి టైమ్‌టేబుల్ వప్పగించారు. కాంగ్రెస్, టిడిపివాళ్లకు యింతకుమించి ఏదీ తట్టకుండా, మధ్యలో మాట్లాడకుండా..జాక్‌లో భాగస్వామిగా కెసియార్ చెప్పారు అంటే, మరి మిగతా భాగస్వాములైన బిజెపి, న్యూ డెమొక్రసీ, వీళ్లందరికీ మైకు యివ్వలేదేం? సరే ఇన్నాళ్లూ జాక్ అంటే యీ రెండు మూడు పార్టీలే.. మరి యిప్పుడు కాంగ్రెస్, టిడిపి కూడా ఉన్న పదవులు ఊడగొట్టుకుని పొలోమని ఉద్యమంలో చేరాయి కదా. వాళ్లతో ఓ ముక్క చెప్పి చేస్తే ఏం పోయింది? వాళ్లూ మమ అందురు కదా ! అమ్మో, మమతో ఆగుతారా వాళ్లు, మాదే అనేయరూ? అని కెసియార్ భయం. తెలంగాణా అధిక సంఖ్యలో ఎమ్మెల్యేలు వున్నది కాంగ్రెస్‌కు. తక్కిన ఎవరికీ లేనంత క్యాడర్ వున్నది టిడిపికి. వాళ్లను తన పక్కన కూర్చోబెట్టుకుంటే వాళ్లు తనని మించి వెలిగిపోరూ? అన్న ఆలోచన కెసియార్‌ది.

ఈ ఆలోచన తెలంగాణ ఉద్యమం అంటే సానుభూతి వున్న మేధావి వర్గాలను, మీడియా వర్గాలను భయపెట్టింది. కెసియార్ యిటువంటి ఒంటెత్తు పోకడలతో, యింత స్వార్థంతో ఉద్యమం నడిపితే కథ ముందుకెలా నడుస్తుంది? అని. పాపం వాళ్లతో ఓ ముక్క చెప్పి ప్రకటన చేయవచ్చు కదాని అని చూశారు తెరాసతో. "వాళ్లు జాక్‌లో సభ్యులు కారు. ఇది జాక్ ప్రకటన" అన్నారు కెటియార్. అవును స్వామీ సభ్యులెలా అవుతారు? కాంగ్రెస్‌వాళ్లు బయటకు వెళ్లేట్లా చేశారు. టిడిపివాళ్లు మేం పోము పోము అని చూరు పట్టుకుని వేళ్లాడితే మెడపట్టి తగిలేశారు. 'అది గతం. ఇప్పుడు మీరు చెప్పిన హితవు విని రాజీనామా చేసి వచ్చారు కదా, ఇప్పటికైనా కలుపుకో వచ్చు కదా. ఇప్పటికిప్పుడు జాక్ టెక్నికాలిటీస్‌పై చర్చ ఎందుకు? ఫలానా ఫలానా పార్టీల సంయుక్త ప్రకటన అని బంద్ పిలుపు నివ్వచ్చు కదా !' అని మేధావుల వ్యథ.

అయినా అదేం బంద్ పిలుపండి ! ఎవరైనా నాలుగైదు రోజుల ముందు చెప్తారు. ఇది గంటల వ్యవధిలో ప్రకటించారు. మన చేతకాని చచ్చుదద్దమ్మ ప్రభుత్వం రాత్రికి రాత్రి బస్సులు, రైళ్లు ఆపేసింది. పెట్రోలు బంకులు మూసేసింది. ఇక ప్రజలు (తెలంగాణా వాళ్లే లెండి) పడ్డారు చూడండి అవస్థలు. తిట్టుకోని వాడు లేడు. ఈ తిట్లు తగిలి కాబోలు బుధవారం మధ్యాహ్నానికి బంద్ సడలించేశారు.

ఎందుకింత అదావుడిగా ప్రకటించారంటే, ఏమో కాంగ్రెస్‌వాళ్లు, టిడిపివాళ్లు తమ కంటె బంద్ పిలుపు ముందే యిచ్చేసి క్రెడిట్ కొట్టేస్తే అన్న భయాలు తెరాసవి. బందు యిబ్బందుల గురించి విమర్శ వచ్చిందనుకోండి 'మాదేం లేదు, జాక్ వాళ్లు యిచ్చిన

పిలుపది' అని తప్పుకోవచ్చు. ఈ తెలంగాణ జాక్ వుంది చూశారూ, దాన్ని కెసియార్ ఎలా ట్రీట్ చేస్తారో చూస్తే నవ్వొస్తుంది. జనవరిలో రాజీనామాలు చేసినప్పుడు కానీ, యిప్పుడు జులైలో చేసినప్పుడు కానీ వాళ్లకు ఓ ముక్క చెప్పింది లేదు. జాక్ చేత ఓ పిలుపు నిప్పించుకుని అప్పుడు చేసినా ఓ అందం. అదేమీ లేదు. ఈ విషయమై బిజెపి కోదండరాం దగ్గర సణిగిందట. 'అది వాళ్ల పార్టీ నిర?యం' అన్నాడట ఆయన పుచ్చుబతాణీ నమిలిన వేదాంతిలా ఏడవలేక నవ్వే నవ్వు నవ్వి. (అసలు ఆయనకు తనపైననే డౌటు – తను డిపెండెంటా? ఇండిపెండెంటా? అని. 'ఐ యామ్ ది బాస్ ఆఫ్ దిస్ హౌస్ అని పెద్దక్షరాల్లో ఐ హేవ్ మై వైఫ్స్ పర్మిషన్ టు సే సో అని చిన్న అక్షరాల్లో రాసి వుండే పోస్టర్‌లా వుంటుంది ఆయన స్థితి). మరి ఎవరి పార్టీ నిర?యం వాళ్లు తీసుకునే మాటయితే ఈ ఐక్య కార్యాచరణ సమితి ఎందుకు? ఈ రాముడికి కోదండం ఎందుకు?

కెసియార్ ఈ పిలుపు నివ్వగానే హై కమాండ్ ఉలిక్కిపడి వుంటుంది. ''చూశారా, కెసియార్ చేష్టలు. అతను మీరు చెప్పినట్టు ఆడతాడని మాకు చెప్తున్నారు. అక్కడ అతను అప్పుడే తన ఆట మొదలుపెట్టాడు" అని క్యాప్టెన్‌వాళ్లకు క్లాసు పీకి వుంటారు. ''మీకు తెలంగాణ యిస్తే మీరు పట్టుకెళ్లి కెసియార్ దోసిట్లో ధారపోస్తారు. ప్రస్తుత పరిస్థితి కొనసాగితే యింతకంటె చెడేది ఏముంది?" అన్న ప్రశ్న సంధించారు. వీళ్ల దగ్గర సమాధానం ఏముంది? కెసియార్ యిలా చేయకుండా వుంటే బాగుండేది అనుకోవడం తప్ప ! మహా అయితే కేకే దగ్గర కెళ్లి రుసరుసలాడతారు. ''చూడయ్యా మీ కెసియార్, మన పరువు తీశాడు" అని.

రేపు టిడిపివాళ్లు బస్సుయాత్ర అని పెట్టుకున్నారు. అందరూ వాళ్లతో కలిసి రావాలట. ఎందుకు వస్తారు? ప్రాస కుదిరింది కదాని 'జెండాలు, ఎజెండాలు పక్కన బెట్టి తెలంగాణ కోరేవాళ్లందరూ..' అని అంటూ వుంటారు కాని ఎవరు మాత్రం జెండా పక్కన పెడతారు ఎవరితో కలిసి వస్తారు? ఒకే పార్టీలోనే తామనుకున్న పదవులు రాకపోతే సమైక్యవాదులు ప్రత్యేకవాదులు అయిపోతున్నారు. ఇక యితర పార్టీల వాళ్లతో భుజాలు కలపడం అంటే కుదిరే పనా? ఇప్పుడు టిడిపివారు కూడా రాజీనామా చేశారు కాబట్టి నాగం వెళ్లి వాళ్లతో కలుస్తారా? అబ్బే, వాళ్లు నలుగురూ వాళ్లో జట్టు.

తెలంగాణ వుద్యమం అంటే సానుభూతి వుండి ఎలాగైనా తెలంగాణా వచ్చేస్తే బాగుండును అనుకునే విద్యాధికులు, పాత్రికేయులు, మేధావులు, మావోయిస్టులు ఒక గ్రూపుగా ఏర్పడి యీ ఉద్యమానికి నైతిక మద్దతు యిస్తున్నారు. వీళ్లు టీవీ చర్చల్లో పాల్గొంటూ, పత్రికల్లో వ్యాసాలు రాస్తూ, ఇంగ్లీషు పత్రికలకు తమ ధోరణి సమాచారం యిస్తూ, సదస్సుల్లో పాల్గొంటూ చాలా చురుగ్గా వుంటారు. వీళ్లకు కెసియార్ అంటే లవ్–హేట్ రిలేషన్‌షిప్. ఉద్యమాన్ని యింతదూరం తీసుకుని వచ్చినందుకు ఆయనపై ప్రేమ. కానీ తన తలతిక్క ధోరణితో ఎన్నేళ్లయినా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోనందుకు కోపం, అసహ్యం.

వాళ్లనుకున్నది చేయడానికి కెసియార్ సిద్ధంగా వుండరు. ఈ మేధావి వర్గాలు నాకు ఉపయోగపడాలి తప్ప వాళ్లు చెప్పినట్టు నేను ఆడడమేమిటి నాన్సెన్స్ అని కెసియార్ అభిప్రాయం. వాళ్లు యిలా చేయవచ్చుగా, అలా చేయవచ్చుగా అని సలహాలు చెప్పబోతే 'ఒఖ్ఖడు పది వోట్లు తేలేడు కానీ, అందరూ నీతులు చెప్పేవాళ్లే' అని విసుక్కుని వీళ్లందరినీ దూరంగా పెట్టేశాడాయన. వీళ్లలో ఎవరైనా కెసియార్ మన్ననలు పొందాలంటే జయశంకర్ గారిలా గోడ ఎక్కాల్సిందే ! అప్పుడు 'ఆయన పేరు ఆయన జిల్లాకు పెట్టాలి', 'ఆయన సూక్తులు పాఠశాల గోడలపై రాయాలి', 'ఆయన జీవితచరిత్ర పాఠ్యాంశంగా పెట్టాలి', 'ఆయన విగ్రహం విరగకొట్టడానికి వీల్లేకుండా హుస్సేన్‌సాగర్ మధ్యలో బుద్ధుడి సైజులో పెట్టాలి' వంటి డిమాండ్లు చేస్తారు. బతికి వుండగా తెలంగాణా జాక్‌కు కన్వీనర్ పదవి కూడా యివ్వలేదు కానీ యిప్పుడు ఎన్నయినా గుర్తుకు వస్తాయి.

కోదండరాంకు యీ సంగతి బాగా తెలుసు. అందుకే ఆయన తగ్గి వుంటాడు. పట్టూ విడుపూ (ఎక్కువగా విడుపే లెండి) తెలిసిన మనిషి. కెసియార్ యిచ్చినంత గౌరవమే తీసుకుని మర్యాద కాపాడుకుంటూ గడుపుతారు. రమ్మంటే వాళ్లింటికి వెళ్తారు. ఈ ప్రొఫెసర్‌గారు యిలా వుండడమేమిటి అని మీరూ నేనూ బుగ్గలు నొక్కుకోవచ్చు. కానీ ఆయన అనుభవాలు ఆయనవి. గతంలో యీ మేధావివర్గాలు కెసియార్‌తో వేగలేక దేవేందర్ గౌడ్ వెనుక ఊరేగాయి. కానీ ఎంత వూరేగించినా ఆయన ఉత్సవవిగ్రహంగా మిగిలాడు తప్ప మూలవిరాట్టు కాలేకపోయాడు.

తెలంగాణ వరకు మూలవిరాట్టు కెసియార్ అని పరిపూర? జ్ఞానోదయం అయిపోయాక యీ మేధావులు పూర్తిగా చప్పబడి ఆయన ఏం చేసినా మహబాగే అని సర్దిచెప్పుకోసాగారు. అందుకే నాగం యిప్పుడు ఖడ్గధారియై గోదాలోకి దిగినా ఆయన వెనక వెళ్లటం లేదు. కెసియారే గతి అని తెలిసినా ఆయన యిలా కాకుండా మరోలా వుంటే బాగుండును అని మనసులో చిన్ని చిన్ని ఆశ. ఎందుకంటే ఆయన గురించి బహిరంగంగా ఫిర్యాదు చేస్తే సమైక్యవాదులు దాన్ని అవకాశంగా తీసుకుని గేలి చేస్తారన్న సంకోచం. తోడికోడలు నవ్వితే ఎవరు మాత్రం భరించగలరు?

అందుకే మంగళవారం టీవీ చర్చల్లో జర్నలిస్టు శ్రీనివాసరెడ్డిగారు కెటియార్‌ను మెత్తమెత్తగా మందలించబోయారు. ఇప్పుడైనా మీరు అందర్నీ కలుపుకుని వెళ్లలేక పోయారా? అని. కెటియార్ ఖచ్చితంగా చెప్పారు – 'టిడిపివాళ్లను మేం నమ్మం. వాళ్లు దిక్కూ దివాణం లేని పరిస్థితుల్లో, దిక్కుతోచక రాజీనామా చేశారు. వాళ్లు మాతో సమానం ఎలా అవుతారు? వాళ్లను కలుపుకోవలసిన అవసరం మాకేమిటి?' అని.

'అలా అనకండి. గతం వదిలిపెట్టండి. ఉద్యమంలో జెండాలు పక్కనబెట్టి అందరూ కలిసి సాగవలసిన అవసరం వుంది కదా' అని శ్రీనివాసరెడ్డి ఎంత నచ్చచెప్పబోయినా కెటియార్ వినలేదు. ఈయన మొహం వేలాడేయవలసి వచ్చింది. ఈ మేధావులకు

కావలసినది తెలంగాణ, దాన్ని ఎవరు తెచ్చినా మహబాగే వాళ్లకు. అందరూ కలిసి రావాలన్న నక్కాశ వాళ్లది. తలిదండ్రులు చూడండి అత్యాశగా పిల్లలందరూ కలిసి వుండాలని, కలిసి సంపాదిస్తూ, కలిసి సమానంగా అందరూ అనుభవిస్తూ, కుటుంబం పేరు పైకి తీసుకురావాలని వూరికే యిద్దై పోతూంటారు. కానీ పిల్లల్లో అలా వుంటుందా? ఎవడికి వాడే పైకి రావాలని చూస్తాడు. 'నాకున్నది వాడికెందుకు పెట్టాలి? కావాలంటే వాణ్నీ కష్టపడమను. వాడేం చెయ్యడు కానీ నా దానిలో వాటా అడుగుతాడు. నువ్వు చూస్తూ కూర్చో. వాడికి ఎలా బుద్ధి చెప్పాలో అలా చెప్తా' అంటాడు. తండ్రి లబలబ లాడతాడు.

ఇప్పుడీ మేధావులు అలాగే వున్నారు. ఎలాగోలా సర్దుకుని అందరూ కలిసి తెలంగాణ తెచ్చేయాలని వాళ్ల ఉబలాటం. ఇన్నేళ్లగా వుద్యమం చేసి యీ కాంగ్రెస్, టిడిపి చేతుల్లో పెట్టాలా అని తెరాస బాధ. మా సంఖ్యాబలంతో పోలిస్తే నువ్వెంత ఐదోవంతో, నాలుగోవంతో, నువ్వే మా చెంతకు రా, లేదా మమ్మల్ని ఉద్యమంలో కలుపుకో అని వీళ్ల పంతం. బుధవారం టీవీ చర్చలో ఈటెల రాజేందర్ స్పష్టంగా చెప్పారు – తెలంగాణ వుద్యమంలో పెద్దన్న పాత్ర మాదే ! ఈ ఉద్యమానికి కర్త, కర్మ, క్రియ కెసియారే అని. ఇదీ తెరాస నాయకుల లైన్ ఆఫ్ థింకింగ్. వాళ్లు ఒక్క మెట్టు కూడా దిగేట్టు లేరు. దిగనక్కరలేదు. ఇతరులను వాళ్లున్న మెట్టుపైకి రానివ్వటం లేదు. రానివ్వకపోవడమే కాదు, ఈ మెట్లదారంతా మాదే. మీకు దీనితో పని లేదు అని యితరులకు చెపుతున్నారు. కృష?దేవరాయలు ఎవర్నో పునీతం చేయిద్దామనుకున్నాట్ట. అది యిష్టం లేని తెనాలి రామలింగడు 'ఓ కుక్కను పట్టుకుని వచ్చి గంగాస్నానాలు చేయిస్తే గోవు అవుతుందా?' అని వెక్కిరించాట్ట.

అలాగ తెరాస దృష్టిలో టిడిపి, కాంగ్రెస్‌వారు జన్మతః పాపులు. వారు ఉద్యమగంగలో మునిగినా పాపాలు ప్రక్షాళం కావు. వాళ్ల పాపాలు పోవాలంటే వాళ్లు చెన్నమనేని రమేష్‌లా, పోచారంలా తెరాస గంగలో మునగాలి. తమ అస్తిత్వాన్ని కోల్పోవాలి. దానికి ముందు తమ పార్టీతో పోట్లాడి తెలంగాణా పట్టుకుని వచ్చి కెసియార్ దోసిట్లో పోసేసి ఆయనలో లీనం అయిపోవాలి. గతంలో తెలంగాణ తెస్తే చాలు, నేను అవతారసమాప్తికి రెడీ అంటూండేవారు కెసియార్. ఇప్పుడు లేదు లేదు, బ్రహ్మలాగ తెలంగాణ సృష్టించాక, విష?వులా దాని స్థితి బాధ్యత కూడా నాదే. దాన్ని మరొకరి చేతిలో పెట్టి దిక్కులు చూస్తూ వుండలేను కదా అంటున్నారు. నా కన్నంలో వేలు పెడితే కొరకనా? అని ఏడుచేపల కథలో చీమ అన్నట్టు మరి నా సింహాసనంలో వాటా కొస్తే కరవనా? అంటున్నారు కెసియార్.

తెరాస తీరు యిలా వుంటే ఎవరు ఆయనతో కలుస్తారు? అందరూ కలిసి రాకపోతే ఆయన ఒక్కరూ ఒంటిచేత్తో తెద్దామంటే తెలంగాణ వచ్చేనా!? ఇదీ ప్రశ్న! ఇప్పుడు ఢిల్లీవాళ్ల మానసిక స్థితి చూస్తే వచ్చేట్టు లేదనే అనిపిస్తోంది. కానీ ఆంధ్రప్రాంతం వాళ్లతో కూడా కలిసి చర్చిస్తేనే పనులు జరుగుతాయి అనే సందేశం యిస్తున్నారు వాళ్లు. ఆ ముక్క చెప్పడానికే, 'తక్కినవాళ్లకూ సెంటిమెంట్లు వుంటాయి', 'హైదరాబాదు మాటేమిటి?' 'దేశంలో తక్కిన పార్టీలతోనూ చర్చించాకే అఖిలపక్షం పిలుస్తాం', 'ఇప్పటికిప్పుడు నిర?యం తీసుకోకపోతే కొంపేం మునగదు'.. యిలాటి స్టేటుమెంట్లు వెలువడుతున్నాయి. 'అయినా రెండో ఎస్సార్సీ కానీ, అసెంబ్లీ తీర్మానం కానీ లేకుండా ఇంకో కొత్త రాష్ట్రం ఎలా యిచ్చేస్తాం?' 'హైదరాబాదును ఉమ్మడి రాజధాని చేస్తే శాంతిభద్రతల బాధ్యత ఏ రాష్ట్రం తీసుకుంటుంది?' ఇటువంటి టెక్నికల్ క్వశ్చన్స్ ప్రణబ్ సంధించారట. మన నాయకులు తెల్లమొహం వేసి 'సార్ అవన్నీ ఆలోచించలేదు. ప్రజలు ప్రత్యేకం అన్నారు. మేం వచ్చి మీ దగ్గర అది వల్లిస్తున్నాం' అన్నారట. చర్చలకు వెళ్లేవాళ్లు గుంపులు గుంపులుగా లోపలకి వెళ్లి దీనాలాపనలు చేయడం కాదు, ఇద్దరు ముగ్గురు వెళ్లి మాటకు మాట బదులు చెప్తే చాలు. వీళ్లు వెళ్లిన తర్వాత లగడపాటి పావుగంట మాట్లాడి వెళ్లారట. ఏం చెప్పారో ఏమో ! అలాగే వీళ్లల్లో ఎవరో ఒకరు వెళ్లవచ్చుగా ! అబ్బే ఒకరి మీద మరొకరికి అనుమానం, ఎక్కడ తలకాయవూపి వచ్చేస్తారోనని. మధు యాష్కీ చెప్పారుగా – మాలోనే బ్లాక్ షీప్ వున్నారని !

అయనా ప్రణబ్ గడుసుతనం కాకపోతే – రెండో ఎస్సార్సీ ఎప్పటి మాటండి, 2004 నాడు తెరాసతో చేసుకున్న ఒప్పందం నాటిది. దాన్ని అప్పుడే వేసి వుండాల్సింది. ఈ పాటికి చర్చ ఓ కొలిక్కి వచ్చేది. ఇక ఎసెంబ్లీ తీర్మానం. మొన్న స్పీకర్ ఎన్నిక కోసం అడావుడిగా అసెంబ్లీ పెట్టగాలేనిది, యిప్పుడు మళ్లీ పిలవవచ్చు. 2009 డిసెంబరు 7 నాటి తీర్మానంవుందిగా అని వీళ్లు సన్నసన్నగా అని చూశారు. అది వుత్తుత్తి తీర్మానం అని అందరికీ తెలుసు. తెలంగాణ ప్రజల్ని ఏమార్చడానికి, కెసియార్‌ను కాపాడడానికి చేసినది. తెలంగాణ యిస్యూ వర్చువల్ కాదనీ, రియల్ అనీ యిప్పుడు అందరికీ తెలిసింది కాబట్టి అసెంబ్లీ తీర్మానం అంటే ప్రాంతాల వారీగా ఓట్లేస్తే తీర్మానం వీగిపోతుందని క్యాఫ్ట్ వాళ్లకీ తెలుసు. ఎవరో గుప్పెడు ఆంధ్ర పెట్టుబడిదారులు తప్ప తక్కిన రాష్ట్రప్రజల్లో 80–90% మంది విభజనకు సై అంటున్నారని పైకి చెప్తున్నారు కానీ అసెంబ్లీ తీర్మానం ద్వారా దాన్ని రుజువు చేస్తామని ఛాలెంజ్ చేయడం లేదు.

నేను గత వ్యాసంలో రాసినట్టు పరిష్కారం ఢిల్లీలో లేదు. హైదరాబాదులోనే వుంది. సోదరుల మధ్య వివాదం సోదరుల మధ్యే తీరాలి. సంభాషించాలి. పక్కన నుంచుని గ్రూపు ఫోటో తీసుకునే ముచ్చట లేదని పొన్నం అనవచ్చు. (ఫోటోలు లేకుండానే అధినాయకులందరూ జాయింటు వ్యాపారాలు జోరుగా చేసుకుంటున్నారు) ఇలాటి కబుర్లు కట్టిపెట్టి సంప్రదింపులు ప్రారంభం కావాలి. ఈ రాజీనామాల వలన జరిగిన మేలేదైనా వుందా అంటే హై కమాండ్ సంప్రదింపుల పర్వానికి శ్రీకారం చుట్టేట్టు వుంది. అదీ యింకా గట్టిగా అనలేదు. ఆ అవకాశాన్ని దొరకబుచ్చుకుని కథ ముందుకు తీసుకుని వెళ్లాలి. కథ యీ దారిలో సాగడం యిష్టం లేని తెరాస తప్పకుండా గండి కొడుతుంది. కానీ మీరు మమ్మల్ని అడగకుండా కార్యక్రమాలు చేపట్టినపుడు మేమూ మిమ్మల్ని ఖాతరు

చేయకుండా ఏదో ఒకటి చేసుకుంటాం అని క్యాప్టివాళ్లు తెరాస వారికి చెప్పగలగాలి. చెప్తారా? అన్నదే మరో ప్రశ్న ! **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**

**జులై 16** **ఎమ్బీయస్ : రోకో, రోకో రోకో, ఫిర్‌సే రోకో..**

రాజీనామాల పర్వం పూర్తవకుండానే ఏకదమ్ ప్రకటించిన ఐదురోజుల కార్యక్రమాల్లో మూడు రోజుల కార్యక్రమాలు కాన్సిల్ చేసేశారు కోదండరామ్ గారు. రాజీనామా చేసిన పక్షాలతో చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని నిర?యిస్తామన్నారు. వాళ్లు హఠాత్తుగా ఎలా గుర్తుకు వచ్చారంటారు? రెండు రోజుల బంద్, రెండురోజుల రైల్ రోకో, ఒక రోజు ఆహారదీక్ష.. యివన్నీ ప్రకటించినప్పుడు వారి కంటికి యీ రాజీనామాల వాళ్లు ఆనలేదా? ఇప్పుడు హఠాత్తుగా ఆత్మీయులెలా అయిపోయారు? వాళ్లింకా జాక్‌లో చేరతామనలేదు, వీళ్లు చేర్చుకుంటామనలేదు.

సోమవారం మధ్యాహ్నం యిలాటి సంప్రదింపులు చేసాకనే 5, 6 బంద్ ప్రకటిస్తే వాళ్లకూ మర్యాద దక్కేది కదా ! దక్కనీయకుండా చేయాలనే అడావుడిగా ప్రకటించారు. సగంలోకి వచ్చాక ఏదో గుర్తుకు వచ్చినట్టు ఆపేస్తున్నారు. అనుకున్నదేదో ఏదో లాంఛనంగా చేసేస్తే పోయేదిగా. నిజానికి బంద్ చేసిన రోజుల్లో రెండో రోజు మధ్యాహ్నానికి అంతా జావకారిపోయింది. అయినా బంద్ సంపూర?విజయం అని చాటుకున్నారా లేదా ? అలాగే రైల్ రోకోలు అవీ పూటో, అరపూటో చేసినా బ్రహ్మాండం బద్దలయింది అని రాయించేసుకుంటే పోయె. భోజనాల విషయంలో కూడా 10 లక్షల పొయ్యిలని ఎనౌన్సు చేసి 2 వేల పొయ్యిలతో సరిపెట్టి అయినా వీటి సెగ తగిలింది, ఢిల్లీ పీఠం కదిలింది అని చెప్పుకోలేదా? అలాగే ఊళ్లల్లో అంతా వండేసుకున్నారు అని నాలుగు చోట్ల టీవీ కెమెరాలు పెట్టి చూపిస్తే పోయేది.

అయినా కాన్సిల్ అని అన్నారంటే వెనక గట్టి కారణం ఏదైనా వుందేమో ! క్యాప్టివాళ్లు కెసియార్ వద్ద మొత్తుకోవడమో, తిట్టుకోవడమో చేశారేమో – 'మీ కారణంగా మా వాళ్లకు మా ప్రజ్ఞ మీద అనుమానం వచ్చేసింది. కెసియార్ చేతిలోంచి మీరు అధికారం గుంజుకోవడం కల్ల' అంటున్నారు. కాస్సేపు మమ్మల్ని కూడా కళ్లాలు పట్టుకోనియ్' అని. అందుకే కెసియార్ దీన్ని రోల్‌బ్యాక్ చేశారేమో ! టిడిపివాళు ్లు కూడా పట్టించుకునేట్టు లేరు. బస్సుయాత్ర మొదలుపెట్టారు. ప్రస్తుతానికి ఆపండి, అందరితో సంప్రదించి అందరూ ఔనంటేనే వెళ్లండి అని కోదండరాం చెప్పి చూశారు. ఇది మా పార్టీ వ్యవహారం, యితరులతో పనేముంది? అని అనుకుని టిడిపి వాళ్లు బస్సును రైట్ రైట్ అన్నారు. కెసియార్‌తో చేతులు కలపి కలపని గద్దర్ అక్కడకు వెళ్లి జెండా వూపి విజిల్ ఊదారు. కెసియార్ వ్యతిరేక బస్సుయాత్ర అన్న కలర్ వచ్చింది. అయినా తెరాసవాళ్లు టిడిపి వాళ్ల బస్సులను అడ్డుకోవడం లేదట. చెయ్యక చెయ్యక రాజీనామాలు చేశారు కదా పాపం అని టిడిపివారిపై సాధారణ ప్రజలకు జాలి వుందేమో, ఈ సమయంలో అడ్డుకుంటే రివర్సవుతుందన్న భయం వేసి వుంటుంది తెరాస వర్గాలకు.

అయినా బస్సుయాత్ర ఆపమని చెప్పడానికి కోదండరాంకు ఏ మోరల్ అథారిటీ వుంది? ఓ పక్క తెరాస నాయకులు టిడిపి నాయకుల్ని రాజీనామా చేసిన తర్వాత కూడా యీసడించడం మానలేదు. మొన్నటిదాకా రాజీనామా చేయలేదని పీడించారు. చివరకు చేస్తే 'గతిలేక చేసిన రాజీనామా కూడా ఓ రాజీనామాయేనా' అంటున్నారు. ఇంక ఎలా చచ్చేది? తెరాసనుండి కాండెక్ట సర్టిఫికెట్టు గురించి ఎదురు చూడకుండా రోడ్డు మీద పడితే ప్రజలే యిస్తారేమో పరీక్షించి చూసుకుందాం అని వాళ్లు బస్సెక్కితే ఓల్డాన్ అంటున్నారు కోదండరాం. మేం చెప్తాం అప్పుడు వెళుదురుగాని అంటున్నారు. వాళ్లని అడక్కుండా వీళ్లు రోకోలు, బంద్‌లు అంటారు. అప్పుడు వాళ్లెవరో మాకు జాన్తానై అంటారు. పోనీ వాళ్లంతటవాళ్లు బస్సు మాట్లాడుకుని ఎక్కబోతూ వుంటే హన్నా, మమ్మల్ని అడక్కుండా ఎక్కితే ఎలా అని దబాయిస్తారు. బొత్తిగా అత్తగారూ–కోడలూ వ్యవహారంలా వుంది. టిడిపి వీళ్లకు యింత లోకువగా కనబడడమే వింతగా వుంది. ఇంత లోకువగా చూస్తూ మళ్లీ అందరూ కలిసి రండి, జాయింటుగా ప్లాను చేద్దాం అంటారు.

కోదండరాం పిలుపుకి స్పందించిన దెవరు? నాగంగారి 'ఆ నలుగురు'. వాళ్లు ఇంకా ఏం చేయాలో తోచక తిరుగుతున్నారు. పార్టీలోంచి బయటకు వచ్చినా నాగం గారికి ఇంక బాబుపై కసి పోలేదు. సోనియాను తిట్టరు, కెసియార్‌ను తిట్టరు. బాబుమీదే పడి నిందిస్తూంటారు. ఆయన తన అభిప్రాయం చెప్పాలట, లేఖ యివ్వాలట. స్వంతపార్టీవాళ్లు ఇంతమంది రాజీనామాలు యిస్తే దిక్కు లేదు కానీ సోనియమ్మ బాబు లేఖ రాలేదు కదాని చెంగుచాటున దాచి వుంచిన తెలంగాణాను తీసి యివ్వటం లేదా? బాబు లేఖ యిస్తే తెలంగాణ యిస్తా అని సోనియా చేత చెప్పించమను యిప్పిస్తాం అని టి–టిడిపివాళ్లు నాగంకు ఎప్పణ్నుంచో చెపుతున్నారు. ఆయనకు అదేమీ అక్కరలేదు. బాబు, బాబు అని ఒకటే కలవరింత. అలాటి నాగం అండు కోని పీటేసి కూర్చోబెట్టి వాళ్లతో కూర్చుని మనం సమైక్యంగా కార్యాచరణ పథకాన్ని రూపొందిద్దాం అంటే టిడిపివారు గంతులేసుకుంటూ వస్తారా? కోదండరాం ఏం కలలు కంటున్నారో ఏమో !

ఇక కాంగ్రెస్‌వాళ్లు. రాజీనామాలు యివ్వగానే భూనభోంతరాళాలు బద్దలవుతాయన్నారు. ఎక్కడా ఏమీ కాలేదు. ఢిల్లీ పీఠం కదిలి వచ్చి కాళ్లమీద పడుతుందన్నారు. కదలలేదు. పాతపాఠమే మళ్లీ చదువుతున్నారు. జానారెడ్డికి ఎవరు చెప్పారో ఏమో రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య సంప్రదింపులకు ఓ కమిటీ వేసి చర్చలు ప్రారంభిస్తారని ఓ వార్త లీక్ చేశారు. మొదట్లో దానిలో ప్రాంతానికి

యిద్దరు చొప్పున ఆరుగురు సభ్యులుంటారని అన్నారు. జానారెడ్డి న్యూస్ లీక్‌లో ఐదుగురే అన్నారు. అంటే సీమ ప్రతినిథి ఒక్కరే అనుకోవాలి. శుక్రవారం ఈనాడు హెడ్‌లైన్సులో కమిటీ ఉత్తిదే అని వుంది. అంటే కమిటీ మీడియాలో పుట్టి, మీడియాలోనే గిట్టిందన్నమాట. ఆజాద్‌ను అడిగితే కమిటీ గురించి ఆలోచించి విరమించుకున్నామని కూడా చెప్పలేదు. 'కమిటీ ఏమిటి? నేనున్నానుగా ఏక్ నిరంజన్‌ను, జిందా తిలిస్మాత్‌ను. నేనే వచ్చి అందరితో మాట్లాడి తేల్చేస్తా' అన్నారు. మొన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమావేశం జరిగిన తర్వాత ఆజాద్ మాట్లాడిన మాటలకు తెలంగాణా కాంగ్రెస్ నాయకులందరూ కారాలూ, మిరియాలూ నూరుతున్నారు. ఆజాద్ 2004లో తెరాసతో పొత్తు కుదిర్చిన జాదూ అని, కాంగ్రెస్–తెరాస సఖ్యత సాధించాలంటే సరైన కాండిడేట్ అనీ ఆకాశానికి ఎత్తేసిన టి కాంగ్రెస్‌వాళ్లు తాము రాజీనామాలు ప్రకటించినా వాటికి విలువ నివ్వకుండా తెలంగాణ యిప్పట్లో తేలదని తేల్చేసిన ఆజాద్ అంటే మండిపడ్డారు. వైయస్ బతికి వుంటే ఆయనే ఆజాద్‌కు ఏదో ఆశ చూపి అలా చెప్పించాడని ఆరోపించేవారు. ఇప్పుడు కిరణ్‌కు అంత ఓపిక లేదని అందరికీ తెలుసు. అందువలన అధిష్టానమే చెప్పించిందన్న అనుమానం. వీళ్లింత ఫిర్యాదు చేసిన ఆజాద్‌ను మందలించిన దాఖలాలు కూడా లేవు.

ఆ ఉక్రోషంతోనే రాజీనామాలు చేద్దామా వద్దా అని ఊగిసలాడుతున్నవారూ కూడా చేసేశారు. చేశాక ఏమీ జరగకపోవడంతో ఆలోచనలో పడ్డారు. చేసి బావుకున్నది కనబడటం లేదు. రాజ్యాంగ, రాజకీయ సంక్షోభం తెచ్చే వుద్దేశం లేదంటారు, మరి యింతమంది రిజైన్ చేశాక అవి లేకుండా ఎలా వుంటాయి? పరిపాలనా సంక్షోభం అయితే తప్పదు. రాజీనామా చేసిన మంత్రులు విధులకు హాజరు కాకూడదని ఉద్యమకారులు అంటున్నారు. హెూం శాఖతో సహా అనేక ముఖ్యశాఖలు తెలంగాణ వారి చేతుల్లో వున్నాయి. అసలే రాష్ట్ర పరిస్థితి అస్తవ్యస్తం. ఫైళ్లు పేరుకుపోయాయి. దానికి తోడు మంత్రులు కూడా ఆఫీసుకి వెళ్లకపోతే ఏం నడుస్తుంది? ఎలా నడుస్తుంది? జానారెడ్డి చెప్పిన కమిటీ వేస్తే 'అదిగో మా రాజీనామాల వలన సంప్రదింపుల కమిటీదాకా వచ్చింది. మేం మా ఛాంబర్స్‌కు వెళ్లి పనిచేసుకుంటాం' అని చెప్పుకోవచ్చు. కానీ కమిటీ మాటే ఎత్తడం లేదు ఆజాద్. ఇప్పుడు వెళ్లాలో లేదో తెలియదు.

ఇక ఎంపీలు – మీరా కుమార్ గారు ఆగస్టు 1 వరకు టైమిచ్చారు. ఆ తర్వాత ఆమోదించేస్తానన్నారు. ఇటు చూస్తే హై కమాండ్ రేపో, మాపో అని కూడా అనటం లేదు. ఎల్లుండో, అవతలెల్లుండో అంటోంది. అదీ ప్రత్యేకరాష్ట్రం కాదు, ఆ విషయమై ఆలోచించడానికి చేయవలసిన ప్రక్రియట. వీళ్లు అడిగినవన్నీ (హైదరాబాదుతో కూడిన ప్రత్యేక తెలంగాణ) మారు మాట్లాడకుండా యిచ్చేస్తే టైము పట్టదు కానీ చర్చల ఒంటూ దిగాక ఎంతకాలం పడుతుందో తెలియదు. కొత్త కొత్త పాయింట్లు పుట్టుకుని వస్తాయి. విభజన ఆవశ్యకత గురించి కూడా డిబేట్ పెడతారు. ఇవన్నీ ఎప్పటికి ఓ దరికి చేరతాయో తెలియదు.

సరిగ్గా యీ రాజీనామాలనేవి కేంద్ర కాబినెట్ విస్తరణకు ముందు దాపురించాయి. కాబినెట్‌లో యీ సారి తెలుగువాళ్లకి రెండో మూడో బెర్తులు దొరుకుతాయేమోననుకుంటే యిప్పుడు అవి వెనక్కి వెళుతున్నాయట. రాజీనామా చేయని తెలంగాణ ఎంపీల కిస్తే చేసినవాళ్లకు కోపం. తెలంగాణ వాళ్లను సాంతం వదిలేసి కోస్తా, సీమవాళ్లకిస్తే తెలంగాణ వాళ్లందరూ భగ్గు. ఈ కారణాలు చెప్పి తెలుగువాళ్లందరికీ ఎగ్గొడితే తక్కినవాళ్లను తృప్తిపరచడానికి భలే ఛాన్సు. సోనియా వదులుకుంటుందా? మనలో మనం తన్నుకుంటే కలిగే ఎన్నో నష్టాల్లో యిది ఒక చిన్న నష్టం. మనవాళ్లకు పదవులు యిచ్చినా రాష్ట్రానికి కలిగే మేలు ఏమీ లేదని తెలుసు మనకు.

ఇది మనకు తెలుసు. అందుకని వూరుకుంటాం. కానీ మంత్రి పదవి ఆశించిన వాడికి అలా వుండదు కదా, "ఇదిగో వీళ్లే సరిగ్గా సమయానికి రేప్పెట్టారు. నా ఛాన్సు చెడగొట్టారు" అని పొన్నం, కేకే ప్రభృతులపై పళ్లు నూరుకుంటారు. ప్రతీ ఉద్యమంలోను, ప్రతి దశలోనూ ఎప్పుడూ అతివాదులు, మితవాదులు (హాక్స్ అండ్ డవ్స్) వుంటారు. రాజీనామా చేయాలన్న ఉబలాటం అందరిలో ఒకే డిగ్రీలో వుండదు. అతివాదుల పోరు పడలేక, వాళ్లు బయటకు వెళ్లి ప్రజలకు ఏం చెప్తారోనన్న భయం చేత మితవాదులు అతివాదులు చెప్పినట్టు చేస్తూండవలసి వస్తుంది. పైగా ఈ అతివాదులకు గుప్తప్రణాళికలు ఏమైనా వున్నాయేమోనన్న అనుమానం వీళ్లను పీడిస్తూ వుంటుంది.

ఇది కోవర్టుల కాలం. పార్టీలో వుండి అధిష్టానాన్ని తిట్టేస్తారు, ఓ శుభముహూర్తాన జంప్ అంటారు. చేగొండి హరిరామజోగయ్య చూడండి. 'మన కాంగ్రెస్‌ను ఈ వైయస్ తగలేస్తున్నాడు, చూడండి ఎంత అవినీతో, ఇలా అయితే చిరంజీవి పార్టీ మనని మట్టి కరిపించదా? తుక్కు తుక్కు కింద కొట్టదా?' అంటూ సోనియాకు ఉత్తరాలు రాయడం, వాటిని ప్రెస్‌కు రిలీజ్ చేసి కాంగ్రెస్ పరువు తీయడం, మధ్యలో చిరు పేరు చెప్పి కాంగ్రెస్ క్యాడర్ స్థయిర్యం దెబ్బ తీయడం. ఇలా యాగీ చేసి చేసి చివరకు చిరు చెంత చేరాడు. అలాగే నాగం – బాబు మాట్లాడాలి, లేకపోతే కెసియార్‌దే విజయం అంటూ మాట్లాడి మాట్లాడి టిడిపి క్యాడర్ భయాందోళనలు పుట్టించి చివరకు పార్టీలోంచి బయటకు వచ్చేసి కెసియార్‌తో మంతనాలకు దిగారు. విడిగా అంబ పలకకపోతే తెరాసలో చేరినా అబ్బురం ఏమీ కాదు.

ఇప్పుడు పొన్నం యిదే ధోరణిలో మాట్లాడుతున్నారు. కాంగ్రెస్‌దే తప్పు, కాంగ్రెసే దోషి.. అని. అందరినీ పురికొల్పి రాజీనామా చేయించారు. ఇంతా చేసి రేపు తెరాసలోకి దూకేస్తే..? ఆయన వెనక్కాల యిప్పటిదాకా వెళ్లినవాళ్ల పరిస్థితి యిరకాటంలో పడుతుంది. అటు వెళ్లాలా? ఇక్కడే వుండిపోవాలా? ప్రతీవాడూ వాడి నియోజకవర్గంలో వున్న పరిస్థితి బట్టి భవిష్యత్తు నిర?యించుకోవాలి. వరంగల్, కరీంనగర్ నాయకులు వాళ్ల నియోజకవర్గ ప్రజల మూడ్ బట్టి ఫోర్సుగా వుంటారు. అదే ఫోర్సు జంటనగరాల ఎమ్మెల్యేలు చూపించి తెరాస భాష మాట్లాడితే జనం ఆమోదించకపోతే..? హై కమాండ్ జులై 13 లోపున మీరు దిగిరాకపోతే రాష్ట్రపతి పాలనే

అని చెప్పిందట. ఆ గడువు నాటికి ఎంతమంది జారుకుంటారో చూడాలి. గట్టిగా నిలబడేవాళ్లు ఎటూ తక్కువే వుంటారు. ఊగిసలాడేవాళ్లు ఏం చేస్తారో అదే ఆసక్తికరం. ఈ జారుకునేవాళ్లు, ఊగిసలాడేవాళ్లు వీళ్లను లాలించి, బెదిరించి తమ పక్షాన వుంచడమే ఈ అతివాదుల పని.

తమతో కలిసిరాకపోతే ఏం జరుగుతుందో జయపాల్ రెడ్డి విషయంలో చేసి చూపించారు. మొన్నటిదాకా ఆయన తెలంగాణా ఉద్యమనాయకుడు, తెలంగాణా దీపస్తంభం, రాజీనామా చేసి నాయకత్వం వహిస్తారు అంటూ మీడియాలో రాయించారు. అదేం లేదని ఆయన సందరరే కాకపోయినా యిటీవల హైదరాబాదు మీటింగులో చెప్పేసి తప్పించుకున్నాడు. కానీ యిప్పుడు రాజీనామాపర్వం వచ్చాక మళ్లీ ఒత్తిడి అంతా ఆయనపైనే పడింది. పార్టీలోవాళ్లు, బయటివాళ్లు ఆయన్ను చిత్తం వచ్చినట్టు తిట్టేస్తున్నారు. దాంతో ఆయన శుక్రవారం గొప్ప ఎత్తు ఎత్తారు. ప్రధానమంత్రి వద్దకు వెళ్లి తెలంగాణ గురించి చెడామడా చెప్పేశారట అని న్యూస్ శనివారం వచ్చేట్టు చేశారు. ఇక హెడ్‌లైన్సు జైపాల్ జై తెలంగాణ అని అన్నారని. 'జయపాల్ సన్నిహితులు చెప్తున్నప్రకారం..' అని క్వాలిఫై చేసి నిర్ధారించబడని విషయాలు రాశారు. 'విభజన తప్ప గత్యంతరం లేదని, అన్ని ప్రాంతాలూ బాగుపడాలంటే హైదరాబాదుతో సహా తెలంగాణ విడగొట్టాలనీ జయపాల్ మన్‌మోహన్‌కు ధైర్యంగా చెప్పేశారని' ఆ రిపోర్టులు. ఇక జయపాల్ మాత్రం మీడియా ఇంటర్వ్యూలలో యింత డైరక్టుగా చెప్పలేదు. నేను ఆయనతో మాట్లాడినది మీకు చెప్పలేను, నా అభిప్రాయం చెప్పాను, అయినా ప్రధాని నిర?యమే ఫైనల్ కాదు.. యిలా చాలా జాగ్రత్తగా చెప్పారు.

అసలు జయపాల్ ప్రధాని వద్ద ఎపాయింట్‌మెంట్ తీసుకున్నది దేనికి? పెట్రోలియం శాఖ సమస్యల గురించి. వాటి గురించి కాస్సేపు మాట్లాడక ప్రధాని అడిగి వుంటారు – 'ఏమిటీ తెలంగాణ విషయంలో చాలా గొడవ అవుతోంది కదా, వాస్తవ పరిస్థితి ఏమిటి? మీ ఉద్దేశం ఏమిటి?' అని. ఈయన చెప్పి వుండవచ్చు. 'ఉద్యమం తీవ్రంగా వుంది. నాపై ఒత్తిడి వుంది' అని. జయపాల్ వంటి సీనియర్ కొలీగ్ అలా చెప్పినపుడు 'అయితే ఏం చేద్దాం? పరిష్కారం ఏదైనా సూచించండి' అని మన్‌మోహన్ అనక మానరు. అప్పుడు తక్కిన పొన్నం, వినోద్ వంటి ఎంపీల్లా యీయన 'ఏమో సార్ అదంతా నాకు తెలియదు. నియోజకవర్గంలో తిరిగే పరిస్థితి లేదు. మాది మాకు యిచ్చేయండి. హైదరాబాదు కూడా మాదే' అని మొండిగా చెప్పేసి వూరుకోలేరు. ఊరుకోరు కూడా. అది చెప్పగానే ''మరి వాటి పర్యవసానాలు ఏమిటి? ఆంధ్రప్రాంతంలో వారి అభిప్రాయాల మాటేమిటి? ఇస్తే మన పార్టీకి లాభం ఏమిటి? కృష? కమిటీ హెచ్చరించిన రెడ్ టెర్రర్, గ్రీన్ టెర్రర్ మాటేమిటి?'' అని మన్‌మోహన్ తప్పకుండా అడుగుతారు.

దానికి జయపాల్ ఏం సమాధానం చెప్పారో మనకు తెలియదు. ఊహించలేం. కానీ ఒకటి మాత్రం వూహించగలం. పత్రికలలో రాసినంత మేరకే అంటే ' మీ చావు మీరు చావండి మాకు హైదరాబాదుతో కూడిన తెలంగాణ యిచ్చి మాత్రం చావండి' అని మాత్రం అనలేదని వూహించగలం. ఆ స్థాయి నాయకుడు తనకు తోచిన పరిష్కారంతో కలిపి సమస్య గురించి చెప్తాడు. కానీ జయపాల్ ఆ పరిష్కారం బయటకు చెప్తే ఉద్యమనాయకులకు రుచించకపోవచ్చు. అందుకని ఆయన ఈ ఏర్పాటు చేశారు. మన్‌మోహన్‌ను కలిశారు. బయటకు వచ్చి తెలంగాణా గురించి మాట్లాడాను అని స్వయంగా చెప్పారు. ఇంతవరకూ వాస్తవం. ఇక కావాలని పుట్టించిన ఊహాగానంలో భాగమే – విభజన కోరారు అన్నది.

మా కొలీగ్ వుండేవాడు – మేనేజర్ గదిలోకి ఒంటరిగా వెళ్లేవాడు. లోపల ఏం జరిగేదో తెలిసేది కాదు, బయటకు వచ్చి యితను చెప్పుకునేవాడు – 'లీవిమ్మని ధాటీగా అడిగి మేనేజర్‌ను లెఫ్ట్ అండ్ రైట్ తీసుకున్నాను. ఇచ్చాడు' అని. ఓసారి మా కొలీగ్ యింకో అతను మేనేజర్ దగ్గరకు వెళ్లి లీవు లేదనిపించుకుని ఉక్రోషంతో అన్నాడు – ''ఫలానా అతను గట్టిగా మాట్లాడితే యిచ్చేస్తారండీ, మేం మెత్తగా మాట్లాడితే యిలాగే వుంటుంది' అని. ఆయన తెల్లబోయి 'అతను యించుమించు కాళ్లమీద పడి బతిమాలాడయ్యా, పోనీ కదాని శాంక్షన్ చేశాను' అని. ఇదా సంగతి అనుకుని అప్పట్నుంచి యితను అతను 'లెఫ్ట్ అండ్ రైట్ తీసుకున్నాను' అన్నప్పుడల్లా ఏడిపించేవాడు – 'అవున్లే లోపలికి వెళ్లి సార్ లెఫ్ట్ ఫుట్ పట్టుకోమంటారా, రైట్ ఫుట్ పట్టుకోమంటారా?' అని అడిగివుంటావు అని.

అలాగ మన నాయకులు 'ఆజాద్ దగ్గరకి వెళ్లాం గట్టిగా చెప్పాం, చిదంబరంతో యింకా మాడు పగిలేలా చెప్పాం, పటేల్‌తో అదరగొట్టేట్టు చెప్పాం..' అని యిలా చెప్తూ వుంటే మనం కాబోసు అనుకోవాలి తప్ప అవతలివాళ్లెవరూ వీళ్లు చెప్పేది కన్‌ఫమ్ చేయరు. ఆ మూలపుటమ్మ, అమ్మలగన్న యమ్మ, జాల పెద్దమ్మ – సోనియమ్మ నోరు విప్పదు. వీళ్లను గుమ్మంలోకి కూడా రానీయదు. 100 మంది రాజీనామాలు చేసినా యిదీ పరిస్థితి. ఇక్కడే తెలిసిపోడం లేదా? మన ఫోర్సెంతో ! హై కమాండ్ ఆలోచనాసరళి యిలా వుందని, తెలంగాణ సమస్యను వాళ్లు చాలా తేలిగ్గా తీసుకుంటున్నారని మీకూ నాకే తెలిసినప్పుడు జయపాల్ వంటి సీజన్‌డ్ పొలిటీషియన్‌కి తెలియదా? ఇటువంటి టైములో వెళ్లి ఇంత బ్లంట్‌గా మాట్లాడి ఆయన కూడా తన తలను వధ్యశిలపై పెడతాడా? ఒకసారి తల ఎగిరిపడితే ఆయనకూ నాకూ మళ్లీ ఎవరైనా పిలిచి మంత్రిపదవి యిస్తారా? మధు యాష్కీలాటివాళ్లు వయసులో చిన్నవాళ్లు. ఈ పార్టీ కాకపోతే మరో పార్టీ ద్వారా ఏదో పదవి సంపాదించుకోగలరు. జయపాల్ మారడానికి పార్టీలు కూడా మిగలలేదు. కాంగ్రెస్ హై కమాండ్‌తో పేచీ పెట్టుకుని, ప్రజల్లోకి వచ్చి చలో అని ఉద్యమం చేసే స్వభావమూ కాదు, ఓపికా లేదు. అందువలన శనివారం నాటి వార్తలన్నీ ఆయన స్క్రీన్‌ప్లేతో వచ్చిన చక్కటి నాటకం. జనం ఆయన మీద పడకుండా పడిన జాగ్రత్త.

కాంగ్రెస్‌వాళ్లు యింత అతితెలివిగా వ్యవహారం చేస్తూ వుంటే వాళ్లు వచ్చి జాక్‌లో చేరతారా? అసలే రాజీనామాలు చేసి తలకాయనొప్పి తెచ్చిపెట్టినందుకు ప్రణబ్‌గారు చిర్రుబుర్రులాడుతున్నాడు. జాక్ కెసియార్ జేబు సంస్థ అన్న పేరు ఎలాగూ పడింది. వెళ్లి కెసియార్

ఒళ్లో చేరారు అంటారు రేపు. తెలంగాణపై ఏమీ తేల్చనందుకు తిట్టవలసినది కేంద్రాన్నే కదా, అంటే కాంగ్రెస్‌నే కదా ! జాక్ మీటింగుల్లో యితరులు కాంగ్రెస్‌ను తిడుతూ వుంటే టికాంగ్రెస్‌వారు నోరు తెరుచుకుని వింటూ వుండాలంటే ఎంత కష్టం. తాము తిట్టడం వేరు, యింకోళ్ల చేత తిట్టించడం వేరు.

ఇవన్నీ వూహించే కాంగ్రెస్‌వాళ్లు జాక్‌కి దూరంగా వున్నారు. ఏదో కాంగ్రెస్‌లో అతివాదులు కొంతమంది జాక్‌తో సంప్రదింపులు చేయవచ్చేమో కానీ యీ పరిస్థితుల్లో కాంగ్రెస్ జాక్‌తో చేతులు కలపడం కష్టం. పైగా జాక్‌లో వున్న తెలంగాణ ఉద్యోగుల సంఘం ప్రకటించిన సహాయనిరాకరణను అధికారంలో వున్న కాంగ్రెస్ ఎలా సమర్థించగలదు? అసలు ఉద్యోగులు పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెట్టాలనే రాజకీయ కారణాలకై సమ్మె చేయడమే విమర్శనీయం. (ఆరో జోన్, ఫ్రీ జోన్ విషయంగా చేసారంటే అర్థముంది, వాళ్ల ఉద్యోగాలకు సంబంధించినది కాబట్టి) దాన్ని అధికారపార్టీ వాళ్లే సమర్థిస్తే యింకా వింత అవుతుంది.

వీటన్నిటి కారణంగానే కాంగ్రెస్ వాళ్లు జాక్‌తో కార్యక్రమాలతో కలవడం కష్టం. కావాలంటే వాళ్లు వేరే రోకో పెట్టుకోవచ్చు. జాక్ వాళ్లు ఇంజన్ ఆపితే, వీళ్లు బోగీలు ఆపవచ్చు. వాళ్లు ఒక పట్టా పీకితే వీళ్లు మరో పట్టా పీకవచ్చు. అంతేగాని వాళ్లతో కలిసి పనిచేస్తే మాత్రం పార్టీలో వాళ్ల భవిష్యత్తు బంద్ రోజు బస్టాండే ! ఇది గ్రహింపుకి వచ్చేటప్పటికి జాక్ 'యిక వీళ్లతో లాభం లేదు, మనంతట మనమే కార్యక్రమాలు పెట్టుకుందాం. రోకోలు, అలాయ్‌బలాయ్‌లు, ధూంధాంలు అన్నీ మనమే చేసుకుందాం' అని అనుకోసాగింది. శనివారం సాయంత్రం సమావేశంలో అది తేల్చుకుంటారట. దీనికంతా కారణం – తెరాస అత్యాశే ! కాంగ్రెస్‌వారి యిబ్బంది కూడా కాస్త గ్రహిస్తూ వాళ్లని గోడకు నెట్టకుండా వుంటే, వాళ్ల హై కమాండ్‌కి అనుమానం రాకుండా ప్రవర్తించి వుంటే జాక్ యింత బలహీనపడేది కాదు. తెలంగాణా ఉద్యమం యిలా చీలికలు, వాలికలు అయ్యేది కాదు. భోజనాల్లో ఎవరి బంతి వాళ్లది అయ్యేది కాదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**

### జులై 23 ఎమ్బీయస్ : బిర్ర బిగిసిన సోనియా

టికాంగ్రెస్‌వారి వ్యవహారం చాలా అయోమయంగా తయారైంది. వాళ్లలో కొందరు అతివాదులు ఊదరగొట్టి రాజీనామాలు చేయించి వారమైంది. ఇదిగో రాజీనామా అనగానే అదిగో తెలంగాణా అంటుంది సోనియా అని కెసియార్ ఊరిస్తే కేకే అందుకో అది చెప్పి వీళ్లని ఊబిలో దించారు. ఇప్పుడు బోర్లా పడ్డారు. వారం రోజులుగా ఎక్కేగుమ్మం, దిగేగుమ్మం. గొంగళి మాత్రం అక్కడే వుంది. చెయ్యడానికి సమయం, పాడూ లేదా అని వాళ్లు విసుక్కున్నారు. రాజీనామాల ముందు రావాల్సింది, యిప్పుడు ఏం చేస్తారో చేసుకోండి అంటున్నారుట. అన్నారో లేదో మనం వినలేదు కానీ జరిగింది వూహించవచ్చు. ఆశావాదులు.. కాదు, కాదు.. అత్యాశావాదులు కూడా విభజనకు హై కమాండ్‌కు సుముఖంగా వుందని చెప్పలేని స్థితి. తమ పార్టీలో యింతమంది రాజీనామా చేసినా చలించకపోవడం ఆశ్చర్యకరమే కానీ వాళ్ల లెక్కలు వాళ్లవట.

9 మంది తమ ఎంపీలు పోయినా, వాళ్లతో బాటు అపోజిషన్ వాళ్లు 4గురు పోతారు కదా, నెట్ లాస్ అయిదే కదా అని ధైర్యంట. అవిశ్వాసతీర్మానం పెట్టగల దమ్ము బిజెపికి వుందా, లెఫ్ట్‌కి వుందా, అయితే గియితే పెడితే అణు ఒప్పందం టైములోలాగ అప్పుడే మానేజ్ చేసుకోవచ్చన్న ధైర్యంట. ఎమ్మెల్యేల విషయంలోనే కాస్త యిబ్బంది. వీళ్లందిరివీ ఆమోదిస్తే అసెంబ్లీ ఒకే ప్రాంతంతో నడుస్తున్నట్టు అవుతుంది. కానీ ఒక విషయంలో ఆనందం వుంది. కిరణ్‌కు కూడా ధోకా లేకుండా పోయింది. 46 మంది రిజైన్ చేశాక ఎసెంబ్లీలో 247 మందే మిగులుతారు. అంటే సింపుల్ మెజారిటీ కావాలంటే కాంగ్రెస్‌కు 124 మంది మద్దతు కావాలి. పీఆర్పీ, మజ్లిస్ కలిపితే 137 మంది అవుతారు. జగన్ 25 మంది వ్యతిరేకంగా ఓటేసి పడగొడితే దెబ్బ పడేదే కానీ టిడిపి కూడా రిజైన్ చేయడం వలన అపోజిషన్ ఓట్లు తగ్గి కిరణ్ ఒడ్డున పడ్డారు.

రాజీనామా చేస్తే ఒత్తిడికి లొంగుతారని టికాంగ్రెస్‌వాళ్లు అంచనా వేశారు. వాళ్లు బిర్ర బిగిసారు. దీనికంతా నాయకత్వం వహిస్తున్న కేశవరావు రాజీనామా ఆమోదిస్తే మంచిది, ఆ స్థానంలో చిరంజీవిని రాజ్యసభ సభ్యుడిగా తీసుకుని కేంద్రంలో ఓ పదవి యిచ్చేస్తే పీ ఆర్పీని సంతోష పెట్టినట్టయినా వుంటుందన్న ఆలోచన కూడా వుందట. నిజంగా అదే జరిగితే దాని అర్థం – వీళ్లు కెసియార్ వుచ్చులో పడినట్టు హై కమాండ్ కూడా నమ్ముతోందనే అనుకోవాలి. కోదండరాం చెప్పాడని రిజైన్ చేశారు బాగానే వుంది కానీ మధ్యలో టిడిపిని లెక్కేసుకోలేదు వీళ్లు. టిడిపి వాళ్లు వీళ్ల కంటె ఒక అడుగు ముందుకేసి రిజైన్ చేసేసి, వెంటనే కోదండరాంకు టాటా చెప్పేసి బస్సెక్కేశారు. కెసియార్ ప్రత్యర్థి అయిన గద్దర్‌ను చేరదీస్తున్నారు. ఇంత బలగం వున్న టిడిపి తన వెంట వుంటే యిక గద్దర్ రెచ్చిపోరా? ఇంకో పాట అందుకోరా? జాక్‌కు ప్రత్యామ్నాయంగా గద్దర్, చుక్కా రామయ్య, విమలక్కలతో కలిపి ఓ ఫ్రంట్ ఏర్పరచి దానిని తన జేబు సంస్థగా నడుపుదామనే ఉత్సాహంలో వుందట టిడిపి.

నిజానికి రాజీనామాల తర్వాత అందరి కంటె అత్యంత ఉత్సాహంగా వున్నది టిడిపియే. బస్సు యాత్రకు స్పందన అంత గొప్పగా లేకున్నా, (బస్సు యాత్రలో నగరనాయకులు పాల్గొనడానికి జంకుతున్నారట. ఎవరి స్థానిక సమస్యలు వాళ్లవి) నిరసనలైతే లేవు కదా. సోమవారం కేయూ విద్యార్థులు ఆపలేకపోయారు కదా ! అంతవరకు మేలే కదా. ఇదంతా చూసి ఎర్రబెల్లి ఒళ్లు మరిచిపోయి "ఆంధ్రప్రాంతంలో పోటీ యాత్ర చేస్తున్న ఎర్రన్నాయుడుని హైదరాబాదులో తిరగనివ్వం ఖబడ్దార్" అనేశారు. ఏమైనా అంటే బాబుని

అనాలి కానీ ఎర్రన్నాయుణ్ని అంటే ఎలా? హరీష్‌రావు చెప్పినట్టు బాబు 'ఎర్రబెల్లిచే బస్సుయాత్ర, ఎర్రంనాయుడిచే పాదయాత్ర' ఒకేసారి చేయిస్తున్నారు. ఒక కంట నీరు కారితే మరో కంట పాలు కారవు కదా ! బంతిలో పాలపక్షం చేసే మనిషి కాదు బాబు. 'మా అమ్మ, మా ఆవిడ నాకు రెండు కళ్లు. ఒకదాన్ని ఒకటి చూసుకోవు' అని కవిత్వం చెప్పారు జనార్దనమహర్షి. అలాగే బాబు రెండు కళ్లూ ఒకదాన్ని ఒకటి చూసుకోవు. (జగన్ రెండు చెవుల సిద్ధాంతం గురించి యింకో వ్యాసంలో) మొత్తానికి తెలంగాణలో టిడిపికి పరిస్థితి చాలా మెరుగుపడిందన్నది ఒప్పుకోక తప్పదు. బిజెపి వాళ్లపై మండిపడడమే దానికి రుజువు. ఇలా అందరూ మంచి పేరు తెచ్చేసుకుంటే ఎలా? అని వాళ్లకు చికాకు.

ఇది కాంగ్రెస్ హై కమాండ్ కు కంటగింపుగా వుంది. 'కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలకు ముప్పు తెచ్చిపెట్టి మాకు నష్టం చేస్తూ తెరాస, టిడిపిలకు లాభం చేస్తారా?" అని వాళ్లు భగ్గుమన్నారు. ఈ కోపం సెగ టికాంగ్రెస్‌వాళ్లందరికీ తగిలి బెంగ పట్టుకుంది. ఆఖరి అస్త్రాన్ని ముందే ప్రయోగించి దెబ్బ తిన్నామా అని పునరాలోచన ప్రారంభమైంది. 'రాజీనామాలు ఆమోదించేస్తే ఉపయెన్నికలు. కాంగ్రెస్ టిక్కెట్టు యిస్తుందా? ఇవ్వదా? ఇవ్వకపోవచ్చు. ఇచ్చినా మీ నిధులు మీరే చూసుకోండి అనవచ్చు. పోనీ తెరాసలో చేరకపోయినా తెరాస నిలబెడుతుందా? నిధులిస్తుందా? కెసియార్ యిచ్చినమాటపై నిలబడతారా? తన పార్టీ సభ్యులను నిరాశపరచి, మీకే టిక్కెట్టు అంటారా? పోనీ అన్నారే అనుకో ! తెరాస ఆశావహులు యిండిపెండెంటుగా నిలబడితే? అప్పుడు తమ ఛాన్సు ఎలా వుంటుంది?

మధ్యలో టిడిపి సంగతేమిటి? వాళ్లు అన్నమాట ప్రకారం తెలంగాణ వచ్చేవరకూ పోటీ చేయమంటూ త్యాగమూర్తుల్లా వెలుగుతూ అమరవీరుల కుటుంబసభ్యులను కాండిడేట్లుగా నిలబెడితే సింపతీ వారికే కదా ! ఇక తమను చూడబోతే లేటుగా రిజైన్ చేసినందుకు ప్రజలు ఆదరిస్తారో లేదో ! ఎంతైనా తమంతట తాముగా చేసిన వాళ్లకున్నంత పరపతి బలవంతపు బ్రాహ్మణార్థంగా చేసిన తమకు వుండదు కదా ! రాజీనామాలు చేసి ఎన్నికలు తెచ్చి పెట్టుకుని సుఖాన వున్న ప్రాణాన్ని దుఃఖాన పెట్టుకున్నట్టయింది కదా ! ఈ కేకే, పొన్నం, గుత్తా, యాష్కీ చివరకు ఎటు తీసుకెళతారో ? కాంగ్రెస్‌ను చీల్చి తెలంగాణ కాంగ్రెస్ పెడతారని పుకార్లు వస్తున్నాయి. చీలిస్తే ఎంతమంది వస్తారు? కాంగ్రెస్‌లో వుండగా ఆటలు వేరు. విడిగా ఎందరు వస్తారు? జగన్ సిఎం కావాలని 155 మంది సంతకాలు పెట్టారు. చివరకు పార్టీలోంచి వెళ్లిపోతే 25 మందికి తగ్గారు. వీళ్లు పార్టీ చీలిస్తే ఎంతమంది వస్తారో? అక్కణ్నుంచి నాగం పక్కనే మనమూ కూర్చోవాలి.

'కేకే రెచ్చిపోతున్నారు. తెలంగాణ బలిదానాల గురించి అసెంబ్లీలో మాట్లాడనందుకు కిరణ్‌ను తిట్టిపోశాడు. "సరే మాట్లాడతాను, వాళ్ల పేర్లు ఇయ్యి. వెరిఫై చేయిస్తాను.' అంటే చచ్చే చిక్కు. కొందరు 400 అంటారు, కొందరు 600, మరి కొందరు 700. వైయస్ అమరుల లిస్టులాగ ఏ పేపరూ తెలంగాణ అమరుల లిస్టు తయారుచేయలేదు. వేయలేదు.

"తెలంగాణ లో 10 జిల్లాలు లాగేసుకుంటున్నందుకు బాధేమో అని కేకే కిరణ్‌ను వెక్కిరించాడు. మంత్రులుగా కొనసాగండి అని కిరణ్ రిజైన్ చేసిన మంత్రులపై ఒత్తిడి తెస్తున్నందుకు కోపం వచ్చిందట. పోనీ చర్చలు చేద్దాం అని కిరణ్ అంటే చర్చలకు రావాలంటే తెలంగాణ యిస్తామని ఒప్పుకోవాలని షరతు పెట్టాడు కేకే. పరిస్థితి చూస్తే ఆశాజనకంగా లేదు. కానీ కేకే ఫోర్సు తగ్గించడం లేదు. చివరకు కెసియార్ తెలంగాణ భవన్ చూరు పంచన చేరుస్తాడా? ఇది అవసరమా? పోనీ జయపాల్ రెడ్డిని నమ్మవచ్చా? తన చర్మం కాపాడుకోవడానికి ఏదో న్యూస్ లీక్ చేసి కూర్చున్నాడు. దాన్ని బహిరంగంగా ఆమోదించు లేదా తిరస్కరించు అని గోనె ఛాలెంజ్ చేస్తే మౌనమే శరణ్యం అన్నాడు. రాజీనామాలపై బెట్టుగా వుండాలా? లేక కొద్దికొద్దిగా వెనక్కి నడుచుకుంటూ వెళ్లిపోవాలా?

"ఎలా వెళతాం? 'రాజీనామా చేస్తే తెలంగాణ వస్తుందని జాక్ అంటే నమ్మి రిజైన్ చేశాం. కానీ రాలేదు. పార్టీ పదవుల్లో వుంటూనే కొట్లాడాలి అని మేం ఎప్పణ్నుంచో వాదిస్తున్నదే రైటని తేలింది. అందుకే రాజీనామాలకు నామాలు పెట్టి, తెలంగాణను భగవంతుడికి అప్పగించి, మళ్లీ పదవుల్లోకి వెళ్లిపోతున్నాం, ఏది ఏమైనా ప్రాణత్యాగానికి మాత్రం వెరవం అని ప్రకటించి తప్పుకుందామా. రాష్ట్రపతి పాలన అస్త్రం కేంద్రం చేతిలో ఎప్పుడూ వుంది. రిజైన్ చేసి సచివాలయానికి రాని మంత్రుల కంటె ఠంచనుగా వచ్చే అధికారులే మేలు కదా అనుకోవచ్చు ప్రజలు. ఓ ఆర్నెల్లు గవర్నరుగారికి అప్పగించేస్తే ఆయన పట్టు లుంగీలు కట్టుకుని గుళ్లల్లో పొర్లు దణా?లు పెట్టడం మానేసి, ఎడ్మినిస్ట్రేషన్‌పై పడవచ్చు. తెలంగాణ ఉద్యమాన్నే కాదు, మనల్నీ జనం మర్చిపోవచ్చు. ఎలా? ' అన్న మీమాంసలో పడ్డారు చాలామంది టికాంగ్రెస్‌వారు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో కేకే బ ృందం రిజైన్ చేసిన కాంగ్రెస్‌వారి సమావేశం పెట్టారు. ఎక్కువమంది రాకపోతే మీడియావారు కెమెరాలకు చిక్కుతామని అనుమానం వచ్చిందేమో, అక్కణ్నుంచి జానారెడ్డి యింట్లో అన్నారు. జానారెడ్డిగారు జాగ్రత్తరెడ్డి గారు. తన యింట్లో పెడితే తనే దీనికంతా కథానాయకుడు అనుకుని పోతారేమోననుకుని అబ్బే ఎగ్జిబిషన్ గ్రౌండ్సే రైట్ అన్నారు. చివరకు సమావేశం జరిగింది. వచ్చినవాళ్లు ఎంతమంది? ఉద్యమానికి మీడియా మద్దతు పుష్కలంగా వుంది కాబట్టి పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు అంటూ రాశారు తప్ప అంకెలు రాయలేదు. భూమి ఆశించినంత మంది రాలేదు అంది. సాక్షి మాత్రం అంకెలు యిచ్చేసింది. 3గ్గురు మంత్రులు, 8 మంది ఎంపీలు (కేకేతో కలిపి), 9 మంది ఎమ్మెల్యేలు, 6 గురు ఎమ్మెల్సీలు. అంతే ! 8 మంది సభ్యులు, ఒక కన్వీనరు మొత్తం 9 మందితో ఓ కోర్ కమిటీ ఏర్పరచి నిరాహారదీక్షలు చేద్దాం (నిరవధికమా? 48 గంటలా? అని కాస్సేపు వాదించుకుని 48 కే ఓట్లేశారు) అనుకున్నారు. జాక్‌తో కలిసి పనిచేయం అని ప్రకటించి హై కమాండ్‌ను తృప్తి పరచామనుకున్నారు.

కమ్యూనికేషన్ గ్యాప్ వలన (ఈ సెల్‌ఫోన్ల యుగంలో సమాచార లోపమా?) ఎక్కువమంది రాలేదు కాబట్టి సోమవారం మళ్లీ మీటింగు అన్నారు. సోమవారం సాయంత్రానికి న్యూస్ 6గురు ఎంపీలు, 3గ్గురు మంత్రులు, 9 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎమ్మెల్సీలు వచ్చారని. అంటే శనివారం కంటె అంకె తగ్గిందన్నమాట. కన్వీనరుగా ఎవరుంటే వాళ్లు హై కమాండ్ ఆగ్రహం ఎదుర్కోవలసి వస్తుందన్న భయం కాబోలు ఆగ్రహం పంచుకోవడానికి యిద్దర్ని పెట్టారు – కేకే, జానా. మధ్యాహ్నానికి యీ న్యూస్ బయటకు వచ్చి తమ పరువు పోతోందని గ్రహించిన కేకే లీకులు వదిలారు. హై కమాండ్ తెలంగాణ సమస్య పరిష్కరించడానికి మూడు ఆప్షన్లతో ముందుకు వస్తోందని ఎవరో ఎవరికో చెప్పారనీ.. ! అవేమిటో యిప్పుడు చర్చించడం వేస్టు. ఎందుకంటే వాటికి ఏ విధమైన శాంక్టిటీ లేదు. హై కమాండ్‌లో బాధ్యతాయుతమైన వ్యక్తి ఎవరూ వాటిని ప్రకటించలేదు. ఇవన్నీ టిడిపి టైపు లీకులు. జైపాల్ రెడ్డి టైపు లీకు. కానీ మన మీడియాకు పీచు మిఠాయి ఒకటి దొరికింది కాబట్టి సోమవారం సాయంత్రం టీవీ చర్చలు పెట్టి దాన్ని పీకి పాకాన పెట్టారు.

మీడియాకు ఆ లీకు పడేసి ఎలాగైనా వార్తల్లోకి ఎక్కాలని కేకే అండు కో ఉస్మానియాకు బయలుదేరారు. ఇప్పుడు ఉద్యమభారం అంతా విద్యార్థులపై పడేశారు. పంచతంత్రం కథలో మంటల్లోంచి జీడిపిక్కల్ని కోతి చేత తీయించడం లాటిదే యిది ! వస్తే పిక్కలు వస్తాయి, కాకపోతే కోతి చేతులే కాల్తాయి. నిరాహారదీక్షలకు విద్యార్థులను ముందుకు తోసి తాము వెనక్కాల వుంటే టీవీ కవరేజి తమకు, లాఠీ దెబ్బలు విద్యార్థులకు. వాళ్లకు షుగర్లా? బీపీలా? నిరాహారదీక్షలు మస్తుగా చేయగలరు. మహా పోతే వాళ్ల చదువులు పోతాయి. తమ పదవులకు ఢోకా లేదు. పోలీసులకూ, ప్రభుత్వానికీ కూడా పండగే. రాజకీయ సమస్య అయితే ఎలా పరిష్కరించాలాన్న బాధ తప్ప, శాంతిభద్రతల సమస్యయితే చిక్కేముంది? బోల్డు బలగాలున్నాయి. వాళ్ల చేతులకు తీట వుంది. వదల్చడానికి విద్యార్థుల వీపులున్నాయి. వీపుల మీద తట్లు తేలగానే కోదండరాం నిరసనగా రేపు హైదరాబాదులో వంటావార్పు అన్నారు. విద్యార్థులకు లాఠీలు, తూటాలూ. మనకు యించక్కా మిఠాయిలూ, బిర్యానీలు ! భేష్ ! కాపీ కాట్స్ సమైక్య జాక్‌వాళ్లూ వంటావార్పులంటున్నారు. ఆ యాక్టివిటీ అంతా గుంటూరులోనే వున్నట్టుంది. ఇద్దరు గుంటూరు మంత్రుల యిళ్లు మాత్రం ముట్టడించారు. వైజాగ్ విద్యార్థులు బొత్సను చుట్టుముట్టారు. సమై'ఖ్య' అని రాయడంలోనే తెలుస్తోంది వాళ్లకు ఎంత విద్య వచ్చో, వాళ్లు ఏ పాటి విద్యార్థులో !

రాజీనామాల వలన ఉద్యమం ముందుకు సాగడం లేదని గ్రహించిన తెలంగాణ జాక్ వాళ్లు యిక సమాజంలో తక్కిన వర్గాలవాళ్ల మీద పడ్డారు. జాక్‌లోని ప్రభుత్వోద్యోగుల సంఘంవారు ఆగస్టు 1 నుండి సమ్మె ప్రకటించారు. గత సమ్మెలో ఆమోదించిన డిమాండ్లను అమలు చేయలేదని న్యాయంగా అడుగుతూ, ప్రత్యేకరాష్ట్రం యిస్తేగాని అవి పరిష్కారమవవని రాజకీయకోణం జోడించారు. కొత్తగూడెం గని కార్మికులు కూడా తమ సమస్యలకు ప్రత్యేకరాష్ట్రం డిమాండ్ జోడించి సమ్మె చేయబోతున్నారు. విద్యార్థులు సరేసరి. ఇలా

దీనికి పూర్తిగా ఆందోళన రూపం యిచ్చినకొద్దీ కేంద్రం అదిగో మావోయిస్టులు, అదిగో ఉగ్రవాదులు అంటుంది. పోలీసు బలగాలు మరిన్ని దించుతుంది. చర్చల వలననే పరిష్కారమౌతుంది అనుకుంటే తెలంగాణ ఉద్యమకారులందరూ మొదట తమలో తాము చర్చించుకుని ఓ ఒప్పందానికి రావాలి. ఆ తర్వాత ఆంధ్రప్రాంత వాసులతో చర్చించాలి. సుబ్బరామిరెడ్డి, రేణుకా చౌదరి ఫోన్ చేస్తే వినాలి తప్ప వాళ్లేదో తప్పు పని చేసినట్టు మీడియాలో చాటి అల్లరి పెట్టకూడదు. ప్రలోభ పెట్టినట్టు కలర్ యివ్వకూడదు. సోనియమ్మకు అన్నీ తెలుసు అని యిన్నాళ్లూ చెప్పారుగా, మన సంగతీ అవిడకు పూర్తిగా అర్థమయ్యే యిలా ట్రీట్ చేస్తోంది అనుకుని ఓదార్చుకుంటే మంచిది. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**

**జులై 25** **ఎమ్బీయస్ : కాంగ్రెస్ – డిఎంకె**

రాజీవ్ హత్య గురించి నేను రాస్తున్న వ్యాసాలు చదివిన చాలామందికి అనుమానం వచ్చింది. "మీరు చెప్పినట్టు ఎల్‌టిటిఇకి డిఎంకెకు అంత సత్సంబంధాలు వుంటే తన భర్తను చంపిన ఎల్‌టిటిఇకు ఆప్తులైన డిఎంకెతో సోనియా పొత్తు ఎలా పెట్టుకున్నారు? అని. దానికి సమాధానం సోనియాగారి వద్దే వుంది. నన్నడిగితే 'రాజకీయాలు' అని వూరుకుంటాను. రాజకీయాలలో కూడా నీతి వుండనక్కరలేదా? అంటే పాటించినవాళ్లకు నీతి వుంటుంది. అలా పాటించినవారిలో– కనీసం యీ విషయంలో – పి.వి.నరసింహారావుగారు ఒకరు.

తమిళనాడులో డిఎంకె, ఎడిఎంకెలలో ఏదో ఒక దానితో కేంద్రంలో వున్న జాతీయ రాజకీయపక్షం పొత్తు పెట్టుకోవడం చాలాకాలంగా వస్తోంది. జాతీయపక్షానికి మూడింట రెండు వంతులు ఎంపీ స్థానాలు, మూడింట ఒక వంతు ఎమ్మెల్యే స్థానాలు యిచ్చి తక్కినవి స్థానిక పక్షం తీసుకుంటూ వుంటుంది. కాంగ్రెస్‌కు అక్కడ స్థిరమైన ఓట్ బ్యాంక్ వుంది. అది గెలిచేందుకు సరిపోదు కానీ ఓడించేందుకు పనికి వస్తుంది. దానికోసం ప్రాంతీయపార్టీ ఉభయతారకమైన పొత్తు కుదుర్చుకుంటూ వుంటుంది.

1996లో పివి గారు ప్రధానిగా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వుండగా తమిళనాడులో లోకసభ ఎన్నికలు, ఎసెంబ్లీ ఎన్నికలు కలిసి వచ్చాయి. రాజీవ్ హత్య తర్వాత అధికారంలోకి వచ్చిన ఎడిఎంకె–కాంగ్రెస్ కూటమి అధికారంలో వుంది. సాధారణంగా తమిళనాడు ఓటర్లు అధికారంలో వున్నవారిని దించి ప్రతిపక్షంలో వున్నవారిని గద్దె కెక్కిస్తూ వుంటారు. కాంగ్రెస్ కూడా అదే పద్ధతి అవలంబిస్తుంది. ప్రతిపక్షంలో వున్నవారితో పొత్తు పెట్టుకుని అప్పటిదాకా తమతో ఊరేగినవారిని ఓడించడానికి చూస్తుంది. అందువలన లెక్కప్రకారం

కాంగ్రెస్ యీసారి డిఎంకెతో పొత్తు పెట్టుకోవాలి. కానీ రాజీవ్ హత్యతో వున్న లింకు కారణంగా డిఎంకెతో పొత్తు పెట్టుకోవడం పివికి యిష్టం లేదు. ఎడిఎంకెతో పొత్తు కొనసాగించడం తమిళ నాయకులైన చిదంబరం, మూపనార్‌లకు యిష్టం లేదు. ఎడిఎంకె అధినేత్రి జయలలిత తమ సహాయంతో పదవిలోకి వచ్చి తమను పట్టించుకోవడం లేదని వీరి బాధ.

జయలలితది ఎవరికీ అంతుపట్టని మనస్తత్వం. ఎవరు దగ్గరివాళ్లో, ఎవరు కారో, ఎప్పుడు ఏం చేస్తుందో ఎవరికీ తెలియదు. పొత్తుల గురించి మాట్లాడాలంటే ఆమె తప్ప వేరెవరితో మాట్లాడినా లాభం లేదు. కాంగ్రెస్ నాయకులను ఆమె దగ్గరకు రానీయలేదు. వాళ్లకు మర్యాద యివ్వలేదు. పైగా జయలలిత అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయింది. పెంపుడు కొడుకు పెళ్లికి కోట్లు కోట్లు ఖర్చు పెట్టి అప్రదిష్ట పాలైంది. జయలలితకు పివి ఒకటి రెండు సార్లు చెప్పినా ధోరణి మారలేదు. మా వలన అధికారంలోకి వచ్చి యింత పొగరా అని మూపనార్, చిదంబరంలకు కోపం. తంగబాలు బృందం జయలలితతో పొత్తు కంటిన్యూ చేద్దామని పివితో వాదించారు. అంటే జయలలితను వాళ్లను ఆదరించిందని కాదు. వాళ్లకు మూపనార్ అంటే వ్యతిరేకత ! అదీ కారణం ! పివి ఎవరివైపు మొగ్గు చూపితే వాళ్ల వాదన గెలుస్తుంది.

డిఎంకె, ఎడిఎంకె ఎవరితోనూ పొత్తు పెట్టుకోకుండా ఎలా? అని పివి చిదంబరం, మూపనార్‌లను అడిగారు. "రజనీకాంత్‌ను సినిమాల్లోంచి రాజకీయాల్లోకి, అంటే మన పార్టీలోకి తెస్తాం. ఇక గెలుపు మనదే" అందీ జంట.

"సరే, అతన్ని అడిగిచూడండి. కానీ విషయం రహస్యంగా వుంచండి. జయలలితకు తెలియనియ్యవద్దు" అన్నారు పివి.

తర్వాత తనకు మీడియా సలహాదారుగా, అదనపు కార్యదర్శిగా వున్న పివిఆర్‌కె ప్రసాద్ గార్ని పిలిచి (ఆయన తన 'అసలేం జరిగింది?' పుస్తకంలో యిది రాశారు) తమిళనాడులో సర్వేలు చేయించమన్నారు. ఆయన ఓఆర్‌జి మార్గ్ ద్వారా, భద్రతా విభాగం సెక్రటరీ చేత, కేంద్ర యింటెలిజెన్సు ద్వారా .. మూడు సర్వేలు చేయించారు. అన్నీ కలిపి చూస్తే తేలినది – కాంగ్రెస్ విడిగా పోటీ చేస్తే గెలవలేదు, ఏ పార్టీతో కలిస్తే అది పొత్తు కలుస్తుంది, రజనీకాంత్ కాంగ్రెస్‌లో చేరితే గెలుపు తథ్యం.'

రజనీకాంత్‌ను మూపనార్ ఢిల్లీకి తీసుకుని వచ్చి పివితో కలిపించారు. పివి రజనీకాంత్‌ను ఒప్పించారు. సిఎం పదవి యిస్తానన్నారు. రజనీ సరేనన్నారు. ఇక మూపనార్‌కి ఏనుగెక్కినంత సంతోషం. రహస్యంగా వుంచాలన్న మాట మరిచి తమిళనాడులోని తన అనుచరులకు ఫోన్లు చేసి 'రేపు రజనీకాంత్‌కు తమిళనాడులో ఘనంగా ఆహ్వానం పలకాలి. జయలలితకు మన తడాఖా చూపించాలి" అని చెప్పారు.

కానీ రాత్రికి రాత్రి రజనీ మనసు మార్చుకున్నారు. మద్రాసులో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ "రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనే లేదు. పివిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నాను" అన్నారు. (ఎన్నికల్లో డిఎంకెకు ప్రచారం చేశాడు) దెబ్బకి మూపనార్ సోదరులకు షాక్. ఢిల్లీకి పరిగెట్టుకుని వచ్చారు. పివి "ఇంకేం చేస్తాం? జయలలితతో పొత్తు పెట్టుకోండి" అన్నారు. వాళ్లకు మరో షాక్ ! మింగుడు పడని షాక్ ! "డిఎంకెతో పెట్టుకుందాం" అన్నారు.

"రాజీవ్ హంతకులతో డిఎంకెకు సంబంధాలున్నాయని మీరేగా ప్రకటనలు చేశారు"

"అదంతా గతం. ప్రస్తుతం నెగ్గాలంటే డిఎంకెతోనే..." అన్నారు మూపనార్ వెంటనున్న పెద్దలు. ఈ పెద్దలెవరో తెలుసా? రాజీవ్ గాంధీకి, ఆయన కుటుంబానికి అత్యంత విధేయులమని చెప్పుకుంటూ యిప్పటికీ పదవులు సంపాదించుకుంటున్న చిదంబరం, మణిశంకర్ అయ్యర్, జయంతి నటరాజన్..వీళ్లంతా సోనియాకు ఆప్తులు. సోనియా అసహ్యించుకునే వ్యక్తి పివి. ఢిల్లీలో సమాధికూడా లేకుండా శవాన్ని తరిమేసింది. ఆ పివి రాజీవ్ పట్ల అత్యంత విధేయతతో డిఎంకెతో పొత్తు పెట్టుకోవడానికి ససేమిరా అన్నారు.

ఈ నిర?యం ఆ పెద్దలకు నచ్చలేదు. కాంగ్రెస్‌లోంచి విడిపోయి 'తమిళ మానిల (ప్రాంతీయ) కాంగ్రెస్' అనే పేర వేరే పార్టీ పెట్టుకున్నారు. మూపనార్ వర్గీయులు మద్రాసులోని కాంగ్రెస్ భవనాన్ని ఆక్రమించేశారు. మూపనార్ వ్యతిరేకి వాళప్పాడి రామ్మూర్తి తివారి కాంగ్రెస్‌లో చేరారు. తంగబాలు బృందం పివి కాంగ్రెస్‌తో వుండిపోయింది. పార్టీ మూడుగా చీలి బలహీనపడింది. పివి నాయకత్వంలోని కాంగ్రెస్ జయలలితతో పొత్తు పెట్టుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. సీట్ల ఫైనలైజేషన్‌కు రెండు రోజుల గడువు మాత్రమే వుంది. 'మీ పార్టీ రెండుగా చీలింది కాబట్టి, ముఖ్యమైన నాయకులు బయటకు వెళ్లిపోయారు కాబట్టి మీకు ఎక్కువ సీట్లు యివ్వనక్కరలేదు' అంటూ జయలలిత గీచిగీచి బేరమాడింది. వీళ్లు ఏడ్చుకుంటూ ఒప్పుకున్నారు. ఆ ఎన్నికలలో నాలుగు కూటములు పోటీ చేశాయి.

డిఎంకె కూటమికి 221 సీట్లు. డిఎంకె పార్టీకి సీట్లు 2 నుండి 173కి పెరిగాయి. తమిళ మానిల కాంగ్రెస్‌కు 39 వచ్చాయి. సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్‌లకు కలిపి 9. జయలలిత పార్టీకి 220 సీట్లు తగ్గి 4 వచ్చాయి. వారితో కలిసిన పివి కాంగ్రెస్ 60 సీట్లలో పోటీ చేసి అన్నిచోట్లా ఓడిపోయింది. (కాంగ్రెస్ ఓట్‌బ్యాంక్ మూపనార్‌తో వెళ్లిపోయింది) డిఎంకె నుండి విడిపోయిన వైగో ఎండిఎంకె పెట్టుకుని అన్ని చోట్లా ఓడిపోయారు. ఆయన కూటమిలోని సిపిఎం, జనతాదళ్‌లకు చెరొకటి వచ్చాయి. డా॥రాందాస్ పెట్టుకున్న పిఎంకెకు 4, ఆయనతో కలిసి ఫ్రంట్ కట్టిన వాళప్పాడి తివారి కాంగ్రెస్‌కు సున్నా. ఈ విధంగా రాజీవ్ హత్యతో సంబంధం వున్న డిఎంకెకు తమిళులు ఘనవిజయాన్ని కట్టబెట్టారు, అదీ ఓ పక్క హత్య కేసు నడుస్తూ వివరాలన్నీ బయటపడుతూ వుండగానే..! దానికి మూడు కారణాలు. ఒకటి – జయలలిత అలవిమాలిన అవినీతి, అహంభావం, రెండు – రజనీకాంత్ డిఎంకె కూటమికి మద్దతు ప్రకటించడం, మూడు – చిదంబరం ప్రభృతుల అవకాశ రాజకీయం.

చిదంబరం అందుకో పెట్టుకున్న తమిళ మానిల కాంగ్రెస్ 1996 ఎన్నికల తర్వాత యునైటెడ్ ఫ్రంట్ ద్వారా ఢిల్లీలో రాజ్యం ఏలింది. చిదంబరం మళ్లీ కేంద్రమంత్రి అయ్యారు. మూపనార్ చనిపోయాక ఆరేళ్ల తర్వాత చివరకు కాంగ్రెస్‌లో కలిసిపోయింది. సోనియా వాళ్లను ఆదరించింది. జయలలిత మీద కోపంతోనే వాళ్లు మొన్న జరిగిన ఎన్నికలలో కూడా డిఎంకెతో ఊరేగారు, ఓ పక్క 2 జి స్పెక్ట్రమ్‌లో డిఎంకె తలమునకలుగా కూరుకుపోయిందని తెలిసినా ! డిఎంకెతో బాటు కాంగ్రెస్ కూడా చావుదెబ్బ తినేసింది. హోం మినిస్టర్‌గా డిఎంకె అవినీతి తెలిసి కూడా, వాళ్లను అరెస్టు చేయబోతున్నామని తెలిసి కూడా చిదంబరం డిఎంకెతో పొత్తు పెట్టుకోవాలని వాదించారంటే, రాజీవ్ పేరు స్మరిస్తూనే డిఎంకెకు రాజీవ్ హత్యతో లింకు వుందని తెలిసి కూడా డిఎంకెతో స్నేహానికి అర్రులు చాచారంటే ఆయన నీతి చూడండి. ఎన్నికలలో ఓడిపోయినా ఫర్వాలేదు, కానీ రాజీవ్ హంతకులతో చేతులు కలపకూడదన్న నీతికి కట్టుబడిన పివిని చూడండి. వీళ్లకు ఆయన పేరు స్మరించే అర్హత కూడా లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**

**జులై 30** **ఎమ్బీయస్ : డాన్సు చేసే సీనుందా?**

తాము వేసిన రాజీనామా అస్త్రం ఎదురు తిరిగి తమకే చుట్టుకుందనే బాధతో, అయోమయంలో, సందిగ్ధంలో కాంగ్రెస్ నేతలు మతులు పోగొట్టుకుంటున్నారని విన్నాను కానీ యింత యిదిగా మతి పోయిందని తెలియలేదు. నిరాహారదీక్ష తర్వాత మన గౌరవనీయులైన ఎంపీలు, 14 లక్షలమందికి ప్రాతినిథ్యం వహించే, నెలకు లక్షలాది జీతభత్యాలు తీసుకునే ప్రజాప్రతినిధులు నడుం వూపుతూ డాన్సు చేశారంటే వీళ్ల గురించి మనం ఏమనుకోవాలి?

ఈ మధ్య టీవీల్లో ఓ ట్రెండ్ ప్రారంభమైంది. ఎన్నికల ఫలితాలు రాగానే కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు.. అంటూ కొన్ని క్లిప్పింగ్స్ చూపిస్తారు. అది గాంధీభవన్ కావచ్చు, మమతా బెనర్జీ యిల్లు కావచ్చు, ఎన్టీయార్ భవన్ కావచ్చు, జయలలిత యిల్లు కావచ్చు... ఫలితాలు వెలువడగానే కొందరు మధ్యవయస్కులైన ఆడవాళ్లు రంగులు చల్లుకుని, నడుం వూపుకుంటూ డాన్సు చేసేస్తారు. కెమెరా వాళ్ల చుట్టూ తిరుగుతూ వుంటుంది. ఆ డాన్సు చేసేవాళ్లు ఏ పార్టీవాళ్లో తెలియదు. ఏ సమావేశంలోనూ అంతకుముందు ప్రసంగాలు యిచ్చినట్టు కనబడదు. మణిపూర్ ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించినా చాలు, వీళ్లు తైతక్కలాడడానికి, టీవీ వాళ్లు వాళ్ల వంపుసొంపులు మనకు చూపించడానికి. జాగ్రత్తగా పరిశీలిస్తే ఒకే మహిళాబృందం అన్ని పార్టీలకూ డాన్సు చేస్తోందేమో తెలుస్తుంది.

సరే ఎంతైనా ఆడవాళ్లంటే నృత్యం చేయడం సహజంగా భావించి కాస్సేపు చూస్తాం. కానీ వినోద్ లాటి వాళ్లు నడుం వూపుతూ డాన్సు చేస్తే చూడడం ఎలా? ఏదో తెలంగాణ నిజంగా వచ్చేస్తే, కనీసం ఆ దిశలో ఓ సానుకూల ప్రకటన వెలువడితే ఒళ్లు మరిచి డాన్సు చేశారంటే – అదీ కమలహాసన్‌లా కథాకళి, కథక్ అంటూ చేయలేరు కాబట్టి వీళ్లు చూసే సినిమాల్లో హీరోయిన్ల డాన్సు అనుకరించి చేసినా – పోన్లే అనుకుంటాం. అక్కడ ఏ ప్రకటనా వెలువడలేదు.

అసలు 48 గంటల నిరాహారదీక్షే ఓ ఫ్లాప్ షో. 48 గంటలని ప్రకటించి ఒక్కడూ 48 గంటలూ కూర్చోలేదు. 36 గంటలకే దుకాణం కట్టేశారు. బొంబాయి పేలుళ్లు అని సాకు. అదే కనక అయితే పేలుళ్ల న్యూస్ బయటకు రాగానే జాతీయప్రయోజనాలు ముఖ్యం అని ప్రకటించి శిబిరం ఎత్తేస్తే అందంగా వుండేది. అక్కడ పేలుళ్లు జరగ్గానే హైదరాబాద్ హై ఎలర్ట్ ఏరియా కాబట్టి ఇంతమంది యిక్కడ గుమిగూడితే ఎవడైనా మానవబాంబు వచ్చి మీతో బాటు కూర్చుంటే మీరనుకున్న ఉపఎన్నికలు మరో రకంగా వస్తాయండి అని పోలీసులు హెచ్చరించి చూశారు. అబ్బే మా ప్రాణాల కంటె తెలంగాణయే ముఖ్యం అని హఠం చేసి వీళ్లు లేవలేదు. ఆ పట్టు అలా వుంచినా బాగుండేది, 24 గంటలు గడిచేసరికి బొంబాయి గుర్తుకు వచ్చింది. ఆ పేరు చెప్పి నిమ్మరసాలు పుచ్చుకున్నారు. దానిలో ఏం కలిపారో ఏమో, చివ్వున లేచి డాన్సులు చేశారు. 36 గంటల నిరాహార దీక్ష తర్వాత డాన్సు చేసేటంత ఓపిక ఎలా వచ్చిందాని ఆశ్చర్యపడ్డారు కొందరు.

అయినా యీ 36 గంటల దీక్షలో కూడా త్రూ ఔట్ కూర్చున్నవారు పదిమంది కూడా లేరు. తక్కినవాళ్లందరూ బోరు సినిమా ఆడుతున్న హాల్లోకిలా రావడం, పోవడం. టీవీ ఫోటోల టైముకి కనబడడం, త్యాగమూర్తుల్లా దండలేసుకుని ఫోటోలు దిగడం, తర్వాత యింటికి వెళ్లిపోవడం.. యిదో తమాషా అయిపోయింది. గుత్తా గారికే కోపం వచ్చింది యీ వరస చూసి. గాంధీగారే అక్కడ వుండి వుంటే ఆత్మహత్య చేసుకునేవాడు. గాడ్సేకి పని, దరిమిలా ఉరిశిక్ష తప్పేవి. రిజైన్ చేసిన మంత్రుల్లో 4గురు, ఎమ్మెల్యేలలో పదిమంది అటు తొంగి చూడలేదు. అసలు కేకే గారి మీటింగులకు ఎమ్మెల్యేల హాజరీ నానాటికి తీసికట్టు నాగంభొట్లు అయిపోతోంది. అటు బొత్స పిలిస్తే మాత్రం గుంపులు గుంపులుగా వెళ్లారు. రాజీనామా చేసినందుకు నెత్తి బాదుకుంటున్నారని వార్తలు వస్తూండగా మధ్యలో యీ దీక్ష పెట్టి దాన్ని నిరూపించారు కేకే బృందం.

ఇంత తక్కువమంది వచ్చారేం అని అడిగితే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ బిపి, షుగర్ వున్నవాళ్లు దీక్షలో పాల్గొనలేదు. మహిళా ఎమ్మెల్యేలకు కొన్ని యిబ్బందులు వున్నాయి అన్నారు. విని నవ్వాలా? ఏడవాలా? ప్రాణమే తృణప్రాయం అన్నవాళ్లు యిలాటివి పట్టించుకుంటారా? ఒకవేళ పట్టించుకుందామంటే మరి ప్రగలాలేల? ఇలాటి దీక్షలు జరపనేల? ఎంచక్కా వంటా–వార్పూ, ఖానా–బజానా వంటి కార్యక్రమాలు పెట్టుకోవచ్చుగా ! పైగా మహిళల గురించి ఆ సంజాయిషీ లేల?

ముళ్లపూడివారు ముక్కోతికొమ్మచ్చిలో రాశారు – వాళ్ల బుద్ధిమంతుడు రిలీజయినపుడు తొలి సోమవారం కలక్షన్లు డల్‌గా

వున్నాయట. హాలు సగమే నిండిందట. బాపురమణలు బస చేసిన మనోరమ హోటల్ కిటికీలోంచి ఆ సినిమాహాలు మార్నింగ్ షో బుకింగ్ వద్ద జనం పల్చపల్చగా కనబడుతున్నారట.  డిస్ట్రిబ్యూటర్స్ తాలూకు మనిషి వచ్చి "అబ్బే, టాక్ బావుందండి. వర్షం కదండీ, పైగా నేచరల్లీ సోమవారం మార్నింగ్ కలక్షన్లు డ్రాపవుతాయి. పొద్దున్న కాబట్టి ఆడాళ్లు వంటలూ, పేరంటాలూ, వ్రతాలు, నోములూ, యితర యిబ్బందులూ.. అందుకని రాలేకపోయారు. లేకపోతేనా.." అంటూ ఏదో సర్దిచెప్పబోయారు. నిర్మొగమాటి బాపు అవతలివైపు కిటికీ తెరిచి లీలామహల్ చూపిస్తూ "చూడండి యిటు. ఆ యిబ్బందిసబ్బందులు యీ ఆడాళ్లకు లేవా?" అన్నారట. అక్కడ "మనుషులు మారాలి" అడుతోంది. గొడుగులేసుకుని ఆడాళ్లు హాలు దగ్గర టిక్కెట్ల కోసం నిలబడ్డారు. "మన సినిమా దానంత హిట్ కావటంలేదు. దట్సాల్" అన్నారట బాపు ఖరాఖండీగా.

ఇలా వాస్తవాలను గుర్తిస్తే మనసుకు హాయి. బుర్రకు మంచిది. తర్వాతి కార్యక్రమం గురించి ఆలోచించవచ్చు. లేకపోతే తమను తాము ఎంతకాలం మభ్య పరుచుకుంటారు? వీళ్లు గులాం నబీ ఆజాద్ మాట మేం వినం అంటే సరిపోతుందా? అభిషేక్ సింఘ్వీ పిచ్చాపాటీగా మాట్లాడిన మాటల్ని మనవాళ్లు దైవవాక్యాలుగా పరిగణించి రోజంతా టీవీల్లో చర్చలు పెట్టేసారు. అందునా నిర్దిష్ట కాలపరిమితిలో తెలంగాణ యిస్తారు అన్నదానిపై తెగ మాట్లాడారు. అసలు ఆ ఆప్షన్ల మధ్య పోలికే లేదు. నిర్దిష్ట కాలపరిమితిలో యిస్తాననడం ఎక్కడ? రెండో ఎస్సార్సీ ఎక్కడ? మనవాళ్లు యిలా హంగామా చేయడంతో అభిషేక్‌కు హై కమాండ్ తలంటు పోసినట్టున్నారు. అతను యిక తెలుగు మీడియాతో ఛస్తే మాట్లాడనంటున్నాడుట. దీనికి విరుగుడుగా ఆజాద్ చేత అంత పొడుగు స్టేటుమెంటు యిప్పించారు.

అసలు ఆజాద్ ఆ ప్రకటన ఏమిటండీ? ఉద్యమం యీ దశకు వచ్చాక, ఏదో ఒకటి నిర?యం తీసుకోవాలని రాష్ట్రప్రజలూ అందరూ కోరుకుంటున్న వేళ మళ్లీ శూన్యం నుంచి   (స్టార్టింగ్ ఫ్రమ్ స్క్రాచ్) మొదలు పెట్టాలంటాడా? అసెంబ్లీలో తీర్మానం లేకుండా అంగుళం ముందుకు పడదా? మరి 2009 డిసెంబరు 9 తర్వాత ఆ దిశగా ఏం చేశారట? మొన్ననే రోశయ్యగారు చెప్పారు – డిసెంబరు 9 ప్రకటన ఆయనకు చూపకుండా విడుదల చేశారు కదా, అసెంబ్లీ తీర్మానం గురించి పార్లమెంటులో చిదంబరం ప్రకటన చేశాక రోశయ్య చెప్పారట – అసెంబ్లీ తీర్మానం నడిచే వ్యవహారం కాదు. ప్రాంతాల వారీగా అసెంబ్లీ విడిపోతుంది. ఆ తీర్మానం పాస్ కాదు అని. అప్పణ్నుంచి మళ్లీ దాని జోలికి వెళ్లలేదు హై కమాండ్.

అలాటిది యిప్పుడు హఠాత్తుగా తీర్మానం పట్టుకు రమ్మనమంటే ఎక్కణ్నుంచి పట్టుకుని వస్తారు? ఏం మొన్న స్పీకర్ ఎన్నికకోసం ఒక రోజు అసెంబ్లీ ఏర్పాటు చేసినట్టు చేయలేకపోయారా? తెలంగాణపై రాష్ట్ర ప్రతినిథుల అభిప్రాయాలు, పార్టీల నాటకాలు అన్నీ బయటపడేవి ! తెలంగాణ పై రాష్ట్రంలోని యితర ప్రాంతాల, దేశంలోని యితర ప్రాంతాల జాతీయ పార్టీల అభిప్రాయం తీసుకోవాలిట. లేకపోతే ఫెడరల్ స్ట్రక్చర్ దెబ్బ తినేస్తుందట. ఇవన్నీ చెపుతూ క ృష? కమిటీ ఆరుమార్గాలు చూపడం వలన సమస్య పరిష్కారం కాలేదనడం తప్పు. ఈ మాట చాలామంది చెపుతున్నారు. అలా అనడం అన్యాయం.

క ృష? కమిటీ ఆరు చెప్పినమాట వాస్తవం కానీ ప్రతీదానిలోనూ వున్న కష్టనష్టాలు, లాభాలు కూడా చర్చించింది. మామూలు భాషలో చెప్పాలంటే ఎవడైనా వచ్చి హైదరాబాదునుండి విజయవాడ రోడ్డు మార్గాన ఎలా వెళ్లాలి అని అడిగితే – సికింద్రాబాదు నుండి వెళ్లవచ్చు కానీ రౌండ్ ఎబౌట్ అవుతుంది, మేడ్చల్ మీదనుండి వెళితే ఎప్పటికీ చేరుకోలేవు. రింగ్ రోడ్డు మీద నుండి వెళితే దూరం కానీ వేగంగా వెళ్లవచ్చు, సాగర్ రోడ్డు నుండి వెళితే ట్రాఫిక్ తక్కువ కానీ రోడ్డు బాగుండదు, దిల్‌సుఖ్ నగర్ ద్వారా అయితే రష్ కానీ దగ్గర.. అని యిలా విపులంగా చెప్పినట్టు చెప్పారు.  అన్నీ చెప్పి ఆరోది బెస్ట్, ఐదోది సెకండ్ బెస్టు. ఆరోది అమలు చేస్తే ఫలానా ఫలానా సమస్యలు వస్తాయి కాబట్టి వాటికి రెమెడీలు యివి. ఐదోది చేస్తే ఫలానా ఫలానా రెమెడీలు తీసుకోవాలి అని అరటిపండు వల్చినట్టు చెప్పారు. అది పట్టుకుని దిశానిర్దేశం చేయలేదనడం మూర?త్వం. దమ్ముంటే ఆరోదో, ఐదోదో చేపట్టాలి. లేకపోతే ధైర్యం లేదని ఒప్పుకోవాలి. అంతేకానీ క ృష?గారు టైము వేస్టు చేశారు అనకూడదు.

ఇవన్నీ చెప్పి 'తెలంగాణ మిత్రులు కోస్తా, సీమ వాళ్లతో సమన్వయంతో పనిచేసి ఏకాభిప్రాయం తెప్పించుకోకపోతే చాలా కష్టమౌతుంది ' అని ఆజాద్ తేల్చారు. ఇది వినగానే పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టే. మీరు దొంగలు, నీచులు, దుర్మార్గులు అని యిన్నీ తిట్టి యిప్పుడు మీరు ఒప్పుకోకపోతే మేం అడిగినది యివ్వరట అంటూ చర్చలకు పిలవడం ఎంత యిబ్బంది? ఓ పక్క పొన్నం సాటి పార్టీ ఎంపీలనే వాడు వీడు అనేస్తున్నారు. దామోదరరెడ్డి ఆంధ్రులు రాకుండా గోడలు కట్టేస్తామంటున్నారు. తీర్మానానికి సహకరించకపోతే ఆంధ్రులు హైదరాబాదులో తిరగలేరని మధు యాష్కీ బెదిరిస్తున్నారు. ఇంకోపక్క ఆంధ్రప్రాంతపు మంత్రులను రైల్ రోకో రోజున తెలంగాణ జాక్ వారు నానా హింసా పెట్టారు. రైలు ఆపి, ప్రయివేటు కారు బుక్ చేసుకుంటే దాని వెంటబడి ఆయన చేయి పట్టుకుని బయటకు లాగి, కారు అద్దాలు పగలకొట్టి గంటన్నర సేపు అడలెత్తించారు. (ఇలాటివి మరో నాలుగు జరిగితే గాని తెలంగాణ ప్రాంతంలో నివసిస్తున్నవారి భయాందోళనలు పాలకులకు అర్థం కావు. రైల్ రోకో అనగానే రైళ్లు, బంద్ అనగానే బస్సులు ఆపివేసి పౌరుల జీవితాలు దుర్భరం చేసేసే దౌర్భాగ్యపు పిరికి ప్రభుత్వం యిది. పదుల సంఖ్యలో వుండే ఆందోళనకారులను అదుపు చేయలేనివారు ఊరికే బెటాలియన్ల కొద్దీ దళాలను తెప్పించి మేపనేల?)

తెలంగాణ ఉద్యోగుల సంఘం నేత గౌడ్ ఇతర ప్రాంతాల సెటిలర్లను తమ ఉద్యమంలో చేర్చుకుని ఆంధ్ర ఉద్యోగుల పని బడతామంటున్నారు. (అంటే దేశంలోని ఇరవై రాష్ట్రాల నుంచి వచ్చి స్థానికుల ఉద్యోగాల 'గుంజుకున్న' ఉద్యోగులు పనికి వస్తారు

కానీ కోస్తా, సీమ ఉద్యోగులు మాత్రం పనికి రారా? హైదరాబాద్ ఫ్రీ జోన్ కావాలంటే బదిలీలకు అప్లయి చేసుకోండి అని యీ రాష్ట్రప్రభుత్వం ప్రకటిస్తేనే కదా వాళ్లు వచ్చినది ! వ్యక్తిగతంగా వాళ్లను తప్పెలా పడతారు?)

ఇక హరీష్‌రావయితే మరీనూ ...'సీమాంధ్రుల' యిళ్లకు విద్యుత్ కట్ చేయిస్తారట. అసలు ఎవరు 'సీమాంధ్రులో' ఎవరు తెలంగాణా వారో ఎలా తెలుస్తారు స్వామీ? 'తెలంగాణవాసి' అన్న పదానికి నిర్వచనమే యిప్పటిదాకా మీ పార్టీ యివ్వలేకపోయింది. తెలంగాణలో పుట్టినవారందరూ తెలంగాణవాసులుగానే పరిగణింపబడతారని మీ పార్టీ అధ్యక్షుడంటే మీరందరూ తిరగబడ్డారు. కాదు, కాదు ఎవడైనా యిక్కడే పుట్టి యిక్కడే పెరిగి యిక్కడే చచ్చినా వాడి తాతకో, ముత్తాతకో ఆంధ్రప్రాంతంతో కనక్షన్ వుందంటే చాలు – వాడు తెలంగాణావాసిగా డిస్‌క్వాలిఫై అవడానికి అని అంటున్నారు. (కొన్ని రాయల్ ఫ్యామిలీస్‌కు మినహాయింపులున్నాయనుకోండి). మళ్లీ వాడికి రాజస్థాన్‌తోనో, గుజరాత్‌తోనో, యుపితోనో కనక్షన్ వుందనుకోండి నిక్షేపంలా పనికి వస్తుంది మీకు.

తెలంగాణ వాడెవడో నిర్వచించడానికి జంకుతున్నారంటేనే తెలుస్తోంది – మీ వాదనలో బలమెంతో, దానికి చట్టరీత్యా చెల్లుబాటు ఎంతో ! తెలంగాణ ఉద్యమంలోకి ఉత్సాహంగా ఉరకలేస్తున్న యువత యీ విషయంపై దృష్టి పెట్టాలి. తెలంగాణావాసి అనే నిర్వచనం బయటకు వచ్చేవరకూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కలిగే అవకాశాలపై స్పష్టత ఏర్పడదు. ఇంత ఆపసోపాలు పడి, అసువులు బాసి యథాతథ స్థితే సాధించారనుకోండి. ఎక్కడి వాళ్లే అక్కడే సర్దుకున్నారనుకోండి. ఉసూరుమనిపించదూ? తెలంగాణ ఉద్యమనాయకులను కాలర్ పట్టి అడగాల్సింది రాజీనామాలు చేయమని కాదు, తెలంగాణకు నిర్వచనం చెప్పండి అని. చెపితే దానికి చట్టబద్ధత వుందా లేదా అన్నది కూడా తెలుసుకోండి.

ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే ఉద్యమకారులు ఓ పక్క యిలా ఎగ్రెసివ్‌గా వుంటే వాళ్లను వెళ్లి కోస్తా, సీమ సోదరులతో మాట్లాడండి అని చెప్తున్నారు ఆజాద్. చెప్పకపోతే బండి అంగుళం కూడా ముందుకు నడవదు అంటున్నారు. నేనే ఉద్యమంలో వుంటే యిది వినగానే నవనాడులూ కృంగిపోతాయి. కాళ్లు చల్లబడతాయి, చేతులు చచ్చుబడతాయి. అలాటిది వీళ్లు ఏకంగా డాన్సులే చేసేశారు. ఎందువలన అంటారు?

బహుశా కెసియార్ యిచ్చిన స్టేటుమెంటు వలన ఏమో ! రెండు వారాల్లో తెలంగాణ గురించి స్పష్టమైన ప్రకటన వస్తుందని నాకు స్పష్టమైన సమాచారం వుంది అన్నందువలనేమో ! నా చిన్నప్పుణ్నుంచీ కెసియార్ యిలాటి ప్రకటనలు గుప్పిస్తూనే వున్నారు. మూణ్నెళ్లలో వస్తుంది, సోనియా చెవిలో చెప్పింది, ఆర్నెల్లలో వస్తుంది, ఈ సారి వచ్చుడు లేకపోతే కెసియార్ చచ్చుడే.. యివన్నీ వినివిని నవ్వు కూడా పుట్టడం మానేసింది. ఇప్పుడు మళ్లీ యీ స్టేటుమెంటు. మొన్నెవరో టీవీ చర్చల్లో చెపుతున్నారు – కెసియార్ అల్లాటప్పా ఎంపీ కాదు, మంత్రిగా చేశారు. అనేకమంది అధికారులతో పరిచయం ఏర్పడింది. వారితో ఆ సంబంధాలు మేన్‌టేన్ చేస్తున్నారు. అందువలన ఆయనకు సరైన సమాచారమే వచ్చి వుండవచ్చు అని.

పదవిలో వున్న మంత్రులనే అధికారులు లక్ష్యపెట్టడం లేదు (సందేహమా? వివరాలకు శంకరరావుగారికి ఫోన్ చేయండి – ఒక హెచ్చరిక – మిమ్మల్ని జగన్ మనిషిగా పొరబడి నన్ను బెదిరించిన వ్యక్తి యితనే మీ ఫోన్ నెంబరు పోలీసులకు యిచ్చేయవచ్చు. ఆయన ఆరోపణ ముందు చేసేసి, ఫోన్ నెంబర్ల గురించి తర్వాత వెతుకుతారు. ఎందుకైనా మంచిది పక్కింటివారి ఫోన్‌లోంచి చేయండి) అలాటిది ఎప్పుడో ఏడేళ్ల క్రితం ఏడు నెలలైనా మంత్రిగిరీ వెలగబెట్టని కెసియార్‌కు వీళ్లు సమాచారం చేరేస్తారా?

ఒకవేళ చేరవేస్తే కెసియార్ మినిస్టర్‌గిరీ కారణంగా మాత్రం కాదు. హెూం మంత్రిగారికి తెలంగాణాపై వున్న కోరిక వలన కావచ్చు. చిదంబరం గారికి మన రాష్ట్రాన్ని చీల్చి, మన గీతను సగానికి చెరిపేసి తమిళనాడు గీతను అలాగే వుంచి పెద్దగా చూపించాలని మహా కోరిక. ఇక మొన్నటిదాకా అక్కడ పనిచేసిన పిళ్లె గారికి డిటోడిటోయే. రిటైరైనా దాని గురించి మాట్లాడడం మానలేదు. స్పష్టమైన ప్రకటన యిద్దామని అనుకున్నారన్నా నమ్మవచ్చు. ఎందుకంటే ఏదో ఒక నిర?యం తీసుకోవలసిన అగత్యం వచ్చింది. ఎటొచ్చీ ఆ స్పష్టమైన ప్రకటన సానుకూల ప్రకటనా కాదా అన్నది ప్రశ్న. కెసియార్ ఆ మాట అన్నందుకే వీళ్లు డాన్సు మొదలెట్టేశారు – వీళ్ల ఆప్టిమిజం దొంగల్దోలా !

నిజానికి కెసియార్ వచ్చిన తర్వాత మీటింగులో వచ్చిన మార్పుకు వీళ్లు అసూయతో కుళ్లిపోయి వుండాల్సింది. అప్పటిదాకా వీళ్ల కార్యకర్తలే నీరసంగా అటూ యిటూ ఎన్టీయార్ గార్డెన్సులో తిరుగుతున్నారట. కెసియార్ వచ్చారని వినగానే అందరూ పరిగెట్టుకుని వచ్చి ఆయన 20 నిఎఎల ఉపన్యాసం విని చప్పట్లతో హెూరెత్తించారట. అంటే వీళ్ల 36 గంటల దీక్ష కెసియార్ ఒక ఉపన్యాసానికి చెల్లు అన్నమాట. ఆయనకున్న పాప్యులారిటీలో వీళ్లకు పదోవంతు కూడా లేదన్నమాట. అది గమనించి వీళ్లు ఏడ్చుకుని వుండాలి. కానీ ఏడవకుండా ఆడారంటే ఏమిటి కారణం? ఒకవేళ కెసియార్ కాంగ్రెస్ కండువా వేసుకున్నందుకేమో !

గతంలో 2004 ఎన్నికలలో సోనియా ఎలక్షన్ మీటింగుకని వస్తే తెరాస వారు వారి గులాబీ కండువా ఆవిడకు కప్పారు. ఆవిడ వేయించుకున్నారు. ఇక అప్పణ్నుంచి తెరాస వారు, ఆ పై తెలంగాణ ఉద్యమకారులు మొదలు పెట్టారు – గులాబీ కండువా వేయించుకున్నపుడు తెలియలేదా, తెలంగాణ యివ్వాలని! కండువా వేసుకోగానే తెలంగాణ యివ్వడానికి ఒప్పుకున్నట్టే అయిపోయింది అని.

నిజానికి గురుద్వారా కెళితే వాళ్లు పొడుగాటి కత్తి ఒకటి చేతిలో పెడతారు. తీసుకోకపోతే కత్తికి పని చెపుతారన్న భయం కొద్దీ

తీసుకుంటారు. మసీదు కెళితే నెత్తిమీద గుడ్డ కప్పుతారు. కప్పించుకోకపోతే ముస్లిం ఓట్లకు నెత్తిమీద గుడ్డ వస్తుందన్న భయం కొద్దీ కప్పించుకుంటారు. గిరిజనుల దగ్గరకు వెళితే గొంగళి కప్పి కొమ్ములున్న టోపీ నెత్తిన పెడతారు. బూరా వూదమంటారు. వాళ్ల నడుం పట్టుకుని డాన్సు చేయమంటారు. చేయాలి. లేకపోతే బాణం తీస్తారేమోనని భయం. ఇవన్నీ చేతికిచ్చి వూరుకోరు. మన్యం నుండి గిరిజనేతరులను తరిమేయమని, వక్ఫ్ భూములని కాపాడమని, గురుద్వారాకు నిధులు యివ్వమనీ.. యిలా కోరికలు కోరతారు. అప్పుడు చూద్దాం అని చెప్పేసి వచ్చేస్తారు వీళ్లు. పనులు జరగకపోయినా వాళ్లు ఏమీ అనుకోరు. తెరాస వాళ్లలాగ కత్తి యిస్తే పుచ్చుకున్నావు కాబట్టి గురుద్వారాలో షాపులకు పర్మిషన్ యిచ్చేసినట్టే అని వాదించరు.

నిజానికి 2004 ఎన్నికల ముందు తెరాస, కాంగ్రెస్ ఎన్నికల పొత్తు కుదుర్చుకునే ముందు రాతపూర్వకమైన ఒప్పందం చేసుకున్నారు. 'మొదటి ఎస్సార్సీని గౌరవిస్తూ రెండో ఎస్సార్సీని ఒప్పుకుంటున్నాం' అంటూ. (ఆజాద్‌గారు యిప్పుడు 2004లో నేను సాల్వ్ చేసేసాను అని చెప్పేసుకుంటున్నది యిదే! ) తెరాస, కాంగ్రెస్ యిద్దరూ ఆ ఒప్పందం గురించి ఎన్నికల సభలో మాట్లాడకుండా ప్రజలను ఏమార్చడమేనన్నమాట ఆజాద్‌గారి ఎలక్షన్ స్ట్రాటజీ !

సోనియా కండువా వేసుకున్నారు కాబట్టి తెరాస మేనిఫెస్టో ఒప్పేసుకున్నట్టే అని కెసియార్ ప్రభృతులు అంటున్నట్టే కెసియార్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు కాబట్టి యికపై కాంగ్రెస్‌వారి మేనిఫెస్టోయే తెరాసది అని అనుకుని కాంగ్రెస్‌వారు మురిసిపోయారేమో ! తెలంగాణ సమస్యకు పరిష్కారం కెసియార్ చేతిలోనే వుంది. ఆయన కాంగ్రెస్‌లో విలీనం అవుతానంటేనే తెలంగాణ వస్తుంది అని మధు యాష్కీ బహిరంగంగా చెప్పేస్తున్నారు కదా. సరే విలీనం అయ్యే ఛాన్సు వుందిలే అని సూచించడానికే కెసియార్ కండువా వేసుకున్నారేమో ! అని అనుకుని వీళ్లు ఆనందించేసి వుంటారు. అంతకంటె వీళ్ల డాన్సుకి మరో సవ్యమైన కారణం నాకు కనబడటం లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**

**జులై 38** **ఎమ్బీయస్ : అయినను పోయి రావలెను హస్తినకు...**

తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ వెళ్లడానికి ఎట్టకేలకు ఒప్పుకున్నారు. మంగళవారందాకా తెగ మొరాయించారు. ఆజాద్‌పై అలకట. ఆయన బీజింగ్‌లో యిచ్చిన స్టేటుమెంటు వెనక్కి తీసుకోవాలట. క్షమాపణ చెప్పాలట. అప్పుడు వెళతారట. 'అసలు వెళ్లడం దేనికి? మనం యిలాగే బిగిసి కూర్చుంటే సోనియాయే స్పెషల్ ఫ్లయిట్ వేసుకుని వచ్చి మన అరచేతిలో పెట్టేసి పోతుంది' అన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.

ఏవో మాయమాటలు చెప్పి ప్రజల్ని ఏమార్చి ఏమార్చి చివరకు వాళ్ల మాయలో వాళ్లే పడిపోయినట్టున్నారు యీ నాయకులు. వీళ్ల కంత సీనే వుంటే రాజీనామాలు యివ్వగానే ఢిల్లీ పీఠం కదిలి వుండాల్సిందిగా ! వాళ్ల మాటల్లోనే చెప్పాలంటే "సీమాంధ్రులకు ప్రధాని, ప్రణబ్‌తో ఎపాయింట్‌మెంట్లూ, మాకూ యీ ఆజాద్‌తోనా?" (వీళ్లకీ యిచ్చారుగా మొన్నటిదాకా) మరి అలాటప్పుడు సోనియా దిగి వచ్చేస్తుందని ఏం చూసి ఆశించారో తెలియదు.

నిజానికి యిన్నాళ్లకు హై కమాండ్ రథం కాస్త కదిలింది. ఇరుప్రాంతాల వారినీ కూర్చోబెట్టి మాట్లాడిస్తామంటున్నారు. ఈ పని ఏ ఐదేళ్లక్రితమో చేసి వుండాల్సింది. ఏదో లేనిబావ కంటె గూనిబావ మేలన్నట్టు, ముక్కుతూ మూలుగుతూ యిన్నాళ్లకు యీ ప్రాసెస్ ప్రారంభమైంది. మొదటిసారి చర్చల్లోనే అన్నీ తేలవు. ఎవరి స్థానాల్లో వాళ్లు బిగుసుకుని కూర్చుంటారు. ఆ తర్వాతి సమావేశంలో ఓ మెట్టు వాళ్లు, ఓ మెట్టు వీళ్లు దిగుతారు. మళ్లీ వీళ్లలో అతివాదులు, వాళ్లల్లో అతివాదులు వాకౌట్ చేస్తారు. ఒప్పుకోవద్దని అతివాదులు, ఒప్పుకోకపోతే యిదీ దక్కదని మితవాదులూ పోట్లాడుకుంటారు. పరస్పర ఆరోపణలు చేసుకుంటారు. చివరకు ఎక్కడికో అక్కడికి ఎప్పటికో అప్పటికి చేరతారు. ఇంత పెద్ద ప్రయాణానికి తొలి అడుగు పడబోతూంటే దానికే హంసపాదా?

వీళ్ల అభ్యంతరం ఏమిటి? ఆజాద్‌ను చూశా? డిసెంబరు 9 స్టేటుమెంటు గురించి సమైక్యవాదులు చిదంబరం మీద పడి ఏడ్చినట్టే వుంది యిదీనూ. చిదంబరం వందసార్లు చెప్పారు – ఆ స్టేటుమెంటు నా వ్యక్తిగతమైనది కాదు, కాబినెట్ ప్రతినిధిగా చదివినది అని. (మంగళవారం ప్రణబూ అదే చెప్పారు) అయినా సమైక్యవాదులు చిదంబరం గూడకట్టుమీద, అర్ధరాత్రి చదవడం మీద ఎన్నో విసుర్లు, తిట్లు, శాపనార్థాలు. దానికి ప్రతిగా ఆయనా "మీరు డిసెంబరు 7 న అసెంబ్లీ తీర్మానం చేయలేదా?" అని కౌంటర్ వేస్తూనే వున్నాడు. అయినా చిదంబరం మాట ఎత్తగానే వాళ్లు మండిపడతారు.

అలాగే యిప్పుడు టి–వాదులు ఆజాద్‌ను పట్టించారు. నిజానికి ఆయనను రాష్ట్రానికి యిన్‌చార్జిగా వేసినప్పుడు వీళ్లందరూ ఆనందించారు. 2004లో తెరాసతో పొత్తు కుదిర్చిన తెలంగాణ సానుభూతిపరుడంటూ స్వాగతించారు. కానీ యిప్పుడు తెలంగాణ సమస్య మళ్లీ ఓంప్రథమం నుండి ప్రారంభించాలని, యితర ప్రాంతీయులతో మాట్లాడందే పనులు జరగవని అనడంతో వీళ్లందరికీ కసెక్కిపోయింది. 'సీమాంధ్రుల' నుండి డబ్బు తినేశాడంటున్నారు.

అప్పుడు చిదంబరం గాని, యిప్పుడు ఆజాద్ గాని హై కమాండ్ చెప్పినట్టే వర్తిస్తారు. వాళ్లకు వ్యక్తిగత అభిప్రాయాలు వుండవని కావు. అవి హై కమాండ్ యిచ్చిన స్టేటుమెంటు చదవడంలో తొంగిచూస్తుంది. ఒక అడుగు ముందుకు వేసినా, రెండు అడుగులు వెనక్కి లాగినా అంతా హై కమాండ్ చేష్టలే. వీళ్లంతా ముసుగులే. అవసరాన్ని బట్టి హై కమాండ్ ఒక్కో ముసుగు ధరిస్తుంది. ఆజాద్

యిచ్చిన ఆ స్టేటుమెంటు తెలంగాణ వస్తుందని ఆశ పెట్టుకున్నవారి పట్ల నిజంగా అశనిపాతమే. కానీ అలా ఎందుకు యివ్వవలసి వచ్చింది? ఎందుకంటే ముందు రోజు ఒక ఢిల్లీ నేత ఆఫ్ ద రికార్డు అన్నమాటల్ని పట్టుకుని కాంగ్రెస్ తెలంగాణ యిచ్చేస్తోందని, మూడు ఆప్షన్లు వర్కవుట్ చేస్తోందని మీడియా హోరెత్తించేసింది కనుక.

నిజానికి హై కమాండ్ యిప్పటిదాకా ఏమీ తేల్చుకున్నట్టు లేదు. అలాటి పరిస్థితుల్లో తెలంగాణ యిచ్చేస్తోందని ప్రచారం జరిగి తర్వాత యివ్వకపోతే వాళ్లు 'సీమాంధ్రుల ప్రలోభాలకు లొంగి మాట వెనక్కు తీసుకున్నార'న్న చెడ్డపేరు వస్తుందని ఆజాద్ పేరుతో స్టేటుమెంటు యిప్పించారు. ఓ సీనియర్ జర్నలిస్టు చెప్పిన ప్రకారం ఆజాద్ బీజింగ్‌లో అంత పెద్ద స్టేటుమెంటు యిచ్చే సావకాశమే లేదు. దాన్ని హై కమాండ్‌వారే డిక్టేట్ చేసి పిటిఐ ద్వారా రిలీజ్ చేసి వుంటారంటాడాయన. అంటే వాళ్లే ఒకరకమైన స్టేటుమెంట్లు ఒకరి ద్వారా, మరో రకమైన స్టేటుమెంట్లు ఇంకోరిద్వారా యిప్పిస్తూ వేర్వేరు గొంతుకలతో మాట్లాడుతూ మిమిక్రీ చేస్తూ వుంటారన్నమాట. ఎవరికి ఎలా కావలసి వస్తే వాళ్ల స్టేటుమెంట్లకు ప్రాముఖ్యత యిస్తూ ఊరడిల్లుతూ వుంటారు.

సోమవారమే మనీష్ తివారీ చేత కూడా స్టేటుమెంటు యిప్పిస్తూ 'జాతీయ ప్రయోజనాల్ని ద ృష్టిలో పెట్టుకోవాలి, ఒత్తిళ్లతో తెలంగాణ సాధించలేరు' అని చెప్పించారు. ఆజాద్ చేత 'యిలా గుంపులు గుంపులుగా వస్తే లాభం లేదు. ప్రాంతానికి 5-10 సభ్యులు చెప్పున మూడు ప్రాంతాల టీములూ వస్తే మాట్లాడతాను' అనిపించారు. ప్రస్తుతం ఆజాద్ చేత సమైక్యవాదానికి అనుకూలంగా మాట్లాడిస్తోంది హై కమాండ్. ఆయనే రాష్ట్రవ్యవహారాలకు యిన్‌చార్జి కాబట్టి ఆ మాటలకు ప్రాధాన్యత యిచ్చి తీరాలి. సాధ్యపడితే చర్చల్లో ఆ మాటలను, వాదనలను ఖండించాలి తప్ప అవి విని కోపగించుకుంటే చెవుపై అలిగినట్టే వుంటుంది.

ఈ విషయం జానారెడ్డి, కేకేలకు ఒక రోజు లేటుగా తలకెక్కింది. సోమవారం సమావేశంలో గండ్ర వెంకటరమణారెడ్డి లాటివారు ఢిల్లీ వెళ్లందే హై కమాండ్ ఉద్దేశం ఎలా తెలుస్తుంది? మన వాదన ఎవరు వినిపిస్తారు? వాళ్లు మనమీద మరింత చెడ్డ అభిప్రాయం ఏర్పరచుకుంటారని వాదిస్తే జానారెడ్డిగారికి కోపం వచ్చి 'నో ఆర్గ్యుమెంట్స్' అని గసిరేశారు. ఆజాద్ క్షమాపణ చెప్పందే, తన మాటలు వెనక్కి తీసుకోనిదే వెళ్లేది లేదు అన్నారు.

అదే సమావేశంలో అధిష్టానంపై తిరగబడైనా తెలంగాణ సాధించుకోవాలని మధు యాష్కీ పిలుపు నిచ్చారు. ఆంధ్రప్రాంతీయుల సినిమాలు ఆగస్టు 1 నుండి అడ్డుకోవాలని జూపల్లి అన్నారు. దీని నిర్వచనం కష్టం. నిర్మాత/హీరో/హీరోయిన్/సహాయనటులు/మ్యూజిక్ డైరక్టర్/డైరక్టర్/డిస్ట్రిబ్యూటర్ - వీరిలో ఎవరు ఆంధ్రావాళ్లయితే ఆపుతారో మరి ! జాగ్రత్తగా ఆలోచించి చేయకపోతే తెలంగాణలోని డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్, వారి ఉద్యోగులు, వారి కుటుంబాలే దెబ్బ తింటాయి. జూపల్లి ఇంకోటి కూడా అన్నారు రాజీవ్ రహదారి కాంట్రాక్టర్లు ఆంధ్రావారు కాబట్టి అవీ ఆపేద్దామని. 'తెలంగాణ యిచ్చేస్తున్నాం, దానిపై ఆంధ్రప్రాంతీయులకు ఏవో సందేహాలు, అభ్యంతరాలు వున్నాయట, వాటిని తీరుద్దురుగాని రండి' అని అని ప్రకటన వచ్చాకే వెళదామని చాలామంది అన్నారు. ఇలాటి ప్రలాపాలతో సభ ముగించిన మర్నాడే ఢిల్లీకి వెళుతున్నారని ప్రకటన వెలువడింది.

అంటే యీ లోపున ఆజాద్ క్షమాపణ చెప్పారా? ఇవాళ పేపర్లో వచ్చిన ఆయన స్టేటుమెంటు చూస్తే అలా ఏమైనా అనిపించిందా? మీడియా మిస్‌రిపోర్టు చేసింది అన్నారు. ఇది పడికట్టు మాటే. నేను ఫలానా మాట అనకపోయినా వేశారు అంటూ ఏదీ ప్రత్యేకంగా ప్రస్తావించి చెప్పలేదు. పైగా 'శతాబ్దాలుగా కలిసివున్నారు. మరిన్ని శతాబ్దాలు నివసించవలసి వుంటుంది సుహృదావే వాతావరణంలో చర్చలు జరపండి.' అంటూ సుద్దులు చెప్పారు. 'తెలంగాణపై ఏకాభిప్రాయం కావాలి' అన్నాను అని చెప్తూనే వున్నారు. ఏకాభిప్రాయం అనగానే తెలంగాణ నాయకులకు తేళ్లు, జెర్రులు పాకుతాయి. ఏకాభిప్రాయం రావడం అసంభవం అని తెలిసి కూడా మళ్లీ దాని గురించే చెప్తూంటే ఎవరికైనా అలాగే వుంటుంది. మూడు ప్రాంతాల టీములతో కలిసి మాట్లాడతాను అన్న స్టాండ్ పై నుండి ఆజాద్ వెనక్కి తగ్గలేదు.

అయినా వీళ్లు ఢిల్లీకి బయలుదేరుతున్నారు. ఇలా వెళ్లడం మంచిదే. అలనాడు కృష్ణ?డు చెప్పినట్లు 'అయినను పోయి రావలెను హస్తినకు..'. అలిగి కూర్చుంటే వ్యవహారం యింకా చెడుతుంది. ఇప్పటికే వీళ్లు రాజీనామాలు చేసినందుకు హై కమాండ్ మహా కోపంగా వుంది. మేం ఢిల్లీ వెళ్లం అంటూ మకురుతనం చూపితే వాళ్లు మొట్టికాయలు వేయడం ఖాయం. ఈ లోపున తెలంగాణ జాక్ మరీ ముందుకు వెళ్లిపోతోంది. రాజీనామాలు చేయని కేంద్రమంత్రి, డిప్యూటీ సిఎం, డిప్యూటీ స్పీకర్, నగర మంత్రులు, మర్రి శశిధర్ రెడ్డి శవయాత్రలు నిర్వహించాలని నిర?యించింది. ఆంధ్ర పెట్టుబడిదారుల కాంట్రాక్టులు, వ్యాపారసంస్థలపై భౌతిక దాడులు చేయాలని నిశ్చయించింది. వీళ్లతో కలవాలా వద్దా అన్నది టి కాంగ్రెస్ నాయకుల ఎదుట వున్న పెద్ద ప్రశ్న.

ఎందుకంటే వీళ్లు ఎటాక్ చేసేది కాంగ్రెస్ నాయకులను, హై కమాండ్ నియమించినవారిని. ఇలాటి చేష్టలవలన హై కమాండ్‌కు కోపం వస్తుంది. వీళ్లతో కలవకపోతే తెలంగాణ ద్రోహులుగా, చిత్తశుద్ధి లేకుండా రాజీనామాలు చేసినవారిగా తెరాస ప్రచారం చేస్తుంది. గతంలో కోదండరాం ఆంధ్ర పారిశ్రామికవేత్తల ఉత్పాదనల లిస్టు తయారుచేస్తున్నామని, వాటన్నిటినీ తెలంగాణ ప్రజలు బహిష్కరించాలని పిలుపు నిచ్చారు. ఆ లిస్టు యింకా పూర్తి కాలేదులా వుంది రిలీజ్ చేయలేదు. ఇప్పుడు వ్యాపారసంస్థలపై దాడి చేస్తారట. ఏ సంస్థదైనా ఓనర్‌షిప్ ఎలా తెలుస్తుంది? షేర్‌మార్కెట్‌లో దాని షేర్లు ఎవరెవరు కొన్నారో, వారి పుట్టుక ఎక్కడిదో ఎవరికి తెలుసు?

వీళ్లు యిలాటి బెదిరింపులు చేస్తారు, వీటిని అడ్డుకోవడానికి ప్రయివేటు సైన్యాన్ని తయారుచేస్తామని టిజి వెంకటేష్ అంటే

ఆయన్ను గజ్జికుక్క, పిచ్చికుక్క అని కాంగ్రెస్ ఎంపీలు తిడతారు. టిజి వెంకటేష్ అలా మాట్లాడడం బాధ్యతారాహిత్యమైతే మరి కారులో వచ్చే ఎమ్మెల్యేపై దాడి చేసినవారిది, తెలంగాణలో ఆంధ్రుల ఆస్తులు నాశనం చేస్తామని బెదిరించేవారిదీ బాధ్యతారాహిత్యం కాదా? ఇవన్నీ చూసే ఆజాద్ సుహృదావే వాతావరణం ఏర్పడితే తప్ప చర్చలు సాగవు. చర్చలు సాగితే తప్ప తెలంగాణ సమస్యకు పరిష్కారం కనిపెట్టం అని ఖరాఖండీగా చెప్తున్నారు. ఇది వీరు గ్రహించాలి.

ఆంధ్రభూమికి ఎక్కణ్నుంచి లీడ్ వచ్చిందో కానీ హైదరాబాద్‌లేని తెలంగాణ ప్రకటించే అంశంపై దృష్టి పెట్టి వంద రోజుల్లో తెలంగాణ ఫార్ములా ఎనౌన్సు చేస్తారని రాశారు. జిల్లాలవారీగా ప్రజాప్రతినిధులను పిలిచి వారి అభిప్రాయాలు లిఖితపూర్వకంగా తీసుకుని అప్పుడు ప్రకటిస్తారట. హైదరాబాదు విషయం తర్వాత మాట్లాడదాం, తెలంగాణ మాత్రం నిర్దిష్ట కాలపరిమితిలో యిచ్చేస్తాం అని చెప్తారట. ఇదే కనుక జరిగితే తెలంగాణ కాంగ్రెస్‌వాళ్లు ఏం చేస్తారో వేచి చూడవలసినదే. ఇంతకంటె ప్రస్తుత పరిస్థితుల్లో సాధించగలిగేది ఏమీ లేదు అని తమ ప్రజలను ఒప్పించగలిగే సామర్థ్యం వీళ్ల కుందా? ఈ తెలంగాణలో పెట్టిన ఎన్నికలలో మీరు తెరాసను ఓడించి రండి, అప్పుడు హైదరాబాదు సంగతి తేలుద్దాం అని హై కమాండ్ అంటుందా?

అంటే మాత్రం చచ్చారే ! ఎందుకంటే జనాలకి యిప్పటికి కూడా తెలంగాణ ఉద్యమం అంటే కెసియారే ! సమైక్యవాదుల ఊరేగింపుల్లో తగలేస్తున్న దిష్టిబొమ్మలు కెసియార్‌వే. కేకేవి, జానారెడ్డివి కావు. వీళ్లను ఉద్యమనాయకులుగా శత్రువులు కూడా పరిగణించడం లేదు. ఇక ప్రజలేం పట్టించుకుంటారు? హై కమాండ్ వద్ద యిన్ని మొట్టికాయలూ తిని చివరకు కెసియార్ వద్ద చేతులు కట్టుకోవలసి వస్తే అంతకంటె దౌర్భాగ్యం యింకేమీ వుండదు. వీళ్ల పరిస్థితి యిలా వుంటే ఢిల్లీకి వెళ్లిన కాంగ్రెస్ సమైక్యవాదులు తమ పనులు తాము బాగానే చక్కబెట్టుకున్నారు. వాళ్లలాగ మీరు రాజీనామాలు చేయకుండా, ఆందోళనలు చేయకుండా, మాకు తలకాయనొప్పి తెచ్చిపెట్టకుండా వున్నారు అని మెప్పులు పొందారు.

యథాతథస్థితి కొనసాగించాలనే వాళ్లకు ఎప్పుడూ కష్టం వుండదు. మార్పు తెద్దామనుకున్నవారికే కష్టాలూ, నష్టాలూ. వారికి చాలా సహనం వుండాలి. తెలంగాణ ఉద్యమనాయకులలో అదే కొరవడుతోంది. కొందరు అతివాదులు మాట్లాడే ధోరణి చూస్తూంటే వాళ్లు కాంగ్రెస్‌లో కొనసాగుదామనుకుంటున్నట్టు కనబడటం లేదు. తెరాస భాష మాట్లాడుతున్నారు. చివరకు అక్కడే తేలతారేమో.

వీళ్ల రాజీనామాల విషయంలో హై కమాండ్ ఏ నిర?యమూ తీసుకోలేదు. రాజీనామాల తర్వాత హిందూలో సురేంద్ర మంచి కార్టూన్ వేశారు. వీళ్లందరూ కలిసి ఓ బ్యాట్ పట్టుకుని రాజీనామా బంతిని కష్టపడి ఢిల్లీ కోర్టులో పడేశారు. కానీ సోనియా ఓ మూల కూర్చుని తీరిగ్గా తన బ్యాట్ అల్లుకుంటూ కూర్చుంది. నిజానికి పరిస్థితి అలాగే వుంది. మీరు సృష్టించిన సమస్య మీరే పరిష్కరించుకోండి అన్నట్టు కూర్చుంది హై కమాండ్. రాజీనామాలు ఉపసంహరించుకోండి అని తనంతట తను అందంటే "తెలంగాణ ప్రకటించండి, అప్పుడు చేస్తాం. అది లేకుండా చేస్తే మాతో బాటు రిజైన్ చేసిన తక్కినపార్టీల వాళ్లు ప్రజల్ని మాపై ఉసిగొల్పుతారు" అంటారు వీళు ్ల. పైగా వీళ్లు రాజీనామాలు ఉపసంహరించినదాకా వుండి టిడిపి, తెరాస ఉపసంహరించుకోకపోతే అప్పుడు చేతులారా కాంగ్రెస్‌వారిని ప్రజల దృష్టిలో కింద పడేసిననట్టవుతుంది.

చెప్పాలంటే తెలంగాణ కాంగ్రెస్‌వారు కెసియార్ పన్నిన ఉచ్చులో బాగానే యిరుక్కున్నారు. ఈ పద్మవ్యూహంలోంచి బయట పడడం ఎలాగో వాళ్లకీ తెలియదు. బయటపడేయడం మాకూ తెలియదంటోంది హై కమాండ్. మహా పోతే రాష్ట్రంలో సగం కంటె తక్కువ భాగమేగా ! అనుకుంటోంది లాగుంది. వీళ్లని బయటపడేయడానికి ఏదైనా కన్సెషన్లు యిస్తే రేపు మరోళ్లూ తమను యిలాగే యిబ్బంది పెట్టవచ్చని భయం అందువలన వీళ్లని మీ చావు మీరు చావండి అని వదిలేస్తే వీరిలో అతివాదులెవరో, మితవాదులెవో తెలిసిపోతుంది. కాంగ్రెస్ నుండి జంప్ చేసేవారెవరో తేలిపోతుంది. ఇదీ హై కమాండ్ ఆలోచన.

ఈ లోపున సమైక్యవాదులు వినాయకుడిలా వాళ్ల చుట్టూ తిరిగి మాట వినే బుద్ధిమంతుల్లలా చూపించుకుంటూ మంచి మార్కులు కొట్టేస్తున్నారు. ఆస్కార్ ఫెర్నాండెజ్ వాళ్ల విందుకు వచ్చారు. అహ్మద్ పటేల్ రాత్రి 11.30కు కూడా ఎపాయింట్‌మెంట్ యిచ్చారు. ప్రధాని మన్‌మోహన్ చాలా సమయమే యిచ్చారు. ఎప్పటిలాగ అంతా విని ఆజాద్‌కి చెప్తాను లెండి అని అన్నారు. చిదంబరం 'తెలుగువాళ్లకో రాష్ట్రం కావాలని చేసిన పోరాటం నాకు తెలుసు. అందరూ తెలుగువాళ్లేగా కూర్చుని మాట్లాడుకోండి, మెజారిటీ అభిప్రాయాల మేరకే నిర?యం తీసుకుంటాం' అన్నారట.

ఇక ప్రణబ్ అయితే వీళ్లతో మనసు విప్పి మాట్లాడినట్లు తోచింది. అయితే పేపర్లో వచ్చినదంతా ప్రణబ్ అన్నారో, లేక సమైక్యవాదులే పుట్టించారో తెలియదు. ఎందుకంటే ఆయన తన నోటితో దేన్నీ ప్రెస్‌తో అనలేదు. పేపర్లో వచ్చిన ప్రకారం ఆయన తెరాసతో 2004 ఒప్పందం, డిసెంబరు 9 స్టేటుమెంటు – అన్నీ పొరబాట్లని అన్నారట. వాటిలో తనకూ భాగం వుందన్నారట. ఇవన్నీ చెపుతూ అసలు విభజన కోరడం అనేది చాలా ఔట్‌డేటెడ్ ఐడియా అన్నట్టు మాట్లాడారట. మెట్రోల స్వభావం, కలకత్తాలో హిందీ మాట్లాడవలసి రావడం వీటి గురించి మాట్లాడారంటే హైదరాబాదు భవిష్యత్తు ఏమవుతుందాని చింతిస్తున్నట్లుగా కనబడుతోంది.

ఇవన్నీ వింటే ప్రత్యేకవాదులకు నిరుత్సాహం కలగడం ఖాయం. అయితే వారు తమ ప్రయత్నాలు తాము చేయాలి. దానికి మార్గం ఢిల్లీ వెళ్లి కోస్తా, సీమ వాసులతో చర్చలు జరపడమే. ఇక్కడ కూర్చుని వాళ్లనూ వీళ్లనూ తిట్టి, ఎపి బోర్డులు చెరిపేసి తెలంగాణా రాస్తాం అంటే ఏం లాభం? ఈ పని దేవేందర్ గౌడ్ ఎప్పుడో చేశారు, కొత్తగా పార్టీ పెట్టినపుడు. ఇప్పుడు ఆయన కారుకి కూడా బహుశా ఎపి అనే వుండి వుంటుంది. వీరాలాపాలు ప్రజల్లో విప్లవకారుడి యిమేజికి పనికి వస్తాయేమో తప్ప చర్చల్లో పనికి

రావు. డిసెంబరు 9 స్టేటుమెంటు గురించి మాట్లాడడం మానేసి (మాట్లాడితే చిదంబరం వెంటనే డిసెంబరు 23 అంటారు) ముందు కథ తేల్చండి అని అడగాలి.

చర్చలంటూ ప్రారంభిస్తే ఎప్పటికో అప్పటికి ముగుస్తాయి. అదేదో సినిమాలో సుత్తివేలు లా "నీ ఫేసు నాకు నచ్చలేదు, నేను నీతో మాట్లాడను" అంటే కుదరదు. సామరస్య వాతావరణంలో చర్చలు సాగాలి. సిద్ధాంతపరంగా యుపిఏ విభజనకు వ్యతిరేకం అని బాగా గుర్తు పెట్టుకుని ఒడుపుగా వ్యవహరించాలి. ఇదే బిజెపికి మెజారిటీ వున్న ప్రభుత్వం అయితే కథ వేరేలా వుండేదేమో. కానీ యిప్పుడున్నది యుపిఏ ప్రభుత్వం. అనువుగాని చోట మరీ దూకుడుగా వెళ్లకుండా కార్యం సాధించుకు రావాలి.

ఇవన్నీ కేకే, జానారెడ్డిగార్లకు అర్థమయ్యే ఢిల్లీ వెళుతున్నారని అనుకోవాలి. వెళుతూ వెళుతూ 12 మంది (వీలైతే యింకో యిద్దరు ఎక్కువ కూడా) వెళదామనుకుంటున్నారట. అదే చిక్కు. ఆజాద్ మాగ్జిమమ్ 10 మంది రావాలి అంటే అలాగే వెళ్లాలి తప్ప ఆయనను ధిక్కరించడం దేనికి? ఎంతమంది వెళ్లినా అక్కడ చెప్పే పాయింట్లు అవేగా – 'డిసెంబరు 9న ప్రామిస్ చేశారు... మీరు తెలంగాణ యివ్వకపోతే ప్రజల్లో తిరగలేం.. తెలంగాణ యిస్తే కెసియార్‌ను పక్కకు నెట్టేసి 100 సీట్లు గెలుస్తాం..' అందువలన 10 మందికి మించకుండా వెళితే చికాకు పడదు. కానీ వీళ్లలో వీళ్లకు భయం. కొంతమంది లోపలికి వెళ్లాక మరో మాట చెప్తారేమోనని. మాలోనే రెండు నాలికల వాళ్లున్నారని మధు యాష్కీ అంటారు, లక్ష్మారెడ్డి అంటారు. అందువలన ఎవరి మీద వదలడానికీ భయం. అందరం కలిసే వెళదామంటారు. అసలు 10 మంది అన్నారు కాబట్టి 10 తెలంగాణ జిల్లాలకు, జిల్లాకు ఒకరు చొప్పున వెళితే బాగుంటుంది. ఆ జిల్లాలో మెజారిటీ ప్రజల మనోభావాలు తెలిపితే బాగుంటుంది. ఈ టీముకి నాయకత్వం కేకే, జానాలకు యిచ్చారేమిటో !

ఓ సినిమాకు రచయితలుగా తాపీ ధర్మారావుగార్ని, ఆరుద్రగార్ని పెట్టుకున్నారట. శ్రీశ్రీ చమత్కరించారు – 'ఒకరు తాపీ, మరొకరు ఆదుర్దా' అని. అలాగ మాట్లాడేవిషయంలో కేకే అతివృష్టి. జానా అనావృష్టి. జానాగారి చెప్పేది ఎంత దీర్ఘంగా, ఎంత స్లోగా వుంటుందంటే వాక్యం పూర్తయేసరికి ఆయన ఎక్కడ మొదలుపెట్టారో, దేని గురించి చెప్పారో మనం మర్చిపోతాం. ఇక కేకే..! దడదడ మాట్లాడతారు. ఆయన మాట్లాడినది తెలుగువాళ్లం మనకే అర్థం కాదు. ఆ మధ్య రాజ్యసభలో మాట్లాడితే అందరూ జుట్టు పీక్కున్నారు. అసలే ఆవేశం. (ఈ అంశే వాళ్లబ్బాయికి వచ్చి బీభత్సంగా ముగిసింది) దానికి తోడు ఆజాద్‌పై యిప్పుడు మహాకోపం. ఆయన మొదలుపెడుతూ 'మీ రాజీనామాల నిర్వాకం వలన తెలంగాణలో టిడిపి బలపడింది' అని నిందిస్తూ మొదలుపెడితే యీయనకు యింకా వెర్రెక్కిపోతుంది. రాజగోపాల్ రెడ్డి యువకుడే కానీ ఆవేశం ఎక్కువలా తోస్తుంది. సుఖేందర్ రెడ్డి వంటి వాళ్లు లీడ్ తీసుకుని కాస్త హుందాగా మాట్లాడితే బాగుంటుందేమో. ఫైనల్‌గా ఎవరెవరు వెళతారో, ఏం మాట్లాడతారో చూద్దాం.

ఏది ఏమైనా వెళ్లడం వలన మంచే జరుగుతుంది తప్ప యింతకంటె చెడిపోదని నా నమ్మకం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**

జులై 43 ఎమ్బీయస్ : హస్తినలో హరివిలాసం

రాబోయే తెలంగాణ రాష్ట్రానికి కాబోయే హెూం మంత్రి తడాఖా ఏమిటో ఢిల్లీలోని ఎపి భవన్ ఉద్యోగులకు తెలిసి వచ్చింది. శరీరపుష్టి ఎలాటిదో చందర్ రావుగారికి తెలిసింది. ఉద్యోగులకే ఏమిటి అక్కడి తలుపులకు, ద్వారబంధాలకు కూడా శారీరకంగా ఆయన శక్తిమంతుడో తెలియవచ్చింది. మర్నాడు భవనంలో బసచేసినవారికి నీళ్లూ, కరంటు కట్టేసి ఉద్యోగులు తమ తడాఖా చూపించబోయారు కానీ దానివలన ఎఫెక్టయింది గీతా రెడ్డి వంటి అతకులే! హరీశ్‌రావు అప్పటికే రాష్ట్రంలో తనను అన్యాయంగా విమర్శిస్తున్న విలేకరులపై హరితాండవం చేస్తున్నారు.

తెరాసను వెనకేసుకుని వచ్చే మీడియా పెద్దలు కూడా సన్నసన్నగా "హరీశ్ విద్యాధికుడు. మూడుసార్లు ఎమ్మెల్యే అయినవాడు. అత్యధిక మెజారిటీతో గెలిచినవాడు. ఆ పరిస్థితుల్లో ఆవేశం రావడం సహజమే కానీ మరీ అంతగా ఆవేశపడడం బాగాలేదని కొందరనేదానిలో వాస్తవం లేకపోలేదని తక్కిన కొందరు అనడాన్ని తప్పు పట్టలేమని యింకా కొందరు అంటున్న విషయాన్ని మనం పరిశీలించక తప్పని పరిస్థితి వచ్చిందని అంగీకరించడం సమంజసమే అని తోస్తోంది" అని డొంక తిరుగుడుగానైనా చెప్తున్నారు. చెపుతూ అదే గుక్కలో దానిపై హరీష్‌రావు క్షమాపణ చెప్పడం, ఆయన సంస్కారం. మెచ్చుకోదగ్గ విషయం" అనేస్తున్నారు.

హరీష్‌రావు క్షమాపణ చెప్పారని పేపర్లో రాసినది చదవకండి. టీవీలో వీడియో చూడండి. "...ఓ దెబ్బ వేసి వుంటే వేసి వుండవచ్చు" అన్నాడాయన. సాయంత్రమంతా, మర్నాడు పొద్దున్నా వేస్తూ వచ్చిన క్లిప్పింగ్స్‌లో ఏ ఒక్కటి చూసినా ఆయనకే తెలిసేది – దెబ్బ వేశారో, వేయలేదో. కానీ తను వేసినది దెబ్బ అవునో కాదో ఆయనకే సందేహం వున్నట్టుంది. అందువలన ఆయన క్షమాపణ అంత అర్థమనస్కంగా వచ్చింది. హరీశ్‌రావు చర్యను తప్పుపట్టే ధైర్యం టి కాంగ్రెస్‌వాళ్లకు కూడా లేదు. సిపిఐ సురవరం వారు కూడా హరీష్ చేసినది తప్పు అని అనలేదు. ఉద్యోగులు సరిగ్గా ప్రవర్తించలేదనే అంటున్నారు. ఉద్యోగుల తప్పేమిటంటే అమరవీరుణ్ని అనాథగా చేయబోయారట.

ముందుగా అమరవీరుడి గురించి మాట్లాడుకుందాం. చనిపోయిన ఆ యువకుడి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూనే ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం గురించి మాట్లాడుకుందాం. ఇప్పటిదాకా బోల్డుమంది పోయారు. 600 మంది అని నేనను.

అది 400 నుండి 600 కు ఒక్కసారిగా జంప్ అయింది. వైయస్ మరణం తర్వాత పోయినవారి లిస్టు ''సాక్షి''లో వేసినట్టు, ఈ అమరవీరుల లిస్టు కూడా ''నమస్తే తెలంగాణ''లో నైనా వేస్తే అప్పుడు కాస్తయినా ఐడియా వస్తుంది. ఆ తర్వాత వారిలో బహిరంగంగా ప్రాణాలు తీసుకున్నవారెవరు, చాటుగా పోయినవారెవరు అన్నదానిపై విచారణ జరిపించాలి.

మండల్ ఉద్యమం దగ్గర్నుండి చూడండి – ఇలా ఉద్యమాలలో ఆత్మహత్యలు చేసుకునేవారెప్పుడూ మీడియాను పిలిచి వారెదుట చేసుకుంటారు కానీ గుట్టుగా చీకటి మాటున చేసుకోరు. అది తెలంగాణ అమరవీరుల ప్రత్యేకత. చనిపోయాడనడం, పక్కన ఓ లేఖ పడి వుండడం యిదీ యీ చావుల ట్రేడ్ మార్క్. ఈ యాదిరెడ్డి పక్కన కూడా పది పేజీల లేఖ పడి వుందట. పూర్తిపాఠం ఎవరూ వేసినట్టు లేదు. సారాంశం చాలా తక్కువే వుంది. దాన్ని పదిపేజీలకు ఎలా విస్తరించాడో మరి ! చెట్టుకి ఉరి వేసుకున్నాట్ట. అంటే స్టూలూ అవీ అక్కడే దొరికాయా? ఏమో ! మామూలుగా ఏదైనా శవం కనబడితే చావు గురించి అనేక కోణాల్లో పరిశీలించి, పరిపరి విధాల ఆలోచిస్తారు. 'తెలంగాణ కోసం' అనే స్టాంపు పద్దాక చావు గురించి ఏ చిన్న ప్రశ్న అడిగినా అది ఉద్యమానికి ద్రోహం చేసినట్టే లెక్క అయిపోతుంది. అందువలన చావు జరిగిన తీరు గురించి మనం యింతకు మించి ఆలోచించవద్దు. మన చావుకి వస్తుంది.

ఇక టైమింగ్ ! అదీ అయోమయంగానే వుంది. కృష్ణ కమిటీ రిపోర్టు రాగానే చాలా ఆత్మహత్యలు జరుగుతాయనుకున్నాను. ఎందుకంటే వారు – కలిసి వుండడమనే ఆరో ఆప్షనే బెస్ట్ ఆప్షన్, ఐదోదైన విభజన సెకండ్ బెస్ట్ ఆప్షన్ మాత్రమే, అదీ అవతలిప్రాంతం వాళ్లు ఒప్పుకుంటేనే – అని విభజనవాదుల గుండె బద్దలయ్యేట్లా యిచ్చారు. తమాషా ఏమిటంటే అప్పుడు ఎవరూ చావలేదు. ఇంతకుముందు ఉత్తుత్తినే చనిపోయినవారు కూడా ఆత్మహత్యల నివారణ కౌన్సిలింగ్ అంటూ జాక్ ఒక కమిటీ పెట్టిన తర్వాత (పెడతామన్నారు, మరి అది పని చేస్తోందో లేదో తెలియదు, దానిలో సభ్యులు ఫలానా ఫలానా అని కూడా పేపర్లో రాలేదు. ఇప్పుడు యాదిరెడ్డి ఆత్మహత్య జరిగిన తర్వాత అయ్యో అతను మా దగ్గరకు రాలేదే అని కూడా అనలేదు) తగ్గాయనుకున్నాను. ఇప్పుడు హఠాత్తుగా యితను చనిపోయాడు. అదీ ఢిల్లీ వచ్చి మరీ పోయాడు. అసలు ఢిల్లీ ఎందుకు వచ్చినట్టు?

టి కాంగ్రెస్‌వాళ్లు ఆజాద్‌తో మాట్లాడడానికి వచ్చినపుడు వచ్చి ఆజాద్‌తో చర్చలు అతనూ వూహించినట్టు జరగకపోవడం వలన నిరాశతో ఆత్మహత్య చేసుకున్నాడా అంటే అదీ కాదు. సమైక్యవాదులు ఢిల్లీ వెళ్లినపుడు అతను వెళ్లాడు. సమైక్యవాదులు విజయం సాధించినందుకు హతాశుడయ్యాడా అంటే వాళ్లకూ విజయం కలగలేదు. 'మేం చెప్పినది వాళ్లు విన్నారంతే, ఏ హామీ యివ్వలేదు. సమైక్యమనో, విభజన అనో మాకు చెప్పలేదు' అని వాళ్లు ఆనెస్టుగా చెప్పారు. 'గతంలో చాలా పొరబాట్లు చేశాం, కానీ ఆ చరిత్రను మార్చలేం' అని ప్రణబ్ అన్నట్టు వీళ్లు చెప్పారు. ప్రణబ్ ఎక్కడా స్టేటుమెంటు యివ్వలేదు.

అయినా ఆ అబ్బాయి తన ఫ్రెండుకి ఫోన్ చేసి 'ఇక్కడేం జరగడం లేదు, తెలంగాణ వచ్చేట్టు లేదు' అని నిరాశగా మాట్లాడాడట. అసలు నిజానికి తెలంగాణ విషయంలో కదలిక వచ్చిందే యిన్నాళ్లకి. రాజీనామాల తర్వాత ఢిల్లీ వాళ్లు చర్చలంటూ పిలుస్తున్నారు. అంతకుముందు ఆ ముచ్చటా లేదు. చర్చలంటూ మొదలెట్టాక రకరకాల దశలు వస్తాయి. కొన్నిసార్లు ఆశాజనకంగా, కొన్నిసార్లు నిరాశాపూరితంగా..! చర్చలు విఫలం, తెలంగాణ యివ్వలేం అని హై కమాండ్ తేల్చి చెప్పింది అని ప్రకటన వచ్చిన రోజు ఈ అబ్బాయి చనిపోయి వుంటే అర్థం చేసుకోగలం.

ఇతనికి మరీ స్టూడెంటు కుర్రవాడు కాదు. 31 ఏళ్లు. జీవితంలో స్థిరపడకపోవడం వల్లనో, తెలంగాణ వచ్చేవరకూ పెళ్లి చేసుకోకూడదనుకున్నాడేమో పెళ్లి అయినట్టు లేదు. చదువు పెద్దగా వున్నట్టు లేదు. డ్రైవర్‌గా పనిచేస్తూ గత రెండేళ్లగా ఉద్యమంలో తిరుగుతున్నాట్ట. అందుచేత ఉద్యమం పోతున్న పోకడలు గమనిస్తున్నవాడే. ఇప్పుడు నిరాశకు గురైతే అతనికి గైడెన్సు యిచ్చేవారు కరువయ్యారు పాపం.

ఆ మధ్య కోడెల శివప్రసాదరావు ఈటెల రాజేందర్‌కు వాళ్లకూ ఓ హితబోధ చేశారు. 'మా వద్ద ఎంతోమంది యువకులు ప్రాణత్యాగం చేసుకున్నారు. మాదీ ఉద్యమం. మీది కాదు' అన్న ధోరణిలో వీళ్లు మాట్లాడితే కోడెల మరోలా వాదించుకుంటూ వచ్చారు – 'మీ పిల్లలెవరూ, మీ నాయకుల పిల్లలెవరూ చేసుకోలేదు కదా. అంటే ఈ బలిదానాల వలన తెలంగాణ రాదు అని నచ్చచెప్పారన్నమాట. చెప్పగలిగారన్నమాట. ఇప్పుడు చేసుకునేవారందరూ వెనుకబడిన వర్గాల వాళ్లే. వాళ్లకు మీరు సరిగ్గా నచ్చచెప్పటం లేదు. మా వద్దా వున్నారు వెనుకబడినవాళ్లు. కానీ వాళ్లకు మేం అర్థమయ్యేట్లు చెప్పాం, అందుకనే మా దగ్గర బలిదానాలు లేవు.' అని.

కోడెల వాళ్లందరికీ నచ్చచెప్పగలిగారు కానీ తన పార్టీ సభ్యుడు పయ్యావుల కేశవ్‌కి చెప్పలేకపోయారు. ఆయన ఆత్మాహుతి దాడులంటున్నాడు. ఆయన కేంద్రంపై చేస్తాననంటే తెలంగాణ ఉద్యమకారులు వారి ననుకున్నారేమో ఆయన్ను చీల్చి చెండాడేస్తున్నారు. ఈ నాయకులు యిలాటి కబుర్లు ఎందుకు చెప్తారో తెలియదు. గతంలో హరీశ్ కిరోసిన్ పోసుకుని అడావుడి చేశాడు. ఆయనకేం కాలేదు కానీ ఆయన్ను చూసి ప్రభావితమైన కుర్రాళ్లు మాడిమసయ్యారు. ఇప్పుడు టికాంగ్రెస్‌వాళ్లు పార్లమెంటులో ఆత్మత్యాగం అంటున్నారు. పయ్యావుల కేశవ్ ఆత్మాహుతి దాడి అంటున్నారు. వీళ్లంతా నిజంగా ప్రాణత్యాగం చేయడం ఉత్తిమాట. మొన్న నిరాహారదీక్ష చేయమంటేనే బిపి, షుగర్ అంటూ తప్పుకున్నారు. శిబిరానికి రావడం, ఫోటోలు తీయించుకుని పోవడం. వీళ్లు కబుర్లు చెప్పి తప్పుకుంటారు. కానీ నిమ్నవర్గాల వారిని ప్రేరేపించి చావుకి పురికొల్పుతారు. యాదిరెడ్డి కూడా పాపం అలాటి కాండిడేటే

నేమో !

అయినా అతను యిలాటి సమయంలో ఎందుకు పోయాడో తెలియదు. అదీ ఢిల్లీలో ! హైదరాబాదులో పోతే 600 చిల్లర అమరవీరులలో జమ అయ్యేవాడు. ఢిల్లీలో పోతే కాస్త ప్రత్యేకత. సమస్య జాతీయ మీడియా దృష్టిలో పడుతుంది అనుకున్నాడేమో. నిజానికి తెలంగాణ అన్నది మనకు ఏడెనిమిది ఏళ్లగా పెద్ద సమస్య. రోజూ పేపర్లో నాలుగో వంతైనా దాని గురించి వుంటోంది. టీవీలో అయితే మూడో వంతు.

అయితే జాతీయ టీవీ ఛానెల్స్ చూడబోతే తెలంగాణ గురించి వాళ్లు కవర్ చేసేది చాలా తక్కువ. ఆర్నెల్ల కో సారైనా ఓ కథనం వుండదు. ఇండియా టుడే, ఔట్‌లుక్ వంటి జాతీయ యింగ్లీషు వీక్లీలలోనూ అదే పరిస్థితి. తెలంగాణ గురించి కాస్తయినా వుంటుందేమో కాని సమైక్యాంధ్ర దృక్పథం గురించి అస్సలు వుండదు. అలాటి పరిస్థితిలో యిటీవల సమైక్యవాదులు ఢిల్లీలో పెద్ద సదస్సు పెట్టి కులదీప్ నయ్యర్, కెపియస్ గిల్, సంజయ్ బారు వంటి జాతీయ స్థాయి మేధావులను పిలిచి మంచి కవరేజి తెచ్చుకున్నారు. దాన్ని కౌంటర్ చేయడానికి తన ఆత్మహత్య వుపయోగపడుతుందని యాదిరెడ్డి అనుకున్నాడేమో. అతనికి అంత ఐడియా లేదంటారా, మరి వేరే ఎవరైనా చెప్పారేమో, నాకు తెలియదు.

ముందుగా ప్లాన్ చేశారో లేదో తెలియదు కానీ యాదిరెడ్డి చావును ఢిల్లీలోనే కాస్త హైలైట్ చేద్దామని జెఎన్‌యు విద్యార్థులూ వాళు ‌్లు అనుకున్నారట. తెలంగాణ గురించి ఢిల్లీలో అప్పుడప్పుడు కాస్త అడావుడి చేసేది వాళ్లే. పైగా టికాంగ్రెస్ నాయకులు అవేళే దిగారు. తెరాస వారు హైదరాబాదునుండి యీ పనిమీదే వస్తున్నారు. అందుకని శవాన్ని ఎపి భవన్‌కి తీసుకుని వచ్చి నివాళి అంటూ, కాస్సేపు గలభా చేసి, అక్కడ ఎపి భవన్‌మీద దాడి చేసి.. యిలాటివన్నీ సహజమే కదా.

ఎపి భవనే ఎందుకంటారా, యీ మధ్యే నమస్తే తెలంగాణ ఒక స్టోరీ వేసింది – అంది ఆంధ్రా భవన్ కాదు, ఆంధ్రోళ్ల భవన్ అంటూ.. అక్కడున్న ఉద్యోగుల్లో చాలామంది ఆంధ్రప్రాంతీయులే అంటూ గణాంకాలు యిచ్చింది. (తెలంగాణవాసి నిర్వచనం తెలిస్తే తప్ప ఎవరు తెలంగాణయో, ఎవరు తెలంగాణేతరుడో తెలియదు లెండి). దానాదీనా ఎపి భవన్ వారికి భయం వేసింది. శవం యిక్కడకు వస్తే యిది మనకు చుట్టుకుంటుందిరా అని. అందువలన అక్కడి కమిషనర్ ఢిల్లీ పోలీసులకు ఉత్తరం రాయించాడు – శవాన్ని యిక్కడకు తీసుకురాకండి అని. అంతటితో ఆగితే బాగుండును, శ్మశానానికి తీసుకెళ్లి క్రిమెటోరియంలో దగ్ధం చేయండి అన్నాడు.

ఇది తప్పు. ఎవరైనా పోతే అయినవాళ్లకు శవాన్ని అప్పగించండి అంటారు తప్ప మీరే తగలేయండి అనకూడదు. అయినా ఢిల్లీలో జరిగే తెలుగువారి చావులకు ఎపి భవన్ బాధ్యత ఎలా వహిస్తుంది? అది నెలకొల్పిన ఉద్దేశమే వేరు. ఢిల్లీలో లక్షలాది తెలుగువాళ్లున్నారు. సగటున రోజుకో తెలుగువాడు చస్తూ వుండవచ్చు. వాళ్లందరినీ ఎపి భవన్ తీసుకుని రామా? అని ఢిల్లీ పోలీసులు అడగరు కదా. అసలు యీ అబ్బాయి కూడా ఫలానా అని ఎలా తెలిసింది అంటే అతను ఆధార్ కార్డు తో సహా తన వివరాలన్నీ రాసుకుని శవం దగ్గర పెట్టుకుని మరీ పోయాడు. విదేశాల్లో అయితే ఆ దేశపు పౌరుడి రాయబార కార్యాలయానికి కబురు పెట్టవచ్చు. ఇది దేశంలోనే జరిగింది.

ఢిల్లీ పోలీసులు ఎపి భవన్‌కి రిఫరెన్సు అడగడమే అనవసరం. దానికి వీళ్లు ఏమో మాకు తెలియదు అనకుండా శ్మశానంలో కాల్చేయి అనడం మరీ తప్పు. కమిషనర్ గారు చెప్పడం బట్టి అక్కడున్న ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఒయస్‌డి) ఉత్తరం రాశారు. తర్వాత రాజకీయనాయకులు ఏం ఒత్తిడి తెచ్చారో, హైదరాబాదునుండి ఏ ఆదేశాలు వెళ్లాయో ఏమో, 'ఎపి భవన్‌కు మీరు రక్షణ కల్పిస్తే శవాన్ని యిక్కడకు తెచ్చినా ఫర్వాలేదు' అని రెండో ఉత్తరం కూడా రాశారు.

అమరవీరులకు నివాళి సరిగ్గా యివ్వనీయలేదని గగ్గోలు పెడుతున్న టి నాయకులు యివన్నీ తెలుసుకోవలసిన పని లేదా? రెండో ఉత్తరం వారు చదవలేదా? ఎపి భవన్‌లో స్టాఫ్ వారికి చెప్పలేదా? హరీశ్ వచ్చి దాడి చేస్తారన్న భయంతో గేట్లు వాళ్లు మూసుకున్నారు. బయట వున్న హరీష్ ఏం చేయాలి? ఇన్‌చార్జికి ఫోన్ చేసి ఏమిటీ వ్యవహారం అని అడగాలి. అడిగారా? అడిగితే రెండో ఉత్తరం సంగతి తెలిసే వుంటుంది. మేం శాంతియుతంగా వుంటాం. మీకేం భయం లేదు అని హామీ యిచ్చి శవాన్ని అక్కడకు తెప్పించి వుండాల్సింది.

హరీష్‌కు అదేం అక్కరలేదు. అవేళ హీరో అవడానికే నిశ్చయించుకున్నారు. రాజు వెడలె రవితేజమలలరగ అన్నట్టు టీవీ కెమెరాలు వెంటరాగా 'చందర్ రావు ఎక్కడ?' అంటూ వెళ్లారు. మీరూ నేనూ అయితే లెటర్ మీద సంతకం పెట్టినవాడికోసం వెతుకుతాం అమాయకంగా. హరీష్ వంటి రాష్ట్ర స్థాయి నాయకుడు ఎవడ్రా ఎపి భవన్ యిన్‌చార్జి అంటూ పెద్ద తలకాయ గదిలోకే దూసుకుపోవాలి. పైగా ఆయనకు ఎపి భవన్ కొత్తేమీ అయి వుండదు. వాళ్ల మామ 2004లోనే కేంద్రమంత్రిగా చేశారు. ఈయనా రాష్ట్రమంత్రి చేశారు. అక్కడ ఇన్‌చార్జి ఎవరో, ఒఎస్‌డి ఎవరో తెలిసే వుంటుంది.

అయినా చందర్ రావు ఎక్కడ అంటూ తలుపులు ఫెళఫెళలాడిస్తూ వెళ్లారు. అసెంబ్లీలో గవర్నరుపై లంఘించినప్పుడే ఆయన ఫిజికల్ ఫిట్‌నెస్ చూపించుకున్నారు. ఇప్పుడు ముష్టిఘాతాల్లో ఎంత ఎక్స్‌పర్టో చూపించారు. వెళుతూ లెటర్ చూపించి ఏమిటిది? అని అడిగి సమాధానం సరిగ్గా చెప్పకపోతే చెయ్యెత్తడం అర్థం చేసుకోవచ్చు. ఆ పాటి సమయమే యిస్తే ఆయన రెండో లేఖ గురించి చెప్పి వుండేవాడు. హరీష్‌ది కొట్టి ఆ తర్వాత మాట్లాడే తత్వంలా వుంది. అన్ని ఛానెల్స్ కెమెరామన్‌లు కవర్ చేసేందుకు వీలుగా

పోజిచ్చి నిలబడి చందర్ రావును కొట్టేశారు. దెబ్బలు తిన్నాయన ఆయన నాదేం లేదు, కమీషనర్‌దే అని చెప్పాడు. అప్పుడు రెట్టించిన కోపంతో కమిషనర్‌పైకి వెళ్లి వుండాలి. కానీ లేదే ! అక్కడికి వెళ్లి చెయ్యెత్తలేదు, కాలెత్తలేదు. మామూలుగా వాదించారు. అదేమి చిత్రమో !

ఎపి భవన్‌లో సహజంగానే అలజడి రేగింది. చందర్ రావు యింట్లో కూడా. ఆయన భార్య ఆఫీసుకి వచ్చి చెప్పు తీసింది ఎవడ్రా కొట్టింది? అని. చందర్ రావు కూతురు టీవీ జర్నలిస్టుట. అలా ఎలా కొడతారని హరీష్‌ను నిలదీసింది. ఆయన 'సారీ అమ్మా' అని వూరుకున్నాట్ట గానీ వెంటనున్న తెరాస ఎమ్మెల్యేలు 'ఏమిటి పెద్ద గోల చేస్తున్నావ్? మీ యింటికి వచ్చి కొట్టామా? ఆఫీసులో కొట్టాం కానీ' అని ఎదురు తిరిగారట.

అంటే ఏమిటి దీనర్థం? ప్రభుత్వాఫీసులో ఉద్యోగులనైతే కొట్టవచ్చు. ఇంటికి వెళ్లి గొడవ చేస్తే తప్పుకానీ అనా? ప్రభుత్వోద్యోగులకు అన్యాయం చేస్తోంది యీ కిరణ్ ప్రభుత్వం అంటూ వారి సమ్మెను బలపరుస్తున్న తెరాసయే యిలా అనవచ్చా? వాళ్లు జీతాలు పుచ్చుకుంటున్నది మీచేత తన్నులు తినడానికా? జాగ్రత్త, మీరు రేపు నిరసన ప్రదర్శనలు చేసేటప్పుడు పోలీసులు వచ్చి మోసుకుంటూ వ్యాన్‌లలో ఎక్కించాలిగా, అప్పుడు కావాలని జారవిడిస్తే నడుములు విరుగుతాయి.

వీళ్లు కొట్టారు కదాని ఎపి భవన్ వాళ్లంతా కలిసి తిరిగి కొట్టలేదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా కేసులు పెట్టారు. పెడుతూ చందర్ రావు ఎస్సీ కావడంతో ఎస్సీ ఎట్రాసిటీస్ యాక్టు కింద పెట్టారు. మన టీవీ పానెలిస్టులందరూ అది తప్పు అని ఘోషించారు. నిజమే, ఆ చట్టం కింద పెట్టడం అనవసరమే. అయితే అలా జరగడం యిదే ప్రథమమా? ఒక ప్రభుత్వోద్యోగి పెటట్టాడనా యింత ఖండనలు? శంకరరావు వంటి మంత్రి తన ఉద్యోగులు తన మాట వినలేదంటూ ఈ చట్టం కిందే ఫిర్యాదు చేసినప్పుడు ఏమైంది యీ తెలివి?

ఆ చట్టం దారుణంగా మిస్‌యూజ్ అవుతోందన్నమాట వాస్తవం. ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఉండవల్లి అరుణ్‌కుమార్ రాజమండ్రి మునిసిపాలిటీ సమావేశంలో 'దురదృష్టవశాత్తూ అయ్యంగార్ రాసిన రాజ్యాంగంలో అలా వుంది మరి..' అని వుంటే హర్షకుమార్ అందుకో అంత అల్లరి చేయగలిగేవారా? అక్కడ ఆయన అయ్యంగార్ బదులు అంబేద్కర్ అన్నాడు, పీకు చుట్టుకుంది. ఎంతోమంది అవినీతి అధికారులు పట్టుబడిన తర్వాత 'ఎస్సీని కాబట్టి పట్టుకున్నారు, అదే అగ్రవర?ం వాడినయితే పట్టుకునేవారా?' అని వాదిస్తున్నారు.

ఈ రోజు తెరాస నాయకుడికి వ్యతిరేకంగా కేసు పెట్టారనా యిప్పుడు అందరూ మేలుకొన్నారు? ఆవేశంతో కొట్టాడు తప్ప హరీష్‌కు ఆ ఉద్యోగి ప్రాంతం, కులం తెలిసి కొట్టలేదని వాళ్ల బావ కెటియార్ వకాలతు తీసుకుని చెప్పారు. ఎపి భవన్ దగ్గర కాచుకుని కూచున్నపుడు కానీ, తాళం కప్పలు పగలకొట్టినపుడు కానీ ఎవడ్రా యీ చందర్ రావు? ఎక్కడివాడు? అని అడక్కుండానే వున్నారా హరీష్? గీతారెడ్డి మొదట్లో రిజైన్ చేయకపోతే ఆవిడ భర్త రాయలసీమ వాడు కాబట్టి అన్నారు. ఇప్పుడు దామోదర రాజనరసింహ రిజైన్ చేయకపోతే వాళ్ల తండ్రి ఎప్పుడో రాయలసీమ నుండి వచ్చాడని చరిత్ర తవ్వుతున్నారు. ప్రతీ దాన్నీ ప్రాంతం, కులం కళ్లతో చూస్తున్న యీ ఉద్యమకారులకు ఎవరెవరో తెలియకుండానే వున్నారా? ఇందాక చెప్పినట్టు హరీష్‌కు ఎపి భవన్ కొత్తా? అక్కడి స్టాఫ్ కొత్తా? అక్కడంతా ఆంధ్రోళ్లు వున్నారని నమస్తే తెలంగాణ చెప్పిందిగా, ఆయన ఆ పేపరు చదవడా?

హరీష్ తన కోపాన్ని కమిషనర్‌పై ఎందుకు చూపించలేదు? ఇక్కడ టి ఎన్‌జిఓలు చెప్తున్నారుగా – ఇతర ప్రాంతాల 'సెటిలర్ల'జోలికి పోమని, వారి సహకారంతో ఆంధ్రా సెటిలర్ల పని పడతామనీ. కమిషనర్ యితర ప్రాంతంవాడు. అందుచేత ఆయన జోలికి పోలేదు. చెయ్యెత్తలేదు. తేరగా దొరికినది యీ చందర్ రావే. మంద కృష? మాదిగ చందర్ రావు ఎస్సీ కాబట్టి కొట్టాడని, కమిషనర్ అగ్రవర?స్తుడు కాబట్టి కొట్టలేదనీ అంటున్నారు. అది కాదు యిస్యూ. కోస్తా, సీమ వాళ్లయితే కొట్టవచ్చు, ఆస్తులు తగలబెట్టవచ్చు, వాళ్ల విగ్రహాలు విరగకొట్టవచ్చు. పరరాష్ట్రం వాడైతే వాడి జోలికి పోకూడదు. ఇదీ ఉద్యమకారుల పాలసీ.

నిజానికి అతనికి జరిగిన 'సత్కారానికి' రాష్ట్ర ఉద్యోగులందరూ నిరసన తెలిపి కనీసం లంచ్ టైమ్ డిమాన్‌స్ట్రేషనైనా చేయాలి. ఏ లగడపాటి రాజగోపాలో ఎపి భవన్‌లో తెలంగాణ ఉద్యోగిపై యిదే విధంగా చేయి చేసుకుని వుంటే తెలంగాణ ఉద్యోగులు అగ్గి రగిలించి వుండేవారు. చందర్ రావు దురదృష్టం. రాంగ్ ప్లేస్‌లో పుట్టాడు. ఆయనకు అండగా నిలిచినది ఎపి భవన్ వుద్యోగులు మాత్రమే. అదీ రెండో రోజుకి చల్లారి పోయారు. ఇలాటి సంఘటనలు పునరావృతం కానీయం అని కమిషనర్ యిచ్చిన హామీ పుచ్చుకుని నిరసన మానేశారు.

పునరావృతం మాట సరే, జరిగినదానికి ఏమిటి? కేసు బుక్ చేశాం కదా అంటారు. ఢిల్లీ పోలీసులు హరీష్‌ను అరెస్టు చేస్తారనే మీరు అనుకుంటున్నారా? ఏది ఏమైనా హరీష్ మళ్లీ హీరో అయ్యారు. రేపు ఆగస్టు 1 తర్వాత హైదరాబాదులో ఆంధ్రప్రాంతీయుల యిళ్లకు కరంటు కట్ చేస్తానంటున్నారు కదా. స్వయంగా వచ్చి ఫ్యూజులు లాగుతారేమో ! అడ్డుకున్న పోలీసుల చెంపలు ఛెళ్లు మనిపిస్తారేమో !

ఈ శనివారం "ఆంధ్రభూమి"లో హరీష్‌ని హీరోగా పొగుడుతూ దాని ఎడిటర్ ఎంవీయార్ శాస్త్రిగారు "వీక్' పాయింట్' చెప్తారేమోనని ఎదురు చూశాను. గతంలో జస్టిస్ నరసింహారెడ్డి ఆయన కంటికి మూర్తీభవించిన ధర్మవీరుడులా కనబడ్డారు. అసాధ్యుడని మెచ్చుకున్నారు. జస్టిస్ రెడ్డిగారి 'చొరవ', 'ధర్మనిబద్ధత' కారణంగా అతిరహస్యాన్ని బట్టబయలు చేశారని ఆకాశానికి ఎత్తేశారు. కృష?కమిటీ

రిపోర్టులో ఎనిమిదో చాప్టర్ బయట పెట్టవచ్చా కూడదా తీర్పు చెప్పు అని అడిగితే దానిపై తీర్పు చెప్పవచ్చు కానీ దానిలో వున్నది యిదీ అని తీర్పులోనే రాయడమేమిటండీ బాబూ ! ఎక్కడా కనీవినీ ఎరగలేదు. సెన్సార్ సభ్యులు ఫలానా సీనులో నగ్న దృశ్యం వుండవచ్చు అని అనుమతిస్తారు కానీ తామే హీరోయిన్ బట్టలు వూడదీసి చూపించరు.

ఎనిమిదో చాప్టర్‌లో ఏం రాశారన్నదీ, దాని ఔచిత్యం ఏమిటన్నదీ వేరే విషయం. అది డిబేటబుల్. కానీ ప్రభుత్వం దాన్ని బయటపెట్టవచ్చా లేదా అని తీర్పుకోసం వెళితే ప్రభుత్వం చేయవలసిన పని (కరక్టుగా చెప్పాలంటే – చేయవలసిన అని న్యాయమూర్తి అనుకున్న పని) తనే చేయడమేమిటి? అదీ ఓ తీర్పరి, ఓ న్యాయమూర్తి ! తెలంగాణ విషయం కాబట్టి ఆయనను ఆకాశానికి ఎత్తేస్తున్నారు. అదే ఏ అమర్‌సింగ్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమో అయితే ఏమనేవారు? ట్యాప్ చేసి నుక్కున్నవి బయటపెట్టవచ్చా? అని పోలీసులు అడిగితే యీయనే అమర్‌సింగ్ హీరోయిన్లతో మాట్లాడిన రసిక సంభాషణలన్నీ తీర్పులో ఉటంకిస్తారా? శాస్త్రిగారు మామూలుగా అయితే రెడ్డిగారి ప్రవర్తనను ఘాటుగా వెక్కిరించేవారు. గతంలో తన బాధ్యత నిర్వర్తించిన ట్రాఫిక్ పోలీసును ఆయన ఎలా దండించారో గుర్తు చేసి  దెప్పి వుండేవారు. కానీ ఎందుకోగాని ఆయనకు రెడ్డిగారిలో హీరోయిజం కనబడింది.

అలాగే హరీష్‌లో కూడా హీరోయిజం కనబడుతుందనే అనుకున్నాను. కానీ ఏమనిపించిందో ఏమో కానీ మెచ్చుకోలేదు. అలా అని నిందించనూ లేదు. ఎందుకొచ్చిందిలే అని ఎక్కడో బ్రిటన్‌లో జరిగిన 'న్యూస్ ఆఫ్ ద వరల్డ్' గురించి ఉన్నమాట చెప్పేసి 'వీక్'గా కానిచ్చేశారు. ఆయన పేపరు కూడా  చందర్ రావుతో హరీష్ వాదిస్తున్న దృశ్యం ఫోటో వేసింది తప్ప కొడుతున్న ఫోటో వేయలేదు. ఫోటోలో చందర్ రావు చేతులు అడ్డుపెట్టుకుంటున్నాడు. హరీష్ యిమేజి కాపాడే బాధ్యత పేపరు నెత్తిన వేసుకున్నట్టుంది.

''ఈనాడు'' యింకా చాలా జాగ్రత్తగా మసలుకుంది. ఆయన ప్రభుత్వోద్యోగిని కొడుతున్న దృశ్యం అన్ని టీవీల్లో వచ్చినా, నమస్తే తెలంగాణ తో సహా అన్ని పేపర్లలో వచ్చినా వీళ్లు మాత్రం వేయలేదు. పైగా హరీష్‌రావు వాగ్వివాదం అనే రాశారు. ఇలాటి ట్రిక్కులు ''హిందూ''వారి దగ్గర చాలా వుంటాయి. ఇక్కడి వార్త వేస్తే ప్రభుత్వానికి కోపం వస్తుందేమోనన్న అనుమానం వస్తే అంటార్కిటికా గురించో, డిగో గార్షియా గురించో హెడ్‌లైన్సు పెట్టేస్తారు. ఈ పత్రికలు తమ స్వేఛ్ఛగురించి మాట్లాడతాయి తప్ప ప్రభుత్వోద్యోగుల స్వేఛ్ఛగురించి చేసేది యిది ! వాళ్లకు ఆత్మగౌరవం వంటివి వుండకూడదా? అసలు వాళ్ల వాదన కూడా వినకుండా కొడతారా?

తమకు సానుభూతి చూపించే పేపర్లు యీ మాత్రం చేయగా లేనిది, మన దృష్టి మరలించడానికి కోదండరాం ప్రయత్నాలు చేయకుండా వుంటారా? చేశారు. బంద్ పిలుపు నిచ్చారు. కారణం ఏమిటట? అమరవీరులకు ప్రభుత్వం నివాళి అర్పించనీయలేదట. ఢిల్లీలో అర్పిస్తేనే నివాళా? స్వంత వూరిలో అర్పిస్తే నివాళి కాదా? తర్వాత ప్రభుత్వోద్యోగులపై ఎస్మా ప్రయోగిస్తానని ప్రభుత్వం అనకూడదట. వీళ్లు అత్యవసర సర్వీసులు కూడా ఆపేస్తాం అనచ్చు కానీ ప్రభుత్వం మాత్రం చట్టప్రకారం వాళ్ల చేతిలో వున్నవి చేస్తానని కూడా అనకూడదట. అసలు అననే లేదు కదా ! ఈ తుక్కు ప్రభుత్వానికి అంత దమ్మెక్కడిది? తన ఉద్యోగులకే రక్షణ కల్పించలేదు కానీ పౌరులకు ఏ రక్షణ కల్పిస్తుంది? కల్పించాలన్నా మంత్రులు వుంటే కదా! ఎస్మా ప్రయోగిస్తాం అన్నది ఓ లీక్ మాత్రమే. అధికార ప్రకటన కానే కాదు. దానికే బంద్ పిలుపు నిచ్చేశారు. పుకార్లకు కూడా బంద్‌లు చేయవలసిన ఖర్మ పట్టింది మనకు. బంద్ అసలు లక్ష్యం హరీష్ నుండి నుండి ఫోకస్ మరల్చడమే అని ఆబాలగోపాలానికి తెలుసు. కానీ ఎవరూ ఏమీ అనరు. అనలేరు.

ఇవన్నీ చూసి హరీష్‌కు మరింత ధైర్యం రావచ్చు. ఇలాటి మరిన్ని పనులకు తెగబడవచ్చు. కానీ ఒక్కటి మాత్రం నిజం. ఇలాటి చేష్టలు తెలంగాణ సాధన లక్ష్యాన్ని మరింత దూరం చేస్తాయి. కృష్ణ కమిటీ ఎనిమిదో రిపోర్టులో తెలంగాణ యిస్తే జరగబోయే అరాచకత్వం గురించి చెప్పి ఢిల్లీ వాళ్లను భయపెట్టింది. ఆ భయాలు నిరాధారమైనవి కావని టాంక్‌బండ్‌పై విరిగి పడిన విగ్రహాలు చాటి చెప్పాయి. ఎసెంబ్లీలో గవర్నరుపై జరిగిన దాడులు నొక్కి వక్కాణించాయి. ఎపి భవన్ ఉద్యోగిపై దాడి పునరుద్ఘాటించింది. హరీష్ స్ఫూర్తి నందిన తెరాసవిద్యార్థి సంఘం వారు శుక్రవారం ఆంధ్రప్రాంతీయుని ఫామ్ హౌస్‌లో కొట్టి పడేసిన చెట్లు బరువుగా తలలూపాయి. ''మనం భారతదేశానికి స్వాతంత్ర్యం యిస్తే అక్కడ కలహాలు జరిగి కుక్కలు చింపిన విస్తరి అవుతుంది'' అని భయపెట్టే చర్చిల్ చాలాకాలం స్వాతంత్ర్యం యివ్వకుండా ఇంగ్లీషు వారిని ఒప్పించగలిగాడు. ఆనాటి ఇంగ్లీషు వారిలా ఇప్పుడు ఢిల్లీ నేతలు భయపడకుండా వుండాలంటే హరీష్ వంటి నాయకులు సంయమనం పాటించాలి.  ఇలాటివి మళ్లీ జరగవని ప్రభుత్వోద్యోగులందరికీ ఆయన హామీ యివ్వాలి. తక్కిన నాయకులు, పత్రికలు ఆయనను వెనకేసుకుని రావడం మానేసి, ఉద్యోగుల పక్షాన నిలబడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**

**జులై 47** **ఎమ్బీయస్ : ఇలా అయితే చర్చలు ఎప్పటి కవుతాయి?**

తెలంగాణ సమస్య యిన్నాళ్లకు చెప్పుకోదగ్గ దశకు చేరింది. పరిష్కారం దిశగా ఆజాద్ ఓ రోడ్‌మ్యాప్ తయారుచేశారు. ప్రతీ ప్రాంతం నుండి 5 నుండి 10 మంది దాకా కాంగ్రెస్ సభ్యులను రమ్మనమన్నారు. అదీ పాయింట్లు రాసుకుని రమ్మనమన్నారు. చర్చలు వీడియో చేయిస్తానన్నారు. వీళ్లోసారి, వాళ్లో సారి మూడు నాలుగు గంటల పాటు తమ తమ వాదనలు వినిపించచ్చు. రెండో సమావేశానికి వెళ్లేసరికి మొదటి సమావేశంలో వీళ్లు చెప్పిన పాయింట్లపై అవతలివాళ్లు లేవనెత్తిన అభ్యంతరాల గురించి వీళ్ల వివరణ

అడుగుతారు. ఉదాహరణకి 1956 నుండి ఒక్క ఎకరం కూడా అదనంగా తడవలేదు అని తెలంగాణ ఉద్యమకారులు అన్నారనుకోండి. తడిసింది అని అవతలివాళ్లు లెక్కలు పట్టుకుని వస్తారు. ఈ అంకెలు తప్పు అని వీళ్లంటారు. ఎందుకు తప్పో చెప్పండి, పోనీ మీ దగ్గర ఏమైనా అంకెలుంటే యివ్వండి, వాటికి ఆధారాలు చూపండి అని అవతలివాళ్లు అంటారు. ఇది సమయం పట్టే వ్యవహారమే కానీ సత్యం అన్వేషించడానికి యిదొక్కటే దారి.

ఇలా సమావేశాలు విడివిడిగా జరిగాక ఒకరి భావాలు మరొకరికి మధ్యవర్తిద్వారా బోధపడ్డాక ఇద్దర్నీ ఓ చోట కూర్చోబెడితే మార్గం సుగమం అవుతుంది. ఇద్దరూ కలిసి ఒక ఒప్పందానికి వస్తారు. ఇది పట్టుకుని ఆజాద్ అప్పుడు టిడిపివారిని పిలుస్తారు. రాష్ట్రంలో అటూ యిటూ స్టేక్స్ వున్న పార్టీ అదే కాబట్టి. వాళ్లూ అటూ యిటూగా సరేనన్న తర్వాత తక్కిన పార్టీలను పిలుస్తారు. వాళ్ల చేత ఔననిపిస్తారు. ఒకటి రెండు పార్టీలు మొండికేస్తే వాళ్లకున్న సంఖ్యాబలం బట్టి వాటి అభ్యంతరాలను లెక్కలోకి తీసుకోవాలో వద్దో పరిగణిస్తారు. మొత్తం మీద ఒక మధ్యేమార్గం ముందుకు వచ్చాక దాన్ని అసెంబ్లీలో తీర్మానంగా ప్రవేశపెడితే అందరూ (అదేలెండి, అధిక సంఖ్యాకులు.. అసమ్మతిరాగం ఆలాపించడానికి ఎప్పుడూ కొందరుంటారు) ఆమోదం తెలుపుతారు. అక్కణ్నుంచి పార్లమెంటు బిల్లు, రాష్ట్రపతి ఆమోదం, వగైరా.. వగైరా..

అయితే టికాంగ్రెస్‌వారికి యిదేమీ నచ్చుబాటుగా లేదు. ఇదంతా చేస్తే ఆగస్టు 1 లోగా పని ఎలా పూర్తవుతుంది అని అభ్యంతరం తెలుపుతున్నారు. ఆ ఆగస్టు 1కి అంత ప్రాముఖ్యత ఏమిట్రా అంటే అది వీళ్లు పెట్టిన గడువుట. పార్లమెంటు సెషన్ ప్రారంభమయ్యే లోపున విషయం తేలిపోవాలట. ఈ గడువులు తమలో తాము పెట్టుకోవచ్చు తప్ప హై కమాండ్‌కి విధించేటంత దమ్ము ఎవరికి వుంది? అసలు చర్చలకు వచ్చేముందే 'తెలంగాణ యిచ్చేశాం. తక్కిన విషయాలపైననే చర్చలు' అని ప్రకటిస్తేనే వెళ్లాలని వీళ్ల డిమాండ్. ఇచ్చేశాం అని ప్రకటించాక హై కమాండ్‌తో 'మీతో చర్చలేముంటాయి? తెలంగాణ ఎలా అభివృద్ధి చేయాలో మేమే చూసుకుంటాం' అనవచ్చు వీళ్లు. మావోయిస్టులతో చర్చలు అంటుంది ప్రభుత్వం. ఆయుధాలు పక్కన పెడితేనే చర్చలు అంటుంది ప్రభుత్వం. ఆ మాట ఎత్తకుండా వుంటేనే చర్చలు అంటారు మావోయిస్టులు. ఎన్నటికీ చర్చలు జరగవు.

తెలంగాణ యిచ్చేశామని చెప్పాకనే చర్చలు అనడానికి బేస్ ఏమిటంటే డిసెంబరు 9 న హై కమాండ్ చేసిన ప్రకటన అంటారు ఉద్యమకారులు. దాన్ని విడిగా చదవకూడదు. డిసెంబరు 23 తో కలిపి చదవాలి అంటారు సాక్షాత్తూ ఆ ప్రకటనను పార్లమెంటులో చదివిన చిదంబరం. కోర్టులో 'టు బి రెడ్ టుగెదర్ విత్..' అన్నట్టుగా డిసెంబరు 23 ది కూడా కలిపితే తప్ప డిసెంబరు 9 స్టేటుమెంటు విడిగా చదవరాదు అంటారు చిదంబరం. అయినా రాజ్యాంగ సవరణ కానీయండి, మరేదైనా కానీయండి, తాజాదే లెక్కలోకి వస్తుంది కానీ ఎప్పుడో పాతది పట్టుకుని దాన్నే వాదిస్తూ కూర్చుంటే ఎలా? కోర్టులో కొట్టేస్తారు. డిసెంబరు 23 స్టేటుమెంటులో డిసెంబరు 9 పూర్వస్థితిని తెచ్చేసారు కదా. ఇంకా డిసెంబరు 9 గురించి మాట్లాడడం దేనికి? జనవరి 2010లో కృష్ణ కమిటీ కిచ్చిన గైడ్‌లైన్స్‌లో 'రాష్ట్రం సమైక్యంగా వుంచాలా? విడగొట్టాలా? అనే అంశాన్ని స్టేక్ హోల్డర్స్ అందరితో మాట్లాడి...' అంటూ విపులంగా యిచ్చారు. ఆఖరిదే బైండింగ్ అవుతుంది కానీ అంతకుముందువి గాలికి పోయినట్టే. టెన్త్ పరీక్షకు వెళ్లాక టెన్త్ మార్కులే చూస్తారు కానీ నైన్త్ మార్కులు ఎవరూ పట్టించుకోరు.

ఏకాభిప్రాయం కొత్తగా సాధించేదేముంది? డిసెంబరు 7 అసెంబ్లీ తీర్మానమే చాలు కదా అంటారు ఉద్యమకారులు. అవేళ మీటింగు కెసియార్ ఆరోగ్యస్థితి గురించి సమీక్షించడానికి పిలిచారు తప్ప రాష్ట్రవిభజనపై కాదు, కావాలంటే ఎజెండా చూసుకోండి అని వాదించారు ఒవైసీ. దేనికో పిలిపి మరి దేనికో సంతకాలు పెట్టమంటే పెట్టేశారనుకోండి. తర్వాత వెనక్కి వెళ్లిపోయారుగా. మరి దానికేమంటారు? అది లెక్కలోకి తీసుకోవద్దా? విడాకులు తీసుకున్న భార్యాభర్తలను మీరు యిప్పటికి కూడా మొగుడూ పెళ్లాలే, ఒకప్పుడు పెళ్లి చేసుకున్నారుగా అంటే కుదురుతుందా? ప్రస్తుత పరిస్థితినే లెక్కలోకి తీసుకోవాలి. ప్రస్తుతం రాష్ట్రంలో భిన్న భిన్న అభిప్రాయాలు వినబడుతున్నాయి. వాటిని సమన్వయ పరచవలసిన బాధ్యత వుంది. అప్పుడే ఏకాభిప్రాయం లేదా కాన్సెన్సస్ ఏర్పడుతుంది.

ఈ పని యిన్నాళ్లకు మొదలైంది. సమైక్యవాదులతో సహా అందరూ ఆనందించాలి. పండోరాస్ బాక్స్ తెరుస్తున్నారు కదా, యిక ఒక్కో సమస్యా ఎదుటబడి అడుగుతుంది, నా సంగతేమిటని ! పరిష్కరించాలి మరి. అసలు యిన్నాళ్లూ బాక్సే తెరవలేదు. అసలు బాక్స్ లేనట్టే నటించారు. ఆ దశ నుండి కదలి వచ్చి పెట్టె తెరుస్తున్నారు. అడ్డు పడకూడదు. పెట్టె తెరవకూడదు అని బెదిరించకూడదు. విభజిస్తే కాల్చుకు చస్తాం అని ఒకళ్లు, విభజించకపోతే కాల్చుకు ఛస్తాం అని మరొకరు బెదిరిస్తే పనులేమవుతాయి? ఓ పాత జోక్ వుంది. ఒకాయనకు యిద్దరు భార్యలు. రైల్లో వెళుతూంటే కిటికీ తలుపు మూసేయండి, లేకపోతే పడిశం పట్టి వెంటనే చచ్చిపోతానని ఒకావిడ బెదిరించిందట. రెండో భార్య తెరవండి, లేకపోతే ఊపిరాడక చచ్చిపోతానని బెదిరించిందట. ఏం చేయాలాని ఆలోచిస్తూ వుంటే సాటివాడు సలహా యిచ్చాట్ట – కాస్సేపు తెరిచి వుంచండి, ఒకావిడ చచ్చిపోతుంది. ఇంకాస్సేపు మూసి వుంచండి, రెండో ఆవిడా పోతుంది. అప్పుడు హాయిగా యింకెవరినైనా బుద్ధిమంతురాల్ని చూసి చేసుకోండి అని. అలాగ హై కమాండ్ సమైక్యమే అని కొందర్ని, విభజనే అని మరి కొందరు అతివాదనాయకులను దఫదఫాలుగా ఆత్మహత్యలకు ప్రేరేపిస్తే చర్చలకు గ్రౌండ్ క్లియరవుతుంది. కాస్త బుఱ్ఱా, బుద్ధీ వున్నవాళ్లే మిగులుతారు.

లేకపోతే ఏమిటండీ, టికాంగ్రెస్ నాయకులకు చర్చలు ఎలా జరుగుతాయో తెలియదా? వాళ్లలో ఇండస్ట్రీలు వున్నవాళ్లు వున్నారుగా, వాళ్ల యూనియన్‌తో చర్చలు ఎలా జరుగుతాయో వాళ్లకు తెలియదా? 'మా జీతం 25% పెంచుతామని ముందే ప్రకటించి చర్చలకు

పిలవండి, అది ఎలా ఖర్చు పెట్టుకోవాలో అది మాత్రం డిస్కస్ చేద్దాం కావాలంటే' అని యూనియన్ లీడర్లు అంటే వీళ్లు సరేనంటారా? సాధారణంగా మేనేజ్‌మెంట్ చర్చలు జరగకుండా తాత్సారం చేస్తుంది. ఎప్పటికో రమ్మంటుంది. యూనియన్ వాళ్లు పరుగులు పెట్టుకుంటూ వెళతారు. ఈ సందర్భంలో హై కమాండ్ మేనేజ్‌మెంట్ అనుకుంటే వాళ్లు చర్చలకు పిలిచినపుడు వీళ్లు చికాకు పెడితే ఎలా?

మొదట మధ్యవర్తే మాకు నచ్చలేదు అన్నారు, ఆజాద్‌కి ఒళ్లు మండేట్లు. తర్వాత ఎలాగోలా దిగి వచ్చి ఢిల్లీ వెళ్లారు. ఇంతమంది ఒకేసారి వస్తే ఎలా, చిన్న టీముగా రండి అన్నాడు. ఆజాద్. మీరూ నేనూ ఆజాద్ స్థానంలో వున్నా అదే చెప్తాం. అసలు టీవీ చర్చలు గంట వుంటేనే విసుగెత్తి పోతుంది. ప్యానెల్‌లో నలుగురు, లైన్ యిన్‌లో యిద్దరు, కాలర్స్ నలుగురు కలిసి మన బుర్ర తినేస్తారు. ప్యానెల్ వాళ్లు ఒకేసారి యిద్దరు మాట్లాడుతూ వున్నపుడు ఆ మోడరేటర్ ఏం చేస్తున్నాడ్రా? వాళ్లల్లో ఒకళ్ల నోరు నొక్కక, మైకు పీకేయక.. ! అని అనిపిస్తూనే వుంటుంది.

మరి యిక్కడ ఏకంగా తొంబలు తొంబలుగా వెళితే ఎలా? అయినా అందరిదీ ఒకటే వాదం, ఒకటే పాయింటు. అందరూ మైకుల ముందు చెలరేగి పోయేవారే ! ఎవరు వెళితే మాత్రం ఏముంది? జిల్లాకు ఒకరు చొప్పున పదిమంది వెళితే ఎక్కీ తొక్కీ. అబ్బే కాదుట, అందర్నీ రానివ్వాలట. ఈ ముక్క పదేపదే చెప్పడంతో శుక్రవారం చర్చలు సాగలేదు. కమిటీ నిర?యించుకుని సోమవారం రండి, అసలే నాకు నడుం నొప్పి గంటల తరబడి మీతో దీనిమీద వాదిస్తూ కూర్చోలేను అని ఆజాద్ చేత చెప్పించుకుని మరీ బయటకి వచ్చారు. ఆయన ఐదు నుండి పదిమంది చాలు అంటే కాదు పన్నెండు అనిపించారు.

మేనేజ్‌మెంట్‌తో యూనియన్ చర్చలు జరిగినప్పుడు చూడండి. యూనియన్‌లో పదివేలమంది సభ్యులుంటే అందరూ రారు. ఐదారుగురు వస్తారు. ఇక్కడా ఐదారుగురు వెళితే చాలు. అంతగా పాయింట్లు తట్టకపోతే సమయం అడగవచ్చు. ఎందుకంటే అవతలి మనిషి స్వంతపార్టీ వాడే. ఇదేమైనా ఐయ్యేయస్ ఇంటర్వ్యూనా, అడగ్గానే సమాధానం చెప్పలేకపోతే పరీక్ష పోతుందనడానికి! ఎక్కువమంది వెళ్లినంత మాత్రాన ఎఫెక్టివ్‌గా మాట్లాడతారన్న నమ్మకం ఏమైనా వుందా? ఊరికే పదిమందీ ఒకేసారి మాట్లాడితే అవతలివాడికి తలవాచిపోతుంది. చెప్పడం వచ్చినవాళ్లు తీరుగా చెప్తే చాలు.

కానీ వీళ్లలో వీళ్లకు యిగో సమస్యలు. నేను వెళతానంటే నేను వెళతానంటూ పేచీలు. ఈ పేచీల వలన చర్చలు సోమవారానికి వాయిదా పడ్డాయి. అదైనా పన్నెండు మందే తేలారా? అబ్బే, 22 మందిట. ఒక్కో అంశం బట్టి ఒక్కో టీములో కొందరు వెళతారట. ఒకే టీము ముందునుండి చివరిదాకా వుంటే మంచిది. లేకపోతే ముందువాళ్లు ఒప్పుకున్న అంశాలు మళ్లీ వెళ్లినవాళ్లు తిరగతోడే ప్రమాదం వుంది. చర్చల్లో పాల్గొన్నంతమాత్రాన ఎవరూ కిరీటాలు పెట్టరు. అయినా వీళ్లు అదో పెద్ద యిస్యూ చేసుకుని ఆలస్యం చేసుకుంటున్నారు.

ఈ లోపున హనుమంతరావుగారు ఓ సలహా పడేశారు. తెలంగాణ యిచ్చేసి హైదరాబాదు ఓ పదేళ్లు ఉమ్మడి రాజధానిగా వుంచండి, సరిపోతుంది అని. ఇవన్నీ చర్చల తర్వాత రావాలి తప్ప ముందే ఆఫర్లు యిచ్చేయకూడదు. పేకాటలో ముందే ముక్కలు చూపిస్తే ఆటేం సాగుతుంది? చావుకి పెడితే లంఖణానికి వస్తుందని సామెత. హైదరాబాదులో అస్సలు అడుగు పెట్టనివ్వం అంటే అవతలివాళ్లు ఓ పాతికేళ్లు మాత్రం అంటారు. మధ్యేమార్గంగా ఏ పదికో, పదిహేనుకో సెటిల్ కావచ్చు. ఇవన్నీ జంప్ చేసి తీర్పు లిచ్చేయడం దేనికి?

అయినా యీ పదేళ్లూ హైదరాబాదుని పాలించే దెవరట? చండీగఢ్ మోడల్లోలా హైదరాబాదును యుటీ చేసి రెండు రాష్ట్రాల సెక్రటరీలు, ఎసెంబ్లీలు నడుపుకోమంటారా? 50 ఏళ్లయింది హర్యాణా ఏర్పడి.. యిప్పటిదాకా వాళ్లు కొత్త రాజధాని కట్టుకోలేదు, చండీగఢ్ వదల్లేదు. రాబోయే ఆంధ్రరాష్ట్ర నాయకులు కూడా అలాగే చేస్తే...? అసలు వారి రాజధాని ఏదో తేలడానికే రెండు మూడేళ్లు పడుతుంది. ప్రతీ జిల్లా మాకంటే మాకు అని కొట్లాటకు దిగుతుంది. ఆ తర్వాత కేంద్రం నిధులు యివ్వాలి. రోడ్డు వేయాలంటేనే అనుకున్నదాని కంటె ఏడాది లేటవుతోంది, బజెట్ పెరిగిపోతోంది. మరి కొత్త రాజధాని కట్టాలంటే అన్నీ టైము ప్రకారం జరుగుతాయని ఎవరు హామీ యిస్తారు? పదేళ్లయాక యింకో పదేళ్లంటే.., ఆ తర్వాత యింకో పదిహేనేళ్లంటే..? రిజర్వేషన్స్ చూడండి, ఏళ్లకేళ్లు ఎలా పెంచుకుంటూ పోయారో !

ఆలోచిస్తే ప్రతీ పరిష్కారంలోనూ సమస్య వుంది. అసలు ఆలోచనే లేటు చేస్తున్నారు టి కాంగ్రెస్‌వారు. దీనివలన వాళ్లు మాత్రమే కాదు, రాష్ట్ర ప్రజలందరూ ఎఫెక్టవుతున్నారు. అదీ బాధ. గత రెండేళ్లగా రాష్ట్రంలో అల్లకల్లోలమే రాజ్యం ఏలుతోంది. పెట్టుబడులు రావడం లేదు. ఉన్న పరిశ్రమలు వెళదామని చూస్తున్నాయి. జనజీవనం తరచు అస్తవ్యస్తమౌతోంది. విద్వేషవాతావరణం పెరుగుతోంది. గతంలో సంయమనం పాటించినవారు కూడా యిప్పుడు నోరు జారుతున్నారు. ఒకళ్లను మించి మరొకరు వీరాలాపాలు పలుకుతున్నారు. తర్వాత యీ నాయకులందరూ ఒకరి నొకరు వాటేసుకోవచ్చు. కానీ యీ విషబీజాలు సామాన్యప్రజలలోకి లోతుగా నాటుకుంటే దీని దుష్ఫలితాలు దశాబ్దాలపాటు మనని వెంటాడుతాయి.

మామూలు ప్రజలందరికీ యీ భయాలున్నాయి. అందువలన ఏదో ఒక నిర?యం త్వరగా తేలాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నారు. వీరిలో సమైక్యవాదులూ వున్నారు, విభజనవాదులూ వున్నారు, తటస్థులూ వున్నారు. ఇన్నాళ్లకు చర్చలు ప్రారంభమయ్యాయి. అన్నీ సవ్యంగా సాగితే – మూణ్నెళ్లు అన్నారు కానీ అలా చేసి, యిలా చేసి ఏ ఆర్నెల్లో పట్టిస్తారు – ఆర్నెల్లలో ఓ నిర?యం బయటకు వస్తే

బాగుండునని ఆశ. టికాంగ్రెస్ వాళ్లు అనవసర పంతాలకు పోతే ఆ ఆర్నెల్లు తొమ్మిది నెలలు కావచ్చు, ఏడాది కావచ్చు. మరీ విసిగిస్తే ఏం చేస్తారో చేసుకోండి అని ఆజాద్, సోనియా కాడి పడేయవచ్చు. అదీ మన భయం. ఇది టి కాంగ్రెస్‌వాళ్లు గుర్తిస్తే ధన్యులం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**

**ఆగస్టు 12** **ఎమ్బీయస్ : రోశయ్యపై ఉక్రోషం దేనికి?**

ఉరుము ఉరిమి మంగలం మీద పడ్డట్టు టి–ఉద్యమకారులు రోశయ్యమీద కారాలు మిరియాలు నూరుతున్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి దారుణంగా ఉచితానుచితాలు మరచి రోశయ్యగారి చావు గురించి ప్రస్తావించి 'ఆయన ఛస్తే మొయ్యడానికి రెడీ' అన్నారు. ఓపక్క అధినేత్రి ఆరోగ్యానికై చర్చి కెళ్లి ప్రార్థనలు చేస్తున్నారు, మరో పక్క సాటి నాయకుడి మరణానికి ప్లాన్లు వేస్తున్నారు. రోశయ్యగారికి నిర్వేదం ముంచుకువచ్చి ఊరుకున్నారేమో కానీ లేకపోతే – ''ఆ పాటి పనికి నాకు నలుగురు దొరక్కపోరు, నీకెందుకు ఆ శ్రమ? కాస్త సవ్యంగా మాట్లాడి నీ సంగతి నువ్వు చూసుకో. ఎవరు ముందో, ఎవరు వెనకో ఎవరికి తెలుసు?'' అనేసి వుండేవారు.

ఇంతకీ రోశయ్యపై ఎందుకింత కోపం? సోనియా అనారోగ్యం దృష్ట్యా ఉద్యమానికి ఆయన విరామం యిమ్మన్నాడు. అందులో తప్పేముంది? టికాంగ్రెస్ నాయకుల్లో ఆ విషయమై తర్జనభర్జన జరిగింది. నిర?యం తీసుకోవలసినది ఆవిడని అందరికీ తెలుసు. అందుకే కెసియార్ ఆవిణ్నే ఆకాశానికి ఎత్తేశారు, పాతాళానికి కుదేశారు. ఇస్తుందన్న ఆశ పుట్టించినపుడు మొదటిది, యివ్వదని భయం పుట్టించినప్పుడు రెండోది. ఇప్పుడు ఆవిడ లేకపోతే పార్లమెంటు నడవటం లేదా, ప్రభుత్వం నడవటం లేదా? భోజనాలు మానేశారా? ఉపవాసాలు మానేశారా? అంటున్నదీ కెసియారే.

కెసియార్ నిమ్స్‌లో ప్రాణాలు కడగట్టి వున్నపుడు (? – క్వశ్చన్ మార్కు ఎందుకంటే గోనె ప్రకాశరావుగారు అప్పటి నిమ్స్ రికార్డులు యింకా బయటపెట్టలేదు, సహ చట్టం కింద అడిగినవారెవరూ కనబడటం లేదు) కూడా వారింట్లో రొటీన్ పనులు జరుగుతూనే వుంటాయి. పార్టీ ఆఫీసులో పనులు కూడా నడుస్తూనే వుంటాయి. కానీ చిదంబరంగారు 'మరి స్టేటుమెంటు ఎలా వుండాలో చెప్పి దేశానికి, రాష్ట్రానికి మార్గదర్శనం చేయండి' అని జయశంకర్‌గార్ని అడిగినప్పుడు, ఆయన మృత్యువు వాకిట్లో వున్న కెసియార్‌ను వెనక్కి పిలిచి అడగవలసి వచ్చింది. అప్పుడు కెసియార్ 'ఛస్తూంటే సంధిమంత్రంలా ఏమిటీ గోల? నేను లేకపోతే మీరు వ్యవహారాలు చూసుకోలేరా?' అని కసురుకోలేదు. స్టేటుమెంటు ఎలా వుండాలో జయశంకర్‌గారికి చెప్పి అప్పుడు విశ్రమించారు.

ఈమాట కెసియార్ కుమారుడు కెటియార్ చెప్పినదే. ఆ మాట కొస్తే కెటియార్‌కి విషయం ఏమిటో తెలుసు. తెలంగాణ ఎందుకు కావాలో తెలుసు. మంచి భాషాపటిమ కూడా చేతిలో వుంది. అయినా ఓ ముఖ్యమైన స్టేటుమెంటు అనగానే చావుబతుకుల్లో వున్న తండ్రిని డిస్టర్బ్ చేయవలసి వచ్చింది. ఇదీ పార్టీ నాయకుడి ప్రాముఖ్యం. ఎందుకంటే ఉద్యమానికి ఆయనే మూలవిరాట్టు. మొత్తానికి డిసెంబరు 9 స్టేటుమెంటు వెలువడింది. అది చాలా ముఖ్యమైన రాష్ట్ర చరిత్రను మలుపు తిప్పిన, కుదుపు కుదిపిన ప్రకటన అనుకున్నాం. ఇప్పుడు చిదంబరం 'ఆ దానిదేముంది, దానితో బాటు డిసెంబరు 23, 2010 జనవరి 5, 2011 జనవరి 6.. అవన్నీ గుదిగుచ్చి చూడాలి తప్ప డిసెంబరు 9 ఒక్కటీ పట్టుకుని వేళ్లాడితే ఎలా? గుడ్డివాళ్లు ఏనుగుని వర?ంచినట్టే వుంది మీ వాలకం' అంటున్నారు.

అంతోటి స్టేటుమెంటుకే కెసియార్ కావలసి వస్తే, మరి తెలంగాణ యిచ్చేయడం వంటి పేద్ద స్టేటుమెంటు యివ్వడానికి సోనియా కావద్దా? సోనియా వున్నంత మాత్రాన ఆ స్టేటుమెంటు యిచ్చేస్తుందా అని అడగకండి. ఉద్యమం కీలకదశకు చేరిన యీ తరుణంలో.. (యీ మాట నాది కాదు ఉద్యమకారులదే, యీ కీలకదశకు చేరడం అనే మాట రెండేళ్లగా వారానికోసారి వింటున్నాను) ఆవిడ ఏదో ఒకటి తేల్చి చెప్పేస్తుందని, అమీతుమీ తేల్చేస్తుందని, తేల్చేట్లా ఆవిడమీద ఒత్తిడి పెంచుతున్నామని చెప్తున్నారు టికాంగ్రెస్‌వారు. రాజీనామాలిచ్చేసి పార్లమెంటు మొహం చూడకపోతే ఆవిడ దిగి వస్తుందని అంటున్నారు. దిగి రావడానికి ఆవిడ అక్కడ వుంటేగా? ఎక్కడో అమెరికాలో వుంది. వైద్యం చేయించుకుంటోంది.

ఆవిడ అమెరికా వెళ్లకుండా హైదరాబాదు వచ్చి వుంటే, అప్పుడు మన టి డాక్టర్లు బంద్ నిర్వహించి ఆవిడకు తడాఖా చూపించి, కత్తి చూపించి ఏదో ఒకటి చెప్తేనే కత్తి దించి సర్జరీ అని బెదిరించగలిగేవారు. కానీ ఆవిడ యిటు రాలేదు. అటు వెళ్లిపోయింది. చికిత్స పొందుతోంది. ట్రీట్‌మెంట్ దక్కనిది మన తెలుగువాళ్లకే. వారానికో సారి బంద్ అనడంతో ఆస్పత్రికి వెళ్లడానికి బస్సుండదు. వెళ్లాక డాక్టరుండడు. ఇదేమిటని కేసు పెడదామంటే కోర్టు వుండదు. అన్యాయంగా వుందంటూ మొత్తుకుందామంటే మంత్రి వుండడు. మంత్రి వుంటే ఆయన సిబ్బంది వుండదు.

సోనియాగారికి వచ్చినది కాన్సర్. అసలే ఆవిడకు చికాకు ఎక్కువ. ఎప్పుడు ఎపాయింట్‌మెంట్ యిస్తుందో, ఎప్పుడు ఊరేగిస్తుందో, ఎప్పుడు దేవిడీ మన్నా చేస్తుందో ఎవరికీ తెలియదు. దీనిగురించి సాధికారంగా మాట్లాడగలిగిన వ్యక్తి చిరంజీవిగారు. ఆయన యిప్పటిదాకా 'ఇన్ ద పాండో, ఆన్ ద బాంకో' తెలియకుండా వున్నారు. ఆయనా, ఆయన అనుచరులు ఓట్లేయడానికి కాంగ్రెస్‌వారు – పదవుల పంపకం దగ్గరకి వచ్చేసరికి పీఆర్పీవారు. ఆ విలీనం ముచ్చటై పోతే గట్టిగా అడగవచ్చని వాళ్ల ఆశ. చిరుకు మువ్వన్నెల కండువా వేయడం బ్రహ్మాండబహిరంగసభలో సోనియా వేస్తారనడం వద్ద ప్రారంభమై ఇంటి వసారాలో రాహుల్ వేస్తారనే వరకు

వచ్చింది. 'రేవు దాటేదాకా ఓడమల్లయ్య, తర్వాత బోడిమల్లయ్య' అనే సామెత మారిపోయి 'చేరేదాకా చిరంజీవి, చేరాక సగటుజీవి' అనే నానుడి భావితరాలు చెప్పుకోవచ్చు.

ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే సోనియాగారి మూడ్ ఎప్పుడు బాగుపడుతుందో, ఆవిడ ఎప్పుడు మన రాష్ట్రం గురించి పట్టించుకుని మర్యాదరామన్న తీర్పు యిస్తుందో తెలియదు. కొంతకాలం సిఎంగా చేశారు కాబట్టి ఆవిడ కళాకళాలు బాగా తెలిసిన రోశయ్యగారు ఈ లోపున ఊరికే ఊదరగొట్టడం దేనికి? గోడు వినేవాడు లేనప్పుడు గోల చేయడం దేనికి, కాస్త వూపిరి పీల్చుకుని, సేదదీరి ఆవిడ వచ్చాక అప్పుడే రెట్టింపు ఉత్సాహంతో చేయవచ్చు కదాన్నారు. అంతే దానికే వీళ్లంతా గగ్గోలు పెట్టేశారు.

రోశయ్యగారు విరామం అన్నదాన్ని విరమించడంగా అర్థం లాగారు. విరమించమనడానికి రోశయ్య ఎవడు అంటూ గొడవ చేశారు. అదేమిటో గాని నినాదాల రొదలో చెవులు సరిగ్గా వినబడడం మానేశాయి వీళ్లకు. ఆ మధ్య పయ్యావుల కేశవ్ హై కమాండ్ తన అనిశ్చితితో రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తోంది అని నిందిస్తూ ''హై కమాండ్‌పై ఆత్మాహుతి దాడి చేస్తా'' అంటూ స్టేటుమెంటు యిచ్చారు. అలా అనడం చాలా ఘోరం. ఆత్మహత్యల గురించి, ఆత్మాహుతి దాడుల గురించి నాయకులు మాట్లాడనే రాదు. వీళు యిలా మాట్లాడేసి యితరులను రెచ్చగొడతారు. ఎవడో అమాయకుడు అమలు చేసి చూపుతాడు. వీళ్లు వెళ్లి మొసలికన్నీళ్లు కార్చి వస్తారు. అలాటి స్టేటుమెంట్లను మీడియా బ్యాన్ చేసి వుంటే బాగుంటుంది. కానీ మీడియా కవర్ చేసింది. దాన్ని టిఉద్యమకారులు వక్రీకరించి 'తెలంగాణావాదులపై ఆత్మాహుతి దాడి చేస్తానన్నాడు' అంటూ గగ్గోలు పెట్టేశారు. నేను చేస్తానన్నది హై కమాండ్‌పై... అని కేశవ్ మొత్తుకున్నా వినలేదు.

అలాగే మొన్న విజయవాడలో విభజనవాదులు సమావేశం పెడితే సమైక్యవాదులు వెళ్లి సమావేశం భగ్నం చేశారు. మళ్లీ అది కూడా తప్పు. ప్రజాస్వామ్యంలో కూడా ఎవరి వాదన వారు వినిపించే హక్కు లేకపోతే యింకెందుకు ఆ ప్రజాస్వామ్యం, బండకేసి కొట్టుకోవడానికి కాకపోతే ! అలా భగ్నం చేసినందుకు విమర్శించే హక్కు మీకూ నాకూ వుంది కానీ టిఉద్యమకారుల్లో చాలామందికి లేదు. ఎందుకంటే వాళ్లు సమైక్యవాదులు తెలంగాణలో సమావేశం పెట్టుకోవడానికి వీల్లేదని హుంకరిస్తున్నారు. ఆ మధ్య (అప్పట్లో) ఎన్నారై ఒకాయన తెలుగువారి మూలాల గురించి పుస్తకం రాసి ఆవిష్కరణ హైదరాబాదులో పెడితే నానా గలభా చేశారు. అటువంటివాళ్లకు ప్రజాస్వామ్యపు హక్కుల గురించి మాట్లాడే నైతికధైర్యం ఎక్కడిది? అయినా అటువంటి శషభిషలు పెట్టుకోని హరీష్‌రావు విజయవాడలో జరిగినదానిపై విరుచుకుపడ్డారు. పడుతూనే దానికి వేరే కలర్ పులిమారు. 'సమైక్యవాదులు తెలంగాణవాదులపై చేసిన దాడిని ఖండిస్తున్నా' అన్నారు. అయ్యా, అక్కడ సమైక్యవాదులు దాడి చేసిన విభజనవాదులపై ! అక్కడ ప్రత్యేకాంధ్ర వాదులూ వున్నారు, ప్రత్యేక తెలంగాణావాదులూ వున్నారు. మీరు ప్రత్యేకాంధ్రవాదులను గాలి కొదిలేసి, ప్రత్యేక తెలంగాణావాదులకు మాత్రమే నష్టం జరిగినట్లు మాట్లాడితే ఎలా?

కానీ మాట్లాడుతున్నారు. ఇప్పుడు రోశయ్యగారు విరామం యిమ్మనమంటే, విరమించమన్నారంటూ మాట తిప్పేసి ఆయనపై తిట్ల వర్షం కురిపించారు. గుత్తా సుఖేందర్ రెడ్డి యింకాస్త ముందుకు వెళ్లి డిసెంబరు 9 ప్రకటన అమలు కాకపోవడానికి కారణం రోశయ్యే అనేశారు. చిదంబరం అసెంబ్లీ తీర్మానం పాస్ చేసి పంపించండి అంటే రోశయ్యగారు చేయించలేదట. ఆయనా, చంద్రబాబు, చిరంజీవి కలిసి ఫోన్లు చేసి ఆంధ్రప్రాంతపు నాయకులచేత రాజీనామాలు చేయించారట. అందువలన రోశయ్యగారి కారణంగానే తెలంగాణ రాలేదట. తెలంగాణ రాకపోవడం చేత 600 మంది అమరులయ్యారట. అందువలన ఆ పాపమంతా రోశయ్యగారి నెత్తికే చుట్టాలట. ఇదీ గుత్తాగారి వాదన.

శనివారం ఆయన యీ ప్రకటన చేయగానే ఆదివారం ఎన్‌టివి వారు చర్చావేదికకు పిలిపి కూర్చోబెట్టారు. ఆయన అత్యుత్సాహంతో తన వాదన వినిపిస్తూండగానే రోశయ్యగారు లైన్‌లోకి వచ్చేశారు, అందర్నీ ఆశ్చర్యపరుస్తూ. 'గుత్తా గారు పెద్దవారు ఎందుకలా అన్నారో తెలియదు కానీ..' అంటూ తన వాదన వినిపించారు. 'అసెంబ్లీ తీర్మానం పాస్ చేయించడం వేరే ఎవరి తరమైనా అవుతుందో లేదో కానీ నా తరం మాత్రం కాదు. నేను ఆ విషయాన్ని సోనియాకు చెప్పాను. అప్పుడు చిదంబరం కూడా అక్కడే వున్నారు. ఆ తర్వాత మన్‌మోహన్‌కు కూడా చెప్పాను.'' అని క్లారిఫై చేశారు.

''రాష్ట్ర ఎసెంబ్లీలో తీర్మానం జరగకపోవడం వల్లనే ఏ నిర?యమూ తీసుకోలేకపోతున్నాం' అని చిదంబరం అన్నారే..'' అని గుత్తా అంటే ''ఎందుకలా అన్నాడో ఆయన్నే అడగండి. కానీ తీర్మానం పాస్ కాదు. ఎందుకంటే అసెంబ్లీ అంతా ప్రాంతాలవారీగా చీలిపోయింది. మూడింట రెండు వంతులు అటు వుండి అడ్డు చెపుతూంటే ఎవరు మాత్రం తీర్మానం పాస్ చేయించగలరు?'' అన్నాడాయన. లాజికలే కదా. అసెంబ్లీలో సమైక్యవాదుల సంఖ్య ఎక్కువగా వుందనే కదా, తెరాస యిన్నాళ్లనుండి అసెంబ్లీలో తీర్మానం గురించి పట్టుబట్టలేదు. వాళ్లు ఎంతసేపు జాతీయస్థాయిలో లాబీయింగ్, పార్లమెంటులో బిల్లు, అసెంబ్లీని అడగనక్కరలేకుండా నిర?యం అంటున్నది. ''తీర్మానం చేసి పంపిన రాష్ట్రాలను కూడా విభజించడం లేదు కదా, ఆ పాటి దానికి రాష్ట్రాలు తీర్మానం చేయడం దేనికి?'' అంటున్నారు.

తెలుగు వాళ్లే తేల్చుకోవాలి అని చిదంబరం మొన్న ప్రకటిస్తే కెసియార్ ఏమన్నారు? ''ఈ చిదంబరం, ఏకాంబరం చెప్పేవి సన్నాసి మాటలు. మేమే తేల్చుకుంటే మీ దగ్గరకు పంచాయితీకి ఎందుకు వస్తాం? విభజన వద్దనేవాళ్లు అసెంబ్లీలో మెజారిటీలో వుంటే మైనారిటీవారి ఆకాంక్షలు ఎన్నటికీ తీరవనేగా అంబేడ్కర్ రాజ్యాంగంలో మూడో సెక్షన్ పెట్టమన్నారు. రాష్ట్రాలను చీల్చే

అధికారం కేంద్రానిదే, వారే నిర?యం తీసుకోవాలి.” అని అత్యంత ఆవేశంగా చెప్పారు. ఎందుకంటే గ్రౌండ్ రియాలిటీ ఆయనకూ తెలుసు. విభజనపై అసెంబ్లీ తీర్మానం చేయాలనేది అయన ఊహ కానే కాదు. మరి డిసెంబరు 9 స్టేటుమెంటు జయశంకర్, కెసియార్ సంప్రదించుకుని డ్రాఫ్ట్ చేశారనుకుంటే దానిలో అసెంబ్లీ తీర్మానం సంగతి కెసియార్ ఎందుకు చొప్పించినట్లు? అంటే దాని అర్థం వీళ్ల ప్రతిపాదించిన స్టేటుమెంటులో చిదంబరం తన వంతు ఉప్పుకారం తను వేశారన్నమాట.

ఆ వెయ్యడానికి ముందు రోశయ్యగారు తన ఎదుట సోనియాతో చెప్తున్నది గమనంలో వుంచుకున్నారన్నమాట. అసెంబ్లీ తీర్మానం పాస్ చేయడం నా వల్ల కాదు అని ముఖ్యమంత్రే అంత గట్టిగా చెప్తూ వుంటే దాని గురించి చిదంబరం ఆ స్టేటుమెంటులో దాన్ని చొప్పించడం దేనికి? రాష్ట్ర విభజనకు అసెంబ్లీ తీర్మానం అవసరం కాదు కానీ ఎంతమంది విభజనకు అనుకూలమో, ఎంతమంది కాదో స్పష్టంగా బ్లాక్ అండ్ వైట్‌లో తేలే ప్రక్రియ అది. భావితరాలకు అది చర్చకు పనికి వస్తుంది.

ఇప్పుడు 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తెలంగాణ ప్రజల మనోభీష్టానికి వ్యతిరేకంగా జరిగింది అని వాదిస్తున్నవారి తో విభేదించేవారు ఆ నాటి ప్రజాప్రతినిధులు పాల్గొన్న అసెంబ్లీ తీర్మానం ముందు పెడుతున్నారు కదా. ఎంతమంది ఔనన్నారో, ఎంతమంది కాదన్నారో గోడమీది రాతలా తెలుస్తోంది కదా. అలాగే రేపటి చరిత్రకారులకు యీనాటి విభజనకు ఎంతమంది అనుకూలమో, ఎంతమంది ప్రతికూలమో తెలిసిపోతుంది. అందుకే ఓ తీర్మానం చేయించి పెట్టుకుంటే మంచిదనుకున్నారు లాగుంది చిదంబరం. అందుకే కెసియార్ చెప్పకపోయినా దాన్ని తన ప్రకటనలో చొప్పించివుంటారు. అప్పటికే రోశయ్య ‘ఈ తీర్మానాలు నా వల్ల కావు’ అని చెప్పారంటున్నారు.

‘ఎవరడ్డొచ్చినా చేయించి తీరతాను’ అని రోశయ్యగారన్నారంటే సందేహించాలి తప్ప నా వల్ల కాదని రోశయ్య గారన్నారంటే సుబ్భరంగా నమ్మవచ్చు. ఎందుకంటే దారినపోయే దానయ్యనని ఆయన చెప్పుకుంటూనే వున్నారు. సిఎం సీట్లో ఆయన కూర్చున్నట్టే వుండేవారు కారు. ఎప్పుడు లెమ్మన్నా లేవడానికి వీలుగా స్టూలు మీద కూర్చున్నట్టుండేవారు. అందువలన అసెంబ్లీ తీర్మానం నా వల్ల కాదని చెప్పారంటే కామన్‌సెన్స్ వున్నవారెవరైనా నమ్మవచ్చు. రోశయ్య చెప్పినదేమిటి? “నేను ఆ మాట చెప్పగానే చిదంబరంగారు ‘అయితే మీరు హైదరాబాదు వెళ్లిపోండి. మీరు వెళ్లాక మేం ఫోన్ చేస్తాం’ అన్నారట. ఈయన విమానం ఎక్కాడు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగగానే చిదంబరం గారి స్టేటుమెంటు గురించి చెప్తే యీయన ఆశ్చర్యపడ్డాడట.

ఆ ముక్క 2009 డిసెంబరులో కూడా చెప్పాడాయన – ‘నాకు చూపించిన స్టేటుమెంటు వేరు, చిదంబరం రిలీజ్ చేసిన స్టేటుమెంటు వేరు’ అని. అందువలన యిప్పుడు ఆయన మాట మార్చింది లేదు. ఇప్పుడు కొత్తగా చెప్పినదేమిటంటే ‘అసెంబ్లీ తీర్మానం పాస్ చేయించే విషయంలో సాధ్యాసాధ్యాల గురించి సోనియా వద్ద చర్చ జరిగింది’ అని. శాసనసభాపక్ష నాయకుడే నా వల్ల కాదు అని చెప్పాక చిదంబరం తన ప్రకటనలో తీర్మానం పాస్ చేయాలి అని మెలిక పెట్టారంటే కావాలనే మడతపేచీ పెట్టినట్టయింది. అబ్బే కాదంటారా, ఆ తర్వాతైనా వాళ్లు తీర్మానం చేయించే ప్రయత్నం చేశారా, వీరప్ప మొయిలీని హైదరాబాదుకి తోలి అందరితో మాట్లాడించారా? లేదే ! అందువలన తిడితేగిడితే అధిష్టానాన్ని తిట్టాలి కానీ రోశయ్యగార్ని తిట్టేం ప్రయోజనం?

కానీ గుత్తాకు లోకువగా దొరికినది రోశయ్య. ఆ రోజు టీవీలో రోశయ్యగారు లైన్‌లోకి వచ్చినపుడు ‘మీరు, బాబు, చిరంజీవి కలిసి ఆంధ్ర ఎమ్మెల్యేలకు, ఎంపీలకు చెప్పి రిజైన్ చేయించారని డియల్ రవీంద్రారెడ్డి నాకు ఆరుగురు ఎంపీల ఎదుట చెప్పాడు’ అన్నారు గుత్తా. “కావాలంటే ఏ దేవుడి గుడిలో ప్రమాణం చేయమంటే చేస్తా. నేనా నీచమైన పని చేయలేదు” అన్నారు రోశయ్య. నిజానికి చిరంజీవికి తన పార్టీ ఎమ్మెల్యేలతోనే సంబంధ బాంధవ్యాలు తక్కువ. రోశయ్య కెరియర్ మొత్తం చూస్తే డైరక్టుగా యింత చురుకైన పాత్ర తీసుకున్న సందర్భమే లేదు. తన చేతికి మట్టి అంటకుండా చూసుకునే మనిషి. ఫోన్లంటూ చేస్తే బాబు చేయించి వుండవచ్చు. అదీ డైరక్టుగా కాదు, ఎవరిచేతనో, ‘ఇలా చేస్తే బాగుంటుందేమో’ అన్నట్టు చేయించవచ్చు తప్ప డైరక్టుగా బయటపడేటంత తెలివితక్కువ నాయకుడు కాదాయన. మరి డియల్ రవీంద్రారెడ్డి ఎందుకలా అన్నారో మనం చెప్పలేం.

గుత్తాగారు అవేళ సాయంత్రం మీడియాతో మాట్లాడినప్పుడు మళ్లీ డియల్ మాట ఎత్తలేదు. రోశయ్య ఫోన్ చేశారనే పాట తప్ప ! మరి యీ లోపున ఏ సమీకరణాలు మారాయో తెలియదు. పొద్దున్న మాత్రం టీవీ ఛానెల్‌లో రోశయ్యగారు ఇలా ఫ్రంటల్ ఎటాక్ యిచ్చేసరికి గుత్తా కంగారుపడ్డారు. “వయసులో పెద్దాయన ఆత్మసాక్షిగా అంటూ ఆయన చెప్తున్నారు కదా..”అంటూ నీళ్లు నమిలారు. “వయసు గురించి కాదు, ఏ దేవుడి గుడికైనా సరే నేను వస్తా, ఒట్టేస్తా..” అని రోశయ్య రెచ్చిపోయారు. ఇదే అదనని కొమ్మినేని “మరి గుత్తాగారూ, ఎపాలజీ చెప్తారా?” అని ఎక్కవేశారు. గుత్తాగారు పుచ్చుబతాణీ నమిలిన వేదాంతిలా నవ్వేసి అక్కడ వదిలేశారు. ప్రోగ్రాం పది నిమిషాలు ఆలస్యంగా ముగిసింది.

తర్వాత గుత్తా ఏమాలోచించుకున్నారో ఏమో, “అసెంబ్లీలో 7 వ తారీకున తెలంగాణ యివ్వాలని అందరూ తీర్మానం చేసి పంపారు కదా, అలాటప్పుడు మళ్లీ పెడితే తీర్మానం వీగిపోతుందని రోశయ్య కలగన్నారా? ఆయనే దోషి” అంటూ మీడియా ముందు పాత ఆరోపణలే చేశారు. రోశయ్యగారు లైన్‌లోకి వచ్చినపుడే అడిగి వుండాల్సింది అదేదో. అయినా ఆయన అడగనక్కరలేదు. నేనైనా చెపుతాను. 7 వ తారీకు తీర్మానం వట్టి బోగస్ అని ఆబాలగోపాలానికి తెలుసు. ‘తెలంగాణ యిచ్చారా, చచ్చారా, ఏదో మనం తీర్మానం చేసేసి తోసేస్తే తప్పు ఢిల్లీవాళ్ల మీద పడి వుంటుంది’ అనే ఉద్దేశంతోనే అందరూ తలూపారని అందరికీ తెలుసు. వేరే ఎవరో ఎందుకు, డిసెంబరు 9 ప్రకటన వచ్చేదాకా టి కాంగ్రెస్ నాయకులు మాత్రం యాక్టివ్‌గా వున్నారా? తెలంగాణ వస్తోందనగానే

అందరూ ఆ బస్సెక్కబోతున్నారు. ఇప్పుడు 14 ఎఫ్ రద్దు గురించి చూడండి, దానివలన నష్టపోయే జిల్లాల ప్రతినిథులు సైతం ఆలోచించకుండా రద్దు చేయండి అంటూ తీర్మానం పాస్ చేసేశారు. ఇప్పుడు కేంద్రం అది పెట్టుకుని రాష్ట్రపతికి సిఫార్సు చేయబోతోంది. అర్జంటుగా కొందరు నాలుకలు కరిచేసుకుని రాష్ట్రపతికి పిటిషన్లు పెట్టబోతున్నారు. ఈ తెలివి అప్పుడుండాలి. ఏం జరగదులే, తెలంగాణావార్ని ఎలాగోలా ఏమార్చేద్దాంలే అనే దురూహ ఎందుకు?

డిసెంబరు 7 తీర్మానం పాసయింది కదాని తెలంగాణ నిజంగా యిచ్చేయాలనే తీర్మానం పాస్ చేయించగలం అని రోశయ్యగారు అనుకుంటే ఆయనకంటె మూరు?డు మరొకడు వుండడు. అంతెందుకు అది జరిగి 20 నెలలయింది కదా, యిప్పుడు పాస్ చేయించగలరా? గుత్తాకే కాదు, మరెవరికైనా ఆ దమ్ముందా? ఆంధ్ర ప్రాంతీయులూ, మీరూ ఓ చోట కూర్చుని మీరూ మీరూ తేల్చుకోండి అంటే చిదంబరం అంటే యింత పొడుగున కోపం వచ్చేసిందే, మాకే అంత సఖ్యత వుంటే మీ దగ్గరకు పంచాయితీకి ఎందుకు వస్తాం? అంటూ.. మరి అసెంబ్లీలో తీర్మానం పాస్ కావడానికి అనుకూలంగా ఓట్లేయండి ప్లీజ్ అని వాళ్లని అడగగలరా?

వాళ్లని బతిమాలే పనేముంది? పార్టీలన్నీ విప్ జారీ చేస్తే చచ్చినట్టు ఓటేసేవారు అంటున్నారు గుత్తా. మొన్నటికి మొన్న పార్లమెంటులో కాంగ్రెస్ విప్ జారీ చేస్తే ధిక్కరించి గైరు హాజరైన పెద్దమనిషి యిలా మాట్లాడితే ఏమనుకోవాలి? ఎలా నవ్వాలి? ఏం, మీకు వచ్చిన విద్య అవతలివాళ్లకు రాదా? ఇక చంద్రబాబు విప్ జారీ చేస్తారా? ఇప్పటికీ ఆయన రెండు కళ్ల సిద్ధాంతం వదలలేదు. 'రాష్ట్రవిభజన ఎలా వుండాలో మాతో చర్చలు చేసి మా సలహా తీసుకుని ఫైనల్‌గా నిర?యం తీసుకుంటారనుకున్నాం, అలాటిది ఏ చర్చాలేకుండా మేమెందుకు ఒప్పుకుంటాం?' అని డిసెంబరు 10 న ప్రకటన చేసిన పెద్దమనిషి మర్నాడు ఎసెంబ్లీలో అందరూ విభజనకు ఓటేసేయండి అని పార్టీ విప్ జారీ చేయిస్తారా?

ఇదంతా జరగని పని అని మెడకాయ మీద తలకాయ వున్నవాళ్లందరికీ తెలుసు. అయినా తెలంగాణ వచ్చేస్తుంటే రోశయ్యగారు ఏదో సైంధవుడిలా అడ్డుపడిపోయారని నిందించడం ఉక్రోషంతోనే తప్ప వేరే దేనితోనూ కాదు. ఆ ఉక్రోషం చేతకానితనంలోంచి ఉదవించింది. తాము రాజీనామాలు చేసినా, దీక్షలు చేసినా, ఏం చేసినా హై కమాండ్ పట్టించుకోవడం లేదన్న ఆక్రోశంలోంచి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో ఆలోచించి ధైర్యంగా నిర?యం తీసుకుని అమలు చేయండి. అంతేగాని దారినపోయే దానయ్య.. సారీ.. రోశయ్యగారి మీద పడి ఘొల్లుమనడం హాస్యాస్పదం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**

**ఆగస్టు 16** **ఎమ్బీయస్ : శభాష్ సుష్మా**

పార్లమెంటులో ఉపన్యాసం సందర్భంగా తెలంగాణ కోసం ఆత్మహత్యలు చేసుకోకండి అని తెలుగులో విజ్ఞప్తి చేసిన సుష్మా స్వరాజ్ తన ట్విట్టర్‌లో "ఇదిగో మీరు యికపై ఆత్మహత్యలు చేసుకుంటే, నేను తెలంగాణ గురించి కలగజేసుకోనంతే.." అని బెదిరించడం చాలా గొప్పగా, మిక్కిలి ఆత్మీయంగా, ఆర్ద్రంగా అనిపించింది. తెలంగాణ గురించి యిప్పుడు జాతీయ స్థాయిలో పెద్ద దిక్కు సుష్మాయే. ప్రజావాణి వినిపించవలసిన ఎంపీలందరూ రాజీనామాలు చేసి అటూ యిటూ తిరుగుతున్నారు. బిజెపియే తెలంగాణా యిస్యూని భుజాన్న వేసుకుంది.

జాతీయ స్థాయిలో తెలంగాణకు మద్దతు యిస్తున్న పార్టీలు అజిత్ సింగ్ పార్టీ, సిపిఐ, బిజెపి. మొదటి రెండింటికి ఠికాణా లేదు. బలం వున్నది బిజెపికే. వచ్చే ఎన్నికలలో బిజెపికి స్వంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగితే తెలంగాణ వచ్చినా ఆశ్చర్యపడనక్కరలేదు. ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడితే మాత్రం డౌటే ! శివసేన వంటిది విదర్భ యిస్యూ వస్తుందని తెలంగాణ వద్దులే అనేయవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ గురించి పోరాడుతున్నది – బిజెపి, దాని అనుబంధ సంస్థలైన ఆరెస్సెస్, ఎబివిపి. బిజెపిలో తక్కిన అందరి కంటె సుష్మా స్వరాజ్ తెలంగాణాతో బాగా ఐడెంటిఫై అయ్యారు. బోనాల సంగతి ఎవరూ చెప్పలేదేమో కానీ లేకపోతే ఆవిడా విజయశాంతిలాగానే బోనాలు ఎత్తుకుని వచ్చి, వెండిబిందెల మొక్కు మొక్కివుండేవారు. అలాటి సుష్మా యీ రోజు ఆత్మహత్యలు చేసుకునేవారికి వార్నింగ్ యిచ్చారు.

ఇప్పటిదాకా టిఉద్యమకారులు చేస్తున్నదేమిటి? ఆత్మహత్యలు చేసుకోకండి అని విజ్ఞప్తి చేయడం, మళ్లీ ఎవరైనా చావగానే పొలోమని అక్కడకు వెళ్లి అతన్ని యింద్రుడు, చంద్రుడు అని పొగడడం. అతని చావును గ్లోరిఫై చేసి, నీవు చూపిన బాటలో నడుస్తాం, నువ్వు కన్న కలలను మేం నెరవేర్చి నీకు రక్తతర్పణం చేస్తాం. సూర్యచంద్రులున్నంతకాలం నీ పేరు నిలిచిపోతుంది. నీ త్యాగం వ ృథాగా పోదు. నువ్వు చచ్చి సాధించబోతున్న తెలంగాణలో బతికి మేం సుఖాలను అనుభవిస్తాం. నీ చావుకి బాధ్యత వహించవలసినది సీమాంధ్రులే ! అని చెప్తూ వాళ్ల అమ్మానాన్నలను చూసి "ఇటువంటివాణ్ని కన్న మీ జన్మ ధన్యం. మీకు ఎలక్షన్‌లో టిక్కెట్లు యివ్వలేం కానీ ఈ సారి యీ ఊరిలో పెట్టే సమావేశంలో ఓ వేదికకు మీ వాడి పేరే పెడతాం... " ఇదీ వరస !

ఆత్మహత్య చేసుకుందామా లేదా అని వూగిసలాడుతున్న అమాయకులు (ఆత్మహత్య చేసుకుంటున్నది అమాయకులే, అందులో సందేహం లేదు, ఇంగ్లీషులో చెప్పాలంటే మిస్‌గైడెడ్) యిటువంటివి చూసి యిన్‌స్పయిరవుతారు. ఆత్మహత్య చేసుకుంటే యింత పేరు ఉత్తినే వచ్చిపడుతోంది కదా అనుకుంటారు. ఏ పేపర్లో చూసినా మన పేరే, మన ఫోటోయే. పోయేది ప్రాణం ఒక్కటే కదా. ఇలా కాకిలా కలకాలం బతికే వేస్టు. హంసలా తక్కువకాలం బతికి ఎక్కువ పేరు తెచ్చుకోవాలి అనుకుని చావు వైపు అడుగులు వేస్తున్నారు.

టిఉద్యమకారులకు అవి చాలా అనువుగా వున్నాయి. 2001లో ఉద్యమం ప్రారంభమైన దగ్గర్నుంచీ కెసియార్ – వెనుకబాటుతనం, వెనుకబాటుతనం అంటూ పాడుతూ వచ్చారు. దాన్ని అప్పట్లో అధికారంలో వున్న బాబు కానీ, తర్వాత వచ్చిన వైయస్ గానీ ఖండించనే లేదు. డిసెంబరు 9 తర్వాతనే అందరూ మేల్కొన్నారు. అంకెలు బయటకు లాగారు. క ృష? కమిటీ వచ్చినపుడు గణాంకాల కార్యాలయం ఎక్కడుందో వెతికి, రికార్డు రూము బూజులు దులిపి ప్రతీదానిపై వివరాలు యిచ్చారు. చూస్తే తెలంగాణ కంటె వెనుకబడిన ప్రాంతాలు చాలా కనబడ్డాయి.

ఇక అప్పట్నుంచి ఆత్మగౌరవం, స్వయంపాలన అనే నినాదం పెరిగింది. తప్పుడు లెక్కలతో అవతలివాళ్లను దోపిడీ దొంగలని అన్నప్పుడు వాళ్ల గౌరవాన్ని మంట కలిపినవాళ్లకు ఆత్మగౌరవం గురించి మాట్లాడే హక్కు వుంటుందా? పైగా ప్రజాస్వామ్యంలో స్వయంపాలన కాక మరేముంది? మీ నియోజకవర్గంలో ఓటర్లే కదా మీరు ఎన్నుకున్నది? ఏ జిల్లావాళ్లు ఆ జిల్లాలోనే ఎంపిక అవాలని కూడా ఏమీ లేదు కదా ! అలా అయితే మెదక్‌కు చెందిన కెసియార్‌ను మేమెందుకు ఎన్నుకోవాలి అని కరీంనగర్, మెహబూబ్‌నగర్‌వాళ్లు అనేవారుగా! మద్రాసులో పుట్టి పెరిగిన విజయశాంతిని మేమెందుకు ఎన్నుకోవాలి అని మెదక్‌వాళ్లు అనేవారుగా ! పోనీ ఎమర్జన్సీ టైములాగ ఎన్నికలు వాయిదా వేసి, ఆంధ్ర అధికారులను నెత్తిమీద కూర్చోబెడితే 'మాకు స్వయంపాలన కావాలి' అని గోలే చేస్తే అర్థం వుంది. కానీ ఎప్పటికప్పుడు జెడ్‌పిటిసి, ఎంపిటిసి స్థాయి నుండి ఎన్నికలు జరుగుతూనే వున్నాయి. తెరాస గెలిచిన సీట్లు నానాటికి తీసికట్టు అవుతూనే వున్నాయి కదాని స్వయంపాలన లేదంటే ఎలా? స్వయంపాలన నినాదం కూడా క్లిక్ కాలేదని ఈ ఆత్మహత్యల నినాదం మొదలు పెట్టారు.

నిరాశానిస్ప ృహలతో యువత ఆత్మహత్యలు చేసుకుంటోంది కాబట్టి వారి బలిదానం వూరికే పోకూడదు కాబట్టి తెలంగాణ యివ్వాలి అని కొత్తపాట. అసలు వాళ్లకు ఆశలు రేకెత్తించింది తర్వాత నిరాశకు గురిచేసినది ఎవరు? తెలంగాణ యిదిగో వచ్చేస్తోంది, అదిగో వచ్చేస్తోంది, ఆర్నెల్లు, మూణ్నెళ్లు, సోనియా నా చెవిలో చెప్పింది 'రావ్‌జీ, వచ్చే దీపావళి మీ తెలంగాణలోనే...' అని.. చెప్పి వుత్తిపుణ్యానికి ఊరించినదెవరు? మొన్నటికి మొన్న 'రెండు వారాల్లో తెలంగాణపై నిర?యం వెలువడుతోందని ఢిల్లీ చిలక నాకు చెవిలో చెప్పింది' అని ఆశల పల్లకి ఎక్కించారు. రెండు వారాలు కాదు మూడున్నర వారాలు గడిచాయి. ఢిల్లీ చిలక ఎక్కడ వాలి ఆగిపోయిందో తెలియదు.

ఆ స్టేటుమెంటు రాగానే 'ఆయన అలా ఎపుడూ చెప్తూనే వుంటాడులే' అని టీవీ చర్చల్లో ఎవరో తీసి పారేస్తే, ఓ తెరాస నాయకుడికి కోపం వచ్చేసింది. 'ఆయన కేంద్రంలో మంత్రిగా చేశారన్నమాట మర్చిపోకండి. ఆ సమయంలో ఆయనకు అనేకమంది ఉన్నతాధికారులతో సంబంధాలు ఏర్పడ్డాయి. ఎంపీగా కూడా చాలా నెలలు ఆయన ఢిల్లీలోనే మకాం వేసి వున్నపుడు వారందరితో టచ్‌లో వున్నారు. ఆయన చెప్పారంటే అయి తీరుతుంది' అని గట్టిగా వాదించారు. మొన్నటిదాకా సిఎంగా వున్న రోశయ్యగారికే దిక్కు లేదని చూస్తూనే వున్నాం. ఎప్పుడో 2004లో కొన్ని నెలలపాటు మంత్రిగా చేసినంత మాత్రాన అధికారులు మన్నించేస్తారనుకోవడం అవివేకం. అందునా ఢిల్లీ వాళ్లు మరీ ముదురు కేసులు. అక్కడ అధికార వర్గాల్లో పర్శనల్ టచ్ అస్సలు వుండదు. ఇవన్నీ తెలిసి కూడా ఈసారైనా ఆయన చెప్పినది నిజమౌతుందేమో చూదాం అని నాబోటి వాడు ఎటూ మాట్లాడకుండా గుడ్లప్పగించి చూస్తూ కూర్చున్నాడు. చివరికి ఏమైంది? అంతా ఉత్తుత్తిదే అయింది. ఉస్సురనిపించారు. తెలంగాణ కోసం తపించిపోతున్న యువకుడు ఉ స్సురనుకుని కూర్చోడు కదా, ఉసురు తీసుకుంటాడు. 'తెలంగాణ వచ్చుడో, కెసియార్ చచ్చుడో' అంటూ నినాదాలు ఆయన వంతు, 'చచ్చుడు' యీ పిల్లల వంతు ! ఎంత ఘోరం

ఇక కాంగ్రెస్‌వాళ్లు. 'మేం తెలంగాణ తెస్తాం. తెచ్చేది మేమే, యిచ్చేది మేమే' అంటున్నారు. కానీ వాళ్లకు తెలియదా అక్కడ యిచ్చే పరిస్థితి వుందో లేదో ! తెలంగాణ ప్రజాప్రతినిధులు దాదాపు అందరూ రాజీనామా చేసి ఐదువారాలైంది. ఢిల్లీ వారికి చీమ కుట్టినట్టుందా? వీరిని పిలిచి పీటవేసి తెలంగాణ వాయినం చేతిలో పెట్టారా? రెండు నెలలు, మూడు నెలలు.. ఏకాభిప్రాయం రావాలి,, దేశంలో తక్కిన పార్టీలతో కూడా మాట్లాడాలి.. అంతకుముందు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల వారూ మాట్లాడుకోవాలి..యిలా అంటూంటే వాళ్లు తెలంగాణ యిచ్చేస్తారని వీళ్లు నమ్ముతున్నారా? వాళ్లు నమ్ముతున్నారని మనం నమ్మాలా? ఎంత మోసం, ఎంత దగా ! పాపం ఆ పిల్లలు నమ్ముతున్నారు కదా, నమ్మి ప్రాణాలు తీసుకుంటున్నారు కదా !

ప్రతీ టి ఉద్యమకారుడికీ ఈ ఆత్మహత్యలే మెయిన్ టాపిక్ ! '600 మంది పోయారు, సీమాంధ్రుల రక్తదాహం తీరలేదు, పొమ్మని మొహం మీద ఉమ్మేసినా వెళ్లటం లేదు. ఇంకా ఎంతమంది రక్తమాంసాలు భుజిస్తారు?' అని పాట పాడుతున్నారు. మొన్న క్విట్ తెలంగాణా ఉద్యమం చేస్తూ కవితగారు 700 మంది అనేశారు. చెప్పానుగా, మన కెవ్వరికీ గణాంకాల పట్ల గౌరవం లేదు. వాస్తవాల పట్ల మర్యాద లేదు. మొన్నటిదాకా 600 మంది అన్నారు. ఆ తర్వాత ఓ పదిమంది పోయారేమో వెంటనే యీవిడ 700 చేశారు. హరీశ్‌రావు యీ అంకెకు లాస్టియరే వచ్చేశారు.

రాజకీయనాయకులు యిలా అంకెల గారడీ చేయడం కొత్త కాదు కానీ, జడ్జిగారే యీ అంకెలు ప్రస్తావించడం నాకు వింతగా తోచింది. 'జస్టిస్ నరసింహారెడ్డిగారు తీర్పు యిస్తూ ఫలానా విధంగా కొన్ని విషయాలు బయటపెట్టారట, అలా ఎలా యిస్తారు?' అంటూ అడుసుమల్లి జయప్రకాశ్ కేసు పెడితే ఆయనపై జస్టిస్ మండిపడ్డారు – ''న్యూస్ పేపరు రిపోర్టులు చదివి వాటి ఆధారంగా కేసు ఎలా పెడతారు?' అంటూ. అంతకుముందు ఆయన యిచ్చిన తీర్పులోనే 'ఉద్యమంలో 600 మంది ఆత్మహత్య చేసుకున్నా క

ృష? కమిటీ పరిగణనలోకి తీసుకోకుండా... ' అంటూ వ్యాఖ్యలు చేశారు.

ఆయనకి ఈ 600 అంకె ఎక్కణ్నుంచి వచ్చింది? టిఉద్యమకారులు యిచ్చిన స్టేటుమెంట్లు న్యూస్ పేపర్లో చదివే కదా! ఆయన వెళ్లి ప్రతీ కేసు యిన్వెస్టిగేట్ చేయలేదు కదా! ఇలా వుంటోంది గందరగోళం ! జడ్జిగారు కూడా ఆత్మహత్యలకు యింత ప్రాధాన్యత యిచ్చి, కమిటీ రికమెండేషన్ యివ్వడంలో అదొక అంశంగా తీసుకోవాలంటే ఏం చెప్పాలి! దానిపై ఫుల్ బెంచ్ స్టే యిచ్చినా రాజకీయనాయకులు ఆత్మహత్యల అంశం వాడుకోవడం మానేస్తారా? ఆత్మహత్యలపై ఆధారపడి తెలంగాణపై నిర?యం తీసుకోవాలట !

ఆత్మహత్యలకు యింత ప్రాధాన్యం యిస్తున్న నాయకుల మధ్య సుష్మా నిజంగా ఓ వెలుగు వెలుగుతున్నారు. "ఆత్మహత్యలు చేసుకుంటే తెలంగాణ రాదు సరికదా, నేను నాయకత్వం నుండి తప్పుకుంటా" అని చెప్తున్నారు. ప్రతి నాయకుడూ యిలా చెప్పాలి. అప్పుడు ఆత్మహత్యలు ఆగుతాయి. కానీ మనవాళ్లు చూడండి – పార్లమెంటులో ఆత్మహత్య చేసుకుంటా, గేటుకి ఉరేసుకుంటా, మానవబాంబు నౌతా.. యివీ కూతలు. కెసియారే ఇంతదాకా వచ్చి యిప్పుడు తెలంగాణ రాకపోతే విషం తాగడం మేలు అన్నారు యీ మధ్యే ! అనవలసిన మాటలా? ఆయన నిజంగానే విషం తాగుతారా? తాగరు కదా !

కానీ యువత మైండ్‌లో ఒక నెగటివ్ థాట్ ప్రవేశపెట్టారు కదా, తెలంగాణ రాకపోతే బతకడం వ్యర్థం అని ! పరీక్ష పాసవకపోతే బతకడం వ్యర్థం, ఉద్యోగం రాకపోతే వ్యర్థం, భార్య విడిచి వెళ్లిపోతే వ్యర్థం.. యిలా ప్రతిదానికీ నిరాశ పడి రైలుపట్టాల వైపు అడుగులేస్తున్న యువతకు యీ రోజుల్లో యిలా కూడా చెప్పడం ఎంత బాధ్యతారాహిత్యం ! మీ పిల్లలకు యిదే చెప్తారా?

పార్టీ అధ్యక్షుడే యిలా మాట్లాడితే ఎమ్మెల్యేలు యింకెలా మాట్లాడతారు ! తెరాస ఎమ్మెల్యేలు యిద్దరు ప్రకటించారు – 17 వ తారీకులోపున ఆంధ్రులు తెలంగాణ విడిచి వెళ్లకపోతే ఆత్మాహుతి దాడులు చేస్తారట. నిజంగా యిది జరిగే పనేనా? నిజంగా ఆంధ్రులు  తెలంగాణ విడిచి వెళ్లడానికి యింకా ఎంతో కథ నడవాలి. పరిస్థితి దుతరేం కావాలి. పదేళ్లగా మాటలలో చూపిస్తున్న దౌర్జన్యం చేతల్లోకి మారాలి. అప్పుడు భయభ్రాంతులవుతారు. అది యింకో వారం రోజుల్లో కాబోతోందని ఎవరూ అనుకోరు. కానీ వీళ్లు అలా అన్నారు. అంటారు కానీ ఆ రోజుకి ఎక్కడో హ్యేపీగా బతికే వుంటారు (ఉండాలి కూడా) కానీ ఏ అమాయకుడో వీళ్ల మాటల్ని అమలు చేయబోతాడు. అప్పుడు లుగుతుంది దుఃఖం. వాళ్ల అమ్మానాన్నలకు ఒళ్లుమండి వీళ్లకు ఏ రాత్రో వచ్చి బాంబులు కట్టేయాలి. వీళ్లతో బాటు ఆ పయ్యావుల కేశవ్‌కు కూడా. కట్టేసి ఢిల్లీ తోలేసి, ఎవర్ని చంపుతావో చంపేయ్ అని చెప్పాలి.

సుష్మా స్వరాజ్ యింత గట్టిగా చెప్పినా చనిపోయిన తర్వాతైనా పేరు వస్తుందన్న భ్రమలో ఎవరైనా ఆత్మహత్యలు చేసుకుందామనుకుంటే ఒక సూచన. చేసుకునేది తెలంగాణలోనే చేసుకోండి. ఢిల్లీలో చేసుకుని యాదిరెడ్డి దెబ్బ తినేశాడు. అది ఆత్మహత్య అవునా కాదా అని ఢిల్లీ పోలీసులు తెగ పరిశోధించేస్తున్నారు. ఆ జేబులో వున్న ఉత్తరం అతను రాసినదా కాదా ఖచ్చితంగా చెప్పలేమంటున్నారు. పార్లమెంటులో సాక్షాత్తూ కేంద్ర హెూం మంత్రిగారి ద్వారా అనుమానాలు వ్యక్తం చేయించారు. అదే తెలంగాణలో అయితే పోలీసులకు యిలాటి సందేహాలు రావు. ఇక్కడ యిన్వెస్టిగేషన్ చేయరు. గుండెనొప్పితో పోయినా ఎవరైనా పట్టుకొచ్చి ఓ వుత్తరం పెడితే చాలు, అది తెలంగాణ ఆత్మహత్యల ఖాతాలో జమ అయిపోతుంది. వైయస్ చావుల జాబితా కూడా కాంగ్రెస్ నాయకులు వివాదాస్పదం చేయబోయారు, కానీ మళ్లీ వెనక్కి తగ్గారు. జగన్ చెప్పినంత మంది కాదు కానీ కాస్త తక్కువగా యింతమంది పోయారు అంటూ ఓ అంకె రిలీజ్ చేశారు. వైయస్ పేరుతో ఓట్లు దండుకోవాలిగా పాపం. అలాగే తెలంగాణ పేరుతో గెలవాలంటే వీళ్ల చావుల్ని ప్రశ్నించకూడదు. అదీ వాళ్ల ఫిలాసఫీ.

కానీ సుష్మా అటువంటి శషభిషలు పెట్టుకోకుండా నిర్ద్వంద్వంగా చెప్పింది – 'ఆత్మహత్యలు ఆపకపోతే ఐ ఆయ్ ఔటాఫ్ దిస్' అని. అందుకే హేట్సాఫ్. ఇది చూసి పార్లమెంటులో ఆవిడ ఉపన్యాసాన్ని సమర్థించారని అనుకోకండి. దాని గురించి మరోసారి. ..– **ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**

**ఆగస్టు 20**

## ఎమ్బీయస్ : 14 ఎఫ్ రద్దుపై నిరసనెందుకు?

14 ఎఫ్ రద్దు చేశాక తెలంగాణలో హర్షాతిరేకాలు, ఆంధ్రలో నిరసనలు అని వార్తలు వస్తున్నాయి. సమైక్యవాద విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. 17 జిల్లాలకు అన్యాయం జరుగుతుంది అంటున్నారు లగడపాటి. సుప్రీం కోర్టుకి వెళ్లి ఆపించేస్తా అంటున్నారు అడుసుమల్లి జయప్రకాశ్. రద్దు చేయమంటూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేశాక యిలా అల్లరి చేయడంలో నైతికత వుందా? లేనే లేదు. ఇలా అయితే అసెంబ్లీలో చేసిన ఏ తీర్మానానికీ విలువ వుండదు. బయట కుదుర్చుకున్న ఏ ఒప్పందానికీ కట్టుబడి వుంటారన్న నమ్మకం వుండదు.

అసెంబ్లీ తీర్మానం అంటే ఆషామాషీ కాదని డిసెంబరు 9 నాడే తెలిసిపోయింది. "మనకి లోకల్‌గా గొడవ లేకుండా వుంటుంది. ఏదో ఒక తీర్మానం చేసి కేంద్రం కోర్టులోకి బంతి నెట్టేస్తే వాళ్లే పడతారు. తప్పు వాళ్ల మీదే నెట్టేయచ్చు." అనే దురూహతో డిసెంబరు 7 న అందరూ కలిసి రాష్ట్రవిభజనకు సై అనేశారు. ఆ తర్వాత దాన్ని బేస్ చేసుకునే విభజిస్తాం అని అంటే  గొల్లుమన్నారు. "ఇంకా మాతో ఏదో చర్చిస్తారనుకున్నాం. అప్పటికప్పుడు అర్ధరాత్రి యిచ్చేస్తారనుకోలేదు" అంటూ బాబుతో సహా అడ్డగోలు వాదనకు

దిగారు. ఏం? ఆ ముక్క డిసెంబరు 7 నాడు చెప్పలేకపోయారా? ఇరుప్రాంతాలవారి మధ్యా చర్చలు జరిగి ఆమోదిస్తేనే.. అనే షరతు పెట్టి అంగీకారం తెలుపలేకపోయారా? తీరా ప్రకటన వచ్చాక వెనక్కి వెళ్లారు. అదే దగా అనిపించింది అందరికీ.

జరిగిందేదో జరిగింది, ఇక అప్పుణ్నుంచైనా జాగ్రత్తగా వుండాలి కదా. 14 ఎఫ్ రద్దుపై తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు కూలంకషంగా చర్చించాల్సింది. నాకు అర్థమైంది ఏమిటంటే – జోనల్ సిస్టమ్ పెట్టి ప్రతీ జోన్‌లోనే స్థానిక అభ్యర్థులకే ఓ స్థాయి వరకు ఉద్యోగాలు రిజర్వ్ చేసినా, రాజధానిలో కొన్ని కేటగిరీల ఉద్యోగాలు మాత్రం రాష్ట్రానికి అంతటికీ సంబంధించినవి కాబట్టి వాటికి యివి వర్తింప చేయలేదు. ఆ కేటగిరీలలో ఆరోది పోలీసు నియామకాలు. అదీ ఎస్సయి క్యాడర్ వరకే. (వాళ్లే తర్వాత పై స్థానాలకు ఎగబాకుతారనుకోండి.)

రాజధాని పోలీసులు అన్ని ప్రాంతాల వారినీ టాకిల్ చేయవలసి వుంటుంది. అక్కడ ఒకే ప్రాంతం వారు మాత్రమే వుంటే , పలపక్షం చూపించవచ్చు, శాంతిభద్రతలకు మంచిది కాదు అనే ఆలోచనతో వాటిని మినహాయించారు. ఫైన్. 'ఈ రూలు పెట్టి 35 ఏళ్లు అయింది కాబట్టి ఇక ఆ భయాలు అక్కరలేదు, కెసియార్ రంగం మీదకు వచ్చాక తెలుగు వారందరిలో సుహృదావేం విలసిల్లి అందరూ సోదరుల్లా వున్నారు, ప్రాంతీయ ద్వేషాలు లేవు కాబట్టి ఎత్తేద్దాం' అని అనుకుంటే మినహాయింపు ఎత్తేయవచ్చు. తప్పేమీ లేదు. అసెంబ్లీలో తీర్మానం ప్రస్తావనకు వచ్చినపుడు ఫలానా కారణం వలన, మారిన పరిస్థితుల వలన ఈ నిర?యం తీసుకుంటున్నాం అని చెప్పి, మనందరికీ దాని వెనుక లాజిక్ చెపితే ఇబ్బందే లేకపోవును. కానీ అదేం జరగలేదు. ఏదో యీ తీర్మానం చేసేస్తే తెలంగాణ వారిని ఉద్ధరించేట్లు పోజు కొట్టి చేసేశారు.

తీర్మానాన్ని కేంద్రానికి పంపించి చేతులు దులిపేసుకున్నారు. ఫాలో అప్ లేదు. ఇక ఆ తర్వాత ఎస్సయి పరీక్షలు పెడతామని ప్రభుత్వం, హత్తెరీ పెట్టడానికి వీల్లేదు అని టి నాయకులు.. హైదరాబాదులో వేకెన్సీలే లేనప్పుడు దానికీ దీనికీ లింకెందుకు అని అడిగితే, 'లేదు ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళతాయి, వాళ్లు అర్థం చేసుకోలేరు' అని నాయకులంటారు. ఎందుకు వెళతాయి? క్లియర్‌గా చెప్పడానికే కదా మీరున్నది ! సమాచార హక్కు చట్టం కింద ఎక్కడెక్కడో మూలమూల వున్న సమాచారాన్ని కూడా బయటకు లాగి వీధిలో పడేస్తున్నారే, ఈ వేకెన్సీలు ఫలానా జిల్లాలో వున్నాయి అని నోటిఫికేషన్ లోనే వున్నపుడు, దాన్ని చూపలేరా? కనీసం ప్రభుత్వం తరఫున ఒక ప్రకటన యివ్వలేదా? నాయకుల స్టేటుమెంట్లకు విలువ ఎప్పుడో పోయింది. ప్రభుత్వపరంగా యిచ్చి వుంటే జనం అర్థం చేసుకునేవారు.

మొత్తానికి యిది ఒక ప్రిస్టేజి క్వశ్చన్ అయిపోయింది. రోశయ్యగారు ఎస్సయి పరీక్షలు నిర్వహించి తీరతాను అంటూనే వాయిదా వేశారు. నా పరిపాలనలో నేను చేసిన ఒకే ఒక పొరబాటు అదే అన్నారు దిగిపోయాక. ఏం లాభం? ఇప్పుడు కిరణ్ కూడా పట్టుబట్టారు. చిదంబరంగారికి రిమైండ్ చేశారు. ఆయన పేచీని పెంచే రకమే కాబట్టి, మళ్లీ పంపండి అన్నాడు. ఎందుకు, యీ సారి ఏకగ్రీవం రాదని తెలిసి ! అలా చెప్పి టి నాయకులను మరింత మండించారు.

ఏమనుకున్నారో ఏమో చివరకు రద్దు చేసేశారు. ఇది కిరణ్‌కు విజయం, తెలంగాణ ఉద్యమానికి విజయం అని అడావుడి చేయడంతో కోస్తా, సీమల్లో విద్యార్థులు అలజడి మొదలుపెట్టారు. మాకు అన్యాయం జరిగిపోయిందో అంటూ. కానీ బొత్స, గాదె వెంకటరెడ్డి వంటి నాయకులు – 'తీర్మానం చేశాం కాబట్టి ఊరుకోవాలి' అంటూ మర్యాదగా మాట్లాడారు. లగడపాటి మాత్రం వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు – కోర్టులో నిలవదు అంటూ. నిలవదు అని తెలిసే వాళ్ల పార్టీ ఎమ్మెల్యేలు తీర్మానికి ఓటేశారా? అప్పుడు యీయన మాట్లాడలేదేం మరి?

అసలు కోస్తా, సీమల్లో ఆందోళన ఎందుకో నాకు అర్థం కావటం లేదు. ఇకపై హైదరాబాదు జోన్‌లో జరిగే పోలీసు నియామకాల్లో స్థానికులకు మాత్రమే ఎక్కువ ఛాన్సుంటుంది అనే కదా. అసలు 'స్థానికుడు' అంటే ఎవరు? అది ఎవరైనా ఆలోచించారా? తరచి చూశారా? ఏ పేపరైనా రాసిందా? (నేనైతే చూడలేదు). నాకు తెలిసున్నవారెవరూ ప్రభుత్వోద్యోగాలకై ప్రయత్నించటం లేదు. అందునా యిక్కడి పోలీసు వుద్యోగాలు వందల్లో వున్నపుడు దానికోసం అప్లయి చేసినవారు నాకు తెలిసే అవకాశం బాగా తక్కువ. అందుకని పోలీసు వారి వెబ్‌సైట్‌కి వెళ్లి స్థానిక అభ్యర్థి నిర్వచనం కోసం చూశాను.

నాకు అర్థమైనంతవరకు దానిలో వున్నది – స్థానిక అభ్యర్థి అనగా – కనీసం 7,8,9,10 క్లాసులు ఆ జోన్‌లో వరుసగా చదివినవాడు. వాడు ఆ నాలుగేళ్లు స్కూలుకి వెళ్లకుండా ప్రయివేటుగా చదివి పాసయిపోయాడనుకోండి. అప్పుడు ఆ నాలుగేళ్లు ఆ ప్రాంతంలో నివసించినట్టు ఎమ్మార్వో నుండి సర్టిఫికెట్టు తెచ్చుకుంటే సరిపోతుంది. ("Local Candidate" means a candidate for that Local area where he has studied in Educational Institution(s) for not less than f**our consecutive academic years prior to** and including the year in which he appeared for **SSC** or its equivalent examination. If however, he has not studied in any educational institution during the above four years period, it is enough if he has resided in that area which is claimed as his local area during the above said period.)

ఒకవేళ వరుసగా నాలుగేళ్లు ఓ చోట చదవలేదనుకోండి అప్పుడు 1 వ క్లాసు నుండి 10 వ క్లాసు దాకా ముక్కలు ముక్కలుగా ఏడేళ్లు ఎక్కడ చదివితే అక్కడ లోకల్ అవుతాడు. ?

తెలంగస్కూలులో చదవకుండా ఏ ఓపెన్ యూనివర్శిటీలోనే చదివేడనుకోండి అప్పుడు ఏడేళ్లు నివాసం వున్నట్టు ఎమ్మార్వో

సర్టిఫికెట్టు యిస్తే సరిపోతుంది. (if he has not studied during the above said period in any Educational Institution(s) the place of residence during the above period will be taken into consideration... a certificate should be obtained from an officer of the Revenue Department not below the rank of a Mandal Revenue Officer in independent charge of a Mandal)

ఇవన్నీ డైరక్టు రిక్రూట్‌మెంట్‌కే. వేరే చోట పోస్టు చేసి యిక్కడకు బదిలీ చేస్తే యివి వర్తించవు.

కోస్తా, సీమ ప్రజాప్రతినిథులు ఆజాద్‌కి చెప్పిన ప్రకారం గ్రేటర్ హైదరాబాదులో 50 లక్షలమంది కోస్తా, సీమలనుండి తరలివచ్చినవారున్నారు. (టి కాంగ్రెస్‌వాళ్లు 5 లక్షలే అన్నారు. స్థానికతకు వాళ్ల నిర్వచనం ఏమిటో మరి!) వారి పిల్లలలో కనీసం 70% మందైనా గత ఏడేళ్లగా వుంటున్నారని అనుకున్నా 35 లక్షలమంది స్థానికులవుతారు. వారిలో ఉద్యోగార్థులు లక్షల సంఖ్యలో వున్నా వారికి లాభం కలిగినట్లే కదా. వారు యిప్పటికీ కోస్తా, సీమ జిల్లాలలో వున్న వారితో, తెలంగాణ లోని సగం జిల్లాల వారితో పోటీ పడనక్కరలేకుండా ఉద్యోగాలు తెచ్చుకోవచ్చు కదా.

పై రూలులో జన్మస్థలం గురించి ప్రస్తావన ఎక్కడా లేదు. హైస్కూలు చదువు గురించే వుంది. తెలంగాణ ఉద్యమనాయకులలో ఎవరైనా వాళ్ల పిల్లవాణ్ని చదువుకోసం ఏ విజయవాడలోనో, నెల్లూరులోనో, వైజాగ్‌లోనో పెట్టి చదివిస్తే అతను స్థానికేతరుడే అవుతాడు, తెలంగాణలో పుట్టినా సరే ! వాళ్లు శాతవాహనుల కాలం నుండి తెలంగాణలోనే వున్నా సరే, లాభం లేదు. ఆ అబ్బాయికి స్థానికత కావాలంటే ఆయన వాళ్లబ్బాయిచేత ఓపెన్ యూనివర్శిటీలో ఓ డిగ్రీ చేయించి, ఎమ్మార్వోకి లంచం యిచ్చి ఏడేళ్లగా యిక్కడే వున్నాడని సర్టిఫికెట్టు తెచ్చుకోవలసి వుంటుంది.

అటువంటి మార్గం అంటూ ఒకటి ఏర్పరిస్తే చాలు, కోస్తా, సీమల నుండే కాదు, ఒడిస్సా, బిహార్‌ల నుండి ఉద్యోగాలకై హైదరాబాదు వచ్చిపడుతున్న కుర్రాళ్లు కూడా యిదే బాట పట్టి స్థానికులయిపోతారు. కష్టమంటారా? ఏమీ కాదు, బోగస్ రేషన్ కార్డులు దాదాపు కోటి వున్నాయని ప్రభుత్వమే ఒప్పుకుంటోంది కదా. రేషన్ కార్డు చూపించి సర్టిఫికెట్టు యిమ్మంటే ఎమ్మార్వో యివ్వక ఛస్తాడా? ఇది ఇక్కడే కాదు, ఏ జోన్‌లోనైనా జరుగుతుంది. ఎక్కడో మోనికా బేడికి దొంగ పాస్‌పోర్టులు యిచ్చిన 'సీమ' మనది. బంగ్లాదేశీయులకు రేషన్ కార్డులు యిచ్చేసిన నగరం మనది. రేపు ఆంధ్రరాష్ట్రం విడిపోయి కోస్టల్ కారిడార్‌లో ఉద్యోగాలు ఇబ్బడిముబ్బడిగా వస్తే తెలంగాణా నిరుద్యోగులు కూడా యిదే పని చేస్తారు. ఆంధ్ర ఉద్యోగులు లంచాలు తీసుకుని వాళ్లకు సర్టిఫికెట్లు యిస్తారు. వైజాగ్ స్టీలు ప్లాంట్‌లో, షిప్ యార్డులో అందరూ స్థానికులే వున్నారా? ఎందరు తెలుగేతరులు వుండి వుంటారు. ఎస్సీ, ఎస్టీ బోగస్ సర్టిఫికెట్లు ఎక్కడ , ఎన్ని యివ్వడం లేదు చెప్పండి.

పరిస్థితులు యింత అధ్వాన్నంగా వున్నపుడు వీటిని సవరించడానికి యువత నడుం బిగించాలి. అంతేకాని విభజన జరిగిపోయి కొత్త రాష్ట్రం ఏర్పడితే సమస్యలన్నీ తీరిపోతాయని అనుకోవడం అవివేకం. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయాక తెలుగువాళ్లందరూ మద్రాసు విడిచి వచ్చేశారా? అక్కడ స్థానికులై ఉద్యోగాలు సంపాదించుకోలేదా? ఇవన్నీ ఆలోచించకుండా 14 ఎఫ్ రద్దుపై తెలంగాణవారు గంతులేయడమూ, కోస్తా, సీమల్లో ఏదో కొంపమునిగిపోయినట్లు గోల చేయడమూ దేనికో నాకు బోధపడటం లేదు.

దీని వుద్యోగాలు వందల సంఖ్యలోనే వున్నాయి. దీని గురించి వర్రీ కాదు, యిది యిస్తే రేపు తెలంగాణ రాష్ట్రం అడుగుతారు, అదీ భయం – అని వాదించవచ్చు సమైక్యవాదులు. అడిగితే అడగవచ్చు. అంతెందుకు అప్పుడే కోదండరాం మొదలుపెట్టారు – 'ఈ ఘనవిజయం సాధించాం కాబట్టి, 14 ఎఫ్ ఒక్కటే ఎ, బి,సి, డి... అన్నిటిని రద్దుచేయాలని. ఆయన అడగ్గానే ఎవరూ యివ్వరు. తెలంగాణ రాష్ట్రం యివ్వడం అనివార్యం అనుకుంటే యిస్తారు, లేకపోతే లేదు. దాని గురించి ఆల్‌రెడీ ఒప్పుకున్న ఒప్పందంపై వెనక్కి వెళ్లడం పెద్దమనిషి తరహా కాదు. అసలేమీ యివ్వకుండా తొక్కిపెడితే సమస్య పరిష్కారం దొరకదు. ఒప్పుకున్నది యిస్తూనే 'నాయనా, చూశారుగా, మీకు ఒరిగింది ఏముంది?' అని చెప్పాలి. నిజానికి టి ఉద్యమకారులు నష్టపోతున్నారు.

ఉద్యమం ముందుకు సాగుతున్నకొద్దీ ఉద్యమంలో పాల్గొంటున్న కార్యకర్తలకు యివన్నీ క్రమేపీ అవగాహనకు వస్తాయి. అప్పుడు 'ఇంత చేసి మనం సాధించినదేమిటి?' అనే ఆలోచన ప్రారంభమవుతుంది. వాళ్లకు ఆ ఆలోచన రాకుండా జాగ్రత్త పడడమే ఉద్యమనాయకులు చేయవలసినది. అందుకే వాళ్లు యీ స్థానికత సమాచారాన్ని తొక్కి పెడతారు.

హైకోర్టు న్యాయవాదుల నియామకం టైములో యిది పైకి వచ్చింది. 1956కి ముందే హైకోర్టు హైదరాబాదుకి వచ్చేయడంతో మద్రాసులో ప్రాక్టీసు చేస్తున్న కోస్తా, సీమ లాయర్లందరూ హైదరాబాదు వచ్చి స్థిరపడిపోయారు. వాళ్ల పిల్లలు యిక్కడే పుట్టారు, యిక్కడే చదివారు, యిక్కడే ప్రాక్టీసు చేస్తున్నారు. వాళ్లని స్థానికులు కాదని ఎలా అనగలం? అందుకే తెలంగాణ కోటాలో వేశాం అని గీతారెడ్డి అంటే గుత్తా సుఖేందర్ రెడ్డి 'ఆంధ్రోళ్ల పిల్లల్ని తెలంగాణ అంటే ఎలా ఒప్పుతాం? వచ్చి ఎన్ని తరాలైనా వాళ్లు ఆంధ్రోళ్లే. గీతారెడ్డి ఆంధ్రోణ్ని పెళ్లి చేసుకుంది కాబట్టి అలా మాట్లాడుతోంది ' అంటూ అడ్డదిడ్డంగా వాదన చేశారు.

ఎవరు ఒప్పినా ఒప్పకపోయినా రూల్సు ఒప్పుతున్నాయి కదా. అప్లికేషన్‌లో నీ తండ్రి ఎక్కడ పుట్టెను? అనే కాలమ్ లేనే లేదు. అసలు కాండిడేటు ఎక్కడ పుట్టినా కూడా అనవసరం. నాలుగేళ్లు వరుసగా ఎక్కడ చదివావు, అది చెప్పు చాలు అంటున్నారు. ఈ లెక్కన రాష్ట్రవిభజన తర్వాత ఎంతమంది 'ఆంధ్రులు' స్థానికేతరులు అవుతారు? ఎన్ని ఉద్యోగాలు మిగిలిపోతాయి? కుటుంబానికి ఓ ఉద్యోగం ఏ ప్రభుత్వం యివ్వగలదు?

610 జీవో కూడా రూలుకు వ్యతిరేకంగా జరిగిన నియామకాల గురించి వేసిన జీవో. అది ఖచ్చితంగా అమలు చేయవలసినదే. అమలు చేయలేదు. చేయకపోగా '610 ప్రభుత్వోద్యోగాలకు మాత్రమే వర్తిస్తోంది, ప్రభుత్వ కార్పోరేషన్‌లలో కూడా అమలు చేయాల'ంటూ యింకో జీవో పట్టుకుని వచ్చారు. 610 అమలుకే దిక్కులేదు. కార్పోరేషన్‌లలో ఏం అమలు చేస్తారు? 'ఏదో ఉద్యమకారులు అడిగారు, వాళ్లని తాత్కాలికంగా తృప్తి పరచడానికి ఓ జీవో యిస్యూ చేసి వాళ్ల మొహాన పడేద్దాం. అమలు చేయకుండా కూర్చుందాం' అని ప్రభుత్వ ఆలోచన.

ఇది 'ఆంధ్రుల కుట్ర' అంటూ యావత్తు కోస్తా, సీమవాళ్ల నెత్తిన యీ పాపం చుట్టడం అవగాహనారాహిత్యం. అది ప్రభుత్వోద్యోగుల మధ్య వ్యవహారం. వాళ్లు రకరకాలుగా చీలిపోయి వుంటారు. ప్రాంతాల వారీగా, కులాల వారీగా, శాఖలవారీగా, హోదాల వారీగా... మళ్లీ పంపకాల దగ్గరకి వచ్చేసరికి, 'వర్క్ టు రూల్' (!) చేయడానికి వచ్చేసరికి అందరూ ఏకమౌతారు. ఏం 610 అమలు చేయవద్దని ఆంధ్రప్రాంతపు ఐటీ ఉద్యోగి అడిగాడా? బిల్డర్ అడిగాడా? వ్యాపారస్తులు అడిగారా? కొబ్బరి బొండాలు అమ్ముకునే వాడు అడిగాడా? అసలు యీ జీవో తెలంగాణ ఉద్యోగులు అధికారులుగా వున్న శాఖల్లో అమలైందా? పోనీ తెలంగాణ యూనియన్ లీడర్లు – యీ స్వామి గౌడ్ వగైరా వున్న శాఖల్లో...? పోనీ తెలంగాణ మంత్రుల కింద వున్న శాఖల్లో...? రేపు తెలంగాణ సిఎం వస్తే అవుతుందా..?

అసలు ఎవరు ఏ ప్రాంతీయులో వివిధ శాఖలనుండి సమాచారమే మాకు అందలేదు అంటుంది ప్రభుత్వం. విస్తృతంగా కంప్యూటరైజేషన్ అయిన యీ రోజుల్లో ఆ సమాచారం తీసుకోవడం అంత కష్టమా? నాన్సెన్స్. 1983లో ఎన్టీయార్ ప్రభుత్వోద్యోగుల వయసు 58 నుండి 55 కి తగ్గించి నెలాఖరులోగా ఉద్యోగాలు పీకేద్దాం అంటే గంటల్లో సమాచారం రెడీ. వాళ్లు పోతే మాకు ప్రమోషన్లు వస్తాయి కదాన్న ఉబలాటంతో కాబోలు రోజుల్లో వాళ్ల టెర్మినల్ బెనిఫిట్స్ షీట్స్ కూడా రెడీ అయిపోయాయి. అప్పట్లో కంప్యూటర్స్ వాడకం కూడా లేదు. అలాటిది యిప్పుడు సమాచారం లేదంటే ఎవడు నమ్ముతాడు?

ఇవి అమలు చేయడానికి ప్రభుత్వానికి ఏదో యిబ్బంది వుంది. ఇక్కణ్నుంచి బదిలీ చేసి పంపితే కోస్తా, సీమ ప్రాంతాల్లో అదే పోస్టు యివ్వాలంటే అక్కడ అవి లేవేమో ! కొత్తగా సృష్టించి యివ్వాలంటే అదనపు ఖర్చేమో ! అక్కడ వున్న వాళ్లు జూనియర్లు అవుతారు కాబట్టి అభ్యంతర పెడతారేమో ! గతంలో ప్రభుత్వమే పోస్టింగ్ యిచ్చి యిప్పుడు వెనక్కి పంపేస్తోంది, అంటూ ఎవరైనా ఉద్యోగి కోర్టు కెళితే ప్రభుత్వానికి చిక్కులేమో ! ఈ ఉద్యోగులున్నారే మహా లిటిగెంట్స్ ! కాలికేస్తే మెడకి, మెడకేస్తే కాలికి వేస్తారు. ఒకరికి బెనిఫిట్ వచ్చిందంటే, మరొకడు కోర్టుకి వెళ్లి ఆపించేయడం ఖాయం.

అందునా ఎలాగోలా రాజధానికి వచ్చిపడినవారు వెనక్కి వెళ్లకుండా వుండడానికి ఏదో ఒక ట్రిక్కు వేస్తారు. కోస్తా, సీమ, తెలంగాణ – ఎక్కణ్నుంచైనా సరే ప్రతీవాడూ పిల్లల చదువుల గురించో, తలిదండ్రుల ఆరోగ్యం గురించో, పలుకుబడి పెరుగుతుందనో, సైడు బిజినెస్ చేసుకోవచ్చనో – రాజధానికి వద్దామని శతథా ప్రయత్నిస్తారు. ఆ తర్వాత వెళ్లకుండా వుండడానికీ అంతే గట్టి ప్రయత్నం చేస్తారు. ఇవే కాదు, బ్యాంకుల్లో కూడా అంతే హెడాఫీసు పోస్టింగు కోసం, సిటీలో పోస్టింగుకోసం అందరూ ఎగబడతారు. గ్రామీణ ప్రాంతాల్లో పోస్ట్ చేస్తే మెడికల్ లీవు పెట్టేస్తారు. అక్కడ వసతులు లేవు మరి ఏం చేస్తారు!

హైదరాబాదు వచ్చి పడిన వాళ్లని యిక్కణ్నుంచి బదిలీ చేయబోతే తేనెతుట్ట కదిలించినట్టే అని కాబోలు కెసియార్ 610 గురించి గట్టిగా పట్టించుకోలేదు. 2004లోనే ఆయన్ను అడిగారు, 610 జీవో గురించి ఏం చేస్తారని? 'ఎలాగూ ప్రత్యేకరాష్ట్రం వస్తోంది కదా, యిలాటి టుప్రీ విషయాల గురించి పట్టించుకోవడం ఎందుకు?' అంటూ తప్పించుకున్నాడాయన. ఏడేళ్లయింది యిప్పటిదాకా రాష్ట్రం కనుచూపు మేరలో లేదు. మరి 610 వలన నష్టపోయి ప్రమోషన్స్ పోగొట్టుకున్నవారికి కలిగిన నష్టాన్ని ఎవరు పూరిస్తారు?

ఏది ఏమైనా జరుగుతోంది ఏమిటంటే ప్రభుత్వం అప్పటికప్పుడు ఏదో ఫైర్ ఫైటింగ్ మెజర్స్‌లా ఏదో ఒక జీవో యిస్యూ చేసి మంట అప్పటికప్పుడు చల్లారుస్తున్నారు. ఆ తర్వాత అమలు చేయరు. ఆ తర్వాత ఉద్యోగులూ గట్టిగా అడగడం లేదు, ప్రభుత్వమూ పట్టించుకోదు. రావణకాష్టంలా దశాబ్దాలు గడిచినా 610 అంటూనే వుంటారు. ప్రభుత్వం నిష్కర్షగా చెప్పేయాలి – ప్రభుత్వంలోనే అమలు చేస్తాం, కార్పోరేషన్‌లో, ప్రయివేటు ఉద్యోగాలలో దీన్ని వర్తింపచేయం అని. చెప్పిన తర్వాత దాన్ని ఖచ్చితంగా ఎన్ని కష్టనష్టాలకు ఓర్చయినా అమలు చేయాలి. అన్నిటి కంటె ముందు 'స్థానికత' అంశం గురించి ప్రభుత్వమే 'ప్రజాహితం కోసం ప్రకటన' అంటూ యిచ్చి ప్రజల్ను ఎడ్యుకేట్ చేయాలి. దీనివలన కలిగే లాభాలు యింతే, ఇంతకంటె ఎక్కువ ఆశించకండి అంటూ. లేకపోతే ఏవో కోట్లాది ఉద్యోగాలు వస్తాయని ఆశపెట్టుకున్న నిరుద్యోగులు ఆశాభంగం చెంది, తిరుగుబాటు చేస్తారు. దాన్ని హేండిల్ చేయడం మరీ కష్టం.

ఈ వ్యాసంలో వాస్తవాలలో కానీ, అన్వయంలో కానీ ఏవైనా పొరపాట్లు వుంటే తెలియపరచమని ప్రత్యేకంగా కోరుతున్నాను. – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**

**ఆగస్టు 23** **ఎమ్బీయస్ : వైయస్ వారసత్వం**

మన రాష్ట్రంలో వైయస్ పేరుకి మంచి గుడ్‌విల్ వుందన్నది నిర్వివాదాంశం. దాన్ని ఎలా ఎన్‌కాష్ చేసుకోవాలో తెలియక

కాంగ్రెస్, జగన్ జుట్టు పీక్కుంటున్నారు. 'జగన్ ఆయన ఆస్తులకు వారసుడు కావచ్చు కానీ, రాజకీయంగా వైయస్ మా వాడు, అమలు చేసిన పథకాలు మావి. ఆయన మా నాయకుడు' అంటుంది కాంగ్రెస్. మరయితే ఆయన కాలంలో జరిగిన అవినీతి కూడా మీదేగా అంటుంది టిడిపి. అబ్బే కాదు, కాదు అది జగన్‌ది అంటుంది కాంగ్రెస్. అవినీతి అంటూ జరిగితే దానిలో వైయస్ కాబినెట్‌లో అందరికీ బాధ్యత వుంది కదా అంటుంది జగన్ వర్గం. ఛ ఛ వాళ్లంతా పుణ్యపురుషులు, వాళ్ల జోలికి వెళ్లనక్కరలేదు అంటుంది కాంగ్రెస్. 'అవునవును, మాదేముంది, మాకేమీ తెలియదు, వైయస్ చెప్పినదానికి తల వూపడం తప్ప, మాకేమీ బాధ్యత లేదు' అంటున్నారు అప్పటి సహచర మంత్రులు. 'మంత్రులన్నతర్వాత తలకాయ వూపడానికే వున్నాం అంటే కుదరదు. వాళ్లకీ బాధ్యత వుంది.' అంది గతంలో కోర్టు చంద్రబాబుపై వేసిన అవినీతి కేసులో తీర్పు చెపుతూ...

కాబినెట్ నిర?యం అంటే కలక్టివ్ డెసిషన్ తప్ప చచ్చిపోయినవాళ్లపై నెట్టేయడం కాదు. ముఖ్యమంత్రి కానీ, ప్రధానమంత్రి గానీ 'ఫస్ట్ ఎమాంగ్ యీక్వల్స్' అనే సిద్ధాంతం మనది. నిర?యాలకు మంత్రులకు బాధ్యత లేకపోతే 2జి స్పెక్ట్రమ్ కేసులో రాజా కాకుండా మన్‌మోహన్ జైల్లో వూచలు లెక్కిస్తూ వుండి వుండేవారు. ఆ కేసు తేలుతూండగానే దయానిధి మారన్ కేసు వస్తే మళ్లీ అక్కడే. ఆ తర్వాత మరో మంత్రి యింకో దానిలో యిరుక్కుంటే అక్కడే కాపురం పెట్టేయవచ్చు. లోక్‌పాల్‌లో ప్రధానమంత్రిని చేర్చడానికి ఒప్పుకోవడం లేదు కదా, ఉండు మీ రోగం కుదురుస్తా అని ఈ అన్నా హజారే గ్రూపు వాళ్లు ఒక్కో మంత్రి మీదా ఆరోపణలు చేస్తూ పోతే చాలు. ఓ 50 మంది దొరికినా, పదవిలో వున్నంతకాలం ప్రధానిని తీహార్‌లోనే కూర్చోబెట్టవచ్చు.

వ్యవహారం యింత ఫన్నీగా తయారవడానికి కారణం ఏమిటంటే – 'వైయస్ గొప్పవాడు, జగన్ చెడ్డవాడు' అని ప్రచారం చేద్దామని కాంగ్రెస్ ఆలోచన. 'వైయస్ అనుమతించకపోతే జగన్ చెడ్డవాడెలా అవుతాడు?' అన్నది మౌలికమైన ప్రశ్న. జగన్ అధికారంలో లేడు కదా. ఫలానా వారికి ఫలానాది ఎలాట్ చేయండి అనే అధికార నిర?యాలను అతని నెత్తికి ఎలా చుడతారు? అందువలన జగన్‌ను యిరికించాలంటే ఏదో ఒక స్టేజిలో వాళ్లు వైయస్ అవినీతికి పాల్పడ్డారని ఒప్పుకుని తీరాలి. వెంటనే వైయస్ అవినీతిలో చెలరేగిపోతూంటే సోనియా ఏం చేస్తోందన్న అనుమానం వస్తుంది. మహారాష్ట్ర సిఎం ఆదర్శ్ కుంభకోణంలో యిరుక్కోగానే పీకేశారు, రాజాను జైలుకి పంపారు, మరి వైయస్‌ను వదిలేసేరేం? అని అడుగుతారు. టిడిపివారు వైయస్‌కు వ్యతిరేకంగా సాక్ష్యాలు సంపాదించామంటున్నారు. వైయస్ సోనియాకు మూటలు పంపించినట్టు సాక్ష్యాలు కూడా సంపాదించారా? సంపాదించి వుంటే జగన్‌పై కేసు పడేసినట్టు సోనియాపై కూడా కేసు పడేస్తే పోయేదిగా ! పనిలో పనిగా సిబిఐ అది కూడా విచారించేసేది!

వచ్చిన చిక్కేమిటంటే కాంగ్రెస్‌కు, టిడిపికి ప్రస్తుతం టార్గెట్ – జగనే ! ముందు అతని పని పట్టాక తర్వాత మనం మనం చూసుకుందాం అని పెట్టుకున్నారు. వాళ్లిద్దరూ కలిసి పని చేస్తున్నారా, విడివిడిగా పనిచేస్తున్నారా అన్నది చెప్పలేం కానీ జగన్ పతనం యిద్దరికీ ప్రయోజనకరం అన్నదాంట్లో సందేహం లేదు. ప్రాంతాల సమస్య వచ్చేటప్పటికి అన్ని పార్టీల సమైక్యవాదులందరూ కలిసిపోయినట్లే, జగన్ యిస్యూ దగ్గర వాళ్లు కలవడంలో ఆశ్చర్యం లేదు. వైయస్ అవినీతిని ఎస్టాబ్లిష్ చేసి ఒకసారి జగన్ని రంగంలోంచి తప్పించాక అప్పుడు టిడిపివారు సోనియాపై దాడి మొదలెడతారు – వైయస్ అవినీతికి మూలకారణం సోనియాయే అంటూ. అప్పుడు కాంగ్రెస్ యిరకాటంలో పడుతుంది. ఇది కాంగ్రెస్‌వాళ్లకూ తెలుసు. అయినా రిస్కు తీసుకుంటున్నారు. వైయస్ కర్రతో జగన్‌ను కొట్టేసి, తర్వాత ఆ కర్రను విరిచి పడేద్దామని అనుకుంటున్నారు.

ప్రస్తుతం వైయస్‌ను వాటేసుకోనూ లేరు(అవినీతి కారణంగా) వదిలిపెట్టనూ లేరు (ఇమేజి కారణంగా). ఈ ఇబ్బంది గమనించే జగన్ తనే వైయస్ వారసత్వం నాదే అంటున్నారు. నిజంగా జగన్ వారసుడేనా?

వైయస్ అనగానే నాకు మొదటగా తోచేది – సమైక్యవాదం. వైయస్ రాష్ట్రవిభజనకు అడ్డం అని అప్పట్లోనే టిఉద్యమకారులు అంటూ వచ్చారు. నాదేముంది, హై కమాండ్‌దే అంతా, వాళ్లేం చెపితే అదే చేయాలి అంటూనే వచ్చారు వైయస్. అది నిజమే అని తేలింది యిటీవల ప్రణబ్ కోస్తా, సీమల నాయకులతో కలిసినపుడు. ఆయన స్పష్టంగా చెప్పారట – తెరాసతో పొత్తు వద్దని వైయస్ మొత్తుకుంటూనే వున్నారు. అయినా వినకుండా మేం అతని మెడలు వంచాం. అది యిప్పుడు మెడకు చుట్టుకుంది. అని. ప్రణబ్ డైరక్టుగా ప్రెస్‌తో చెప్పలేదు కాబట్టి యీ మాటలు అబద్ధం అందామనుకున్నా, మర్నాడే కేకే ఓ టీవీ ఇంటర్‌వ్యూలో మాట్లాడుతూ ప్రణబ్ మాటలు ధృవీకరించారు – 'వైయస్ తెరాసతో పొత్తు వద్దన్నారు. పొత్తు పెట్టుకుంటే తెలంగాణ యివ్వవలసిన పరిస్థితి ఏర్పడుతుందని వాదించారు. నేను పొత్తుకొరకై వాదించాను – నేను చెప్పిన కారణమూ అదే. ఇప్పుడు పొత్తు పెట్టుకుంటేనే, రేపు తెలంగాణ ఏర్పడుతుంది అని.'

దీనివలన వైయస్ ఎంత కరడుగట్టిన సమైక్యవాదో తెలుస్తోంది. తన యిష్టానికి వ్యతిరేకంగా హై కమాండ్ తెరాసతో పొత్తు పెట్టుకుంది కాబట్టి అప్పటికి భరించినా, వాళ్లకు మంత్రిపదవులు యిచ్చినా, తర్వాత అటు చేసి యిటుచేసి వాళ్లని కాబినెట్‌లోంచి తరిమేశారు. యుపిఏలోంచి తరిమేశారు. వాళ్ల పార్టీ చీల్చారు. కెసియార్‌ను నిస్తేజం చేశారు. 2009 నాటికి తన మాటకు విలువ పెరగడంతో 'తెరాసతో ససేమిరా పొత్తు వద్దు, మరీ బలవంతం చేస్తే నేను బెంగుళూరు వెళ్లి కూర్చుంటా, మీరే గెలిపించుకోండి' అని బ్లాక్‌మెయిల్ చేశారు. (అదీ పేపర్లలో వచ్చేసింది) సమైక్యవాదం పట్ల అంత కమిట్‌మెంట్ వున్న వ్యక్తి. కమిట్‌మెంట్‌తో బాటు సమైక్యవాదం మంచిదని ప్రజలను నమ్మించగలనన్న, ప్రజలకు నచ్చచెప్పగలనన్న ఆత్మవిశ్వాసం గల వ్యక్తి. వైయస్‌ను తిట్టని తెలంగాణావాది లేడు. అయినా ధైర్యంగా అక్కడ పర్యటించి, 50 సీట్లు, తక్కిన అన్ని పార్టీల కంటె ఎక్కువ సీట్లు గెలుచుకుని

చూపించిన ధీరుడు.

వైయస్ వారసుడన్నవాడు అలాటి కమిట్‌మెంట్, అలాటి గుండెధైర్యం చూపించాలి. జగన్ చేస్తున్నదేమిటి? ఈ విషయంలో అతని ఆదర్శం తన తండ్రి కాదు, చంద్రబాబు. బాబు రెండు కళ్ల సిద్ధాంతం స్టూలు వేసుకుని బాబు కూర్చున్న గోడ మీదే పక్కన చోటు చేసుకుని కూర్చున్నాడు. కేంద్రమే డిసైడ్ చేయాలట. ఆ కాడికి నీ పార్టీ ఎందుకు? మేనిఫెస్టో లెందుకు? విధానాలెందుకు? ఆ అంశం కేంద్రం పరిధిలో వుంది కాబట్టి మాట్లాడము అంటే చాలా విషయాలపై మాట్లాడకూడదు. అణు యింధనం, పొరుగుదేశాలతో విధానం, కేంద్రస్థాయి పన్నుల విధింపు, పర్యావరణం, సరళీకృత ఆర్థిక విధానం, ఎస్సీ వర్గీకరణ.. యిలా అనేకవాటిమీద నోరు మూసుకోవాలి. ఇక రాష్ట్రస్థాయి అంశాలపై మాత్రం మాట్లాడడం దేనికి? నువ్వెలాగూ అధికారంలో లేవు. నువ్వు చెప్పినది వాళ్లు వినరు. ఇక దానిమీదా మాట్లాడకుండా వుంటే పోయె. అధికారంలోకి వచ్చాక అప్పుడే చూసుకోవచ్చు. ప్రస్తుతానికి ఏదోలా మసిబూసి మారేడుకాయ చేసి ప్రజలను మభ్యపెట్టి కాలం గడుపుదామనుకుంటే హర్షించడం ఎలా?

వైయస్ మాత్రం యీ ట్రిక్కులు వేయలేదా అంటే వేశాడు. 2004లో తెరాసతో కుదుర్చుకున్న (మొదటి ఎస్సార్సీని గౌరవిస్తూ రెండో ఎస్సార్సీని కోరుతాం) ఒప్పందాన్ని బయటపెట్టలేదు. 2009లో తెలంగాణ ఎన్నికలయ్యేవరకు స్తబ్ధంగా వుండి ఆ తర్వాత సీమకి వెళ్లి రాష్ట్రవిభజన గురించి భయాలు రెచ్చగొట్టాడు. కానీ ఏం చేసినా, వైయస్‌కి ఒక సాకు వుంది – వ్యక్తిగతంగా నాకు యిష్టం లేకపోయినా, మా హై కమాండ్ చెప్పినట్టు చేశాను అని చెప్పుకోవచ్చు. అందుకే తెరాసతో పొత్తుకు అంగీకరించాను, వాళ్లకు మంత్రిపదవులు యిచ్చాను అని. హై కమాండ్ వైయస్‌కు ఫ్రీ హ్యేండ్ యివ్వలేదన్న సంగతి కెవిపి రాజ్యసభ సభ్యత్వం విషయంలోనే తెలిసి వచ్చింది. వైయస్‌కు వున్న ఎక్స్‌క్యూజ్ బాబుకి, జగన్‌కి లేదు. వాళ్ల వాళ్ల పార్టీలో సర్వంసహా చక్రవర్తులు. వాళ్ల మాటే ఫైనల్. వాళ్లకు హై కమాండ్ లేదు.

సమైక్యవాదం విషయంలో బాబు, జగన్‌లలో జగన్‌కు యింకా ఎక్స్‌క్యూజ్ లేదు. బాబు ప్రధానంగా రాజకీయజీవి (పొలిటికల్ యానిమల్ అని ఇంగ్లీషులో అంటారు, తెలుగులో ఆ వాడకం లేదు) అనే అందరూ అనుకుంటాం. ఆయన చైతన్యరథం మనిషి కాదు. కార్యకర్తలకు, నాయకులకు నాయకుడు. గుండెతో కాకుండా తలకాయతో ఆలోచించి, పూర్వాపరాలు, లాభనష్టాలు బేరీజు వేసి అడుగులు వేసే మనిషి. సమైక్యవాదం ఓట్లు తెస్తుందంటే రైట్ అటే, లేదు విభజనవాదం గిరాకీలో వుందంటే రైట్ అటే.. అనే జాగ్రత్తమనిషి. ప్రజల మధ్య తిరుగుతూ వారి అభీష్టం ప్రకారం వెళ్లరు. వాళ్లకి ఏది మంచిదో తనే నిర?యించి అమలు చేసి దీనికి అలవాటు పడమంటారు.

మరి జగన్ – భవిష్యత్తు మాట ఎలా వుంటుందో కానీ, ప్రస్తుతానికి జనం మధ్యలో తిరుగుతున్నారు. జనాల యిష్టాయిష్టాలను గ్రహించి, లాభనష్టాల లెక్కలు పక్కన పెట్టి తను అనుకున్నది పైకి చెప్పి, జనాలను అదిలించైనా తన వైపుకు తిప్పుకుంటేనే లీడరుగా ఎదుగుతారు. బాబును 30 ఏళ్లగా జనం చూస్తున్నారు. ఆయన వద్దనుండి ఏమి ఆశించకూడదో కూడా జనాలకు తెలిసిపోయింది. జగన్ కొత్త సరుకు. యువకుడు. అతనూ యిలాగే మామూలు రాజకీయజీవుల్లాగానే లెక్కలేసుకుని యిలా అంటే యిన్ని ఓట్లు వస్తాయి, అలా అంటే అన్ని సీట్లు వస్తాయి అని లెక్కలేసుకుని నోరు విప్పితే 'ఏం కొత్తదనం వుందని యీ కొత్త వ్యక్తిని ఎందుకు ఆదరించాలి?' అన్న మీమాంస ప్రజల్లో కలుగుతుంది. ఏదో ఒక నిర?యం తీసుకుని, దాన్ని ప్రజలకు నచ్చచెప్పగలిగినప్పుడే జగన్ లీడరవుతాడు. లేకపోతే ఓ రాజకీయ వ్యాపారే !

వైయస్‌లో కొట్టవచ్చినట్టు కనబడే లక్షణం ధీమా ! ఏం వచ్చినా తట్టుకుంటాననే నిబ్బరం ప్రదర్శించారు. పరిటాల రవి కేసులో కొడుకు మీద అనుమానం రాగానే సిబిఐ విచారణకు తనే కోరారు. మరి జగన్? శంకర్రావు కేసులో విచారణ ప్రారంభం కాగానే సుప్రీంకోర్టుకి వెళ్లి స్టే తెచ్చుకోబోయారు. ఇలాటి స్టేలు తెచ్చుకున్నందుకే బాబుని, రామోజీరావుగార్ని ఎద్దేవా చేసిన జగనే యిప్పుడు స్టే కోసం అడిగారంటే ఎంత ఫన్నీగా వుంది ! అంటే – ఏదో బయటపడుతుందని భయపడ్డావన్నమాట. జగన్‌పై నడిచిన కేసంతా కుట్ర కావచ్చు, మరోటి కావచ్చు. అది ప్రజలకు అంత యింట్రస్టు లేదు. దాన్ని జగన్ ఎలా ఎదుర్కున్నాడన్నది ముఖ్యం.

మొన్న తీర్పు వస్తుందన్న రోజున 'జగన్‌ను దోషిగా ప్రకటిస్తున్నాం' అని వస్తుందేమో, వెంటనే పోలీసులు అరెస్టుకి బయలుదేరతారేమో, అప్పటిదాకా ఓదార్పు అంటూ ఎండలో తిరుగుతున్న జగన్ వెంటనే ఛాతీలో నొప్పి అంటూ కేర్ హాస్పటల్‌లో చేరి జైలుకి వెళ్లడం తప్పించుకుంటా డేమోనని ఎదురు చూశాను. ఎందుకంటే మామూలుగా రాజకీయ నాయకులందరూ చేసేది యిదే. జగనూ అదే బాటలో వెళుతున్నారు అనే అభిప్రాయం నాకు బలపడసాగింది. అయితే అవేళ్టి తీర్పు 'సిబిఐ పూర్తి విచారణ చేయాలి' అని వచ్చింది. అదే ఫన్నీగా వుంది. అసలు సిబిఐ ప్రాథమిక విచారణ తీరుతెన్నులు చూస్తే కదా, వాళ్లు పూర్తి విచారణ ఎలా చేస్తారో ఓ ఐడియా వచ్చేది. ఆ రిపోర్టు కేసి కన్నెత్తి చూడని దానికి రెండు వారాల్లో అదావుడిగా, ఎలాగోలా యిచ్చేయండి అని తొందరపెట్టడం దేనికి? పాపం సిబిఐవారు నిద్రాహారాలు మానుకుని రిపోర్టు తయారుచేస్తే దాని కవరు కూడా తెరవకుండా పక్కన పడేయడం దేనికి?

చూస్తూంటే నాకు 'తిలకాష' మహిషబంధనం' కథ గుర్తుకు వచ్చింది. మీకూ తెలిసే వుంటుంది అయినా మళ్లీ చెప్తా. కృష?దేవరాయలు ఆస్థానానికి ఓ పండితుడు చర్చకు వచ్చి అనేక గ్రంథాలు కోట్ చేస్తూ అదలగొట్టేశాట్ట. అప్పుడు తెనాలి రామలింగడు రేపు మీతో చర్చ పెట్టుకుంటానని చెప్పి మర్నాడు ఓ పెద్ద పుస్తకాన్ని పట్టుగుడ్డలో కప్పి మేళతాళాలతో పల్లకిలో తెచ్చి ''ఇదే నా వాదాలకు ఆధార గ్రంథం. దీనిపేరు ''తిలకాష' మహిషబంధనం'' అన్నాడు. ఆ పేరు ఎప్పుడూ వినని పండితుడు నేను చదివిన

వేలాది గ్రంథాల్లో యిది లేదు. దీనిపై నేను తర్కించలేను అని ఓటమి ఒప్పుకుని వెళ్లిపోయాడు. ఆయన వెళ్లిన తర్వాత రాయలు "నిజం చెప్పాలంటే నేనూ ఆ పుస్తకం పేరు వినలేదు. కాస్త చూపించు" అని అడిగాడు. రామకృష?డు పట్టుబట్ట తొలగించి చూపాడు. ఓ కర్రపెట్టె, లోపల నువ్వు కాడలు (తిలకాష?ం), పశువులను కట్టే పలుపు (మహిష బంధనం) వున్నాయి. పేరు డాబుగా వుండడంతో, దానికి అట్టహాసం చేయడంతో పండితుడు బోల్తా పడ్డాడు. పుస్తకం విప్పి చూపించమనైనా అడగకుండా కాలికి బుద్ధి చెప్పాడు.

అలాగే యిక్కడ కోర్టువాళ్లు సిబిఐ వారి దస్త్రం యిప్పకుండానే వారు ప్రాథమిక విచారణలో ఏవేవో రహస్యాలు కనిపెట్టేసి వుంటారన్న ఉద్దేశంతో కాబోలు, ఆ చేత్తోనే పూర్తిస్థాయి విచారణ కూడా చేసేయండి బాబూ అనేశారు. విచారణకు ఆదేశించడానికి బేస్ ఏమిటంటే – శంకర్రావు, ఎర్రంనాయుడు గార్ల లేఖలట. అవి అంత గట్టిగా వుంటే సిబిఐవార్ని ప్రాథమిక విచారణ అంటూ ఎందుకు యిబ్బంది పెట్టినట్టో ! మధ్యలో సిబిఐ ఏదో కనిపెట్టేస్తోందని మనకు బిల్డప్ ఎందుకో ! సిబిఐ మనపాలిట తిలకాష' మహిషబంధనం అయింది. అంతా మిస్టీరియస్‌గా వుంది.

ఏది ఏమైనా కోర్టు చురుగ్గా పనిచేసినందుకు చాలా సంతోషంగా వుంది. నాకు తెలిసి ఏ కేసులోనూ యింత చురుకుదనం చూడలేదు. మంచిదే, యిదే వూపులో తక్కిన రాజకీయ నాయకుల మీద వారి ప్రత్యర్థులు ఎడాపెడా లేఖలు రాసేయాలనీ, వాటిని కోర్టువారు సుమోటోగా స్వీకరించి సిబిఐ విచారణలకు ఆదేశించాలనీ నాకు ఆశగా వుంది. ఇప్పటికే తెలుగుపేపర్లన్నీ ఒకరి అవినీతి మీద మరొకరు రాసేసుకుంటున్నారు. ఓ పాతిక ముహారేు మంది నాయకులమీద యిలా సిబిఐ విచారణలు వేసేస్తే చాలు పేపర్లనిండా యివే. రాసినవే రాసి రాసి రాచిరంపాన పెడుతున్నారు. ఇక అప్పుడు సప్లిమెంట్లు వేసి చంపుతారేమో. పోన్లే తూకానికి అమ్మినపుడు నాలుగు రూపాయలు ఎక్కువ వస్తాయి !

ఇంతకీ జగన్ కేసేమవుతుంది? సిబిఐ విచారణ ఎప్పటికి తేల్తుంది? తీహార్‌లో తొలి తెలుగు ఎంపీగా జగన్ వాసికెక్కుతారా? (టిడిపి దేవినేని కొటేషన్). చెప్పలేం. దశాబ్దాలుగా రాజకీయాలు చూస్తూ వస్తున్నాను కాబట్టి రాజకీయనాయకుడికి అవినీతి కారణాలపై జైలుశిక్ష పడుతుందంటే ఓ పట్టాన నమ్మను. ఈ రాజా, కనిమొళి కూడా బయటకు వచ్చేస్తారనే అనుకుంటున్నాను. వీళ్లంతా ఒకరి నొకరు కాపాడుకుంటారు. ఇప్పుడు ఎడియూరప్ప పై అవినీతి ఆరోపణలు వచ్చాయి కదా, ఆయన జైలుకి వెళతాడనుకుంటున్నారా? సిఎం పోస్టు నుండి దింపేసి యికపై సంపాదించుకునే అవకాశం లేకుండా చేయడమే పెద్ద శిక్ష అని ఇండియన్ పాలిటిక్స్ శిక్షాస్మృతి చెప్తుంది. మళ్లీ ఎన్నికలలో గెలిస్తే చాలు 'ప్రజాకోర్టులో నేను నిర్దోషినని నిరూపించబడ్డాను' అంటాడు పొలిటీషియన్. అంతెందుకు మొన్న ఎన్నికలలో అఖండమైన మెజారిటీ కట్టబెట్టేముందు జయలలితపై కేసులు వున్నాయని తమిళనాడు ప్రజలకు తెలియదా?

అందునా జగన్ కేసులో బంగారు లక్ష్మణ్ కేసులో లంచం పుచ్చుకుంటూ దొరికిన కేసు కాదు. పెట్టుబడులకు, ఫేవర్స్‌కు లింకు ఎస్టాబ్లిష్ చేయడం కష్టం. మీరు ఓ అధికారి. నేను కాంట్రాక్టరుని. మీరు లంచం పుచ్చుకోరు. అప్పుడు నేనేం చేస్తాను? నాకు జూబిలీహిల్స్‌లో ఓ స్థలం వుందండి, మీలాటి నిజాయితీపరుడికి కొన్న రేటుకి యిచ్చేస్తాను అంటాను. మీరు సరేనంటే చట్టం మిమ్మల్ని ఉరేస్తుందా? లేకపోతే మీ డొక్కు కారు నంబరు నాకు లక్కీ నెంబరని మా జ్యోతిష్కుడు చెప్పాడు, పది లక్షలిచ్చి కొనుక్కుంటా అంటా. తప్పనగలరా? ఏ షేరు ఎంతకు కొనాలో ఎవరు నిర?యిస్తారు? ఎవరైనా ఎంతకైనా కొనవచ్చు. నష్టంలో వున్న కంపెనీ షేర్లు ఎందుకు కొంటారు, అప్పుడే పెట్టిన కంపెనీలో ఎవరు షేర్లు కొంటారు–యివన్నీ సిల్లీ క్వశ్చన్స్. ఏదైనా కంపెనీ పెడితే అది బ్రేక్ ఈవెన్ అవడానికి ఏళ్లు పట్టవచ్చని అందరికీ తెలుసు. బ్రేక్ ఈవెన్ అయేవరకు దానిలో నష్టాలే కదా. ఒక్కోప్పుడు కంపెనీకి షేర్లు కొనే సమయానికి నష్టాలు వుండవచ్చు. కానీ గుడ్‌విల్ వుంటుంది. ఫ్యూచర్ వుంటుంది. వాటిని లెక్కలో తీసుకుని షేరు ధర నిర?యించుకుంటారు.

ఇలాటి వాదనలు నా బోటి వాడే చేసినపుడు జగన్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టిన 20 ప్లస్ దిగ్గంతులు చేయలేరా? అవన్నీ ఓపెన్‌గా అందరికీ తెలిసి చేసిన పెట్టుబడులు. టాక్స్ హేవెన్స్ నుండి వచ్చాయంటే అసలు ప్రభుత్వం ఆ వెసులుబాటు ఎందుకు పెట్టినట్టు? అది కొంతమందికే ఉపయోగపడాలా? చట్టరీత్యా కన్నం అంటూ చేసి పెట్టాక నేను మాత్రమే దూరతాను, నా వెనుక ఎవరూ దూరకూడదు అంటే కుదురుతుందా? డబ్బు ఎక్కణ్నుంచి చెప్పుకోవలసిన బాధ్యత పెట్టుబడి పెట్టినవాళ్లది, పెట్టుబడి స్వీకరించినవాడిది కాదు. అందువలన జగన్ మునిగితే అతనితో బాటు యీ 20 ప్లస్ పెద్ద తలకాయలూ మునుగుతాయి. వాళ్లు మునిగితే రాష్ట్రంలో చాలామంది నాయకుల కొంపలు మునుగుతాయి. అందువలన చివరకు అంతా కలిసి యీ కేసును తేల్చేస్తారని నాకు మా చెడ్డ అనుమానం.

జగన్ సమస్యకు రాజకీయంగా ఓ పరిష్కారం కనిపెడితే సిబిఐను జోకొట్టవచ్చు. జగన్‌ను కాంగ్రెస్‌లోకి మళ్లీ ఆహ్వానించవచ్చు. కారట్ అండ్ స్టిక్ మెథడ్ అంటారు కదా, చేరితే సిఎం పదవి యిస్తాం, చేరకపోతే సిబిఐ చేత కేసు నడిపిస్తాం అనవచ్చు. ప్రైమా ఫేసీ కేసు వుంటే ప్రభుత్వమే సిబిఐ విచారణకు ఆదేశించవచ్చు. కానీ అలా చేస్తే జగన్‌పై సింపతీ పెరగవచ్చు. అందుకే శంకర్రావును అడ్డం వేసుకున్నారు. జగన్‌ను ఆహ్వానించాల్సిన ఖర్మ కాంగ్రెస్‌కు ఎందుకుంది అంటే.. పేపర్లలో చదివినదాని ప్రకారం ఆజాద్ ఉద్దేశంలో కాంగ్రెస్‌లో మన రాష్ట్రంలో రెండు తప్పులు చేసింది – ఒకటి తెలంగాణ ప్రకటన, రెండు జగన్‌ను హేండిల్ చేయడం. తెలంగాణ గురించి గట్టిగా నిర?యం తీసుకుని అమలు చేస్తున్నట్లు తెలుస్తూనే వుంది. అలాగే జగన్ గురించి కేసు పెట్టడం, వేగంగా

నడిపించడం, మెడమీద కత్తి కట్టడం జరిగిపోయింది.  కిరణ్‌లో ఎన్నికలు జరిపే శక్తి వున్నట్టు తోచడం లేదు. ఆయన యిమేజి ప్రజల్లో నాటుకోవటం లేదు. జగన్ తెలంగాణ పర్యటనలో తన బలాన్ని అక్కడకూడా చూపించగలిగితే హై కమాండ్ వైఖరిలో మార్పు వచ్చి అతన్ని పిలుచుకుని రావచ్చు. వాళ్లు పిలిచినా జగన్ వెళతాడా? సోనియాపై పగబట్టాడుకదా అంటే – అతనితో బాటు కేసుల్లో యిరుక్కున్న బిజినెస్‌మెన్ అతనిపై ఒత్తిడి చేయవచ్చు. నీ మాట ఎలాగున్నా మా వ్యాపారాలు దెబ్బతింటాయి అని మొత్తుకోవచ్చు. అతన్ని మెత్తబరచవచ్చు.

చూదాం ఏమవుతుందో. ఇంతకీ శీర్షిక వద్దకు వస్తే – వైయస్‌కు వారసులు నాకెవరూ కనబడటం లేదు ! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**

**ఆగస్టు 30** **ఎమ్బీయస్ : అన్నా... అన్నన్నా...**

అన్నా హజారే గురించి రాయమని చాలామంది కోరిక. నేను రాసేది చాలామందికి మింగుడపడదని తెలిసీ యిలా రాస్తున్నాను. నాకు అన్నా హజారే విధానాల పట్ల విశ్వాసం లేదు, గౌరవం లేదు. ఆయన అరెస్టయినా, అరెస్టు తర్వాత ఎస్సెమ్మెస్‌లు, ఫార్వార్డ్‌లు కురిసినా, ప్రభుత్వం మెట్టుదిగినా, అన్నా బెట్టు సడలించకపోయినా – నేను చలించను. ఇదేదో కొన్నాళ్లు నడుస్తుంది. ప్రభుత్వం సరేనంటుంది, నెల్లాళ్ల పాటూ దీక్ష చేయమంటుంది. ఈయన మైదానంలో కూర్చున్నాక ఎవరో సంఘవ్యతిరేక శక్తులు జొరబడతారు, లేదా ప్రభుత్వమే జొప్పిస్తుంది. వాళ్ల అల్లరి వలన అన్నాకు ప్రాణాపాయం వుందంటుంది, ఆయనను కాపాడడానికే తప్పించామంటుంది, దీక్ష భగ్నం చేస్తుంది. లోక్‌పాల్ బిల్లుపై మళ్లీ చర్చ అంటుంది. ప్రధానిని మాత్రం లోక్‌పాల్ పరిధిలో చేర్చం అని చెప్తుంది. మళ్లీ కథ మొదలు..

నేను ప్రభుత్వంలో వున్నా అన్నా పట్ల అవాకులు, చెవాకులూ వాగను కానీ ఆయన చెప్పినట్లు ఆడను కూడా. ప్రధానిని అర్జంటుగా పరిధిలో చేర్చడానికి ఒప్పుకోను. ప్రధాని అంటే ఆషామాషీనా? మొత్తం దేశానికే ఎగ్జిక్యూటివ్ హెడ్. దేశప్రజలందరూ పార్లమెంటు సభ్యులను ఎన్నుకోగా వారితో అత్యధికులు ఆమోదించగా ప్రభుత్వాన్ని నడిపించే, దేశప్రజల వర్తమానాన్ని, భవిష్యత్తును రూపుదిద్దే వ్యక్తి.  ఆయనను శాసించే శక్తి ఒక్క వ్యక్తి చేతిలో పెట్టాలా? అమ్మ ఆశ !

అసలు లోక్‌పాల్ అంటూ ఒకటి ఏర్పడనీ.., అది ఎలా పనిచేస్తుందో చూడనీ. ఆ స్థానాన్ని అధిష్టించిన వ్యక్తి అతని చేతికిచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేస్తున్నాడో, దుర్వినియోగం చేస్తున్నాడో చూడనీ.. అప్పుడు చూదాం అతని చేతిలో యింకా అధికారం పెట్టాలో వద్దో..! ఏదైనా కొత్త వ్యవస్థ పెట్టినపుడు ట్రయల్ అండ్ ఎర్రర్ మెథడ్‌లో టెస్ట్ చేయాలి. ఎన్టీయార్ 'ధర్మమహామాత్ర' అనే వ్యవస్థ పెట్టారు. అది ఎక్కడుందో ఎవరికైనా గుర్తుందా? లోకాయుక్తలో కలిసిపోయింది. మన రాష్ట్రంలో లోకాయుక్త బాగా పనిచేస్తే యిన్ని అవినీతి ఆరోపణలెందుకు? ఈ ఎమ్మార్ ప్రాపర్టీస్ విషయంలో అది ఏం చేస్తోందట? ఈ వ్యవస్థల్లో ఏది నిలుస్తుందో, ఏది నిలవదో, ఏది పనిచేస్తుందో, ఏది పడకేస్తుందో తెలియనప్పుడు ఊరికే దాని గురించి అట్టహాసం చేయడం దేనికి? లోక్‌పాల్ మాత్రం ఖచ్చితంగా పనిచేసేస్తుందని ఎవరైనా గ్యారంటీ యివ్వగలరా?

మనదేశంలో న్యాయవ్యవస్థకు ఎంతో గౌరవం యిస్తాం. న్యాయమూర్తులను మామూలు మనుష్యుల్లా చూడం. విషయం కోర్టులో వుంటే బయట మాట్లాడకూడదట, సబ్–జ్యుడిస్. న్యాయమూర్తులు ప్రభావితం అయిపోతారట. తీర్పు నచ్చకపోయినా న్యాయమూర్తిని ఏమీ అనడానికి లేదు, కంటెంప్ట్ ఆఫ్ కోర్టు. వాళ్లకు బోల్డు రక్షణలు. వాళ్లని విచారించే అధికారం ఎగ్జిక్యూటివ్‌కు లేదు. వాళ్లు తీర్పులో ఎగ్జిక్యూటివ్ క్షేమిటి, కాబినెట్ క్షేమిటి, మతాధికారులకూ, దేవుడికీ కూడా నీతులూ, పాఠాలూ చెప్పేస్తారు. బోగస్ ఎన్‌కౌంటర్ చేసే పోలీసులకు ఉరేసినా ఫర్వాలేదు వంటి ఆవేశపూరితమైన వ్యాఖ్యలు చేస్తారు. వాళ్లు ఏం చేసినా, ఏమన్నా చెల్లుతుంది. అదీ న్యాయవ్యవస్థ వాళ్లకు కల్పించిన రక్షణకవచం.

ఈ కవచం కల్పించినందుకు గాను న్యాయమూర్తులందరూ పులుకడిగిన ముత్యాల్లా వున్నారా? లేరు అని రాస్తే నేను జైలు కెళ్లాల్సి వస్తుంది, కాబట్టి రాయలేను. కానీ వాళ్ల మీద ఆరోపణలున్నాయి అని రాయాలి. జస్టిస్ దినకరన్, యిప్పుడు జస్టిస్ సౌమిత్ర.. అంతకుముందు సుప్రీంకోర్టులో సగం మంది న్యాయమూర్తులు నిజాయితీపరులు కారని ఎవరో చేసిన ఆరోపణ.. యివన్నీ వింటే ఏమనిపిస్తోంది? న్యాయవ్యవస్థ వుండవలసిన తీరులో లేదని అనిపిస్తోందా? లేదా? తీర్పు వ్యతిరేకంగా వచ్చినవాడు న్యాయమూర్తికి కులం, ప్రాంతం, మతం, ధనం వగైరా పక్షపాతం వుందని ఆరోపించినా వెంటనే నమ్మనక్కరలేదు కానీ పూర్తిగా కొట్టివేయగలమా? ఏమంటే ఏం కొంపమునుగుతుందోనని నోరుమూసుకుని వున్నాం. గట్టిగా నిలదీసి అడిగితే సమాజంలో ఏ వర్గం నిజాయితీగా వుంది చెప్పండి అని వాళ్లు మనని నిలదీస్తారు. అన్నిటా విలువల పతనం కనబడుతోంది.

మరి రేపు లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పడితే అది మాత్రం ఎక్కణ్నుంచైనా ఏర్పడుతుందా? దానికోసం దేవుడు ప్రత్యేకమైన మనుష్యులను సృష్టిస్తాడా? ''మాయాబజారు''లో సత్యపీఠం లాటిది మయుడిచేత తయారుచేయించి అక్కడ నెలకొల్పుతాడా? యాంటీ కరప్షన్ బ్యూరో పెట్టినపుడు అది సరిగ్గా పనిచేయదని, దాని అధికారులపై సిబిఐ విచారణ జరిపించవలసి వస్తుందని ఎవరైనా అనుకున్నారా? సిబిఐను నెలకొల్పినపుడు దాన్ని కొద్దికాలంలో 'కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ యిన్వెస్టిగేషన్' అనబోతారని కలగన్నారా? ఇంటెలిజెన్సు

బ్యూరోను ఐబి పేర నెలకొల్పినపుడు 'ఇందిరా బ్యూరో' గా ముద్రపడుతుందని ఎవరికైనా అనుమానం వచ్చిందా? అసలు అందరూ సవ్యంగా పనిచేస్తే కథ యింతదూరం ఎందుకు వస్తుంది? స్థానిక పోలీసుస్టేషన్‌లో కానిస్టేబులే అవినీతికి కళ్లెం వేయగలిగేవాడు.

అంతెందుకు ఏ వస్తువు కొన్నా అది సవ్యంగా పనిచేస్తుందో లేదో గ్యారంటీగా చెప్పగలరా? షాకు యివ్వదని షాపు వాడు చెప్పాడు కదాన్న ధైర్యంతో కొత్త గీజరును తడిచేత్తో ముట్టుకుంటారా? కొత్తకారుకి బ్రేకులు బ్రహ్మాండంగా పడతాయనీ, గేర్లు యింకా చక్కగా పడతాయని సేల్స్‌మన్ చెప్పాడన్న నమ్మకంతో స్టార్ట్ చేస్తూనే 120 స్పీడులో తోలగలరా? కాస్సేపు 40, 50లో తోలి చూసుకోరా? మీ అపార్టుమెంటు కాంప్లెక్సుకి కొత్త వాచ్‌మన్‌ను నియమించినప్పుడు వాడి చేతికి కర్ర మాత్రమే యిస్తారు. వాడు బాగా బాధ్యతగా పనిచేస్తున్నాడన్న నమ్మకం కుదిరితేనే లైసెన్సున్న తుపాకీ యిస్తారు. ఉద్యోగంలో చేరుతూనే వాడి తుపాకీ చేతిలో పెట్టరు. ప్రభుత్వం కూడా ఓ పథకం పెట్టినపుడు ప్రయోగాత్మకంగా దేశంలో ఓ 60,70 జిల్లాల్లో మొదలుపెట్టి అది బాగా నడుస్తోంటే తక్కినవాటికి దశలవారీగా విస్తరిస్తారు.

దేన్నయినా చిన్న స్థాయిలో మొదలుపెట్టి లోపాలు సరిచేసుకుంటూ, ముందుకు సాగుతారు. అన్ని బిల్లులూ, అన్ని పథకాలూ అక్షరాల్లో అందంగానే కనబడతాయి. అమలుకి వచ్చేసరికే యిబ్బందులు తెలుస్తాయి. అందుకే మన రాజ్యాంగాన్ని యిన్నిసార్లు సవరించుకున్నాం.

లోక్‌పాల్‌ను చిన్నస్థాయిలోనే మొదలుపెట్టనివ్వాలి. క్రమేపీ అది బాగా పనిచేస్తేనే దానికి మరింత శక్తి నివ్వాలి. ఆ వ్యవస్థను పెడుతూ పెడుతూనే దాని చేతికి వజ్రాయుధం యిస్తే ఆ తర్వాత భస్మాసురుడికి వరం యిచ్చిన శివుడిలా ప్రాణభీతితో పరుగులు పెట్టాలి. ఏ మేరకు శక్తి నివ్వాలి అన్నది చర్చల ద్వారానే తేలాలి. నేను చెప్పినదే వినాలి అనడం మూర?త్వం, అహంకారం. నా మాట వినని వాళ్లంతా అవినీతిపరులు అనుకోవడం అవివేకంతో కలిసిన అహంభావం. పట్టూ విడుపూ లేకుండా ప్రవర్తించడం ప్రజాస్వామ్యవిధానం పట్ల అగౌరవం, అమర్యాద.

మన రాజ్యాంగ నిర్మాతలు మనకు మూడు ప్రధాన విభాగాలను మంచి తూకంలో యిచ్చారు. రాజకీయపరంగా ఏర్పడి, ప్రతీ ఐదేళ్లకూ ప్రజల అగ్నిపరీక్షకు గురయ్యే మైన పార్లమెంటు, పరిపాలనదక్షులతో కూడి తమ చర్యలకు ప్రజలను ఎదుర్కోవలసిన అవసరం లేని బ్యూరాక్రసీ, వాళ్లు రాజ్యాంగబద్ధంగా పాలిస్తున్నారో లేదో చూడడానికి జుడిషియరీ – యీ మూడిటికీ అధికారాలు యిచ్చి ఎవరూ యింకొకర్ని విస్మరించలేని విధంగా కూర్చారు. అప్పటికీ రాజ్యాంగ నిర్మాతలు ఎదురు చూడని సన్నివేశాలు వచ్చినపుడు ఆ రాజ్యాంగం చాలదని, నప్పదని ఫీలయిన సందరాలున్నాయి. అందుకనే రాజ్యాంగాన్ని సవరణలు చేసే వెసులుబాటు కూడా కల్పించారు. ఇన్ని ఏర్పాట్లు చేస్తే ఏదో వాళ్లందరూ తెలివితక్కువ వాళ్లయినట్టు, యిప్పుడు వెలుగుతున్నవారే మేధావులైనట్టు – ఒక సూపర్ పవర్ వ్యవస్థను నియమిద్దామని వీళ్లు చూస్తున్నారు. ఈ వ్యవస్థ లోపభూయిష్టమైతే సరిదిద్దే ఉపకరణం ఏది? ఎక్కడుంది?

నా ఉద్దేశంలో ప్రతీదానికి కౌంటర్ ఫోర్సు వుండాలి. పగలు-రాత్రి, ఆడా-మగా, రీజన్-ఎమోషన్, నీరూ-నిప్పూ.. యివన్నీ కాంప్లిమెంటరీ. ఒకదానికి మరొకటి పూరకాలు. అలా వుంటేనే సంపూర?త్వం సిద్ధిస్తుంది. యాజమాన్యం ఎంతమంచిదైనా దానికి ప్రతిగా యూనియన్ వుండాలి. దేని శక్తి ఎక్కువైనా అది కాలక్రమంలో దుర్వినియోగం అవుతుంది. సెజ్‌లలో, ఐటీ సెక్టార్‌లో యూనియన్ లేదని నేను ఫీలవుతుంటే చాలామంది ఐటీవాళ్లు కోప్పడ్డారు – ఈ కమ్యూనిస్టు స్లోగన్లన్నీ పని అడ్డుకోవడానికే. మాకు చూడండి, యూనియన్ వుందా? లేకపోయినా మాకు కోక్‌లు, క్యాబ్‌లు, ఆఫీసు ఖర్చుపై వీకెండ్‌లు.. ఎన్ని సౌకర్యాలు సమకూర్చారో.. అని.

అంతలో రిసెషన్ వచ్చింది. ఐటీ మేనేజ్‌మెంట్లు యిష్టం వచ్చినట్టు ఉద్యోగాలు పీకేశారు. సిల్లీ సిల్లీ రీజన్స్‌కి (పార్కింగ్ లాట్‌లో కారు గట్టిగా హారన్ కొట్టావ్ లాటి కారణానికి కూడా) చెప్పా పెట్టకుండా, పావుగంట వ్యవధిలో ఉద్యోగం తీసేశాం, రిజైన్ చేయి, చేయడానికి తిరస్కరిస్తే నీ సర్టిఫికెట్టు పాడుచేస్తాం, ఎవరినీ కలవకుండా వెళ్లిపో, నీ సామాన్లు కొరియర్‌లో పంపుతాం.. యిలా! ఈ విధానం వల ఎంతోమంది దెబ్బ తిన్నారు– ఆర్థికంగా, మానసికంగా ! అందలం ఎక్కించి బురదలో తోసినట్టయింది. ప్రాజెక్టులు రాకపోతే మార్కెటింగ్ వారిది తప్పు, సాఫ్ట్‌వేర్ వాళ్లదేముంది? అవసరం లేకపోయినా రెట్టింపుమందిని తీసుకోవడమేల? బెంచీపై కూర్చోబెట్టనేల? సడన్‌గా తీసేయనేల?

ఈ మిస్‌ప్లానింగ్‌కు బాధ్యుడైన మేనేజ్‌మెంట్‌కి శిక్ష పడాలి. ఈ ఇంజనియర్‌కు కాదు. పనిలేనప్పుడు ఎవడు తీసుకోమన్నాడు? నువ్వు తీసుకోకపోతే ఇంకోచోటకి, పని వున్న కంపెనీకే పోయి వుండేవాడు. ఐటీ కంపెనీ యాజమాన్యాలు చిత్తం వచ్చినట్టు, యిష్టారాజ్యం–భరతుడి పట్టం మాదిరి నడిచాయి. అక్కడ యూనియన్లే వుండి వుంటే మేనేజ్‌మెంట్‌ను ప్రశ్నించి వుండేవి. ఉద్యోగం పీకేముందు చట్టం ప్రకారం యివ్వవలసిన నోటీసులు యిచ్చి మరీ తీసేసేది.

అలా అని నేను కమ్యూనిజాన్ని వెనకేసుకుని వస్తున్నానని అనుకోకండి. మార్క్స్ ప్రవచించిన కార్మిక నియంతృత్వం కూడా నేను వ్యతిరేకిస్తాను.. కార్మికుడు పైకి వస్తే సాటి కార్మికుడిని కూడా ఉద్ధరించేస్తాడనే ఆదర్శపు ఆలోచన పెట్టుకుని మార్క్స్ అలా అన్నాడు. (ఇలాటి ఆదర్శవాదులే లోక్‌పాల్ బిల్లును సమర్థిస్తున్నారు) కానీ వాస్తవానికి ఏమైంది? కార్మికుడు పైకి వచ్చాక సాటి కార్మికుడిని పాతయజమాని కంటె హీనంగా దోపిడీ చేయడం చూశాం. రష్యాలో ఏం జరిగింది? కార్మిక నియంతృత్వం పేర తమకు నచ్చనివాళ్లను ఊచకోత కోశారు. ఇండియాలో ఏం జరిగింది? మాజీ కమ్యూనిస్టులను మించిన కాపిటలిస్టులు లేరన్న పేరు వచ్చింది.

రాజకీయాల్లో కూడా బలమైన అపోజిషన్ వుంటేనే ప్రభుత్వం ఒళ్లు దగ్గరపెట్టుకుని పనిచేస్తుంది. లేకపోతే మా యిష్టం అంటుంది. పోలీసు దౌర్జన్యాలను ఎదిరించడానికి పౌరహక్కుల వంటి పౌరవ్యవస్థ వుండాలి. అప్పుడే వాళ్లు ఆగుతారు. లేకపోతే ప్రతీవాడూ ఎన్‌కౌంటరే. హద్దులులేని అధికారం కళ్లు బైర్లు కమ్మిస్తుంది. మనందరిలో నియంత కావాలన్న కోరిక దాగి వుంటుంది. ప్రజాస్వామ్యం గురించి పైకి ఎన్ని పాఠాలు చెప్పినా, మనం లోపల అనుకుంటూనే వుంటాం –'ఈ గాడిద కొడుకులికి యింత విడమరిచి చెప్పడం అనవసరం, ఎలాగూ వినరు. ఓ తుపాకీ పట్టుకుని యిలా చెయ్యండి సన్నాసులారా అనాలి' అని.

కానీ మన దృష్టిలో మనం చాలా న్యాయవంతులైన, దయార్ద్రహృదయులైన నియంతలం. (బెనెవొలెంట్ డిక్టేటర్). 'నా చేతికే అధికారం యిస్తేనా.. యీ ముష్టివాళ్లందరినీ పట్టుకెళ్లి జైల్లో పడేస్తా, ట్రాఫిక్ పాటించనివారి టైర్లు పేల్చేస్తా, కిడ్నాప్ చేసి పిల్లలను చంపేసివారిని చెట్టుకు ఉరేస్తా, రేప్ చేసేవారిని అందుకు పనికి రాకుండా చేస్తా, టైముకి ఆఫీసుకి రానివాళ్లందరినీ సస్పెండ్ చేసేస్తా, బలిసిన రాజకీయనాయకులను  అరకకు కట్టి పొలాలు దున్నిస్తా.. 'యిలా అనేక కోరికలు. అన్నిటిలోనూ ఆరోపణ చేసేది మనమే, తీర్పు చెప్పేది మనమే, అమలు చేసేది మనమే. లోక్‌పాల్ బిల్లును మనవాళ్లు సమర్థించడానికి కూడా కారణం యిదే. ఈ విధంగా కలలు కనే అధికారం ముష్టివాడికి కూడా వుంటుంది. వాడేమనుకుంటాడు? 'ముష్టి వేయనివాళ్లను కొరడా పెట్టి కొట్టాలి' అని !
**(సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**

## ఆగస్టు 32 ఎమ్బీయస్ : అన్నా... అన్నన్నా... – 3/6

ప్రతీ అంశానికి పలుదృక్కోణాలు వుంటాయి. ఒకే మనిషి అన్ని విషయాలలోనూ కరక్టుగా వుంటాడని చెప్పలేం. అటువంటప్పుడు ఒక్క లోక్‌పాల్ చేతిలో కళ్లాలు లేని అధికారం పెట్టడం ఎలా? అతను కావాలంటే ఎవరినైనా శాసించగలడట ! వాహ్! కరా?టకలో లోకాయుక్త గట్టిగా నిలిచాడు కాబట్టే ఎడ్యూరప్ప గద్దె దిగాడని అనుకుంటున్నాం. మరి అదే వ్యవస్థ మన రాష్ట్రంలో ఏం చేస్తోంది? సంతోష్ హెగ్డే వారసుడు అంతే పట్టుదలగా వుంటాడా? ఎలక్షన్ కమిషనర్‌గా శేషన్ అందర్నీ అదలగొట్టాడు. ఓహో యిలా వుందా అనుకుంది కేంద్రం. ఆ పోస్టులో ముగ్గుర్ని వేసింది. డైల్యూట్ చేసింది. మళ్లీ వాళ్లలో తనకు కావలసినవాళ్లను వేస్తోంది. నవీన్ చావ్లా కాంగ్రెస్‌కు దగ్గరివాడని అందరికీ తెలుసు. అయినా అడ్డుకోగలిగారా?  ఇలా ఎన్నో ప్రశ్నలు. ఇప్పుడు కరా?టక లోకాయుక్త ఎడ్యూరప్పను దింపగలిగాడు. అంతేనా? శిక్ష అయిపోయిందా? ఇంకా పడవద్దా? పడుతుందా? ఎడ్యూరప్ప జైలుకి వెళతాడా? సమాధానాలు ఎవరికి వారే చెప్పుకోవచ్చు.

మావోయిస్టులను అదుపు చేయడానికి కొత్తచట్టం కావాలని కొన్ని ప్రభుత్వాలు అడిగినప్పుడు కేంద్రం చెపుతుంది – ఉన్నవి అమలు చేసి చూపించండి, అవి చాలు అని. మన వ్యవస్థ అంతా జల్లెడ లాటిది. అన్నీ లూప్‌హోల్సే. వాటిని ప్లగ్ చేయాలి, కన్నాలు మూసేస్తే ఎలుకలు దూరవు. అది చెయ్యకుండా పెద్ద పిల్లిని పట్టుకొస్తాం అనడం దేనికి? ఆ పిల్లి ఏం  చేస్తుందో ? ఎలుకలను పట్టేబదులు యింట్లో పాలు తాగి కూర్చుంటుందేమో ! ఈసప్ కథల్లో ఓ గుఱ్ఱం కథ వుంది. దానికీ, జింకకూ పంతం వచ్చింది. పోట్లాడుకున్నాయి. అప్పుడు గుఱ్ఱం మనిషి దగ్గరకు వచ్చి జింకను వేటాడు అని కోరింది. దాని వేగాన్ని నేను అందుకోలేను అన్నాడు మనిషి. దానికేముంది, నా వీపు మీద ఎక్కి వేటాడు అంది. వేట జరిగింది. జింక చచ్చింది. ఇక చాలు దిగమంది గుఱ్ఱం. "అబ్బే, నీ సవారీ నాకు చాలా బాగుంది. దిగను. ఇకపైనుండి నువ్వు నన్ను మోయాల్సిందే" అన్నాడు మనిషి. అప్పుణ్నుంచి గుఱ్ఱం మనిషికి బానిస అయింది అని కథ.

గుఱ్ఱం లాటి మనం ఈ రోజు అవినీతిని వేటాడడానికి లోక్‌పాల్‌ని మన నెత్తిన ఎక్కించుకుంటే, రేపు యితను దిగనంటే...? క్రూరంగా ప్రవర్తిస్తే...? "అబ్బే, అన్నా హజారేయే మన లోక్‌పాల్ అవుతాడు. ఆయన చాలా మంచివాడు" అని నచ్చచెప్పాలని చూడకండి. అక్కడికి వెళ్లిన తర్వాత చూడాలి అయ్యగారి బిస. ఓ తమిళ సినిమా చూశాను. పేరు గుర్తులేదు. శివాజీ గణేషన్ ఓ సామాన్యపౌరుడు. ఓ ప్రభుత్వాధికారి దౌష్ట్యంపై తిరగబడతాడు. చివరకు రాజుగారి అతన్ని తీసేసి యితన్ని ఆ స్థానంలో పెడతాడు. ఇతను పోనుపోను మారతాడు. ఓ రోజు ఒక రైతును కొరడా ఎత్తి కొట్టబోతూ వుంటే అతనికి హఠాత్తుగా గుర్తుకు వస్తుంది, గతంలో ఆ అధికారి పెట్టిన పోజే యిప్పుడు తానూ పెట్టాడని. అప్పుడు అతనిలో పరివర్తన వస్తుంది.  కానీ యిలాటి హీరోలు తెరమీదే వుంటారు. నిత్యజీవితంలో విలన్లే ఎక్కువ. వాళ్లలో పరివర్తన రాదు. మేం చేసినదే కరక్టనుకునే మూర?త్వంలో వుంటారు.

ఇప్పటికీ అనేక దేశాల్లో చూస్తున్నాం. రాజుగారి నియంతృత్వం పెరిగి ప్రజలు ఆగ్రహంగా వున్నపుడు లేదా ప్రజాస్వామ్యంలో రాజకీయనాయకులు పరస్పర కలహాలతో ప్రజల్ని విసిగించాక  సైన్యాధికారి రాజుని తరిమేసి అధికారం వశపరుచుకుంటున్నాడు. ఓ ఐదేళ్లు బాగా పాలించాక, క్రమంగా అతనే నియంత అవుతున్నాడు. రాజుగారే నయం అనిపిస్తున్నాడు. కానీ యీ నియంతను తొలగించడం కష్టం. ఎందుకంటే సైన్యం అధికారం మరిగింది. ఇతన్నే సమర్థిస్తుంది. దీనికి ఉదాహరణలు కోకొల్లలు. ఇరుగుపొరుగున వున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, బర్మాల నుండి ఆఫ్రికా, లాటిన్ అమెరికా, మధ్య ఏసియా... ఎక్కడైనా యిదే కథ.

ఇప్పుడీ లోక్‌పాల్ అనే సూపర్‌మేన్‌కు మన హక్కులన్నీ యివ్వడం దేనికి? ఆనక ఏడవడం దేనికి? అన్నా హజారే అలా చేయదే అనుకోండి. ఆయన వారసుడు ఎలా వుంటాడో చెప్పగలరా? మొరార్జీ దేశాయికి నీతిపరుడన్న పేరుంది కాబట్టి ఆయనను ప్రధాని

చేశారు. కానీ ఆయన కుమారుడు కాంతి దేశాయ్‌పై తట్టెడు ఆరోపణలు. కొడుకుని ఏమైనా అంటే తండ్రికి కోపం. అలాగ అన్నాకు అమరిన భూషణాలు (శాంతి, ప్రశాంత్) కూడా అంత స్వఛ్ఛమైన బంగారంతో చేసినవేనా? వాళ్ల కథలు బయటకు వచ్చాయి కదా.

ప్రధానమంత్రిని బిల్లులో చేర్చాలన్న అంత పట్టుదల దేనికి? నిజంగా చేర్చారే అనుకోండి. ప్రధానిపైన శంకర్రావు లాటి పెద్దమనిషి ఎవరైనా ఓ ఉత్తరమ్ముక్క రాసి పడేశానుకోండి. వెంటనే లోక్‌పాల్ 'ప్రధానిపై సిబిఐ విచారణ ఆదేశిస్తున్నాను' అంటే చాలు గొహొవింద. ప్రధాని వెళ్లి జైల్లో కూర్చుంటే దేశం కార్యకలాపాలన్నీ బంద్. పోనీ జైలుకి పంపకుండా బెయిల్ యిచ్చి బయటకు తీసుకుని వచ్చారు కానీ యీ ఆరోపణ వలన మొహానికి మసి పూసి వదిలిపెట్టారు కదా. విదేశీ ప్రధాని ఎవరో అతిథిగా వస్తే ఆయనతో కలిసి 'అవినీతి నిర్మూలనకు యిరుదేశాలు కట్టుబడి వున్నాయి' వంటి స్టేటుమెంటు యిచ్చేటప్పుడు వచ్చినవాడు ఫక్కున నవ్వుతాడు. పోనీ ఆరోపణల సంగతి తేలేవరకూ యింట్లోనే పడుక్కుని ఆ తర్వాత వస్తే మంచిది అని ప్రధాని అనుకుంటే కుదురుతుందా? ఆ విచారణ ఎంతకాలం సాగుతుందో, పేరు క్లియర్ అయ్యేవరకూ టెన్షనేగా. ఇదీ మన ప్రధానిని మనం గౌరవించే తీరు.

జస్ట్ ఆరోపణకే విచారణ జరుపుతారా అంటే జగన్ విషయంలో జరగటం లేదా? సిబిఐ రిపోర్టు జోలికి పోకుండా, కేవలం శంకరరావు, టిడిపి యిచ్చిన డాక్యుమెంట్ల ఆధారంగా హైకోర్టు పూర్తి స్థాయి విచారణ ఆదేశించింది. వాళ్లిచ్చిన డాక్యుమెంట్లు ఏమిటట? మీకూ నాకూ కూడా దొరికే ఆర్వోసి డాక్యుమెంట్లే. సాక్షిలో పెట్టుబడి పెట్టినవారెవరైనా ఒప్పుకోలు పత్రాలు యిచ్చారేమో అని భ్రమ పడకండి. ఎలాట్‌మెంట్స్‌కు, పెట్టుబడులకు మధ్య వున్న బంధం (నెక్సస్) నిరూపించే ఆధారాలు కూడా ఏమీ యివ్వలేదు. అయినా సిబిఐ విచారణ ఆదేశించబడింది. ఇవన్నీ తెలిసినా మీడియా తనవంతు విచారణ, శిక్షా తను జరిపేస్తోంది. జగన్‌ని తీహార్ జైల్లో ఎన్నో నెంబరు సెల్‌లో వుంచాలో కూడా చెప్పేస్తున్నారు. కార్టూన్లు హొరెత్తి పోతున్నాయి. ఆ జైలా, యీ జైలా, జైలుకి ఎవరు ఆహారం తీసుకెళ్లాలి.. అంటూ.

నిజానికి జగన్‌కి ఏ అధికారమూ లేదు కాబట్టి కానీ లేకపోతే పదవి వుంటే పీకేసేవారు. నిజాయితీ నిరూపించుకున్నాక మళ్లీ రా అనేవారు. అదే టోకెన్‌లో రేపు ప్రధానిని కూడా లోక్‌పాల్ అలాగే అంటాడు. లేకపోతే అతనికి గుర్తింపు ఎలా వస్తుంది పాపం?

ఓసారి ఈనాడులో శాసనమండలిలో గొడవ గురించి "పెద్దల గలభా" అని హెడింగ్ పెట్టి వార్త వేశారు. గౌరవనీయులైన శాసనమండలి సభ్యులందరినీ అవమానించినట్టే అన్న అర్థం తీసి ఎవరోగాని తాడేపల్లి గూడెంలో అనుకుంటా ఓ చిన్న కోర్టులో కేసు పడేశారు. మాజిస్ట్రేటుగారు పొంగిపోయారు. రామోజీరావుగార్ని స్వయంగా హాజరు కమ్మనమని హుకుం జారీ చేశారు. ఆయన స్వయంగా రాలేనంటూ అర్జీలు పెట్టుకున్నా అన్నీ తిరస్కరించి, ఓ రోజున ఆయనను ఆ కోర్టుకు రప్పించి తరించారు. ఆయన్ను చూడడానికి వచ్చిన ఊరి ప్రజలతో కోర్టు కిటకిటలాడింది. మేజిస్ట్రేటు పులకించారు. రామోజీరావుగారుని అలా రప్పించి వుండకపోతే యీ కథ నాకు గుర్తుండేది కాదు.

ఇప్పుడు లోక్‌పాల్ కూడా యిలా పబ్లిసిటీ కోసం పార్లమెంటులో అడుగు పెట్టకూడదంటూ ప్రధానిని ఆదేశించి చరిత్రలోకి ఎక్కేయవచ్చు. ఆయనకది బాగానే వుంటుంది కానీ దేశం గతి ఏమిటని నా ప్రశ్న. ఏ పాకిస్తానో కావాలని ఏదో దిక్కుమాలిన ఎన్‌జీవో (సామాజిక సంస్థ)కు డబ్బిచ్చి ఆరోపణ చేయిస్తే..? విచారణ జరిగి ప్రధాని నిర్దోషి అని తేలేలోపున నానా రభసా అయిపోతుంది కదా ! పోనీ పాకిస్తాన్ ఎందుకు? ప్రధానమంత్రి పదవిపై కన్నేసిన డిప్యూటీ ప్రధానమంత్రో, హోం మంత్రో ఏ సుబ్రహ్మణ్యం స్వామి చేతికో కాసిని కాగితాలు యిచ్చి కేసు వేయమంటే..? కేసు రాగానే లోక్‌పాల్ ప్రధానికి నోటీసు యిస్తాడు. ఆరోపణలు ఎదుర్కుంటున్న ప్రధాని పదవిలో వుండకూడదని డిప్యూటీ పిఎం స్టేటుమెంట్లు యిప్పిస్తాడు. చాలు, కేసు తేలేదాకా డిప్యూటీ పిఎమ్మే, యాక్టింగ్ పిఎంగా వుంటాడు. ఏం యిలాటిది జరగదని చెప్పగలరా?

ఆరోపణల్లో నిజానిజాల గురించి కాస్త చెపుతాను. బ్యాంకుల్లో నేను చూశాను – ఒక ఆఫీసరుపై ఏదో ఒక ఆరోపణ వస్తుంది. వెంటనే సస్పెండ్ చేసి, విచారించి, దోషి అయితే దండన వేసి, నిర్దోషి అయితే సస్పెన్షన్ ఎత్తివేస్తే ఎవరికీ గొడవ వుండదు. కానీ అది జరగదు. ఆరోపణ చేసిన తర్వాత మూడు, నాలుగేళ్లకు కానీ విచారణ ప్రారంభం కాదు. ఈ లోపున సస్పెండ్ చేస్తారు. ఇంట్లో కూర్చోవాలి. చాలా సిగ్గుగా వుంటుంది. నిర్దోషి అయితే మరీను. పక్కింటివాడి సింపతీ కూడా దక్కదు. 'బాంకు వాళ్లంతా యింతే ఎడాపెడా తినేస్తారు' అని కామెంట్ చేస్తారు, దగ్గరి బంధువులు కూడా. కూతురి పెళ్లికి పిత్రార్జితం కూడా అమ్ముకోవడానికి వుండదు. కేసు నడుస్తూండగా ప్రమోషన్ యివ్వరు. ఇంటర్వ్యూకి హాజరైనా రిజల్ట్ సీల్డ్ కవర్‌లో పెడతారు. ఈ లోపుగా రిటైరయినా టెర్మినల్ బెనిఫిట్స్ యివ్వరు. సస్పెన్షన్ చేశాక ఆర్నెల్లు సగంజీతం యిచ్చి ఆ తర్వాత పూర్తి జీతం యిచ్చినా కూడా యీ నిందితులు చిక్కిపోయి, ఆరోగ్యాలు చెడగొట్టుకోవడానికి కారణం యిదే !

మన ప్రస్తుత ప్రధాని మన్‌మోహన్ ఆర్థికమంత్రిగా వుండగా ఆయన పార్టీవారే అసత్యారోపణలు చేశారు. ఆయన బాధపడి రిజైన్ చేస్తానన్నారు. అప్పటి ప్రధాని పివి గారు పివిఆర్‌కె గారిని పంపించి మన్‌మోహన్‌కి ఎలా నచ్చచెప్పారో పివిఆర్‌కె తన పుస్తకంలో రాశారు. లోక్‌పాల్‌కు మన రేవంత్ రెడ్డిలాటి సలహాదారుంటే ప్రధానిని యిరికించడం ఎంతసేపు. వైయస్ అవినీతి గురించి మాట్లాడుతూ ఆయన వైయస్ హయాంలో తీసుకున్న నిర?యాల విషయంలో వైయస్ ఒక్కడిదే తప్పనీ, ఆయన కాబినెట్ సహచరులందరూ పునీతులనీ సర్టిఫికెట్టు యిచ్చేశాడు.

కాంగ్రెస్ పట్ల టిడిపి యింత ప్రేమ కురిపిస్తుందని రెండేళ్ల క్రితం ఎవడైనా చెప్పి వుంటే నమ్మి వుండేవాణ్ని కాను. సాక్షి కాంగ్రెస్‌కు

వ్యతిరేకంగా రాస్తుందని చెప్పినా నమ్మేవాణ్ని కాను. కానీ చూస్తూండగానే వింతవింతలు జరుగుతున్నాయి. రేవంత్ లాజిక్ ప్రకారం కాబినెట్ డెసిషన్ ఏం తీసుకున్నా ముఖ్యమంత్రే దండనీయుడు. అలాగే కేంద్ర కాబినెట్‌లోని ఎనభైమందిలో ఏ ఒక్కడు తప్పు చేసినా, తప్పు చేశారని ఆరోపణ వచ్చినా ప్రధానే దండనీయుడంటారు లోక్‌పాల్, రేవంత్ లాజిక్ ఉపయోగిస్తే. ఒక కేసులో బయటపడగానే, మరో కేసులో లోపలికి పంపించవచ్చు.

చట్టం కఠినంగా వుంటే నిజంగా తప్పులు చేసినవాడికి ఫర్వాలేదు, కానీ నిజాయితీపరుడు కూడా దెబ్బ తింటాడు. తన వద్దకు వచ్చిన పత్రాలను చూస్తే ప్రధానిపై చేసిన ఆరోపణల్లో ప్రైమా ఫేసీ కేసు వుందని నాకు తోచింది అని లోక్‌పాల్ అంటే దిక్కేముంది? అది వ్యక్తిగత అభిప్రాయమే కదా. 'కీలకపత్రాల ఆధారంగా' ఆయన ఆ అభిప్రాయానికి వచ్చారని మన పేపర్లు ఘోషిస్తాయి. ఈ కీలక పత్రాలు చూసినవాడెవడు? అవి ఎంత కీలకమో తెలిసినవాడెవడు? ఇప్పుడు జగన్‌పై దాడిలో కీలకపత్రాలు లభ్యం అని రాసేస్తున్నారు. మీరు చెప్పండి – కీలకపత్రాలు యిప్పుడు దొరికే ఛాన్సుందా?

ఇవాళ సిబిఐ జగన్ యిళ్లపైన, ఆఫీసులపైన, అతని కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినవారి యిళ్లపైన దాడులు చేస్తోందని నిన్ననే అందరికీ తెలిసింది. ఇంత డప్పు కొట్టుకుంటూ వెళితే అవతలివాళ్లు సర్దేసుకోరా? సిబిఐ వాళ్లకంటె ముందే మీడియా వ్యాన్‌లు రెడీగా వుంటున్నాయి. వాటిలో సాక్షి వ్యాన్ కూడా వుంటోంది. అలాటప్పుడు వాళ్లు దొరుకుతారా? గతంలో అయితే దొంగఖాతాలు రాసిన బౌండు పుస్తకాలు తగలేయడానికి టైము పట్టేది, యిప్పుడేముంది, డిలీట్ బటన్ నొక్కితే చాలు, కంప్యూటర్లో ఖాతా మొత్తం ఖాళీ. లేదా గోరంత పెన్ డ్రైవ్‌లో మొత్తం సమాచారం ఎక్కించేసి పంటికి క్యాప్‌లా పెట్టుకోవచ్చు.

కీలకపత్రాలు ఎలా వుంటాయో నా స్వానుభవం చెప్తాను. సాధారణంగా నా కుటుంబ వ్యవహారాలు రాయను. ఈ కథనం కూడా ఎవరిమీదో పెట్టి రాయవచ్చు. కానీ ఆథెంటిసిటీకోసం నా పేరే బయటపెట్టుకుంటున్నాను. చట్టం ఎలా దుర్వినియోగం అవుతోందో ప్రత్యక్షంగా అనుభవించినవాణ్ని కాబట్టి యింత ఘాటుగా రాస్తున్నాను.

మా బంధువుల అబ్బాయి వైవాహికజీవితంలో కలతలు వచ్చాయి. కాపురం సవ్యంగా నడుపుకోమని సలహాలు చెపుతూ, హితం కోరుతూ నేను అతనికి ఈమెయిల్స్ యిచ్చాను. కానీ ఆ అమ్మాయి యింట్లోంచి వెళ్లిపోయి వరకట్నహింస కింద కేసు పెట్టింది. అబ్బాయి మీద, తల్లిమీద, సలహాలు చెప్పిన నా మీద. నా పేరుపై అరెస్టు వారెంటు విడుదలైంది. నేను బిత్తరపోయాను. నా పెళ్లికే కట్నం తీసుకోని నాపై యిలాటి కేసా!?

ఈ సంబంధం విషయంలో కూడా నేను హాజరు కావడం తప్ప పెళ్లిచూపుల్లో కాని, పెళ్లి మాటల్లో కాని నా ప్రమేయం ఎంతమాత్రం లేదు. అలాటివాడిపై కట్నం కోసం భార్యను హింసించమంటూ యీ మెయిల్స్ యిచ్చి ప్రోద్బలం చేశానని కేసు పెట్టారు. బెయిల్ దొరికింది. అప్పుడు పోలీసు స్టేషన్‌లో అడిగాను – "నా ఈమెయిల్స్‌లో ఏం రాశానో చూశారా? కాపురం చెడగొట్టుకోమని ఎక్కడైనా రాశానా?" అని. "ఏమో, జిరాక్సులు యిచ్చారు. అవి అస్పష్టంగా వున్నాయి. అయినా చదివినవాడెవడు? కేసు పెట్టాక ఎవర్నైనా అరెస్టు చేయడమే మా పని" అని చెప్పాడు యిన్‌స్పెక్టర్. ఏమనాలో తెలియలేదు. చివరకు భరణం తీసుకుని విడాకులు యిచ్చి ఆ అమ్మాయి వెళ్లిపోయింది కానీ లేకపోతే నేనింకా కోర్టు మెట్లు ఎక్కుతూ దిగుతూ వుండేవాణ్ని.

నేను సెలబ్రిటీని కాను. లేకపోతే ఆ వార్త పేపర్లలో వచ్చి వుండేది. 'హింసించమని రెచ్చగొట్టిన వైనం, బ్లాక్ అండ్ వైట్ ప్రూఫ్' అంటూ ఆ ఈమెయిల్స్ జిరాక్సులను టీవీ తెరపై తెగ చూపించేవారు. ఆ మధ్య సినీనటి ఆమని తమ్ముడి భార్య భర్తతో పోట్లాడి ఈ 498ఎ కేసే పెట్టింది. ఆడపడుచు కాబట్టి ఆమనిపేరు కూడా చేర్చింది. పబ్లిసిటీ కోసం కూడా అయితే కావచ్చు. ఇక చూసుకోండి. రోజంతా ఆమనిపై టీవీల్లో కథనాలు. "శుభలగ్నం సినిమాలో డబ్బుకోసం భర్తనే అమ్ముకున్న ఆమనికి వైవాహికబంధం ఏం తెలుసు అని బుగ్గలు నొక్కుకుంటున్నారు కొందరు.." అంటూ వగరు కంఠంతో బోడి వ్యాఖ్యానం ఒకటి వెనక్కాల..! ఆమనికి యీ విషయంలో ప్రమేయం వుందో లేదో నాకు తెలియదు. కానీ గృహకలహం వలన అప్రదిష్టపాలైంది కదా.

ఈ చట్టం కింద బుక్కయిపోయిన ఆడపడుచు మొగుళ్లు కూడా నాకు తెలుసు. "అసలు ఆ అమ్మాయిని బయట చూస్తే గుర్తు కూడా పట్టలేనండీ, మంచి పొజిషన్‌లో వున్నాను కదా, నా పేరు చెప్పి మా బావమరిదిని, అత్తమామలను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు లాగుదామని నన్ను దీంట్లోకి యీడ్చారు" అని బాధపడ్డారు వాళ్లు. ఈ చట్టంలాగే మిస్‌యూజ్ అయ్యే ఛాన్సున్న చట్టం ఎస్సీ, ఎస్టీ చట్టం. మా బ్యాంకుల్లో చూశాను. తాగి డ్యూటీకి వచ్చిన సబార్డినేట్ స్టాఫ్‌పై చర్య తీసుకోవాలంటే జంకు ! "అతను ఎస్సీఅండీ. నన్ను కులంపేరుతో దూషించాడంటూ నా మీద ఫిర్యాదు చేస్తే నేను జైల్లో కూర్చోవాలి." అని పై అధికారులనేవారు. మంత్రి శంకర్రావుగారు దీన్ని ఏ స్థాయికి తీసుకెళ్లారో యీ మధ్యే చూశాం కాబట్టి విస్తారంగా రాయడం లేదు. ఇటువంటి కేసు ఒకటి పెట్టుకుని లోక్‌పాల్‌గారు ప్రధానిపై యిష్టం వచ్చినట్టు వ్యాఖ్యలు చేస్తే..?

నిజానికి రాజకీయనాయకులందరికీ ఆక్యుపేషనల్ హజార్డ్స్ వుంటాయి. ఏదో వూళ్లో ప్రచారానికి వెళతారు. అక్కడ స్థానిక నాయకులు ఎవర్నో పరిచయం చేసి "మన పార్టీకి విరాళాలు యిచ్చారం'టారు. వాడు ఈ నాయకుడితో ఫోటో దిగుతాడు. కొన్నాళ్లకు వాడు స్మగ్లర్ అని తెలిసిందనుకోండి. 'ఈ స్మగ్లర్‌కు పెద్దపెద్ద నాయకులతో సంబంధాలున్నాయి' అంటూ యీ ఫోటో పేపర్లో వేస్తే యీ నాయకుడి యిమేజి మటాష్ !

ఆరుషి హత్య కేసులో తలిదండ్రుల అవస్థ చూడండి. వాళ్లు దోషులో, నిర్దోషులో యింకా నా కర్థం కాలేదు కానీ వాళ్ల వ్యక్తిగత

జీవితాన్ని పబ్లిగ్గా ఉతికేసి, ఆరేశారు. సిబిఐ రుజువులు చూపలేకపోయింది కానీ వాళ్ల పరువు మాత్రం తీసిపడేసింది. నిజం అనేది నిలకడమీద తేల్తుంది. కానీ యీ లోపున ఎంత డామేజి జరుగుతోందో చూడండి. న్యూస్ ఆఫ్ ద వరల్డ్ కేసులో పత్రిక వాళ్లు ఓ అమ్మాయి సెల్‌ఫోన్ ట్యాప్ చేసి ఆమె మెస్సేజ్‌లు ట్యాంపర్ చేసి ఆమె బతికి వుందేమోనని పోలీసులకు అనుమానం కలిగించి, విచారణను తప్పుదారి పట్టించారు. ఆమె బతికివుండే కిడ్నాప్ అయినట్టు నాటకమాడుతోంది అని ఆమె కారెక్టరుపై యితరులు బురద జల్లారా లేదా?

సినిమా నటుడు సుమన్ కథ తెలిసే వుంటుంది. పాతికేళ్ల క్రితం అతను క్షణం తీరికలేకుండా సినిమాల్లో నటిస్తున్న రోజుల్లో అతనిపై గూండా యాక్టు పెట్టారు. బ్లూ ఫిలింలు తీస్తున్నాడని, హేబిట్యువల్ గూండా (అతి తరచుగా గూండా కేసుల్లో బుక్ అయి, ఎంత మారుద్దామని చూసినా మారని వాళ్లను అదుపులో పెట్టడానికి అంటూ ఆ చట్టాన్ని ప్రవేశపెట్టారు) అనీ కేసు పెట్టి బెయిల్ కూడా యివ్వలేదు. మూడు నెలలపాటు సాధారణ ఖైదీగా బతికాడు. ఇంత బిజీ నటుడిపై అదేం కేసు, అతను గూండా ఏమిటి? నేరం చేశాడని మీరు చెప్పిన తేదీల్లో అతను వందమంది మధ్య షూటింగులో వున్నాడు కదాని అడిగినవాడు లేకపోయాడు. తెరమీద హీరోయిజం ప్రదర్శించే హీరోలందరూ నిజజీవితంలో భీరువులై నోరు మూసుకున్నారు. ఎందుకంటే సుమన్‌ని జైల్లో పెట్టించినది అప్పటి సిఎం ఎంజీయార్ కుడిభుజం కనుక. కానీ ముగ్గురు హీరోయిన్లు మాత్రం ప్రెస్‌మీట్ పెట్టి ఖండించారు. వాళ్లూ అసలైన హీరోలు.

ఇంతకీ చెప్పదలచినదేమిటంటే – ఒక డ్రాకోనియన్ చట్టం అంటూ ఏర్పరచాక దాన్ని దురుపయోగం చేసే ఛాన్సు చాలా వుంటుంది సుమా అని చెప్పడానికి. మరి మన చట్టాల్లో యిలాటివి చాలా వున్నా ఎలా నెట్టుకువస్తున్నామంటే, కోర్టులనేవో, మరొకటో యింకో కౌంటర్ ఫోర్సు వుంటోంది కాబట్టి. అది లేకుండా లోక్‌పాల్ అనే సర్వంసహా చక్రవర్తి పోస్టు సృష్టించి అతని చేతిలో యిలాటి అధికారాలు పెట్టడం మనం సమర్థించకూడదు. అలాటి వ్యవస్థకోసం పోట్లాడే అన్నా హజారేను అసలు సమర్థించకూడదు.

అయినా నేను చెప్పినట్టు చేయండి, లేకపోతే ఛస్తా అంటూ ఒక వ్యక్తి మొత్తం వ్యవస్థను శాసించాలని చూడడమేమిటి? ఏమిటీ బ్లాక్‌మెయిల్ ? ఆయనా, ఆయన అనుచరులు తప్ప వేరే మేధావులు లేరా? నాలుగు రోజులు వదిలేస్తే వాళ్లలో వాళ్లకే లుకలుకలు వస్తాయి. అలాటప్పుడు వాళ్లు చెప్పినదే వేదం అని ఎలా చెప్పగలం?

మహాత్మా గాంధీ నిరశన దీక్ష చేస్తే అప్పటి అధినేతలు దిగిరాలేదా అంటే అప్పట్లో ఆంగ్లప్రభుత్వం రోజుల్లో ప్రజాస్వామ్య వ్యవస్థ లేదు. తన అభిప్రాయం చెప్పే మార్గం లేదు కాబట్టి దీక్ష పట్టి ప్రజాబలం చూపవలసి వచ్చింది. ఇప్పుడున్నది ప్రజాస్వామ్యమే. పార్లమెంటులో చర్చించవచ్చు. అందరి అభిప్రాయాలూ తీసుకుని అప్పుడు బిల్లు రూపొందించవచ్చు. అదేం అక్కరలేదు, నేను చెప్పినదే చేయాలనడమేమిటి తమాషానా?

అయినా గాంధీతో పోలికేమిటి, నాన్సెన్స్ ! గాంధీ ఉట్టిపుణ్యాన గాంధీ కాలేదు. ఎన్నేళ్లు భారతదేశమంతా పర్యటించి, అందరి అభిప్రాయాలు తీసుకుని తన విధానం రూపొందించుకున్నాడో గమనించండి. అది కొన్ని దశాబ్దాల ప్రాసెస్. ఈయన మహారాష్ట్ర అనే ఒక్క రాష్ట్రంలో ఓ గ్రామంలో ఏదో చేయగానే గాంధీ అయిపోతాడా? మహామహా జయప్రకాష్ నారాయణ్ కూడా మహాత్ముడు కాలేకపోయాడు. ఎమర్జన్సీకి వ్యతిరేకంగా పోరాడి జనతా పార్టీని అధికారంలోకి తెస్తే "మహాత్మా ఆఫ్ 77" అన్నారు. ఆయన అనుచరులే ఆయన్ని విస్మరించారు. గాంధీ స్థానంలోకి ఆయన రాలేకపోయాడు. అలాటిది యీ అన్నా హజారే, కేవలం నిజాయితీ, మొండితనం వున్నంత మాత్రాన గాంధీ అయిపోతాడా?

అతనితో వ్యవహరించడంలో కేంద్రం పొరబాట్లు చేయవచ్చు. చివరకు అతని కోరికలకు లొంగిపోవచ్చు కూడా. నాకు తెలియదు. నేను మాత్రం ప్రస్తుతం నడిచే యీ ఆందోళనను సమర్థించను. ఆ కారణంగా నేను అవినీతిపరుణ్నానో, అవినీతి సమర్థకుడుననో అనుకునేవాళ్లని చూసి జాలిపడతాను. అన్నా హజారే వెనక్కాల నిలుస్తున్న రాజకీయ నాయకుల కంటె నాకు ఎక్కువ నీతి వున్నదన్న సంగతి నాకు తెలుసు. నేను ఎవరికీ రుజువు చేయనక్కరలేదు.

నేననేది ఒకటే – అన్నా హజారే బృందం మొన్నటివరకు చేసిన కృషి కారణంగానే లోక్‌పాల్ బిల్లు యీ దశకు వచ్చింది. ఇప్పుడు వారు ప్రాక్టికల్‌గా ఆలోచించి, మరీ అసాధ్యమైన కోరికలు కోరకుండా కేంద్రం చేత బిల్లు పాస్ చేయించాలి. అది ఎలా నడుస్తోందో చూసి, కావాలంటే తర్వాత పై మెట్టుకి వెళ్లాలి. ఆర్‌టిఐ చట్టం అమలులోకి రావడానికి ఎన్నాళ్లు పట్టిందో గమనించండి. ఇప్పుడే వీళ్లు మరీ ఎక్కువ బెట్టుకి పోతే అసలుకే మోసం వస్తుంది. లోక్‌పాల్ రాగానే (అది వ్యవస్థ అంటున్నారు కానీ దానికి ఎవరో ఒకరు హెడ్‌గా వుంటారు కదా) ఈ 2 జి స్పెక్ట్రమ్ స్కామ్‌లోనే ప్రధానిని యిరికించి విచారణకు ఆదేశించవచ్చు. విచారణ జరుగుతున్నంతకాలం రాజీనామా యివ్వాలనే డిమాండ్ సంగతి బిజెపి చూసుకుంటుంది. గతంలో పివిపై ఎన్నో ఆరోపణలు వచ్చాయి. ఏదీ రుజువు కాలేదు. కానీ మహానుభావుడు ఓ పదేళ్లపాటు నింద మోశాడు కదా. మనక్షోభ పడ్డాడు కదా. లోక్‌పాల్ లాటిది వుండి వుంటే మరీ అల్లరి పెట్టి వుండేవారు. ఇది వూహించి యుపిఏ అన్నా హజారే ఉద్యమానికి గండి కొడుతుంది. లేని బావ కంటె గూనిబావ మేలన్న సామెత, ఎక్కడికక్కడే ఎంకటలక్ష్మి సామెత వూరికే రాలేదు. దశాబ్దాలుగా నిద్రపోతున్న బిల్లును ఇంతవరకు తీసుకుని వచ్చారు కదా, దీన్ని అమలు కానీయండి, తర్వాతి సంగతి తర్వాత చూసుకోవచ్చు.

ఇక అన్నా హజారే ఏం చేసినా రైట్ అని సమర్థిస్తున్నవారి గురించి నా ఉద్దేశం – వీరు అత్యాశకు పోతున్నారు. ఏదో ఒక వ్యవస్థ

ఏర్పడినంత మాత్రాన అన్నీ సెటర్‌రైట్ అయిపోతాయని అపోహ పడుతున్నారు. రాత్రికి రాత్రి అవినీతిరహిత సమాజం ఏర్పడుతుందని కలలు కంటున్నారు. అమెరికాలో చట్టాలు అలా వున్నాయి, సింగపూర్‌లో యిలా చేశారు, హాంగ్‌కాంగ్‌లో యింకోలా చేశారు.. అని చెప్తున్నారు. ఎందుకండీ యివన్నీ? మన గ్రౌండ్ రియాలిటీ ఏమిటి చెప్పండి. ఎసిబివాళ్లు రెడ్‌హేండెడ్‌గా మొన్న మెహబూబ్‌నగర్ జిల్లాలో ఒక ఎస్సయిని పట్టుకుంటే అక్కడి ప్రజాప్రతినిధులు తెలంగాణా అంశం తెచ్చి ఆ అధికారిని కొట్టి తరిమేశారు. ఆ ఎస్సయిని పట్టించిన హొటల్‌వాడు ఆంధ్ర ప్రాంతీయుడట, తెలంగాణాకు చెందిన నిందితుడు ఎస్సయి ఆ కారణం చెప్పి వీళ్లందరినీ పోగేసి, కేసు తప్పించుకున్నాడు. ఆ మధ్య ఒకతను పట్టుబడితే నేను బిసిని కాబట్టి పట్టుకున్నారు, అదే అగ్రవర?స్తుడనైతే పట్టుకునేవారా? అని వాదించాడు. ఇలాటివి అక్కడున్నాయా? జగన్ ఆస్తులపై విచారణ జరుగుతూంటే తన గురించి ప్రార్థించమంటూ అతను సాటి క్రైస్తవులకు ఎస్సెమ్మెస్‌లు పంపడం వేరే ఏ దేశంలోనైనా వూహించగలమా?

అన్నా హజారేను సమర్థించేవారిలో యీ రకంగా కులం, ప్రాంతం, మతం కారణంగా అవినీతిని ఉపేక్షించేవారున్నా నేను ఆశ్చర్యపడను. వీరంతా ఆ లోక్‌పాల్ ఏదో అదొక్కటి వచ్చేస్తే దేశమంతా సుభిక్షం అయిపోతుందని అనుకుంటున్నారు. ఈ పార్లమెంటు చెత్త, ఈ రాజకీయాలు చెత్త, అందుకని దాన్ని పక్కకు నెట్టేసే వ్యవస్థ రావాలనే దీన్ని సమర్థిస్తున్నాం అంటున్నారు. మరి ఆ చెత్తను తొలగించేందుకు మీరేం చేస్తున్నారు? ఉన్న యింటిని వూడ్చుకోవడానికి చూడటం లేదు కానీ, కొత్త భవంతి ఒకటి సకలసౌకర్యాలతో తెల్లారేసరికి వెలిసిపోతుందనుకోవడానికి అన్నా హజారే ఏమైనా పాతాళభైరవా? విద్యావంతుల్లో సగానికి సగం మంది ఓట్లే వేయరు కానీ ఫార్వార్డ్‌లు, ఎస్సెమ్మెస్‌లు పంపేస్తే దేశం  అర్జంటుగా మారిపోతుందా?

పార్లమెంటుకి వెళ్లి బాగ చేయడానికి ఏం ప్రయత్నం చేస్తున్నాం? దేశం కోసం త్యాగాలు చేసినవారి వారసులం మనం. ఈ రోజు చేస్తున్న వృత్తి మానేసి రాజకీయాలలోకి వెళ్లడానికి మనం రెడీ కాదు. నెగ్గుతామో లేదోనని భయం. మన వృత్తిలోనే దండిగా సంపాదించి, కావాలంటే ఓ రెండు కోట్లు పడేసి నెగ్గే పార్టీ టిక్కెట్టు కొందామని చూస్తున్నాం. ఇలా చేస్తూన్న మనం ఎటు చూసినా లంచగొండితనం కనబడుతూంటే కళ్లు మూసుకుంటున్నాం. తిరుపతిలో దేవుడి దర్శనానికి, పాస్‌పోర్టు సంపాదించడానికి, తత్కాల్ టిక్కెట్టు సంపాదించడానికి.. వేయేల అడుగడుగునా అవినీతిని ప్రోత్సహిస్తాం. అవినీతిని దుయ్యబట్టే "శివాజీ" వంటి సినిమాకు బ్లాక్‌మార్కెట్‌లో టిక్కెట్లు కొంటున్నాం. వ్యక్తులుగా దీన్ని ఎదుర్కోవడం కష్టం కానీ యూజర్స్ అసోసియేషన్స్‌గా ఏర్పడి ఎక్కడికక్కడ ఫైట్ చేస్తూ వుంటే పరిస్థితులు మారతాయి. దానికి టైము పడుతుంది. ఓపిక వుండాలి. కానీ మనకా ఓపిక లేదు, అలా చేసేందుకు టైము లేదు, ఏదో ఈ అన్నా హజారేకి జై అనేస్తే ఆయనే అన్నీ చూసేసుకుంటాడు అనుకోవడం అత్యాశ, దురాశ, పగటికల !

ప్రభుత్వం అన్నా హజారేని ఎలా హ్యేండిల్ చేయాలో తెలియక కొట్టుమిట్టులాడుతోంది. ఆయనకి నచ్చచెప్పగలిగేవారు జనాలు మాత్రమే. చేసినంతవరకు చాలు కానీ ఎలాగోలా బిల్లు బయటపడేయమని చెప్పాలి. ప్రధానిని యిన్‌క్లూడ్ చేయాలన్న డిమాండ్ పక్కకు పెట్టు స్వామీ, 100% విజయం లేకపోయినా ఫర్వాలేదు, 90% వచ్చినా చాలని చెప్పాలి. అన్నిటికన్నా మనకు మొదట కావలసినది – అవినీతి ఆరోపణలపై చప్పున విచారణ జరపడం. కింది స్థాయినుండి శిక్షలు వేసుకుంటూ రావడం. న్యాయవ్యవస్థలో ఎన్నో లోపాలు. పెండింగ్ కేసులు లక్షోపలక్షలు. దాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తే అవినీతి యింతదూరం వచ్చేది కాదు. ఇంతదూరం వచ్చేశాక ఒక్కసారి కూకటివేళ్లతో పెకలించడం అయ్యేపని కాదు. ఇది అన్నాగారు గుర్తించాలి. మనలాటి తమ్ముళ్లం ఆయనకు 'అన్నా, ఉట్టి కెక్కు, తర్వాత స్వర్గానికి ఎక్కుదువుగాని' అని చెప్పాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**

**ఆగస్టు 38** **ఎమ్బీయస్ : సకలమా?... వికలమా?**

17 నుంచి సకలజనుల సమ్మె ప్రారంభమైందన్నారు. దాని గురించి మొదట ప్రకటించినప్పుడు భూనభోంతరాళాలు బద్దలై పోతాయన్నారు. క్రమేపీ అది నానాటికి తీసికట్టు నాగం భొట్లయి చివరకు బాగ్ లింగంపల్లి నుండి ట్యాంక్‌బండ్‌కి ర్యాలీగా పరిణమించింది. ఉద్యోగివర్గాలు సరైన సమయంలో మేలుకొని పక్కకు తప్పుకోవడంతో తెలంగాణ జాక్ బిక్కమొహం వేయాల్సి వస్తోంది. వాళ్లు రాజకీయనాయకులకు స్పష్టంగా చెప్పారు – మా భుజాల మీద తుపాకీ పెట్టి కాల్చవద్దు. మమ్మల్ని ముందుపెట్టి మీరు వెనక్కాల వుండవద్దు అని. అసలు మీ రాజీనామాలు ఆమోదింప చేసుకుని అప్పుడు మాట్లాడండి అన్నారు. ఉపన్యాసాలిచ్చి అవతలివాళ్లను ముందుకు తోయడం, ఆత్మహత్యలకు పురికొల్పడం చేయగలరు కానీ పదవులు పోగొట్టుకుంటారా నాయకులు !?

ఇక ఉద్యోగుల్లో కూడా రకరకాల సందేహాలు పుట్టుకుని వచ్చాయి. రాజకీయ కారణాల వలన సమ్మె చేస్తే సింపతీ వుంటుందా లేదా అని. ప్రభుత్వం కూడా అందిట – 'మీ సమస్యలు చెప్పండి, అన్నీ తీరుస్తాం,  మా పరిధిలో లేని తెలంగాణ విషయంపై మమ్మల్ని చంపితే మేమేం చేస్తాం? దానిపై సమ్మె చేస్తూ కూర్చుంటే నెలల తరబడి చేయాల్సి వుంటుంది' అని. 'పోనీ ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో వున్న మన సమస్యలు యిలాగైనా తీరతాయి కదా, తెలంగాణ వచ్చినప్పుడే రానీ' అన్న ఆలోచన ఉద్యోగుల్లో వచ్చిందట.

పైగా ఉద్యోగులందరూ తమ పిల్లల చదువుల గురించి చింతించేవారే. రాజకీయ నాయకుల పిల్లలకేముంది, చదువు రాకపోతే కాంట్రాక్టులు, సెటిల్‌మెంట్లు చేసుకుని బతకగలరు. వ్యాపారవేత్తల పిల్లలకు దుకాణం ఎవరెడీ. దెబ్బ తినేది మధ్యతరగతివాళ్లే. ఉద్యోగులందరూ మధ్యతరగతి వాళ్లే. తెలంగాణ ఎప్పుడొస్తుందో తెలియదు కానీ యీ లోపున పిల్లల చదువులు చెట్టెక్కుతున్నాయని

యింట్లో సణుగుడు ఎక్కువగా వుంటోంది. బంద్‌ల వలన సిలబస్‌లు పూర్తి కావటం లేదు. పూర్తి కావటం లేదన్న చింతతో కాలేజీవాళు శరవేగంతో పాఠాలు చెప్పేసి ఆర్నెల్ల కోర్సును మూణ్నెల్లలో ముగించేస్తున్నారు. వాళ్లు చెపితే మాత్రం పిల్లల బుర్రలకు ఎక్కాలా? వాళ్లు మనుష్యులా? లేక రజనీకాంత్ రోబోలా?

నాలుగో పాఠం వంటబడితేనే ఐదో పాఠం తలకెక్కుతుంది. నాలుగు, అయిదు, ఆరు, ఏడు ఒకేసారి చెప్పేసి కోర్సు అయిపోయిందంటూ చప్పట్లు కొట్టించేస్తే సరిపోతుందా? పరీక్షల్లో పేపర్లు లీక్ చేయిస్తాం, కాపీలు కొట్టనిస్తాం, యాజీగా దిద్దుతాం అని ఊరడిస్తే చాలుతుందా? రేపు కాంపిటీటివ్ పరీక్షలకు వెళ్లినపుడు సబ్జక్ట్ తెలియకుండా వెళితే ఎక్కడ తేలతారు? రాష్ట్రంలోనే సగభాగంలో... గట్టిగా మాట్లాడితే మూడింట రెండువంతుల భాగంలో విద్యార్థులు బంద్‌లు, సమ్మెలు, నిరసనలు, నినాదాల హెూరు, వంటావార్పులు లేకుండా చక్కగా చదివేసుకుంటున్నారా, వాళ్లంతా రాష్ట్రంలోనే పోటీకి నిలబడినప్పుడు పాఠాలే పూర్తిగా చదవని, వంటబట్టని యీ తెలంగాణ పిల్లలు ఎక్కడ నిలవగలుగుతారు? వాళ్ల భవిష్యత్తు ఏమవుతుంది? రాష్ట్రస్థాయిలోనే యిలా వుంటే జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయి పరీక్షలలో ఏమవుతుందో వేరే చెప్పనక్కరలేదు.

మీకు కనుక చదువుకునే పిల్లలుంటే, ఉద్యమం మాట ఎలా వున్నా, దీని గురించి తప్పక ఆలోచిస్తారు. తెలంగాణ తలిదండ్రులు ఆలోచించారు కాబట్టే యీసారి యీ ప్రాంతం నుండి ఇరవై వేల మైగ్రేషన్ సర్టిఫికెట్టులు జారీ అయ్యాయట. అంటే అంతమంది పై చదువులకు పిల్లల్ని యితర రాష్ట్రాలకు పంపించారన్నమాట. కొందరు ఆంధ్రప్రాంతానికి పంపించి చదివిస్తున్నారు. అక్కడ ఎడ్మిషన్లు 30% పెరిగాయట. ఇక్కడ అనేక కాలేజీలు విద్యార్థులు తగ్గి బావురుమంటున్నాయి. అక్కడ చదువు అమోఘంగా వుంటే పంపినా ఓ అర్థం వుంది. అసలు చదువంటూ వుంది, యిక్కడ అదీ లేదు కదా అంటున్నారు పంపినవారు.

ఒక మధ్యతరగతి ఉద్యోగికి పిల్లల్ని దూరప్రాంతంలో పెట్టి చదివించడం అంటే ఎంత క్షోభ, ఎంత ఖర్చు ! స్తోమత వున్నా లేకపోయినా అప్పోసొప్పో చేసి పంపాలి కదా. పైగా టెన్షన్. ఇప్పుడైతే అక్కడ ప్రశాంతంగానే వుంది. తెలంగాణ వారని వివక్షత చూపటం లేదు. రేపు యిక్కడ గొడవలు చెలరేగి, తెరాస ఎమ్మెల్యేలు చెప్పినట్టు ఆంధ్రప్రాంతీయులకు నీళ్లూ, కరంటూ కట్ చేసి, వారిపై ఆత్మాహుతి దాడులు జరిపి గొడవలు సృష్టిస్తే ఎలా? అక్కడ ప్రతిచర్యగా మన పిల్లల మీద దాడులు చేస్తే? అన్న భయం ఏ తండ్రికైనా, ఏ తల్లి కైనా వుంటుంది.

అందువలన తెలంగాణ సమస్య చప్పున తేలిపోయి మామూలు పరిస్థితులు ఏర్పడితే బతుకు జీవుడా అని మన పిల్లల్ని మన దగ్గరకు తెచ్చేసుకుంటే చాలు అనుకుంటారు. మనం సమ్మె చేయడం వలన సమస్య పరిష్కారం అవుతుంది అనుకుంటే సమ్మె చేస్తారు. ఇది రాజకీయసమస్య, రాజకీయంగా పరిష్కారం లభించాలి, సమ్మె చేసినా లాభం లేదు, పైగా సమ్మె చేస్తే జీతం విరక్కోస్తాం అంటోంది ప్రభుత్వం, అవును కోసే అధికారం వాళ్లకుంది అంటోంది కోర్టు, అటు జీతమూ రాక, యిటు చదువుల కారణంగా అదనపు ఖర్చులూ పెరిగి.. ఎంత రొష్టు ! ఇంతా చేసి వస్తుందో రాదో అన్న మీమాంసలో పడ్డారు ఉద్యోగులు. అందుకే సెప్టెంబరు 6 వరకు వాయిదా అన్నారు. మీరు ఉద్యోగి కాకపోయినా, సాధారణ పౌరుడు మాత్రమే అయినా ఏం ఆలోచిస్తారు చెప్పండి. ఒక్కో పార్టీని తీసుకుని ఉద్యమం కోణంలో వాళ్లు చేస్తున్నది పరామర్శించి చూస్తే యిలా వుండదూ...?

కాంగ్రెస్ – తెలంగాణ యిచ్చేట్టు అస్సలు కనబడటం లేదు. తెలంగాణ వచ్చేస్తుంది అని ఏ తెలంగాణ నాయకుడు ప్రకటించినా వెంటనే ఆజాదో, చిదంబరమో ఖండించేస్తున్నారు. 'చర్చలు ప్రారంభమయ్యాయి, నడుస్తున్నాయి, దేశంలో అందరి అభిప్రాయం తీసుకుని బహుళసమ్మతం (కాన్సెన్సస్ అంటే అదే అర్థం, ఏకాభిప్రాయం అని మన పేపర్లు రాసేది తప్పు) అయితేనే ముందుకు అడుగేస్తాం' అని. చిదంబరం మరీనూ. 'డిసెంబరు 9 తో బాటు 23 కలిపి చదవాలి. కాంగ్రెస్‌తో సహా అందరూ అభిప్రాయాలు చెప్పాలి. ఒకటే అభిప్రాయం వుండాలి. ఇదేం ఆషామాషీ వ్యవహారం కాదు' అంటూ. ఇక ప్రణబ్ ప్రకటనలు ఏమీ చేయలేదు కానీ డిసెంబరు 9 నాడు ప్రకటన చేయడం తప్పై పోయిందని అన్నట్టు సమైక్యవాదులు చెప్పేసుకుంటున్నారు.

ఈ వరస చూస్తే కాంగ్రెస్ ఫైనల్‌గా ప్రత్యేక తెలంగాణ యిచ్చినా హైదరాబాదుతో సహా యిచ్చేట్టు లేదు. చర్చలంటూ ఓ ప్రక్రియ మొదలుపెట్టి సాగిస్తోంది. ఎప్పుడో చేయాల్సిన పని. ఇప్పుడే ఆ ఐడియా వచ్చినట్టు మొదలెట్టింది. పైగా దానికి ఆజాద్‌ను యిన్‌చార్జి చేసింది. ఆయనకు నడుం నొప్పిట, రంజాన్ ఉపవాసాలట. ఎక్కువ సేపు కూర్చోలేను, ఐదుగురో, పదిమందో రండి చాలు, చప్పున చెప్పి వెళ్లండి అంటున్నాడు. కానీ యిటు తెలంగాణ, అటు కోస్తా, సీమలవాళ్లు ఆ మాట పట్టించుకోకుండా తొంబలు తొంబలుగా వెళుతున్నారు. ఆయనకు ఎంత విసుగు వస్తోందో ఏమో. చర్చలు రెండు నెలలు, మూడు నెలలు అంటున్నాడు. డెడ్‌లైన్లు పెట్టకూడదట.

అసలు వాళ్లు చెప్పేదానికీ, వీళ్లు చెప్పేదానికీ పొంతనే వుండటం లేదు, గ్రేటర్ హైదరాబాదులో ఆంధ్రప్రాంతీయులు 5 లక్షలమంది వుంటారని టి వాళ్లంటే, అబ్బే 50 లక్షలని ఎ వాళ్లంటారు. ఇలా అయితే ఎవరిని నమ్మాలి? టి వాళ్లు ఆజాద్ దగ్గరకు వెళ్లినపుడు హైదరాబాదులో 'సీమాంధ్రుల' పెట్టుబడులు 5% కంటె లేవన్నారు. ఐటీ ఉద్యోగాలలో కూడా నార్త్ యిండియన్సే ఎక్కువ అన్నారు. మళ్లీ బయటకు వచ్చి ఉద్యోగాలన్నీ ఆంధ్రావాళ్లే కొట్టేశారన్నారు. పరిశ్రమల్లో 90% వాళ్లవే అన్నారు. ఆజాద్ ఎదుటా, విడిగా ఒకటే మాట్లాడితే బాగుండును. ఇలా తేడాలొస్తే ఆజాద్ మరింత గందరగోళపడి చివరకు ఏం రిపోర్టు యిస్తాడో ఏమో.

చర్చల్లో మధ్యేమార్గం అంటూ ఒకటి తేలి, హైదరాబాదును పూర్తిగా యివ్వకపోతే ఉద్యమకారులు చల్లారతారా? అసలు కాంగ్రెస్ ఏమనుకుంటోంది. పార్లమెంటులో సర్వే చేతా మాట్లాడించింది, కావూరి చేతా మాట్లాడించింది. అత్తతో అమ్మి, కోడలుతో కొన్నట్టుంది.

తెలంగాణలో ప్రజాభిప్రాయం ఎలా వుంటే అలా మొగ్గుతుందేమో. అది తెలుసుకోవడానికే లగడపాటి చేత సర్వేలు చేయిస్తోందా? లగడపాటి సాధారణంగా హై కమాండ్ మనసెరిగినట్టు మాట్లాడుతూంటాడు. అతని జోస్యాలు ఫలిస్తూంటాయి. పరిష్కారం త్వరలో వస్తుందని అంటున్నాడు కానీ తెలంగాణ యిచ్చేస్తారని అనటం లేదు.

లగడపాటి హై కమాండ్‌కి బాగా క్లోజ్ అన్న సంగతి, జగన్‌పై సిబిఐ పెట్టిన చార్జిషీటులో వాళ్ల తమ్ముడిపేరు తీసేయడంలోనే కనబడుతోంది. అంతేకాదు, లగడపాటి ఉద్యమంలో నిరంతరం చురుకుగా వుండరు. కృష్ణ కమిటీకి తను యిచ్చిన నివేదిక లక్షలాది కాపీలు ముద్రించి రాష్ట్రమంతా పంచుతానన్నారు. పంచనేలేదు. ఎప్పుడెప్పుడు హై కమాండ్ కదలిక తెద్దామనుకుంటుందో అప్పుడు లగడపాటిని ఉపయోగించుకుంటుందని తోస్తుంది. అలాగే వి హనుమంతరావు కూడా, హై కమాండ్ మనసెరిగి నడుచుకోవడంలో ఘనుడు. ఆయన రాజీనామా చేయలేదంటేనే తెలుస్తోంది. ఇప్పుడప్పుడే హై కమాండ్‌కి తెలంగాణ యిచ్చే వాలకం లేదని !

టి కాంగ్రెస్ ఎంపీలు మాత్రమే చాలా చురుగ్గా ఉద్యమాన్ని నడుపుతున్నారు. రాజీనామాలు చేశారు, చేయించారు. దెబ్బకి సోనియా ప్రత్యేక విమానంలో దిగి వచ్చి తెలంగాణ యిస్తుందని అనుకున్నారు, అన్నారు. రిజైన్ చేసి నెలన్నర అయింది. హై కమాండ్ మెట్టు దిగి రాలేదు. వీళ్లు బెట్టుగా చాలాకాలం వున్నారు. కానీ ఎంతకాలం వుండగలరు? లోకసభ స్పీకరు పిలిచి మాట్లాడను కూడా మాట్లాడలేదు. ఆగస్టు 1 కల్లా తేల్చేస్తానన్నారు. ఆ గడువు దాటి మూడువారాలైంది. ఉలుకూ పలుకూ లేదు. వీళ్లూ ఆవిడ ఆఫీసు ముందు ధర్నాలు చేయడం లేదు. ఎందుకంటే తొందరపడి ముందే బ్రహ్మాస్త్రం ప్రయోగించేశాం అని అనుకుంటున్నారు కాబట్టి.

బయటకు చెప్పరు కానీ లోపల్లోపలి తర్జనభర్జనలు అర్థమౌతూనే వున్నాయి. వీళ్లతో బాటు రిజైన్ చేయని సర్వే ఆ రోజు పార్లమెంటులో తెలంగాణ వీరుడిగా వెలిగిపోయాడని వీళ్లకు దుగ్ధ పుట్టి వుంటుంది. విప్ జారీ చేసినా వీళ్లు మాట వినలేదని కోపగించిన హై కమాండ్ సర్వేని మెచ్చి ఏ కమిటీలోనో సభ్యుడిగా వేయవచ్చు. ఇప్పుడు ముగ్గురు ఎంపీలు మేము పార్లమెంటు హాజరవుతాం అని ఖచ్చితంగా చెప్పారు. తెలంగాణపై మొదటినుండీ గట్టిగా, ధైర్యంగా మాట్లాడే మధు యాష్కీ వారిలో వుండడం ఆశ్చర్యం. అతను రాహుల్ గాంధీకి క్లోజని ప్రతీతి. ఒకవేళ యిప్పట్లో యిచ్చేది లేదనీ, మీరు యిలా ప్రవర్తిస్తే నేను మా అమ్మని కన్విన్స్ చేయడం కష్టం అనీ రాహుల్ మధుకి చెప్పారా? ఏమో !

తక్కినవాళ్లకు కూడా ధైర్యం జారుతోంది. మామూలుగా పార్లమెంటుకి వెళ్లం కానీ ఓటింగు వున్నపుడు మాత్రం వెళతాం అని నొక్కులు నొక్కారు యివాళ. మిగతాటప్పుడు ఏం చేస్తే ఎవరికి కావాలి? ఇన్నాళ్లూ ఏవో దేశసమస్యల గురించి పార్లమెంటులో అదుతేమైన ఉపన్యాసాలు యిచ్చేసినట్టు, యిప్పుడు యివ్వం పొమ్మన్నట్టు పెద్ద పోజు దేనికి? వీళ్లంతా హెడ్‌కౌంట్‌కే పనికి వస్తారు. ఓటింగు టైములోనే వీళ్ల గురించి వెతుకుతారు. అప్పుడు వుండి ప్రభుత్వాన్ని కాపాడతాం అంటే దాని అర్థం పార్లమెంటుకి హాజరవుతారనే. అంటే వీళ్ల స్ట్రాటజీ చీదేసిందనే, 'బ్లాక్' మెయిల్ రంగు మాసిపోయిందనే అర్థం.

లేస్తే మనిషిని కానట్టు వుండాలి తప్ప, లేచి చూపించకూడదు. (యువతరానికి సామెతలతో పరిచయం తగ్గిపోతోంది కనుక, దీని గురించి తెలియనివారికోసం యిది వివరిస్తాను – ఒకూళ్లో ఒక వస్తాదుకి ఏదో ప్రమాదంలో కాళ్లు పోయాయి. తిండి గడవడం మానేసింది. అందువలన అతను వేరే వూరెళ్లి ఇంటి అరుగుమీద పడక్కుర్చీలో కూర్చుని కాళ్లమీద దుప్పటి కప్పేసి దారిన పోయేవారిని దబాయించి డబ్బులు లాగేవాడు. ఎవడైనా మొరాయిస్తే 'లేస్తే మనిషిని కాను జాగ్రత్త' అనేవాడు. నడుం దాకా అతని కండలూ అవీ కనబడతాయి కదా, వీడు లేస్తే మనిషి కాదు, మృగంలా మారుతాడు కాబోలని జనం అదలిచచ్చి అడిగినంతా యిచ్చి పోయేవారు. ఓ రోజున ఓ మొండివాడు లేచి చూపించు చూద్దాం అని ఛాలెంజ్ చేసి, ఊళ్లో వాళ్లముందు లేవగొట్టించాడు. చూస్తే ఏముంది? విరిగిన కాళ్లు. "అందుకే నేను చెప్పా, లేస్తే మామూలు మనిషిని కాను...అవిటివాణ్ని" అని సంజాయిషీ యిచ్చుకున్నాడు వస్తాదు. అతని వాక్చమత్కారానికి అంతా ఫక్కున నవ్వి క్షమించేశారు.)

తెలంగాణ ప్రజాప్రతినిథులందరూ కలిసి రాజీనామాలు యిస్తే మిన్ను విరిగి మీద పడుతుందన్న భయం కల్పించాలి తప్ప రాజీనామాలు యిచ్చేయకూడదని మనకు తెలియకపోయినా వాళ్లకు తెలియాలి. వాళ్ల బలం ఎంతో కనీసం వాళ్లకు –మన వస్తాదు గారిలా – తెలుసుకాబట్టి బెదిరింపులతో సరిపెట్టాలి. కానీ వాళ్లను సామెతలో మొండివాడిలా లేవగొట్టి వాళ్ల అవిటితనం బయటపెట్టినవాడు కెసియార్. మీరు రాజీనామాలు చేయండి, చాలు తెలంగాణ బంగరు పళ్లెరంలో వచ్చిపడుతుంది అని ఊదరగొట్టి, బయట ప్రజల్లో కూడా తెలంగాణ రాకపోవడానికి కారణం యిదిగో వీళ్లు రాజీనామాలు చేయకపోవడమే కారణం అని చెప్పి నమ్మించసాగాడు.

అంతేకాదు, తన కామ్రేడ్ కేకే ద్వారా కాంగ్రెస్ వాళ్లను భ్రమపెట్టాడు. జాంబవంతుడు ఆంజనేయుణ్ని ఉబ్బేసినట్టు ఉబ్బేయించాడు. మనం తలచుకుంటే యీ ప్రభుత్వం ఉఫ్ అన్నాడు. తెలంగాణ యిచ్చేస్తారు. ఆ క్రెడిట్ అంతా మనదే, ఎన్నికల్లో గెలుపు మనదే, కెసియార్ కేసి జనం చూడనే చూడరు అన్నాడు. దాంతో పొన్నం, గుత్తా, వివేక్.. అందరూ ఆంజనేయుళ్లా సముద్రం లంఘించబోయారు. చిక్కేమిటంటే వీళ్లు ఆంజనేయుళ్లు కారు. అందువలన సముద్రంపై ఎగరవలసినవాళ్లు నడిసంద్రంలో దుబుక్కున పడ్డారు. మునిగారు. ఉన్నబట్టలు వూడాయి. ఇప్పుడు బట్టలిచ్చి కాపాడి మర్యాదగా గట్టెక్కించేవాడెవడా అని చూస్తున్నారు. ఆనరబుల్ ఎగ్జిట్ కూడా అంత వీజీ కాదు. అందునా అది ఆజాద్ చేతిలో వుంది.

వీళ్లను ఉబ్బేసి ట్రాప్‌లో పడేసి యీ కాంగ్రెస్ వస్తాదులు అవిటివాళ్లని, చేతకానివాళ్లని జనాలకు నిరూపించిన కెసియార్ కడుపుబ్బా నవ్వుకుంటూ వుండవచ్చు. ఒకవేళ తెలంగాణ వచ్చినా యీ కాంగ్రెస్ వాళ్ల ప్రతాపం వలన మాత్రం కాదు అని ప్రజలకు తేటతెల్లంగా తెలిసిపోయింది. తెలంగాణ ఎన్నికలలో కాంగ్రెస్‌వాళ్లను యీ విషయంగా గౌరవించి ఓట్లేయడం కల్ల. నెగ్గితే వేరే రకంగా నెగ్గవచ్చు తప్ప వీళ్లకు హై కమాండ్ వద్ద పరపతి లేదని, వీళ్ల మాట చెల్లుబాటు కాదనీ రుజువైంది. గతంలో వైయస్ తెరాస చేత యుపిఏ నుండి, రాష్ట్ర కాబినెట్ చేత రిజైన్ చేసే పరిస్థితి తెచ్చిపెట్టి, వాళ్లు వున్నా వెళ్లిపోయినా ఒకటేనని, గుడ్డికన్ను మూసినా తెరిచినా ఒకటేననీ రుజువు చేశాడు. ఇప్పుడు కెసియార్ పగ తీర్చేసుకున్నారు. ఈ కాంగ్రెస్ ఎంపీల వలన ఒరిగేది ఏమీ లేదని తేల్చి వీళ్ల స్థానాన్ని పలుచన చేశారు.

అసలు కాంగ్రెస్ ఎంపీలను యీ దారి పట్టించినది కేకే. ఆయనలో ఏ నాయకత్వ లక్షణాలు ఈ ఎంపీలు చూశారో నాకైతే అర్థం కాదు. ఆయనకు ఎలా మాట్లాడాలో తెలియదు. సోనియాను తప్ప అందరు కాంగ్రెస్ నాయకులనూ బహిరంగంగా తిట్టారు. ఆవేశం ఎక్కువ, కమ్యూనికేషన్ స్కిల్స్ పూజ్యం, దీనికి తోడు కెసియార్‌కు క్లోజని హై కమాండ్‌కు అనుమానమని మన సందేహం. ఆయన రాజీనామా ఆమోదిస్తే నష్టం ఏమీ లేదు కాబట్టి ఆమోదిస్తారని అంటున్నారు. అది జరిగితే మన సందేహం ధృవపడుతుంది.

ఇక టి మంత్రులు – వీళ్ల పరిస్థితి ఎంపీల కంటె కనాకష్టంగా వుంది. ఎమ్మెల్యే పదవులకు రాజీనామాలిచ్చారు, మంత్రిపదవులకు యివ్వలేదు. పని చేయటం లేదంటూ ఉద్యమకారులు సానుభూతి కోరతారు. దొంగచాటుగానైనా పని చేయకపోతే ఉన్న ఉద్యోగం పీకేస్తారేమోనని ఇంటి దగ్గర్నుంచి పనిచేస్తారు. ఫైళ్లమీద సంతకాలు పెడుతున్నాం కదా జీతాలు పుచ్చుకుంటే తప్పేముంది అని క్లెయిమ్ చేస్తారు. నో వర్క్, నో పే అని మీ ఉద్యోగులకు ఓ పక్క చెపుతూ మీరు మాత్రం పనిచేయందే జీతాలు ఎందుకు పుచ్చుకుంటున్నారు? అని ఉద్యమకారులు నిలదీస్తే మొహం వాల్చేస్తారు. తేలుకొట్టిన దొంగలంటే వీళ్లే. రాజీనామా చేసిన కాంగ్రెస్ ప్రజాప్రతినిథుల సమావేశానికి రమ్మంటే సగానికి సగం మంది దుమ్మా కొడతారు.

ఏ పని చేసినా అర్ధమనస్కంగా చేస్తారు. దోభీకా కుత్తా న ఘర్‌కా, న ఘాట్‌కా అన్నట్టు వీళ్లను సిఎమ్మూ నమ్మడు, ఉద్యమకారులూ నమ్మరు. సోనియా అసలే నమ్మదు. వీళ్లు ఫిబ్రవరిలో ఎపాయింట్‌మెంట్ అడిగితే యిప్పటిదాకా యివ్వలేదట. అక్కడే తెలిసిపోయింది మన పస. ఆగస్టు 15 ఫంక్షన్‌కి వెళతామని కాస్సేపు, వెళ్లమని కాస్సేపు, చివరకు ఏ సందేశం ఎక్కణ్నుంచి వచ్చిందో వెళ్లారు. కాబినెట్ మీటింగు సెక్రటేరియట్‌లో అయితే రారట, క్యాంప్ ఆఫీసులో అయితే వస్తారట. నెమ్మదిగా సెక్రటేరియట్‌కు కూడా రా నారంభించారు. సోమవారం నాటికి అందరూ వచ్చేయవచ్చేమో కూడా. 'రాను రానంటూనే చిన్నదీ రాములారి గుడికి వచ్చింద'న్నట్టు యీ బెట్టు ఎందుకు, యీ విడుపులు ఎందుకు? దీపం వుండగానే యిల్లు చక్కబెట్టుకోవాలని తాపత్రయమా? కాంట్రాక్టర్ల వద్ద కమిట్ అయి, మధ్యలో ఫైలు చూడడం మానేసామంటే వాళ్లు వూరుకోరన్న భయమా? వెళ్లిపోదామని నిశ్చయించుకున్నపుడు స్టీరింగ్ కమిటీకి ఓ మాట చెప్పి వెళ్లడం కూడా చేయటం లేదు. ఎవరి నిర?యం వాళ్లదే.

వీళ్లందరిలో జూపల్లి ఒకరే సిన్సియర్. ఆయన మంత్రి పదవి వదిలేసి రోడ్లు పట్టుకుని పాదయాత్రలు చేస్తున్నారు. అవునూ, యీ మధ్య మానేశారా ఏమిటి? డికె అరుణ ససేమిరా అన్నంతసేపూ గట్టిగా చేశారు, రాజీ కుదిరాక యీయనకూ ఉత్సాహం చచ్చినట్టుంది. కెసియార్ తెలంగాణ తల్లి విగ్రహాల స్థాపనలాగే వుంది ! కోమటిరెడ్డి కూడా విధులకు వెళ్లటం లేదు కానీ దానికి వెనకాల జగన్ వున్నాడన్న అనుమానం నాకుంది. తెలంగాణ కోసం అనడం కంటె కిరణ్‌కుమార్‌ని యిబ్బంది పెట్టడం కోసం అనడం సమంజసమేమో!

ఇక టి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. వీళ్లు ముందునుంచీ నీరసంగానే వున్నారు. యాక్టివ్‌గా వున్నవాళ్లు ఓ గుప్పెడుమంది వున్నారేమో. సిటీలో వాళ్లు సాధ్యమైనంతవరకు చేయకుండా వుండడానికి చూశారు. కొంతమంది చెయ్యను కూడా చేయలేదు. స్పీకర్ తిరస్కరిస్తే ఏమీ కళవెళపడలేదు. మీటింగులు పెడితే సగం మంది కంటె తక్కువే వస్తారు. బయట చర్చల్లో కనబడరు. గాలి ఎటు మళ్లితే అటు వుందాం అన్నట్టుగా కూర్చున్నారు. చూదాం ముందు ముందు ఏం జరుగుతుందో !

సోనియా అనారోగ్యం, రంజాన్, వినాయక చవితి, 14 ఎఫ్ రద్దు యివన్నీ చెప్పి కాంగ్రెస్ వాళ్లు ఉద్యమానికి విరామం యిస్తున్నారు. సాఫ్ట్ పెడల్ చేస్తున్నారు. మళ్లీ ఎప్పుడు పుంజుకుంటుందో తెలియదు. ఆజాద్ గారు కోస్తా, సీమ వారితో చర్చలు ప్రారంభించారు. ఇద్దరికీ మధ్యేమార్గంగా ఏదో ఒకటి చెప్తారేమో. అది కాంగ్రెస్ వారు ఆమోదించాలి. తక్కిన పార్టీలు కూడా సై అనాలి. ఫైనల్‌గా తెరాస కూడా ఆమోదిస్తేనే కథ ముందుకు సాగుతుంది. తన చేతిలో వున్న వీటో పవర్‌ను కెసియార్ ఎలా వాడతారో వేచి చూడాల్సిందే.

ఇక టిడిపి – నాగం వెళ్లిపోయాక బాబు టి–టిడిపివారికి స్వేఛనిచ్చారు. వాళ్లు రాజీనామాలు చేసినా, కోస్తా, సీమల వాళ్లను పడతిట్టినా, వీరాలాపాలతో బస్సు యాత్రలు చేసినా తెరాస వారు మాత్రం వారిని ఆమోదించలేదు. తెలంగాణ జాక్‌లో చోటు యివ్వటం లేదు. టిడిపిలో ఎర్రబెల్లి దయాకరరావు మరీ ఎక్కువ వుత్సాహం చూపడంతో మోత్కుపల్లికి మండింది. కడియం శ్రీహరి ఎప్పటినుండో గుర్తింపు కోసం చూస్తున్నారు. ప్రాడిగల్ సన్ దేవేందర్ ఎలాగూ వున్నారు. వీరందరితో కలిసి బాబు తన తెలంగాణ నిర?యం వచ్చేలోపున తన పుట్టి మునగకుండా చూసుకుంటున్నారు.

తెరాస వారు, ప్రజాసంఘాలవారు అందరికీ బాగా నేర్పి పెట్టారు – టిడిపివారు నోరెత్తితే మాట్లాడితే బాబును చెప్పమనండి అంటూ నిలదీయండి అని. సోనియాపై కంటె, బాబుమీదే వాళ్లకు కసి. కాంగ్రెస్‌తో చేతులు కలిపి టిడిపిని మట్టు పెట్టడమే తెరాస లక్ష్యం అని టిడిపి ఎప్పణ్నుంచో అంటోంది. మొన్న వాళ్లు రాజీనామాలు చేసినా కూడా తెరాస ఆహ్వానించకపోవడంతో అది

రుజువైంది. ఎర్రబెల్లి అది ఎత్తి చూపితే మేం ఎందుకు ఆహ్వానించాలి, ప్రజలు ఆహ్వానిస్తారేమో చూసుకోండి చాలు అన్నారు హరీష్ రావు ఓ టీవీ చర్చలో.

తెలంగాణ కోసం బొంతపురుగునైనా ముద్దాడతాననే కెసియార్, సాటి తెలంగాణ నాయకులు, తెలంగాణలో ఎంతో క్యాడర్, ఓటు బ్యాంకు, గుడ్‌విల్ వున్న టిడిపి తమ చెంత చేరుతూంటే కనీసం మర్యాదకైనా, కడుపులో ప్రేమ లేకపోయినా కౌగలించుకోవచ్చు. తెలంగాణ వచ్చిన తర్వాత బలాబలాలు తేల్చుకోవచ్చు కానీ యిప్పుడు ఎట్‌లీస్ట్ ఫర్ ఎప్పియరన్సెస్ కలిసి పనిచేస్తామనవచ్చు. మరీ అంటరానివాళ్లలా చూసి, వాళ్ల యాత్రలు అడ్డుకోనక్కరలేదు. కెసియార్ రానీయటం లేదు కాబట్టి వీళ్లు గద్దర్‌ను పట్టుకోబోయారు. గద్దర్ మావోయిస్టు మిత్రులు బాబుగారి టిడిపిను ఆమోదించలేమన్నారో ఏమో అక్కడ పాజిటివ్ సిగ్నల్ రాలేదు.

దాంతో టిడిపి వారు కొండా లక్ష్మణ్‌ను ఆశ్రయించి ముందుకు పెట్టుకుని వెళ్లడానికి చూస్తున్నారు. ఆ లక్ష్మణుడు కోదండ 'రాముడి' వెంట నడవరు. వేరు బాట పట్టి కెసియార్‌ని విమర్శిస్తున్నారు. ఆయనకు గ్లామర్ లేదు కానీ క్రెడిబిలిటీ పెరిగి నాయకుడు కాబోతూండగానే లగడపాటి దిగబడ్డారు. ఇంకో రెండు రోజులకు జెసి. వీళ్లందరితో మాట్లాడి బాపూజీ మైల పడిపోయారని కెసియార్ గోల చేయడం ఖాయం. సమైక్యవాదులతో రాజీ పడి చర్చలు ఆరంభించిన బాపూజీకి తనను విమర్శించే హక్కు లేదంటారు. ఆ విధంగా ఎ-కాంగ్రెస్ నాయకులు బాపూజీని ఉద్యమంలో పనికి రాకుండా చేశారు.

ఇక టిడిపిలోనుండి బయటకు వచ్చిన నాగం – ఆయన ఎటు వెళుతున్నారో ఆయనకే తెలియదులాగుంది. రాజీనామాలు చేశార కాబట్టి సడన్‌గా మమ్మల్ని నెత్తిన పెట్టుకోవాలి అంటే ఎలా? ఈ పని తెరాసవాళ్లు ఎప్పుడో, ఎన్నిసార్లో చేశారు, మీరు యిన్నాళ్లకు, అదీ బాబు మీద కోపంతో చేశారు. బయటకు వచ్చినా బాబును తిట్టడం తప్ప వేరే పని లేదు. రాజీనామాలు ఆమోదింప చేసుకుంటే ప్రజలంతా యీయన్నే నాయకుణ్ని చేస్తారనే ఆశ కాబోలు, స్పీకర్ మిస్సింగ్ అని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు యిచ్చారు. ఆగస్టు 15 నాడు పబ్లిసిటీకై తెలంగాణ జెండా ఎగరేయడం లాటి ఏదో హంగామా చేయబోయారు.

కనబడిన పోలీసులను నువ్వే జిల్లా వాడివి నీ పని బడతా అననారంభించా రీమధ్య ! ఇన్నేళ్ల రాజకీయ అనుభవం, మంత్రిగా చేసిన అనుభవం, ఉన్నతవిద్య ఎక్కడికి పోయాయో తెలియదు. ఇప్పుడు గుర్తింపు కోసం హుందాతనం మరచి యిలాటి వింతవింత పనులు చేస్తున్నారు. బాబును తిట్టి తిట్టి తెరాసకో, (జయపాల్ ద్వారా) కాంగ్రెస్‌కో క్లోజ్ ఏమోనన్న అభిప్రాయం కలిగిస్తున్నారు. ఎవరైనా యితన్ని బాబును ఏడిపించడానికే ఉపయోగించుకుంటారు కానీ తమ పార్టీలో చేర్చుకుని యిబ్బంది పడరని నా అనుమానం.

ఇక బాబు – జగన్ కూడా తనతో బాటు గోడమీద వచ్చి కూర్చోవడం ఊరట నిచ్చింది. అతనూ సమైక్యవాదానికి జై అని వుంటే ఈయనపై కోస్తా, సీమలనుండి ఒత్తిడి పడేది, నువ్వూ అను అని. ఇప్పుడు ఆ బాధ లేదు. అందువలన ఇటు తెలంగాణ పార్టీ శాఖను, అటు ఆంధ్రశాఖను ఏం కావాలంటే అది చేసుకోండి అని స్వేఛ్ఛనిచ్చేశారు. ఎవరి యిష్టం వచ్చినట్టు వారు మాట్లాడేస్తున్నారు. అంతలో కాంగ్రెస్ యిప్పట్లో యీ సమస్యను తేల్చదన్న అభిప్రాయం కలిగింది ఆయనకు. జగన్ విషయంలో చిదంబరంతో జరిగిన రహస్య సమావేశాల్లో అడిగి చూశారేమో మరి. మరీ ఆవేశపడవద్దని క్యాడర్‌కి చెప్పారు.

దాంతో టి టిడిపివారు రాజీనామాల విషయంలో కాంగ్రెస్ దారిలో నడుస్తున్నారు తప్ప నాగం బాటలో లేరు. ఎటొచ్చీ రాజీనామాలు చేయడం వలన జనంలో తిరిగే మానసిక స్థయిర్యం వచ్చింది. ప్రజలు అప్పుడేదో తిరస్కరించారని, ఇప్పుడేదో గౌరవించారని అనుకోవడం అనవసరం. ఎందుకంటే అప్పుడు కోడిగుడ్లు విసిరిన జనాభాయే యిప్పుడూ విసురుతున్నారు. అప్పట్లో రాజీనామాలు చేయలేదు కాబట్టి అన్నారు, యిప్పుడు బాబు ఫోటో పెట్టినందుకు.. అంటున్నారు. రేపు రాజీనామాలు ఆమోదింప చేసుకోనందుకు.. అంటారు.

రాజీనామాలు నిజంగా ఆమోదింపచేసుకోవడానికి టిడిపి వారికి భయం. వచ్చే ఎన్నికలలో తెరాస వీళ్లను ఆమోదిస్తుందా లేదా అని. బాబు పంచనుండి బయటకు రాలేదు కాబట్టి పోటీ అభ్యర్థులను పెట్టి ఓడిద్దాం అనే స్లోగన్ తెరాస బిజెపి యిస్తే వీళ్ల పని మటాష్. అందుకే వీళ్లు తెలంగాణ వచ్చేదాకా మళ్లీ ఎన్నికలకు నిలబడవద్దు అనే స్టాండ్ తీసుకున్నారు. చాలా మెచ్చుకోదగినదిగా కనబడుతోంది అది. ఒకవేళ ఎన్నికలు వస్తే, అమరవీరుల కుటుంబాలకు యిద్దాం అన్న స్లోగన్ కూడా యిచ్చారు. దాన్ని బట్టి అమరవీరుల కుటుంబాలు టిడిపి వైపుకి వస్తాయా అని ఎదురు చూస్తే వాళ్లూ రాలేదు. చిదంబరం టిడిపి అభిప్రాయం కూడా ముఖ్యమే అని బహిరంగంగా ప్రకటించి వీళ్లను యిరకాటంలోకి నెట్టాడు. బాబు మాదేముంది, కేంద్రం నిర?యం తీసుకోవాలి అంటారు తప్ప, కేంద్రం తీసుకున్న నిర?యాన్ని ఆమోదిస్తాం అని అనటం లేదు. ఔననో, కాదనో అప్పుడు వెలిబుచ్చే అభిప్రాయం ఏదో యిప్పుడే చెప్తే పోయె కదా.

ఇక బిజెపి – ఇప్పుడు తెలంగాణ వుద్యమంలో అందరి కంటె ముందున్నది బిజెపి, దాని అనుబంధ సంస్థ ఎబివిపియే. వాళ్లే కాదు, ఆ సంస్థల పట్ల సింపతీ వున్న త్రిపురనేని హనుమాన్ చౌదరిగారి వంటి మేధావులు యిప్పుడు తెరాస వాదనకు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని కూడగడుతున్నారు. కేంద్రంలో కూడా బిజెపియే తెలంగాణకు పెద్దదిక్కయింది. రాష్ట్ర నాయకులు యిచ్చిన సమాచారం పెట్టుకుని పార్లమెంటులో సుష్మా స్వరాజ్ చెలరేగారు. కానీ దానిలో వున్న పొరపాట్లు ఎ కాంగ్రెస్ పార్లమెంటేరియన్స్ బయటపెట్టడంతో ఆవిడ క్రెడిబిలిటీ దెబ్బ తింది.

తెలంగాణ యిస్తానని 2004 సోనియా సభలో వాగ్దానం చేసింది అన్నమాట తప్పని మీకూ నాకూ కూడా తెలుసు. సోనియా

ఎంతసేపూ 'తెలంగాణ ప్రజల అభీష్టం నాకు తెలుసు' అంటూ వచ్చారు కానీ 'తెలంగాణ యిస్తాను' అని అనలేదు. ఎలా అనగలరు? తెరాసతో చేసుకున్న రాతపూర్వకమైన రహస్య ఒప్పందంలో రెండో ఎస్సార్సీకి తెరాసను ఒప్పించారు కదా ! అలాటప్పుడు రెండో ఎస్సార్సీ లేకుండా తెలంగాణ యిస్తానని ఎలా చెప్పగలరు? (అలాగే కాంగ్రెస్ 2009 మానిఫెస్టోలో తెలంగాణ యిస్తానని చెప్పిందని సర్వేనో, ఎవరో అన్నారు. అదీ తప్పే. మానిఫెస్టోలో అలా లేదని ఎప్పుడో తేలింది. పైగా 2009 ఎన్నికల సభలో తెలంగాణలో సోనియా చేత జై ఆంధ్రప్రదేశ్ అనిపించారు వైయస్సార్) తెరాస కానీ, టి ఉద్యమకారులు కానీ మాటిమాటికీ అనేది 'తెరాస కండువా వేసుకున్నపుడు సోనియాకు తెలియలేదా తెలంగాణ యివ్వాలని' అనే. మొన్న కెసియార్ కాంగ్రెస్ కండువా వేసుకున్నారు కాబట్టి ఆజాద్ నిర?యానికి కట్టుబడతారా, పిచ్చిగానీ. సోనియా అలాటి స్టేటుమెంటు యిచ్చివుంటే దాని వీడియో ఈ పాటికి టి ఛానెల్‌లో రోజుకి పదిసార్లు వేసి వుండేవారు. ఇవేవీ ఆలోచించకుండా సుష్మా ఏదో మాట్లాడేశారు.

అలాగే నిజామాబాద్‌లో నెహ్రూ స్పీచ్. 'తుంటరి వరుడు, అమాయకపు వధువు' అని వరి?ంచారు అంటే కాబోసనుకున్నాం. నెహ్రూగారికి యిలాటి ఉపమానాలంటే యిష్టం కాబట్టి అన్నా అని వుండవచ్చు అనుకున్నా. ఈ మాట ఎప్పణ్నుంచో చెప్తూ వచ్చారు – టి ఉద్యమకారులు. ఇప్పుడు సుష్మా అనగానే దాన్ని లగడపాటి ఛాలెంజ్ చేశారు, నెహ్రూ అలా అనలేదని. సుష్మా ఖండించలేదు. ఎందుకంటే మనకు చెప్పినదే టి ఉద్యమకారులు ఆవిడకీ చెప్పారు.

గ్రౌండ్ రియాలిటీ ఎలా వుందో ఆ విషయంలో కూడా బిజెపి హై కమాండ్‌కి తప్పుడు సమాచారం వెళుతోందేమో యిప్పుడు తెలియదు. కాంగ్రెస్ హై కమాండ్ యిలాగే అరకొర సమాచారంతో డిసెంబరు 9 స్టేటుమెంటు యిప్పించి యిప్పుడు దిద్దుబాటు చర్యలతో సతమత మవుతోంది. రెండు ప్రాంతాలలో దెబ్బ తింటామేమోనన్న భయం వారిని వణికిస్తోంది. బిజెపికి ఆ భయం లేదు. ఎందుకంటే వారికి పోవడానికి ఏమీ లేదు. ఉన్న బలం ఏదో తెలంగాణలోనే వుంది. వస్తే నాలుగైదు సీట్లు యిక్కడే రావాలి. అందుకని సమరోత్సాహంతో వున్నారు. టాంక్‌బండ్ విధ్వంసంలో, ప్రత్యేక ఉద్యమాన్ని సమర్థించని వారిపై దాడి చేయడంలో బిజెపి, ఎబివిపి క్యాడరే ముందు వుంటోందని వార్తలు.

తెరాస తప్ప తక్కిన అన్ని పార్టీలూ రాజకీయజాక్‌ను దూరంగా పెట్టేసినా, జాక్‌ను అంటిపెట్టుకున్న మరో పార్టీ బిజెపియే. సకల జనసమ్మె కూడా ఎంతో ఉత్సాహంగా చేద్దామనుకున్నారు. రంజాన్ కారణంగా వాయిదా వేయమని ముస్లింలు కోరితే తక్కిన పార్టీలు సరేనన్నాయి కానీ వద్దు వాయిదా వేయవద్దు అని బిజెపి గట్టిగా చెప్పి చూసింది. బిజెపి ఉత్సాహం చూసి కేంద్రంలో కాంగ్రెస్, స్థానికంగా మజ్లిస్ వణుకుతున్నాయి. ప్రత్యేక రాష్ట్రం యివ్వడానికి కాంగ్రెస్, దాని అనుబంధ పార్టీలు మరింత సంకోచిస్తున్నాయి. ఇక మజ్లిస్‌కైతే బిజెపి బూచిని చూపి ముస్లిములను భయపెట్టడానికి మరింత అనువుగా వుంది. ఇప్పటివరకు హైదరాబాదు కాక తక్కిన జిల్లాలలో ప్రత్యేక ఉద్యమం పట్ల సానుభూతి వున్న ముస్లిములు కూడా బిజెపి ముందంజ చూసి భయపడుతున్నారు. కెసియార్ సెక్యులర్ అని తెలిసినా, అతను ఎప్పటికైనా బిజెపితోనే అంటకాగుతాడని అందరికీ తెలిసినదే. ఇప్పుడే యిలా వుంటే రాష్ట్రం ఏర్పడ్డాక యింకెలా వుంటుందో అన్న భయం ముస్లిములకు వేయవచ్చు. వాళ్లు ఉద్యమానికి దూరంగా జరగవచ్చు.

ఇక తెరాస – రాజీనామాలు చేస్తే బ్రహ్మాండం బద్దలవుతుందని కెసియార్ చెప్పిన మాట వట్టి పోయింది. ఏమీ జరగలేదు. తెరాసకు తెలిసిన మంత్రం అది ఒక్కటే. అది పారలేదు. పారలేదని తెలిసో, తెలియకో కెసియార్ రెండువారాల్లో నిర?యం వచ్చేస్తుందని వూరించారు కానీ ఆ మాటా వట్టిదయింది. ఇక 2014 గురించి మాట్లాడడం మొదలెట్టారాయన. 'ఈ కాంగ్రెస్‌వాళ్లు 2014 ఎన్నికలలో దొరక్కపోతారా' అంటే ఇప్పట్లో రాదని తేలిపోయినట్టేనా? అందుకే ఆయన చప్పబడ్డారా? తెలియదు. ప్రస్తుతానికి మాత్రం ఆయన సకలజనుల సమ్మెను కూడా ప్రోత్సహించడం లేదు. మొదటిరోజు ర్యాలీలో పాల్గొనలేదు. కెసియార్ లేకపోతే జనాలకు ఉత్సాహమే వుండదు. ఆయన మౌనానికి అర్థమేమిటో తెలియక కొట్టుమిట్టు లాడుతున్నారు.

మొత్తం మీద చూస్తే తెలంగాణ ఉద్యమం 'బాల (విద్యార్థి) నాయకత్వం, బహునాయకత్వం' అయిపోయింది. రెండూ మంచివి కాదు. ప్రతీవాళ్లూ 'అందరూ తమతమ జెండాలు, ఎజెండాలు పక్కకు పెట్టి త్యాగాలు చేసి తెలంగాణ కోసం ఏకం కావాలి' అని పిలుపు నిచ్చేవారే కానీ ఎవరూ కలవడం లేదు. తెరాస ఆధ్వర్యంలో నడిచే పత్రిక, టీవీ ఛానెల్ వాళ్లు ఎప్రూవ్ చేసిన తెలంగాణ నాయకులనే ప్రొజెక్ట్ చేస్తోంది. ఉద్యమానికి పేటెంట్ తమవద్దనే వుంచుకుంది. ఇక ఇతరులు ఎలా చొరబడగలరు? ఇలా అయితే ఉద్యమం ఎన్నాళ్లు నడుస్తుంది? ఏ విధంగా నడుస్తుంది? ఎప్పటికైనా విజయం సాధిస్తుందా?

ఇలా పరిపరి విధాల ఆలోచించి చూచే కాబోలు ఉద్యోగులు చప్పబడ్డారు. నాయకులతో పహలే ఆప్ అన్నారు. ఉద్యోగుల మీదనే యావదాశలూ పెట్టుకున్న తెలంగాణ ఉద్యమనాయకులు సకలజన సమ్మెను ఉత్సాహంగా నడపటం లేదు. దీన్ని డాంప్ స్క్విబ్‌గా చేసేబదులు, మొత్తానికే వాయిదా వేసి వుంటే యీ లుకలుకలు బయటపడేవి కావు. చూద్దాం మళ్లీ ఎప్పుడు పుంజుకుంటుందో. సెప్టెంబరు 6 అంటున్నారుగా. అప్పటికి పరిస్థితి ఎలా మారుతుందో చూదాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**

**ఆగస్టు 46** **ఎమ్బీయస్ : జగన్ వర్గం రాజీనామా**

జగన్ వర్గం ఎమ్మెల్యేలు యివాళ రాజీనామా చేస్తున్నారు. ఈ పని చేస్తారని చాలా నెలలుగా అంటున్నా యిన్నాళ్లకు అది

మెటీరియలైజ్ అయింది. జగన్ దీక్ష పడితే, ఓదార్పుకి వెళితే వెంట వెళతారు తప్ప రిజైన్ చేయమంటే పట్టుమని పదిమంది కూడా చేయరు అంటూ వచ్చినవాళ్లు నివ్వెరపోయేట్లుగా 29 మంది సిద్ధమయ్యారు. ఇంకో రెండు మూడు రోజుల్లో యింకా వస్తారేమో చూడాలి. దీని రాజకీయ పర్యవసానాలు ఎలా వుంటాయో చూడాలి కానీ యీ లోపున రాజకీయంగా యిది చాలా సరైన టైమింగ్ అని చెప్పక తప్పదు. కాంగ్రెస్‌పై ఎప్పటికప్పుడు తిరుగుబాటు చేస్తూ వాళ్లు చర్య తీసుకుని నెట్టేస్తే 'మార్టియర్' (అమరవీరుడు) ముద్ర వేయించుకుని బయటకు వద్దామని ఎదురు చూశారు. కానీ వాళ్లు చర్య తీసుకోవడం లేదు. కాకా వెంకటస్వామి సోనియాను తిట్టిపోసినా చర్య లేదు.

ఇక యీ మధ్య జగన్‌పై దాడి తీసుకోవడం ప్రారంభమయ్యాక అతన్ని అరెస్టు చేయగానే రాజీనామా చేస్తారని అనడం ప్రారంభించారు. అప్పుడు చేస్తే చాలా ఎబ్బెట్టుగా వుండేది. ఒక వ్యక్తిపై అనుమానం కొద్దీ సిబిఐ విచారణ జరుపుతూంటే దాన్ని నీరుకార్చడానికి రాజీనామాలు చేసినట్టు వుండేది. అసలు సిబిఐ దాడులకు నిరసన తెలుపుతూ, అడ్డుకోబోవడమే అసహ్యంగా వుంది. జగన్ మాత్రం తనపై సిబిఐ దాడులను ఎలా విమర్శించగలరో నాకు అర్థం కాదు. కావాలంటే విచారణ జరిపించుకోండి అంటూ ఛాలెంజ్‌లు విసిరింది అతనే. మాట్లాడితే సోనియాను పడతిట్టి, అఫెన్సివ్‌లో వెళ్లి దానికి ప్రతిచర్య వుండదని ఎలా అనుకోగలరు? కాంగ్రెస్‌లోనుండి బయటకు వచ్చినపుడు యిలాటి వేధింపులు వుంటాయని తెలుసు అని చెప్తున్నారు కదా, వాటికి సిద్ధపడే వుండాలి. వాటికి తగిన ఏర్పాట్లు చేసుకునే వుండాలి. ఏవైనా ట్రాక్స్ వదిలేసి వుంటే, అవి మూసేసుకునే పార్టీ పెట్టి వుంటారని అనుకుంటున్నాం మేము. ఉండవల్లి దగ్గర్నుంచి సబ్బం హరి ద్వారా 'జగన్ దొరకడు' అని అంటూనే వున్నారు. వీళ్ల కున్న ధైర్యం జగన్‌కు, అతని తల్లికి లేనట్టుంది.

విజయలక్ష్మి గారి ఉత్తరం చాలా నవ్వు పుట్టించింది. ఫోక్స్ వ్యాగన్ కేసులో బొత్స యిల్లెందుకు సోదా చేయలేదు? మాదెందుకు చేస్తున్నారు? వంటి ప్రశ్నలు సిల్లీగా వున్నాయి. అది సిబిఐ యిష్టం. సోదా చేయకూడదని రూలుండి మీ యిల్లు సోదా చేస్తే అడగవచ్చు. వారికి ఆ అధికారం రాజ్యాంగం యిచ్చినపుడు ఎవరి విషయంలో వినియోగించాలి, ఎవరి విషయంలో వినియోగించకూడదు అన్నది పూర్తిగా వారి విచక్షణపై వుంది. ఆ విచక్షణను ఎంత స్వతంత్రంగా వుపయోగిస్తున్నారు, ఏ మేరకు రాజకీయ ప్రభావాలకు లోనవుతున్నారు అన్నది వేరే అంశం. అంతెందుకు వైయస్ బతికి వుండి, ఏ బొత్సయో జగన్‌లాగ తిరుగుబాటు చేసి వుంటే హై కమాండ్ ఆదేశాల మేరకు వైయస్ కూడా సిబిఐ ద్వారా బొత్సను యిలాగే వెంటాడి వేధించేవారు. తెరాసను చీల్చినపుడు స్పీకర్ వ్యవస్థను వైయస్ దుర్వినియోగం చేయలేదా?

చట్టం అంటూ పెట్టాక దాన్ని ఎలాగైనా వాడవచ్చు. "అన్నా, అన్నన్నా.." వ్యాసాల్లో అదే రాశాను. చెక్స్, బేలన్స్‌లు లేకుండా ఓ చట్టం ఏర్పాటు చేస్తే దాన్ని సెలక్టివ్‌గా (మిస్)యూజ్ చేసే అవకాశం వుంది అనే వాదించాను. ఇప్పుడు వైయస్ కాంగ్రెస్‌వారు అడుగుతున్నారు – 'సిబిఐ వద్ద ఇరవై వేల కేసులు పెండింగ్ వుండగా దీన్నే ఎందుకు ముందుగా టేకప్ చేశారు?' అని. వరసప్రకారం తీసుకోవాలి అనే రూలు ఏర్పాటు చేసి వుంటే యీ ప్రశ్న యిప్పుడు వచ్చేది కాదు కదా. అప్పుడు చిన్నా చితకా కేసుల ప్రాధాన్యతాక్రమంలో యిది వెనుక బడి యీ లోపుల చాలా హాని జరిగిపోతుంది అంటారా, అలాటప్పుడు వెయ్యి కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందన్న ఆరోపణలున్న కేసులన్నీ ఓ కేటగిరిలో పడేసి వాటిలో కనీసం ఓ క్రమం పాటించాలి. ఇలాటి సవరణలన్నీ వీళ్లు అధికారంలో వున్నపుడు తోచవు. ఎందుకంటే మనమే ఎల్లప్పుడూ అధికారంలో వుంటాం, యిది పెట్టి శత్రువులను అడలగొడదాం అనుకుంటారు. ప్రతిపక్షంలోకి వచ్చాక అప్పుడు తోచినా టూ లేట్. సుప్రీంకోర్టులో పిటిషన్ వుండగా అడావుడిగా దాడులెందుకు? అన్న మాటా అర్థరహితం. అలా చేయకూడదని రూలేమైనా వుందా? ఉంటే కోర్టు కెళ్లి ఆపించుకోండి. లేకపోతే వూరుకోండి.

రాజకీయ దురుద్దేశంతోనే కక్ష సాధిస్తున్నారు అని వాపోతే నవ్వకేం చేస్తాం? రాజకీయాల్లో దురుద్దేశం కాక సదుద్దేశం ఎందుకుంటుంది? రాజకీయం అంటే రాజకీయంలాగానే చూడాలి. మీరు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టు మీద గెలిచినవారిని, ఆ పార్టీలోనే వుండమని చెపుతూ మీ సభలకు రప్పించి కాంగ్రెస్ మొరేల్ దెబ్బతీయడంలో దురుద్దేశం కాక సదుద్దేశం వుందా? కాంగ్రెస్‌లోనుండి బయటకు వచ్చాకనే జగన్‌లో దుర్గుణాలు కనబడ్డాయా అని విజయలక్ష్మిగారు సోనియాను నిలదీశారు. మీకూ అంతే కదా, కాంగ్రెస్‌నుండి బయటకు వచ్చాకనే బోఫోర్స్‌లో రాజీవ్ యింటిని సోదా చేయలేదని గుర్తుకు వచ్చింది.

మీ ఆయన బతికున్నంతకాలం రామనామం కంటె రాజీవనామమే ఎక్కువగా వినబడింది కదా తల్లీ. మొలతాడున్నవాడు తెలుగునాట ఒక్కడైనా పుట్టనట్టు, తుమ్మినా దగ్గినా రాజీవజపమే! మురికి కాలువనుండి ముష్టివాళ్ల పథకం దాకా అన్నిటికీ రాజీవే కదా. మీకూ మీకూ చెడింది కాబట్టి యివాళ మీకు అన్నీ వింతగా తోస్తున్నాయి మరి! తావులు తప్పితే మిత్రులు శత్రువులవుతారు. నీటిలో వున్నంత సేపు కమలానికి సూర్యుడు మిత్రుడు. సూర్యకాంతి వలన వికసిస్తుంది. మరి అదే కమలం నీటిలోంచి బయటకు వచ్చేసి గట్టున పడితే అదే సూర్యకాంతికి ఎండి వాడిపోతుంది. ఇది ప్రకృతి నేర్పిన పాఠం. ఇప్పుడు మీరు కాంగ్రెస్ బయట వున్నారు. సూర్యకాంతి నుండి ఎలా కాపాడుకోవాలో మీరే చూసుకోవాలి తప్ప లేఖలు రాస్తే బేలతనం బయటపెట్టుకున్నట్టు వుంటుంది.

మనం ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేస్తే పోలీసు వచ్చి పట్టుకుంటే "నన్నే పట్టుకున్నావేం? అల్ల వాడు చూడు హెల్మెట్ లేకుండా వెళ్లిపోతున్నాడు. వాణ్నీ పట్టుకో.." అని వాదించగలమా? వాడి సంగతి తర్వాత, ముందు నువ్వు ఫైన్ కట్టు అంటాడు పోలీసు. చెట్టంత ఎదిగిన మా బంధువుల అబ్బాయి గతంలో హాఫ్ టిక్కెట్టు కొని రైలెక్కాడు. టిసి పట్టుకుంటే "చాలామంది టిక్కెట్టు లేకుండానే

ఎక్కేస్తున్నారు. నేను పోనీ కదాని హాఫ్ టిక్కెట్ కొంటే నన్ను పట్టుకుంటావేం?" అని వాదన మొదలెట్టాడు. "వాళ్ల సంగతి తర్వాత, ముందు నీ సంగతి తేల్చు" అన్నాడు టిసి. అలాగ మీరు కేసుల్లోంచి ఎలా బయటపడాలో చూసుకోండి చాలు.

ఇలాటి యిబ్బందులు వుంటాయనే చాలామంది రాజకీయనాయకులు స్విస్ బాంకుల్లో దాచుకుంటారు. అక్కడ దాచారో లేదో కానీ మీరు యిక్కడ మాత్రం కళ్లు మిరిమిట్లు గొలిపే హర్మ్యాలు కట్టారు, ఓదార్పులంటూ లక్షలు పంచుతున్నారు. ఎవరికైనా అనుమానం వస్తుంది యిది కష్టార్జితమేనా? అని. కష్టార్జితమే అని నిరూపించుకోవాల్సిన బాధ్యత మీది. దాని మీద ఫోకస్ చేయకుండా మమ్మల్ని ఎందుకు అడుగుతున్నారు? కోర్టు వారు సిబిఐ రిపోర్టు ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు? యివి మీరు అడగకూడదు. కావాలంటే బయటివాళ్లు అడగవచ్చు. ఇదే పద్ధతి అన్ని కేసుల్లోనూ అవలంబిస్తారా అని. అడగడమే తప్ప చేయగలిగేది ఏమీ లేదు. ఎందుకంటే చట్టాలు అలా వున్నాయి. చట్టాలు అలా అఘోరించడానికి కారణం దశాబ్దాలపాటు రాజకీయాల్లో వున్న మీ వైయస్ వంటి వారే !'

జగన్ అరెస్టయినపుడు రిజైన్ చేస్తే ప్రజలు యిలా అడిగే ప్రమాదం వుంది కాబట్టి యిప్పుడే రిజైన్ చేశారు జగన్ వర్గం. ఇప్పుడు వాళ్లకు మంచి అవకాశం దొరికింది – వైయస్ పేరుపై మచ్చపడింది అని. సిబిఐ చార్జిషీటు లీక్ అయింది. చేసినవారెవరో చిన్నపిల్లలు కూడా చెప్పగలరు. దానిలో వైయస్‌ను నిందితుడిగా పెట్టలేదట. చనిపోయారు కాబట్టి పెట్టలేదు, అందువలన చార్జిషీటులో పేరు ప్రస్తావించామంతే అంటున్నారు సిబిఐ డైరక్టర్.

నాకు తెలియక అడుగుతున్నాను – చనిపోయినంత మాత్రాన నిందితుడు కాకుండా పోతాడా? సాక్ష్యాలుండి అతను ప్రజాధనం హరించాడని తేలితే దాన్ని జప్తు చేసే ప్రయత్నం చేయరా? చనిపోయాడు కాబట్టి అతనికి భౌతికంగా శిక్ష వేయలేం కానీ అతను నేరవిధానాలలో సంపాదించిన ఆస్తులు పిల్లలకు రాసేస్తే అవైనా రాబట్టాలి కదా. అలాటప్పుడు నిందితుడిగా చేర్చాలి కదా. అబ్బే అలాటి సావకాశం లేదంటే ఎవడైనా ఒక మంత్రిని పట్టుకుని అతని చేత అవినీతి చేయించి, బినామీగా వుండి ఆస్తులన్నీ తన పేర రాయించేసుకుని తర్వాత మంత్రిని ఖతం చేసేయవచ్చు. అప్పుడు మంత్రి మీదా కేసు లేదు, ఇతని ఆస్తులూ సురక్షితం. ఇదెక్కడి చట్టం? ఇక్కడ ఏదో మిస్సవుతోంది. న్యూస్‌పేపర్లు సరిగ్గా రాయడం లేదు. వైయస్ పేరు నిందితుడిగా పేర్కొనపోవడానికి కారణం రాజకీయం తప్ప న్యాయపరం కాదు.

వైయస్ నేరస్తుడు అని అధికారపూర్వకంగా అనడానికి కాంగ్రెస్‌కి దమ్ము లేదు. అందువలన తన పార్టీలో కొందరు నాయకుల చేత అనిపిస్తోంది. కోర్టు ద్వారా, సిబిఐ ద్వారా అనిపిస్తోంది. అది తెలిసే జగన్ పార్టీవాళ్లు "అంత అనుమానం వుంటే కాంగ్రెస్ ప్రభుత్వమే విచారణకు ఆదేశించవచ్చుగా" అని ఎక్కేస్తున్నారు. ఓ పక్క సిబిఐ దాడులు జరుగుతూ, ఈ జగాన జగన్ కంటె అవినీతిపరుడు లేడు, రాడు అన్న ధోరణి మీడియా కథనాలు వస్తున్న యీ తరుణంలో కూడా కృషా? జిల్లాలో జగన్‌కి వస్తున్న ఆదరణ చూస్తే అర్థమౌతున్నది ఏమిటంటే – ఎన్ని అవినీతి ఆరోపణలున్నా వైయస్ పాప్యులారిటీ యింకా తగ్గలేదనీ, అదే జగన్‌పై ప్రసరిస్తోందనీ.

అలాటప్పుడు వైయస్‌పై దోషి అనే ముద్ర కొట్టడానికి కాంగ్రెస్‌కు ఎంత ధైర్యం కావాలి? ఆ ధైర్యం చాలకనే వైయస్‌ను ముద్దాయిగా పేర్కొనలేదు. మొత్తం కథానాయకుడు జగనే అన్నట్టు, అతను అధికార దుర్వినియోగం చేయకపోయినా తండ్రిని మొహమాటపెట్టి, బలవంతపెట్టి అక్రమాలు చేయించినట్టు చిత్రీకరిస్తున్నారు. విహెచ్ వంటి హై కమాండ్ వంది మాగధులు 'జగన్ వంటి కొడుకు ఎవరికీ వద్దు, నా చేత కానిపనులు చేయిస్తున్నాడు' అని వైయస్ తన వద్ద వాపోయినట్టు కథలు ప్రచారం చేస్తున్నారు. మొత్తానికి వైయస్ ధృతరాష్ట్రుడు అయినట్టు జగన్ దుర్యోధనుడు అయినట్టు స్క్రీన్‌ప్లే తయారవుతోంది.

దీనికి టిడిపి మద్దతు పలకడమే చిత్రం. మొన్నటిదాకా వాళ్లన్నది – వైయస్ అవినీతిమార్గంలో డబ్బు సంపాదించి కొడుక్కి కట్టబెట్టాడని. ఇప్పుడు వైయస్ లేడు కాబట్టి జగనే వైయస్ చేత చేయించాడంటున్నారు. జగన్ ప్రధానశత్రువు అయిపోయాడు. ఎందుకంటే వైయస్ పోయాడు, జగన్ వున్నాడు. రేపు ఉపఎన్నికలలో గాని, జనరల్ ఎన్నికలలో కాని ఎదుర్కోవలసినది జగన్నే కదా. 'జగన్ మాయలో పడి వైయస్ అవినీతి పనులు చేశాడు. ఆ చేయడం వలన వైయస్‌కి మాత్రమే మకిలి అంటింది. అతని కాబినెట్ సహచరులందరూ పుణ్యపురుషులు' యిదీ టిడిపి వాదన. శభాష్.

టిడిపి అనుకూల మీడియా కూడా వైయస్ కాలంలో కాబినెట్ మీటింగులు ఎలా జరిగేవో, మంత్రులందరూ బుద్ధిమంతులైన బాలకుల్లా వైయస్ మాటకు ఎలా తల వూపేవారో కళ్లతో చూసినట్టు రాస్తున్నారు. వాళ్లకు పాపం వ్యక్తిగతంగా ఏ ఆశలూ వుండేవి కావుట. వైయస్ రమ్మన్నప్పుడల్లా సిఎంఓకి రావడం, ఫైలు మీద చదవకుండా సంతకాలు పెట్టడంట. నాకు తెలియక అడుగుతాను – యిలాటి మంత్రులు కాదు, మనుష్యులు వుండినా, వూడినా ఒకటే కదా ! ఇలా సంతకాలు పెట్టేదానికి అంతమంది మంత్రులెందుకు యిద్దరు ముగ్గురితో వ్యవహారం లాగించేయవచ్చుగా, (పోనీ నన్ను పెట్టుకోవచ్చుగా, నేను సంతకం బాఘా అందంగా పెడతానని హామీ యిస్తాను). అప్పటి మంత్రులే కంటిన్యూ అవుతున్నారుగా.. వాళ్లు యిప్పుడూ యిలాగే వున్నారా? లేక హఠాత్తుగా ఫైళ్ల పట్ల పరిజ్ఞానం పెంచేసుకున్నారా? ఒకవేళ యిప్పుడూ యిలాగే వుంటే ఇలాటివాళ్లు సెక్రటేరియట్‌కు రాకపోవడం వలన పరిపాలన కుంటుపడుతోందని రాయడం దేనికి? ఆ సంతకాలు, ఆ నిర?యాలూ సిఎంగారు ఒంటి చేత్తో చూసుకోగలరుగా.

కాంగ్రెస్‌కు ఓ అజెండా – వైయస్ అవినీతి జగన్‌కు, పరపతి వారికీ దక్కాలని..

టిడిపికి ఓ అజెండా – వైయస్ అవినీతి జగన్‌కు, పరపతి కాంగ్రెస్‌కు దక్కకూడదని..

ప్రస్తుతానికి ఇద్దరికీ గల కామన్ ఎజెండా – జగన్‌కి పరపతి పోవాలి, వైయస్ మంత్రులు కాపాడబడాలి..

జగన్ అనుచరులు రిజైన్ చేసినా అసెంబ్లీకి ధోకా లేదు. టిడిపి ఎలాగూ వుంది కొమ్ము కాయడానికి. అది తెలిసీ వాళ్లు రిజైన్ చేస్తున్నారు, ఎందుకంటే వైయస్ పరపతికి తామే వారసులమనీ, అతనిపై మచ్చపడితే సహించమనీ ప్రజలకు చాటడానికి. కానీ యీ మచ్చలు వైయస్ వుండగానే పడ్డాయి. అప్పుడు లేని ఉలుకు యిప్పుడెందుకంటే – అప్పుడు బురద చల్లినది టిడిపి, ఇప్పుడు సోనియా. సోనియాయే చేయిస్తోంది అన్నది ఊహాజనితం తప్ప రుజువు చేయలేనిది. పరిస్థితుల బట్టి అవగాహన చేసుకోవలసినది.

ఒకటి మాత్రం ఒప్పుకోవాలి. ఇన్నాళ్లూ తాత్సారంతో పరిస్థితి దిగజార్చిన కాంగ్రెస్ యిన్నాళ్లకు ధైర్యంగా నిర?యాలు తీసుకుని అమలు చేస్తోంది – తెలంగాణ విషయంలో, జగన్ విషయంలో రెండింటిలోనూ కటువైన నిర?యాలు తీసుకుని సాహసంగా ముందుకు వెళుతోంది. జగన్‌ను మాత్రం ఎటాక్ చేయడం, వైయస్‌ను కొద్దిగాను అతని కాబినెట్ సహచరులను పూర్తిగా యిన్సులేట్ చేయడం, కాన్సర్ చికిత్స అంత సున్నితంగా చేయాలి. శత్రుకణాలను నాశనం చేయడంలో మిత్రకణాలు కూడా దెబ్బతింటాయి. అక్కడ కణాలు, యిక్కడ గణాలు. జగన్ కూడా అంతే సున్నితంగా, సాహసంగా ఎదుర్కోవాలి తప్ప 'ఫౌల్, ఫౌల్' అని అరిస్తే ప్రజల దృష్టిలో దిగజారుతాడు. సిబిఐ విచారణకు ముందుకు రావడంలో ఘనత వుంది. నేరాలు రుజువైతే ఒప్పుకోవడంలోనూ వుంది. – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**

## ఆగస్టు 51 ఎమ్బీయస్ : అవినీతీ – మనమూ

శీర్షిక మనమూ – అవినీతీ అని పెడితే క్యాచీగా (ముందు చిన్నపదం, తర్వాత పెద్దపదం) వుంటుందని తెలిసినా యిలాగే పెడుతున్నాను. ఎందుకంటే అవినీతి ఆత్మలా స్థిరమైనది, మనం దేహంలా కొంతకాలం వుండి పోయేవాళ్లం. అవినీతితో ఎలా వేగాలో మనం నేర్చుకోవాలి తప్ప మన కోసం అవినీతి తన విశ్వరూపాన్ని కాస్తయినా తగ్గించుకోదు. మనం అప్రమత్తంగా వుంటే దాన్ని అదుపు చేయగలుగుతాం, మనని తినేయకుండా చూసుకోగలుగుతాం. ప్రమత్తంగా, ఓస్ ఒక్క చట్టం చేసి పారేస్తే చాలు అది అణిగి వుంటుందనో, మాయమవుతుందనో ధీమాతో వుంటే అది భూతంలా విస్తరించి, మనల్ని మింగేస్తుంది. అందుకని టైటిల్ అలా పెట్టా. ''అన్నా.. అన్నన్నా..'' రాసినప్పుడే నాకు తెలుసు – నా మీద చాలా యిటుకబెడ్డలు (బ్రిక్ బాట్స్) పడతాయని. ఆశ్చర్యం ఏమిటంటే వాటితో పాటు కొన్ని పూలరేకులు కూడా పడ్డాయి. మీరు చెప్పాక అలా కూడా ఆలోచించి చూశాం అని.

చాలామంది నా నిరాశావాదాన్ని తప్పుపట్టారు. ఇలాటివి చాలా చూశాం అంటూ పెదవి విరవడం తప్పన్నారు. కానీ ఏం చేయను? చూశాను కాబట్టి చెప్పాను. ఈనాడు మీలాగే నేనూ ఆనాడు చాలా కలలు కన్నాను, ఆశలు పెట్టుకున్నాను. జెపి (జయప్రకాశ్ నారాయణ్) 1975లో ''సంపూర? క్రాంతి'' పేర జనాల్ని కదిలిస్తే మార్పు వచ్చేస్తుందని పొంగిపోయాను. ఆయన బతికుండగానే జనతా పార్టీవారు ఆయన్ను సమాధి చేశారు. ఆయన శిష్యులు ములాయం కులంపేరుతో సమాజాన్ని చీలిస్తే, యింకో శిష్యుడు లాలూ అవినీతికి మారుపేరుగా నిలిచాడు.

ఆత్మగౌరవం, సామాజిక చైతన్యం అంటూ సమాజాన్ని ఓ ఊపు వూపిన పెరియార్ శిష్యులు, కరుణానిధి వగైరాలు ఎంత అవినీతికి పాల్పడ్డారో చూశాను. ఆయన తర్వాతి తరం వచ్చేసరికి మరీ ముదిరిపోయింది. యువకుడు రాజీవ్ గాంధీ సైన్సు, టెక్నాలజీ అంటూ ఆశలు రేపాడు. తల్లిలాటి వాడు కాడని ఆనందపడ్డాను. అంతలో బోఫోర్స్ కేసులో యిరుక్కుని నిరాశ పరిచాడు. కిర్లోస్కర్ వంటి పారిశ్రామిక వేత్తలను సైతం నడిరోడ్డు మీద నడిపించి, నిప్పులాంటి నిజాయితీగా మారుపేరుగా పేరు తెచ్చుకున్న వాడు విపి సింగ్. అతను అవినీతి అంశంపై రాజీవ్‌కి ఎదురు తిరిగి పార్టీలోంచి బయటకు వచ్చి, కొత్త పార్టీ పెట్టి తనను నెగ్గిస్తే బోఫోర్స్ వివరాలు బయటపెడతానంటూ ఎన్నికలలో పాల్గొంటే వీరావేశంతో బలపరిచాను. నెగ్గాక బోఫోర్స్ మాట ఎత్తలేదు సరికదా, తన పదవి కాపాడడానికి మండల్ కమిషన్ అంటూ దేశాన్ని చీల్చి ఆరని కాష్టాన్ని రగిల్చాడు ప్రబుద్ధుడు.

ఆరెస్సెస్ సిద్ధాంతాలు రుచించకపోయినా, వారి సింపుల్ లైఫ్ చూసి ముచ్చటపడి జనసంఘం (బిజెపి పూర్వరూపం) వారికి అధికారం వస్తే నీతిగా వుంటారనుకున్నాను. అన్ని రాష్ట్రాలలో ఉసూరుమనిపించారు. ఇప్పుడు కర్నాటకలో పరాకాష్టకు చేరారు. ఇదే అల్టిమేటో, ఎడ్యూరప్పను తలదన్నేవాడు యింకా వస్తాడో వేచి చూడాలి. అలాగే కమ్యూనిస్టులు.. వాళ్లూ చాలా కబుర్లు చెపుతారు. రాఘవులు గారు సైకిల్ ఎక్కి వస్తే ఏం సింప్లిసిటీ అని మురిసిపోతాం. కానీ ఆయన పార్టీ కేరళలో అవినీతిపరుడిగా నిరూపించబడిన పినరాయ్ విజయన్‌కు దన్నుగా నిలబడింది.

ఇలా అడుగడుగునా నేను మోసపోతూనే వున్నాను. ఇప్పటికీ నాకు బుద్ధి రాలేదు. మూడేళ్ల క్రితం చిరంజీవి అవినీతికి వ్యతిరేకంగా పోరాడతానంటూ పార్టీ పెడితే నిజంగా అలా చేస్తాడేమో, సినిమాల్లో బాగా సంపాదించాడు కాబట్టి కక్కుర్తి పడడు అనుకున్నా. వాళ్ల పార్టీకి ఓటేద్దామనుకున్నాను. సగంలోనే రంగు బయటపడింది. చివరకు రంగెలా వెలిసిపోయిందో మొన్ననే చూశా. తన పుట్టినరోజు, పార్టీ గిట్టినరోజు ఒకే రోజయ్యేట్లు చూసుకున్నాడాయన. సామాజిక న్యాయం చేయాలంటే రాజ్యాంగంలో మార్పు రావాలట, అది ఒక ప్రాంతీయపార్టీ చేయలేదట. అందుకని జాతీయపార్టీలో విలీనమై పోయాం అని కోటగిరి విద్యాధరరావుగారి కుంటి వాదన. ఏం

పార్టీ పెట్టబోయేముందు ఆ విషయం తెలియదా? డిఎంకె ప్రాంతీయపార్టీ అయినా సమాజంలో మార్పు తెచ్చిందా లేదా, వెనుకబడిన కులాలకు ప్రాముఖ్యత తెచ్చిందా లేదా?

చిరంజీవి వేరే ఏ పార్టీలో కలిసినా యింత ఆశ్చర్యం కలిగేది కాదేమో, బొత్తిగా కాంగ్రెస్‌లో చేరడంతోనే నిరాశపరిచారు. ఇంకా అవినీతి గురించి మాట్లాడుతూంటే నవ్వొస్తోంది. నన్ను తిట్టే వారిలో చిరంజీవిపై ఆశ పెట్టుకుని, భంగపడినవారు కూడా వుండేవుంటారు. కానీ వాళ్లు తమ ఆశలను అన్నా హజారేవైపు మళ్లించుకున్నారు. నేను మళ్లించుకోలేదు. ఇన్ని సార్లు బోల్తా పడినవాణ్ని కాబట్టి నేను కనబడేవి ఎండమావులేమో చూసుకోండి అని హెచ్చరిస్తున్నాను. మీరూ నా లాగే ఆశాభంగం చెందకండి, అవి ఎండమావులే అయితే ఒయాసిస్సులుగా మార్చుకునే పని చూడండి అని హితవు చెప్తున్నాను. మీ సబ్బుబుడగలను వాస్తవాలనే పుల్ల పెట్టి పగలకొట్టేస్తున్నందుకు నాపై మీకు కోపం రావచ్చు. అంతమాత్రం చేత మీ కలలు నిజం అయిపోతూ అది చూసి ఏడ్చే ఏడుపుగొట్టులా నన్ను భావించకండి. మీరనుకున్న మార్పు నిజంగా వచ్చేస్తే సంతోషించేవారిలో నేను ప్రథముణ్ని.

'మీరు సమర్థించకపోతే నోరు మూసుకుని కూర్చోవచ్చుగా, ఇలా రాసి అన్నా ఉద్యమానికి అడ్డుతగలడానికి సిగ్గు లేదా? ఇలా అయితే అవినీతిరహితభారతం ఎప్పటికి అవతరించేను?' అని చాలామంది మందలించారు. నోరు మూసుకుని కూర్చునే మాటయితే నేను చాలావాటిపై రాయనవసరమే లేదు. రాజకీయాల గురించి రాసినప్పుడల్లా "నీకు చేతనైనది సినిమా కబుర్లు ఒక్కటే అది చెప్పుకుని బతుకు, వీటి జోలికి రావద్దు" అని హితోక్తులు వినబడుతూనే వుంటాయి. అయినా నేను యివీ రాస్తూనే వుంటాను. నా ఉద్దేశాలు ఎప్పుడూ రుద్దను. 'ఇలా కూడా ఆలోచించి చూడండి' అన్నదే నా స్లోగన్. నిర?యం మీదే. నేను రాసినంత మాత్రంలో లంచాలు పట్టేవాళ్లు పట్టడం మానేస్తారని, తీసుకోనివాళ్లు 'ఎమ్బీయస్ అన్నాను విమర్శించాడు కాబట్టి యివాళ్టినుంచి తీసేసుకుందాం' అని దుకాణం తెరుస్తారనీ అనుకోను.

నిర?యాలు తీసుకునేవారెవరూ ఈ రాతలు చదువుతారనీ, దాన్ని బట్టి నిర?యాలు తీసుకుంటారనీ నా కెలాటి భ్రమలూ లేవు. అయితే ఎందుకు రాస్తున్నట్టు? అంటారేమో, యీ రాతలు చదివేవారు విశాల ద ృక్పథం ఏర్పరచుకుని భవిష్యత్తులో నిర?యం తీసుకునే అవకాశం వచ్చినపుడు మంచి విచక్షణతో నిర?యం తీసుకుంటారేమోనని ఆశ, అంతే.

అవినీతిరహితభారతం – వినడానికి బాగానే వుంది కానీ అదెలా ఏర్పడుతుంది? నన్ను తిడితేనా? మా అమెరికాలో యిలా వుండదు, ఆస్ట్రేలియాలో యిలా వుండదు, మీలాటి వాళ్లు సమర్థించడం బట్టే ఇండియా యిలా వెనకబడి వుంది అంటూ నన్ను తిట్టిన ఎన్నారైలను సూటిగా అడుగుతాను – మీరు పాస్‌పోర్టుకి దరఖాస్తు చేశారు కదా, పోలీసు చెకింగ్‌కు వచ్చినపుడు మీలో ఎంతమంది లంచం యివ్వకుండా తప్పించుకున్నారు? మీరంటే, మీరో, మీ తరఫున వేరెవరో.. ! ఏ లంచమూ లేకుండా పాస్‌పోర్టు చేతికి వచ్చిందా? నేను యిన్నేళ్లకు గత సెప్టెంబరులో పాస్‌పోర్టుకై అప్లయి చేశాను. ఇప్పటిదాకా పోలీసు చెకింగ్‌కి కూడా రాలేదు. అప్లికేషన్ ఏ గంగలో కలిసిందో తెలియదు. నాకు విదేశీయాత్రల ఛాన్సు లేదు కాబట్టి నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్నాను. నాకే చదువుకో, ఉద్యోగానికో ఫారిన్ వెళ్లవలసిన అర్జన్సీ పడితే లంచం యివ్వాల్సి వస్తుంది కదా. మీరు లంచాలిచ్చి వాళ్లకు అలవాటు చేశారు కదా. మరి ఇండియా యిలా వుంది అంటూ రాగాలెడితే ఎలా? అమెరికా అలా వుందంటే దానిలో మీ ప్రజ్ఞ ఏమీ లేదు. వీలుపడితే వాళ్లనీ చెడగొడదామని మనవాళ్లు చూస్తున్నారు. ట్రై వ్యాలీ కేసులో చూశాంగా, స్టూడెంటు వీసాపై వెళ్లి, చట్టవిరుద్ధంగా ఉద్యోగాలు చేస్తూ డబ్బు సంపాదిస్తూ పట్టుబడ్డారుగా !

మనకు శ్రమ లేకుండా పని జరిగిపోయినంతకాలం నీతిగానే వుంటాం. అందరూ క్యూలో వెళుతుంటే మనమూ క్యూలో నిలబడతాం. ఎవడైనా పక్కనుంచి వెళ్లి బస్సెక్కితే చాలు, మన నీతి సడలిపోతుంది. వెర్రివెధవల్లా యిక్కడ నిలబడడం దేనికనుకుంటూ ఈ దారి వదలి, వాడు చూపిన షార్ట్ కట్ కోసం వెంపర్లాడతాం. ప్రయాణం ముందే ప్లాను చేసుకుంటే టిక్కెట్టు కొనడానికి లంచం యివ్వం. కానీ ఎవరికో చావు ముంచుకుని వచ్చి అర్జంటుగా వెళ్లవలసి వచ్చిందనుకోండి. అప్పుడు మన నీతి గాలికి ఎగురుతుంది – "ఎలాగోలా, ఆ టీసీకి కావలసినది పడేసినదైనా టిక్కెట్టు సంపాదించు" అని ఎవరికో పురమాయిస్తాం. ఆలిని అమ్ముకునైనా, సత్యాన్ని పాటించినవాడు హరిశ్చంద్రుడవుతాడు. హరిశ్చంద్రులు అరుదుగానే వుంటారు. నూటికి 99 మంది సాధారణ జనం ఎలాటివాళ్లమంటే –

దైవదర్శనానికి గుడికి వెళ్లామనుకోండి. మొదట దేవుడికి లంచం పెడదామని చూస్తాం, "స్పెషల్ దర్శనం టిక్కెట్టు వుందా?" అని. అది మనం అనుకున్నదానికంటె ఖరీదుగా వుందనుకోండి. వెంటనే మనకు మనం నచ్చచెప్పుకుంటాం – " ధర్మదర్శనంలో వెళితేనే పుణ్యం" అని. వెంటనే ఆ క్యూలో నిలబడతాం. కాస్సేపటికి ఓ పురోహితుడెవడో తగిలి "దేవుణ్ని పక్కనుంచి చూపిస్తాను. దర్శనం అయ్యాక నా విషయం మర్చిపోకండి" అంటే వెంటనే ధర్మదర్శనం ఫిలాసఫీ పక్కన పడేసి "పాపం పేద బ్రాహ్మడు. మనం సాయం చేయకపోతే ఎవరు చేస్తారు" అని నచ్చచెప్పుకుని అడ్డదారిలో దేవుణ్ని చూసేసి అతని చేతిలో ఓ పది రూపాయలు పెట్టి వైదికధర్మాన్ని ఉద్ధరించినట్టు పోజు కొడతార. నిజంగా వైదికధర్మాన్ని నిలబెట్టాలంటే అతని చేత వేదం కాస్సేపు చదివించుకుని ఆ పదీ యివ్వు. దానికీ దేవుడి దర్శనానికి లింకు పెట్టకు. ఇలాటి పని నేను చేసినప్పుడు నా పిల్లలు నన్ను అబ్జర్వ్ చేస్తారు కదా. వాళు ్ల ఎదిగి వచ్చేసరికి నా కంటె హైయ్యర్ వెర్షన్‌గా తయారవుతారు. బుద్ధిగా వుండే బ్రాహ్మణ్ని కూడా "ఇదిగో మాస్టారూ, మాట .. యిలా రండి.." అని పిలిచి చెడగొట్టే రకంలా అవుతారు.

ఈ రోజు సమాజం యిలా ఏడ్చిందంటే నా బోటి మధ్యవయస్కులే కారణం. గత పాతికేళ్లగా మేం సమాజాన్ని చెడగొట్టాం. మా ముందుతరం వాళ్లకంటె నీతినిజాయితీలలో దిగజారాం. కులస్పృహను, మతస్పృహను పెంచాం. సమసమాజం ఏర్పరచకపోగా ధనిక–పేదల మధ్య అంతరాన్ని పెంచాం. మా పెంపకంలో పెరిగిన నేటి యువతరం ముందు రెండు ఛాయిస్‌లు వున్నాయి. ఒకటి మా నీడలోనుండి బయటకు వెళ్లి సమాజాన్ని బాగుపరచాలి. లేదా పైన చెప్పినట్టు మా కంటె అధ్వాన్నంగా తయారై సమాజాన్ని యింకా దోపిడీ చేయాలి. ఏది చేసేందుకు ఛాన్సుంది? అవినీతి వ్యవస్థ చేత బాధపడుతున్న యువతరం దాని నిర్మూలనకు ఏమైనా చేస్తోందా? ఏదైనా చేయగలదా? ఏమిటి మార్గం?

నేటి యువతరంతో ప్రధానమైన సమస్య ఏమిటంటే – ఓర్పు లేకపోవడం. క్విక్ రిజల్ట్స్ రావాలనుకోవడం, రాకపోతే నిరాశలో కూరుకుపోవడం. ఒక విషయం బాగా గుర్తు పెట్టుకోండి. సమాజంలో మార్పు లేకుండా వుండదు. నిరంతరం అది మారుతూనే వుంటుంది. ఒకే నదిలో రెండుసార్లు అడుగుపెట్టలేవు అన్నాడు గ్రీక్ ఫిలాసఫర్ జీనో. కాలు పెట్టి తీసేలోపునే పాతనీరు మారిపోతుంది, కొత్తది వచ్చేస్తుంది. నదిస్వరూపం మారిపోతుంది. అయితే సమాజం మారేవేగం (వెలాసిటీ) చాలా తక్కువ. నెమ్మదిగా మారుతూ వుంటుంది. అది చాలామందికి అసహనం కలిగిస్తుంది. గబగబా మారిపోవచ్చు కదా అనుకుంటారు.

పావుశతాబ్దం సమయం ఒక యూనిట్ అనుకుంటే ఒక్కో యూనిట్‌లో యాక్సిలరేషన్ (వేగం మారే రేటు) ఎక్కువగా వుంటుంది, ఒక్కో యూనిట్‌లో యాక్సిలరేషన్ తక్కువగా వుంటుంది. ఈ మార్పు మంచికా, చెడ్డకా అన్నది ఒక్కో అంశంలో ఒక్కోలా వుంటుంది. అది కూడా మన దృక్పథంపై ఆధారపడి వుంటుంది. మనకు నచ్చే విధంగా సమాజం మారాలి అనుకున్నా ఓపిక పట్టాలి. అది మనం అనుకున్న దిశలో తిరిగేందుకు మనం చచ్చేట్లా శ్రమించాలి. అయితే మనం ఏమీ చేయటం లేదు. దాని పాటికి అది తిరుగుతోంది. అది ఎక్కడికో చేరాక మనం కోపగించుకుంటున్నాం.

మనకు వచ్చిందేమిటంటే జెస్చర్స్. ప్లాస్టిక్ వాడకం వలన భూమి నాశనం అవుతోంది. ఫలానా శనివారం రాత్రి 8 గంటలకు కొవ్వొత్తులు వెలిగించి అరగంట సేపు పట్టుకోండి అంటే పట్టుకుంటాం. ఇంట్లో వున్న ప్లాస్టిక్ వస్తువులు పారేయం. షాపుకి చేతులూపుకుంటూ వెళ్లి వాడు క్యారీ బ్యాగ్ యివ్వనంటే "...తొక్కలో రూల్సు" అని తిట్టుకుంటాం. ప్రపంచశాంతికై 10 కి.మీ.లు పరిగెట్టడానికి జీన్స్, టీ షర్టు వేసుకుని టాంక్‌బండ్‌మీద తయారవుతాం. వచ్చేటప్పుడు ఓ మోటర్ సైకిల్ వాడో అడ్డం వచ్చి ట్రాఫిక్ జామ్ కలిగిస్తే వాణ్ని పట్టుకుని తన్నబోతాం. ఎక్కడుంది మన చిత్తశుద్ధి?

నాకు తెలిసున్న యువతీయువకులు గ్రీన్ పీస్‌లో సభ్యులు. వాళ్ల చేత్తో ఒక మొక్క పాతగా, నీళ్లు పొయ్యగా, ఓ పువ్వు పెట్టుకోగా చూడలేదు. అదేమిటంటే మేం గ్రీన్ పీస్ వాళ్లకు డబ్బు పంపిస్తున్నాం. వాళ్లను చేయమను అవన్నీ. మాకా మట్టి ముట్టుకోవడం అసహ్యం. వానపామును చూస్తే వెలపరం అంటారు. వీళ్లు యునిసెఫ్‌కు డబ్బు పంపి, క్రై గ్రీటింగ్ కార్డులు కొని బీద, అనాథ పిల్లల్ని రక్షించేస్తున్నాం అనుకుంటారు. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర కారు తుడిచి డబ్బులడిగిన పిల్లల్ని కొట్టబోయినంత పని చేస్తారు. 'ఆ అంతర్జాతీయ సంస్థలకు మీరు పంపే విరాళాలకు యిన్‌కమ్‌టాక్స్ రిబేటు రావచ్చు కానీ దానిలో చాలాభాగం దాని ఎగ్జిక్యూటివ్స్ విలాసాలకే ఖర్చవుతుంది, అంతకంటె మీ కళ్ల ఎదురుగా కనబడుతున్న పనిమనిషి పిల్లాడికి చదువు చెప్పి బాగుపరచండి' అంటే మాకు టైము లేదంటారు.

కావాలంటే డబ్బు పడేస్తాం. వాళ్లెవరినో చేయమను అన్న ఫిలాసఫీ ఎల్లెడలా కనబడుతుంది. డబ్బు యిస్తాననడం గొప్పే, కానీ దాని కంటె గొప్పది మనుష్యులను మొబిలైజ్ చేయడం. అది చేయలేరు. 2010లో నేను రాష్ట్రమంతా సమైక్యవాద సదస్సులు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చాను గుర్తుందా? సదస్సు ఎలా వుండవచ్చో ఒక టెంప్లేట్ తయారుచేసి యిది చదివి ఎవరైనా ఏర్పాటు చేస్తే ఆ సభకు నేను నా ఖర్చులతో వచ్చి ప్రసంగిస్తానని ఆఫర్ చేశాను. దాని మీద చాలామంది పాఠకులు నాకు ఆఫర్ చేశారు – "నేను ఖర్చు భరిస్తాను. మా వూళ్లో పెట్టించండి" అంటూ. నేను జవాబిచ్చాను – "నాకు డబ్బు అఖ్ఖర్లేదు. మీ వూళ్లో మీ స్నేహితులు, బంధువులు, క్లాస్‌మేట్స్ ఎవరికైనా చెప్పి ఏర్పాటు చేయించండి. ఆ డబ్బు వాళ్లకే పంపండి ఖర్చులకి వుంటుంది" అని. "అలాటివాళ్లు ఎవరూ లేరు" అని సమాధానం. మొత్తం మీద ఒక్కచోటనుండి కూడా నాకు ఆహ్వానం రాలేదు.

అంతెందుకు, నేను ఫలానా పుస్తకం బాగుంటుంది కొని చదవండి అని నా కాలమ్‌లో రాస్తే 'ఇంటర్నెట్‌లో దొరుకుతుందా? లేకపోతే మీకు డబ్బు పంపితే మీరు పంపగలరా? మేం జర్మనీలో వున్నాం, ఆఫ్రికాలో వున్నాం' అని రాస్తారు. 'ఎక్కడ వున్నా, మీ బంధుమిత్రులు ఆంధ్రదేశంలో వుంటారుగా, రాసి తెప్పించుకోవచ్చుగా" అంటే "అబ్బే వాళ్లెవరికీ ఆసక్తి లేదండీ.." అంటారు. నిజానికి ఎంతోమంది ఉదారస్వభావులు కనబడతారు. "మా ఊరికి ఏమైనా చేయాలని వుందండీ. నిజాయితీగా పనిచేసే ఎన్జీవో (సామాజిక సంస్థ) ఏదైనా వుంటే రికమెండ్ చేయండి" అని. ఎవర్ని రికమెండ్ చేయాలన్నా మనకు భయం. వాడు చివరకు ఎలా తేలతాడో అని. వెళ్లి చెక్ చేసి, ఆ దానం సద్వినియోగం అయ్యేట్టు చూడాలి. కానీ అలా చూస్తున్నామా?

ఇలా మనకు ఏదో మంచి చేయాలని వుంటుంది కానీ తగిన సాధనసంపత్తి సమకూర్చుకునేందుకు వీలుండదు, సమయం వుండదు, ఓపిక వుండదు, ఓర్పు వుండదు. అందువలన ఏ లోకసత్తా జెపి లాటి వాళ్లో తారసిల్లితే మనం పొంగిపోతాం. మనం చేయాల్సిన పనులన్నీ ఆయన నెత్తిన పెట్టేస్తాం. "డబ్బు యిస్తున్నాంగా" అని మనకి మనమే సర్ది చెప్పుకుంటాం. ఆయనకు విరాళాలకు లోటు లేదు. కానీ చేసే కార్యకర్తలే లేరు. ఆయనది ఓ పత్రిక వుంది – జనబలం అని. మామూలు ప్రజలెవరూ దాన్ని చదవరు. దాని

ఉనికే తెలియదు చాలామందికి. ఏ వూళ్లోనూ వాళ్లు గట్టిగా మార్పు తెచ్చేసినది లేదు. ఎక్కడికి వెళ్లాలన్నా, ఏం పని చేయాలన్నా జెపి గారే కదలాలి. 'ఫలానా వూళ్లో అవినీతి యిన్ని యూనిట్లు వుండేది, అక్కడ లోకసత్తా పెట్టాక యిన్ని యూనిట్లు తగ్గింది' అని ఎవరైనా క్లెయిమ్ చేయగలరా?

చూసి చూసి ఆయనకు విసుగుపుట్టి ఆ ఉద్యమాన్ని రాజకీయపక్షంగా మార్చేశారు. మార్పుకి అడ్డు చెప్పినవారిని తీసి పక్కన పడేశారు. పార్టీగా కూడా దాని పెర్‌ఫామెన్స్ చూశాం. విరాళాలిచ్చినవారెవ్వరూ అంత నిరుత్సాహకరమైన ఫలితాలను ఊహించలేదు. కనీసం 5%-10% ఓట్లయినా వస్తాయనీ, 2014 ఎన్నికలలో తమకు వందదాకా సీట్లు వచ్చినా ఆశ్చర్యపడనక్కరలేదనీ ఆశ పడినవాళ్లు 2% ఓట్లకంటె తక్కువ వస్తే బాధపడ్డారు. సమాజంలో విద్యావంతులంతా లోకసత్తాకు గుద్దేస్తారని అనుకున్నారు. కానీ విద్యావంతులు కూడా అమలు చేసే సామర్థ్యం ఎవరికి వుందో, ఎవరికి లేదో గమనించే ఓట్లేస్తారు కదా.

'ఇదంతా 'నీ బోటి వాళ్లు సపోర్టు చేయకపోవడం మూలానే..'' అని నాకెవరూ మెయిల్స్ రాయవద్దు. నేనేముంది, కోన్‌కిస్కాయ్‌ని. సమాజం అలా వుంటే నేనేం చేస్తాను? జెపి గారి కృషి సొంతం వ్యర్థమైందని నేను అనను. ఫలితాలు మాత్రం ఆయన కృషికి తగ్గ స్థాయిలో లేవని, సమాజంలో గణనీయమైన మార్పు తేలేకపోయారనీ మాత్రం అంటాను.

ఇప్పుడు మనకు కొత్త దేవుడు దొరికాడు. అన్నా హజారే. మనం ఎస్సెమ్మెస్‌లు పంపేస్తే, ఫార్వార్డ్‌లు గుప్పిస్తే, అడిగితే డబ్బు పంపేస్తే ఆయనే తోటకెళ్లి చెట్టుకు కాసినవాటిలో మనకు కావాలసినవన్నీ పట్టుకుని వచ్చేస్తాడని దురాశ పడుతున్నాం. మన అత్యాశ చూసి, దీన్ని ఎన్‌క్యాష్ చేసుకునే వాళ్లు తయారయ్యారు. ఐ యామ్ అన్నా అని గాంధీ టోపీలు తయారుచేసేవాళ్లు, టీ షర్టులు ప్రింట్ చేసేవాళ్లు, టీవీల్లో మాట్లాడి పేరు తెచ్చుకున్టేవాళ్లు, యిదే అదనుగా అన్నాకు మద్దతుగా నగ్నంగా రోడ్డు మీద నడుస్తానని పబ్లిసిటీ కొట్టేస్తున్న సలినా వలీఖాన్ అనే మోడలూ.. ఇలా..

ఈ సందట్లో సడేమియాగాళ్లలో ఎవరికి వచ్చిందో కానీ బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది. ఒక నెంబరు యిచ్చి దీనికి మెసేజ్ పంపమంటున్నారు. 25 కోట్ల మెసేజ్‌లు వస్తే జనలోక్‌పాల్ బిల్లు పెడతానని కేంద్రం చెప్పింది కాబట్టి (ఎక్కడ చెప్పింది? అన్నీ వీళ్ల అబద్ధాలే) మనం మెసేజ్‌లివ్వాలట. దీని వలన ఆ ఫోన్ కంపెనీకి ఎంత లాభమో ఏమిటో ! ఇలా అన్నాను రకరకాలుగా (దుర్) ఉపయోగించుకుంటున్న లోకంలో ఆయన అనుకున్న లక్ష్యం సాధించగలడా? అవినీతిరహిత భారతం ఏర్పడే విధానం యిదేనా?

సరే, అన్నా ఏమీ చేయలేడనే అనుకుందాం. అందుకని మనం వూరుకోవలసినదేనా? లోకం యిలా సాగాల్సిందేనా? దీనికి పరిష్కారం లేదా? అని అడిగితే - పరిష్కారం దిశగా ఏం చేయాలో మాత్రం చెప్పగలను. మోజెస్‌లా ఎవరో మెస్సయ్య వచ్చి మనల్ని బాగుచేసేస్తాడని అనుకునే భ్రమలు ముందు విడవాలి. ఒకవేళ అలాటివాడు వచ్చినా మనం అడుగడుగునా సణుగుతూనే వుంటాం. (బైబిల్ కథల్లో హీబ్రూల గురించి రాస్తున్నాను, చదవండి) మనలోనే చైతన్యం రావాలి. అన్ని స్థాయిల్లో మనం సంఘాలుగా ఏర్పడి అవినీతిని, నియమోల్లంఘనను ఎదిరిస్తూ వుండాలి.

కన్స్యూమర్స్ సొసైటీలు లాటివి ఎన్నో రావాలి. రోడ్ యూజర్స్ అసోసియేషన్, ఫలానా స్టేషన్ ట్రెయిన్ పాసింజర్స్ అసోసియేషన్, ఫలానా పార్క్ వాకర్స్ అసోసియేషన్, ఫలానా సినిమాహాల్ వ్యూయర్స్ అసోసియేషన్... ఎక్కడ పడితే అక్కడ.. 20 మంది యూజర్స్ వుంటే చాలు ఓ సంఘంగా ఏర్పడి ఉల్లంఘన జరిగినపుడు అడుగుతూండాలి. సినిమా హాల్లో ఎసి ఆఫ్ చేసినా వెళ్లి అడగాలి. బాత్‌రూమ్‌లో వాసన వస్తే నిలదీయాలి. బస్సు బస్టాండ్‌లో ఆగకపోతే ఆ స్టాప్‌లో వాళ్లు ఫిర్యాదు చేయాలి. సమయానికి రైలు రాకపోతే గొడవ చేయాలి. పార్క్ వంటి పబ్లిక్ ప్లేస్‌లో లవర్స్ రొమాన్సు చేస్తూ వుంటే పక్కకు తప్పుకుని వెళ్లిపోయే బదులు ఓ నలుగురు అక్కడే నిలబడితే చాలు అలాటివి ఆగుతాయి.

చట్టాలు అమలు చేయడానికి ముందు ప్రభుత్వం సౌకర్యాలు ఏర్పరచేట్లా చూడాలి. రోడ్డుపై మూత్ర విసర్జన చేస్తే నేరం. పోలీసు వచ్చి ఫైన్ వేస్తే కేసు పెడితే కాదనలేం. కానీ అంతకుముందు ప్రభుత్వం ప్రతీ అర కి.మీ. దూరంలో పబ్లిక్ యూరినల్స్ ఏర్పాటు చేయాలి. అలాగే రోడ్డు మీద నడిచేవారి కోసం జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలి. దానిపై వాహనాలు నిలిపితే మనం అక్కడే ఆగిపోయి నిరసన తెలపాలి. పోలీసువాణ్ని కేసు బుక్ చేయమనాలి. పోలీసువాడు లంచం తీసుకుని వదిలేస్తూంటే అక్కడే నిలబడి చూస్తూ వుండాలి. వాణ్ని ఎలాగూ తిట్టలేం, కొట్టలేం. గమనిస్తూ వుంటే వాడికి భయం వేస్తుంది. రోజూ అదే టైముకి వచ్చి ఓ వారం నిలబడితే వాడు జంకుతాడు.

ప్రభుత్వం అర్థరహితమైన రూల్సు పెడుతూ వుంటే యీ సంఘాలు అడ్డు చెప్పాలి. హైదరాబాదులో ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేస్తే వెయ్యి రూపాయలు ఫైన్ అని పెట్టారు. ఏ వంద రూపాయలో పెట్టి స్ట్రిక్టుగా అమలు చేస్తే చాలామంది నిజాయితీగా కట్టేస్తారు. వెయ్యి రూపాయలనడంతో ఓ వంద లంచం యిచ్చి తప్పించుకోవడానికి చూస్తారు. అది అమలు కాదు సరికదా, సమాజంలో అవినీతి పెరగడానికి దోహదపడుతుంది. ఇలా ఎన్నో రూల్సు వున్నాయి. చట్టాలు వున్నాయి. స్విస్ బ్యాంకుల్లోని బ్లాక్‌మనీ తెచ్చేస్తే దేశం బాగుపడిపోతుంది అని అంటే అసలు అక్కడ పెట్టనిచ్చినది ఎవరు? బ్లాక్ మనీ జెనరేట్ చేయనిచ్చినది ఎవరు? దానికి పురికొల్పే చట్టం ఏర్పరచినదెవరు? ఇలా అనేక ప్రశ్నలు వస్తాయి. వాటిని సరిచేయాలని ఒత్తిడి తేవాలి కదా.

కఠినమైన చట్టం చేసేసి వూరుకుంటే అది డిస్‌యూజ్ అవుతుంది, లేదా మిస్‌యూజ్ అవుతుంది. (అన్నా, అన్నన్నా..లో ఉదాహరణలు యిచ్చాను). అందువలన ప్రజాస్వామ్యానికి కాన్‌స్టంట్ విజిల్ (నిరంతరమైన నిఘా) వుండి తీరాలి అంటారు. ఆ నిఘా

ప్రయత్నం కూడా సామాజిక సంస్థల ద్వారా లాంగ్, డీప్ అండ్ సస్టయినింగ్ గా వుండాలి. పేరుకోసం మొదలెట్టడం, నిరాశ చెందో, పంతాలకు పోయో మధ్యలో రిజైన్ చేయడం, యితరులను విమర్శించడం చేయకూడదు. ఇవన్నీ తెలిసి ఏదో ఎన్‌జీవో పిల్ వేస్తే అప్పుడు దాని ఫలితం అనుభవిద్దామని చూస్తున్నాం తప్ప, అప్పటిదాకా గుడ్లప్పగించి చూస్తున్నాం.

ఏ ఆఫీసులోనైనా సరే కంప్లయింట్స్ అండ్ సజెషన్ బాక్స్ ఎక్కడుందో ఎవడూ చూడడు. ఎవడూ పట్టించుకోడని గట్టి నమ్మకం. అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లలో చూడండి. ఏ యిద్దరు ఓనర్స్ కలిసినా సౌకర్యాలు లేవని బిల్డర్‌ను తిట్టుకుంటారు. అలా అని అసోసియేషన్ ఏర్పరచి ఫైట్ చేద్దాం రండి అంటే మీటింగుకి వచ్చేవాళ్లు గుప్పెడు మంది వుండరు. సెక్రటరీగా వుండమంటే వాళ్లూ మాయమై పోతారు. ఇలాటి పరిస్థితుల్లో అన్నా కాదు వాళ్లన్నగారు కూడా ఏమీ చేయలేరు. చేసినా పదికాలాలపాటు నిలవదు. పాలపొంగులా పొంగి, చప్పున చల్లారుతుంది. దీన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం జరుగుతుంది.

అన్నా హజారే పంతం నెగ్గుతోందని, ప్రభుత్వం దిగివస్తోందని వార్తలు వస్తున్నా యీ విషయంపై నా అభిప్రాయం మారదు. అన్నా ప్రస్తుతానికి గెలవవచ్చు, కానీ ఆయన చేయాల్సిన పద్ధతి యిది కాదని నేను నమ్ముతాను. ప్రభుత్వం యీ రోజు సరేనన్నా, పోను పోను కాలు అడ్డుపెడుతుందని నా అనుమానం. ప్రభుత్వం దిగి వచ్చినంతవరకు ఆమోదించి ఏదో ఒక బిల్లు చప్పున పాస్ కావాలని నా ఆకాంక్ష. లేకపోతే మహిళా రిజర్వేషన్ బిల్లులాగానే దీనినీ నాన్చి నాన్చి మనం మర్చిపోయేట్లు చేస్తారు. ఆర్‌టిఐ చట్టం కాదు, మరోటి కాదు – ఒకే రోజు ఆవిర్భవించలేదు.

నౌ ఆర్ నెవర్ అనే పద్ధతి మంచిది కాదు. పిల్లవాడికి పళ్లు ఒకేసారి రాదు, హరాయించుకునే శక్తి బట్టి దశలవారీగా ఏర్పడతాయి. చట్టమూ అంతే క్రమేపీ దంతాలు ఏర్పడతాయి. పాలపళ్లు మొదట ఏర్పడి, పిల్లవాడు ఎదుగుతున్న కొద్దీ అవి రాలిపోయి గట్టివి ఏర్పడతాయి. సరిగ్గా చూసుకోకపోతే ఆ దంతాలు రాలిపోయి బోసినోరయి ఏది కొరకడానికీ పనికి రాకుండా పోతుంది. చట్టాన్ని కూడా మనం సరిగ్గా ఉపయోగిస్తూ చలామణీలో వుంచాలి. దానికి కోర్టులు చురుగ్గా పనిచేయాలి. కేసులు త్వరగా పరిష్కరిస్తూ మంచివాళ్లను రక్షిస్తూ, చెడ్డవాళ్లనూ శిక్షిస్తూ వుండాలి. కోర్టులు చురుగ్గా పనిచేసేట్టు ప్రజాసంఘాలు మరీ చురుగ్గా పనిచేయాలి.

ఇంత కథ వుండగా అదేమీ చేయకుండా అన్నా హజారేను నీకు జై కొడతాం, వెళ్లి ఎక్కణ్నుంచో అవినీతిరహిత భారతం పట్టుకురా అంటే పట్టుకు రాలేడు అని నా భావం. తేగలను, నేను దేశాన్ని శాసించగలను, యీ నాయకులంతా నా మాట వినితీరాలి అని ఆయన అనుకుంటే అది మూర?త్వం. ఉద్యమంలో పట్టు, విడుపు వుండాలి. పరిమితులు తెలిసి ఎగరాలి. చేసినంతవరకు థ్యాంక్స్. ఇప్పటికైనా శాంతించి, ఆచరణయోగ్యమైన ప్రణాళిక వేసుకుంటే బాగుంటుంది. ఈ లోగా – యిన్ని చెప్తున్నారు, మీరు సంఘం ఏర్పాటు చేయవచ్చు కదా అని నన్ను తిట్టకండి. అదే ప్రశ్న నేనూ మిమ్మల్ని అడుగుతాను. మన బట్టే మన పాలకులుంటారు. వెనకటికి దేశంలో పాల కరువు ఏర్పడితే రాజుగారు ప్రతీవాడు ఓ చెంబు పాలు విరాళం యివ్వండి అంటూ ఓ పెద్ద గంగాళం చీకటి గదిలో ఏర్పాటు చేశాట్ట. ప్రతీవాడు "పక్కవాడు ఎలాగూ పాలు పోస్తాడు, నేను నీళ్లు పోస్తే మాత్రం తేడా ఏం వస్తుంది?" అనుకుంటూ నీళ్లు పోశాట్ట. అంతా అయ్యాక చూస్తే అన్నీ నీళ్లే ! పాల చుక్క లేదు. అలా మనమంతా నీళ్లు పోసి, పాలకోవాలాంటి భారతం రమ్మంటే రాదని చెప్తున్నాను. గ్రహించండి చాలు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**

**ఆగస్టు 56 ఎమ్బీయస్ : నయనతార మతపరివర్తన**

సినిమాతార నయనతార ప్రభుదేవా అనే నటదర్శకుణ్ని ప్రేమించి, పెళ్లాడబోతోంది. ఆమె క్రైస్తవురాలు, అతను హిందూ కావడం చేత అతనికోసం ఆమె హిందువుగా మతం మార్చుకుంది. సివిల్ మ్యారేజి చేసుకుంటే మతాంతర వివాహం చెల్లుతుంది. ప్రభుదేవా మొదటి భార్య రమాలత్ ముస్లిం. ఆవిడ మతం మార్చుకోకుండానే పెళ్లి చేసుకుంది. అది చెల్లింది. అందుకే ఆమెకు భరణం దక్కింది. అలాగే నయనతార కూడా మతం మార్చుకోనక్కరలేదు. అయినా మార్చుకుంది. అదేదో హిందూమతంలోని అంశాలు ఆమెను ఆకట్టుకున్నాయి కాబట్టి అని ఎవరూ అనుకోనక్కరలేదు. ఏ మతమైనా చెప్పేది ఒక్కటే – పరోపకారం మంచిదని, పరపీడన చెడ్డదని. అది ఆచరిస్తే చాలు, దానికోసం మతం మార్చుకోనక్కరలేదు. కానీ భర్తకోసం ఆమె మార్చుకుందామనుకుంది. అది ఆమె అభి'మతం'. దానిపై వ్యాఖ్యానించడానికి ఏమీ లేదు.

అయినా ఆమె మతాంతీకరణపై తమిళనాడులోని క్రైస్తవసంఘాలు ఆమెను తీవ్రంగా విమర్శించాయిట. పనిలేకపోతే సరి. దానిపై ఖండనమండనలు కూడా వచ్చాయి. మతాల గురించి పాకులాడేవారు యిలా చేయడంలో ఆశ్చర్యం లేదు. దాని గురించి మనం చెప్పుకోవలసిన పనీ లేదు. అయితే యిది రాయడానికి పురికొల్పినది – ఆంధ్రజ్యోతిలో 'నయనతార మతమార్పిడి' (ఇది దుష్టసమాసం, మతం సంస్కృతం, మార్పిడి తెలుగుపదం. అందుకే అది నేను ఉపయోగించలేదు) పేర ప్రచురించబడిన లేఖ. రాసినది ఒంగోలులో వున్న భారత హేతువాద సంఘం సంయుక్త కార్యదర్శి నార్నె వెంకటసుబ్బయ్య గారు.

మతం వ్యక్తిగత విషయం, ఏ మతానికి చెందకుండా తమకు తాము మనుష్యులం అనే స్థాయికి ఎదగాలనేది హేతువాదుల లక్ష్యం అని చెపుతూనే ఆయన 'హిందూమతం స్వీకరిస్తూ నయనతార వేదాలను, గాయత్రీ మంత్రాన్ని పఠించినట్లు చెప్పుకున్నారు. ఇది హిందూ మత సంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధమైనది. ఎందుకంటే శూద్రులకు, స్త్రీలకు వేదాలను పఠించే అర్హత లేదు. గాయత్రి

మంత్రాన్ని పఠించే అర్హత అసలే లేదు. వేదాలను, వేదమంత్రాలను కేవలం ఒక్క బ్రాహ్మణకులం మాత్రమే చదవాలి. వేరే కులాల వారికి వాటిని చదివే అర్హత లేదు. వేదాలను విన్నా, వాటిని చదివినా వారి చెవులలో సీసం కరిగించి పోయాలని స్మృతులు ఘోషిస్తున్నాయి..” అంటూ రాశారు.

ఈ మాటలు అంటే గింటే ఏ కరడుగట్టిన హిందూ ఛాందసవాదో అనాలి. ఈ హేతువాదికి ఎందుకింత బాధ? నయనతార గాయత్రిమంత్రం చదివితే గాయత్రీదేవి ఫీలైందో లేదో కానీ యీయన ఫీలయిపోతున్నాడు. హిందూమతానికి అది విరుద్ధంట. అయితే కానీ. ఏ మతం లేనివాడికి యీయన కెందుకు కడుపునొప్పి? అయినా నాకు తెలిసి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య – మూడు కులాలకూ ద్విజత్వం, యజ్ఞోపవీతధారణ వుంటుంది. జందెం వేసుకున్నపుడు గాయత్రీ మంత్రోచ్చాటన వుంటుంది. వీళ్లకు వేదాధ్యయనం చేసే హక్కుంది. బ్రాహ్మణులకు అదనంగా వున్నది – యితరులకు వేదాన్ని నేర్పే హక్కు. అది యితరులకు లేదు. ఈయన ముందు వాక్యంలో ‘శూద్రులకు, స్త్రీలకు.. చదివే అర్హత లేదు’ అని మొదలు పెట్టి, మూడో వాక్యం దగ్గరకు వచ్చేసరికి ‘బ్రాహ్మణకులం తప్ప వేరే కులాల వారికి లేద’ని.. తేల్చారు. శూద్రులు కాక బ్రాహ్మణేతరులు వేరే వున్నారన్న సంగతి ఎగరగొట్టేశారు. వారి చెవుల్లో సీసం కరిగించి పోయాలని చెపుతూ స్మృతులను అడ్డం వేసుకున్నారు.

స్మృతుల సంగతి పక్కన పెడదాం. అసలు యీ హేతువాది మనుష్యుల మధ్య వున్నారో, తాళపత్రాలలో జీవిస్తున్నారో మొదట చూద్దాం. మంత్రాలు, వేదాలు బ్రాహ్మణులకే పరిమితం అనే భావన అనేది అసలు ఎప్పుడైనా వుండేదో లేదో తెలియదు. గాయత్రిమంత్రాన్ని సృష్టించిన విశ్వామిత్రుడే జన్మచే బ్రాహ్మడు కాదు కదా. ఇలాటి ఛాందసాలు గతంలో వుంటే హిందూసమాజం వాటినుండి ఎప్పుడో బయటపడింది. అందరూ అన్నీ చదువుతున్నారు. గాయత్రి పరివార్ అని ఒకటి చాలాకాలంగా పనిచేస్తోంది. గాయత్రీ యజ్ఞం అని నిర్వహిస్తూ అక్కడ అందరి చేతా – కుల, లింగ వివక్షత లేకుండా అందరి చేతా సామూహికంగా చదివిస్తున్నారు. ఎందరో పాల్గొంటున్నారు. ఎవరూ అభ్యంతర పెట్టటం లేదు.

ఇదే కాదు, వేదాల గురించి పుస్తకాలు, సిడిలు, టీవీలో ప్రసంగాలు ఎన్నో విరివిగా లభిస్తున్నాయి. వీటిని రాసేవారు, వ్యాఖ్యానించేవారు, పాడేవారు అన్ని కులాలవాళ్లూ వుంటున్నారు. దైవసమానులుగా పలువురిచే పరిగణించబడుతున్న బాబాలలో ఎందరు బ్రాహ్మణులు? ఋగ్వేదంపై ప్రామాణికమైన పరిశోధన చేసిన మాక్స్ ముల్లర్ బ్రాహ్మణుడా? అంతమాత్రం చేత ఆ పుస్తకాన్ని తిరస్కరించారా? ఎప్పుడో 70 ఏళ్ల క్రితమే ఈ హేతువాదిగారి వూరికి దగ్గరలోనే తెనాలిలో త్రిపురనేని రామస్వామి చౌదరిగారు బ్రాహ్మణేతరులకు వేదపాఠశాల పెట్టి వేదం నేర్పించారు. అప్పుడు ఎవరైనా సీసం పట్టుకుని వచ్చి సీసాలతో కరిగించి పోశారా? ఇప్పుడు కూడా అనేక వేదపాఠశాలల్లో అనేక కులాలవారు చదువుతున్నారట. వాళ్లందరినీ వెలి వేస్తున్నారా?

విష్ణుసహస్రనామం, లలితా సహస్రనామం – యిలాటివి కొన్ని సమయాలలో మాత్రమే, కొన్ని ప్రదేశాలలో మాత్రమే చదవాలని నా చిన్నపుడు అనేవారు. ఇప్పుడు అదేమీ లేదు. ఎక్కడ పడితే అక్కడ చదువుతున్నారు. బస్సుల్లో, రైళ్లల్లో, సినిమాహాలు వెయిటింగ్ లాంజ్‌లలో కాస్త సమయం చిక్కితే ఆడవాళ్లు హేండ్‌బ్యాగ్‌ల్లోంచి చిన్నసైజు పుస్తకంలో వున్న స్తోత్రాలు తీసి చదువుకుంటున్నారు. వాళ్ల యిష్టం. ఎవరూ కాదనేవాడు లేదు. ఎవళ్ల నమ్మకం వాళ్లది అని వూరుకుంటున్నారు తప్ప మతం భ్రష్టుపోతోందంటూ యీ హేతువాదిలా ఉరేసుకోవడం లేదు. ఈయనకు ఆ మార్పు యిష్టం లేనట్టుంది. స్మృతుల పేరు పెట్టి బెదరగొడుతున్నారు.

అసలా స్మృతులు ఏ కాలంలోనైనా ఎవరైనా అమలు చేశారో లేదో ఎవడు చూడవచ్చాడు. రాసేసి ఓ మూల పడేశారేమో ! ఎందుకంటే దళిత సాహిత్యకారులు మాటిమాటికి మనుస్మృతిని ‘కోట్’ చేసి ఓ మాట చెప్తూ వుంటారు. ‘బ్రాహ్మణుడి ఎదురుగా అస్పృశ్యుడు అపాన వాయువు విడిస్తే వాడి పిరుదులు కోసేయాల’ని దాంట్లో రాసుందట. రాస్తే రాసి వుండవచ్చు. ఒరిజినల్‌లో లేకపోయినా తర్వాత ఎవడో యిరికించి వుండవచ్చు (ప్రక్షిప్తాలు అనేవి చాలా తరచుగా జరుగుతూ వుంటాయి). ఇంతకీ అది ఎప్పుడైనా అమలు అయిందా లేదా అన్నది ప్రశ్న. దానికి దాఖలాలున్నాయా? అసలు ఎవడైనా ఆ పుస్తకాలు చదవాలి కదా అమలు చేయడానికి..! మను స్మృతిపై గౌరవం లేనివాళ్లు, తిట్టడానికి దానిలో ఏం దొరుకుతుందా అని వెతికేవాళ్లూ తప్ప వేరే ఎవరూ చదవడం లేదు. నాకు తారసిల్లిన మామూలు వాళ్లెవరూ ఏ స్మృతీ చదవలేదు. అసలు ఎన్ని వున్నాయో కూడా వారికి తెలియదు.

ఎందుకంటే ఆ స్మృతి మన నిత్యజీవితంలో ఎక్కడా అడ్డు రాదు. గతకాలంలో కూడా వచ్చి వుంటుందని అనుకోను. ఎందుకంటే ఏ కులంవాడైనా తన భుజబలంతో రాజ్యానికి వచ్చిన తర్వాత ‘నేను సూర్యవంశపు క్షత్రియుణ్ని, లేదా చంద్రవంశపు క్షత్రియుణ్ని’ అని ప్రకటించుకుంటే యీ స్మృతి అడ్డు వచ్చేదా? స్మృతి పుస్తకం యింట్లో దాచి పెట్టుకుని పెట్టుకున్న రాజపురోహితుడికి ఓ అగ్రహారం యిచ్చేస్తే ఆయన పుస్తకం దాచేస్తాడు. కాదూ, శాస్త్రం ఒప్పదు అని శంకరాభరణం శంకరశాస్త్రిలా భీష్మిస్తే ఆయన తలకాయ ఎగరేసి, మాటవినే ఇంకో పురోహితుణ్ని తెచ్చుకుంటాడు రాజు. ఫినిష్ ! గుళ్లో కూడా చాలా రిలాక్సేషన్లు వుంటాయి. స్నానం చేసి రాలేదంటే నెత్తిన నీళ్లు చల్లి ఫర్వాలేదు, కూర్చోండి అంటారు. అర్చన చేయిస్తూ ఆవుపాలు తేలేదండీ, వస్త్రాలు తేలేదండీ అంటే అయితే అక్షింతలు చల్లేయండి, ఫర్వాలేదు అంటారు.

ఇక్కడ ఒక ఉదంతం చెప్తాను – కేరళలో ఓ క్రైస్తవుడిగా పుట్టిన ఓ కమ్యూనిస్టు నాయకుడు (పేరు గుర్తుకు రావటం లేదు, ఇది 35.40 యేళ్ల క్రితం మాట) వుండేవారు. ఆయన చర్చి గుమ్మం తొక్కేవాడు కాదు. అది బాహాటంగా చెప్పుకునేవాడు కూడా. చర్చి ఆయనపై కారాలూ, మిరియాలూ నూరేది. కేరళలో మతపరమైన (క్రైస్తవ, ముస్లిమ్, హిందువుల్లో నాయర్) పార్టీలు చాలా వున్నాయి.

కేరళ చర్చి మద్దతుతో ప్రారంభమైన పార్టీలో రెండు, మూడు  చీలికలు వచ్చేయి కూడా. అంత పవర్‌ఫుల్ చర్చి అన్నమాట. ఈ కమ్యూనిస్టు దరిమిలా మంత్రి అయ్యాడు. అతని కూతురు పెద్దదై ఒక క్రైస్తవుణ్ని పెళ్లి చేసుకుంటానంది. చర్చి ఆ పెళ్లిని సోలమ్నైజ్ చేయనంది. తండ్రి క్రైస్తవుడు కానందువలన మేం దీన్ని ఆమోదించం అంది. ఇక కూతురు, భార్య యీ కమ్యూనిస్టుపై ఒత్తిడి తెచ్చారు. ఈయన గత్యంతరం లేక చర్చికి వెళ్లి బాప్టిజం తీసుకుని, కూతురు పెళ్లి చేసి ఊపిరి పీల్చుకున్నాడు. ఇలాటిది హిందూ మతంలో జరిగినట్టు నాకు తెలియదు. ఇందిరా గాంధీని పూరీ జగన్నాథుని గుడికి రానీయలేదనీ (ఆమె పార్శీని పెళ్లాడింది కాబట్టి) అలాటివి చదివాను. అంతేకానీ ప్రత్యేకంగా యిటువంటి అవకాశాలను వినియోగించుకుని వంచినట్లు తెలియదు.

ఎవరు ఏం చేసినా హిందూ పీఠాధిపతులు ఏమీ అనరు. అసలు హిందువులకు ఒక ఏకీకృతమైన పీఠమే లేదు. ఎవడూ ఎవడి మాటా వినడు. రోమన్ కేథలిక్కులకైతే పోప్ చెప్పినది వేదం. మన హిందువులలో ఎవరి మాట వేదవాక్కు చెప్పండి చూదాం. పుష్కరాలు యివాళ్టినుండి అని ఒకరంటారు, కాదు వారం తర్వాత అని యింకోరంటారు. కృషా?ష్టమి నక్షత్రం ప్రకారం చేయాలని ఒకడంటే, కాదు తిథి ప్రకారం అని మరోడంటాడు. నార్త్ వాళ్లకు పండగ అయినది, సౌత్ వాళ్లకు కాదు, ఈస్ట్ వాళ్లకు మంచిదైన రోజు వెస్ట్ వాళ్లకు కాదు. ఏది ఎలా చేసినా హిందువుగానే చెలామణీ అవుతావు.

ఇదీ ఫైనల్, ఇదే ఫైనల్ అని శాసించే పీఠాధిపతి ఎవరూ లేరు. అసలు దేశంలో ఎన్ని పీఠాలున్నాయో మనకే తెలియదు. ప్రస్తుతం వున్న చిన్న జియ్యర్ స్వామి యాక్టివ్‌గా వున్నారు కాబట్టి, జియ్యర్ (దాని అర్థం ఏమిటి, అయ్యర్ కేమైనా బంధువా అని అడగకండి), అనే పదవి ఒకటి వుందనీ, 'చిన్న' అని వుంది కాబట్టి 'పెద్ద జియ్యర్' కూడా ఒకళ్లు వుండివుండాలని అనుకుంటున్నాం.

ఆయన ఓ పీఠాధిపతి కదా అనుకున్నా, లింగాయతుల వంటి వీరశైవులు 'ఆయన్ని మేం కేర్ చెయ్యం పొమ్మంటారు'. హిందూమతంలో వున్న బ్యూటీ అదే, విషు?వు నమ్మనివాళ్లూ హిందువులే, శివుణ్ని నమ్మనివాళ్లూ హిందువులే. ఇంతమంది దేవుళ్లలో ఒకణ్నే నమ్మినా, ఎవర్నీ నమ్మకపోయినా, గుడికి వెళ్లినా, వెళ్లకపోయినా ఎవరూ ఏమీ అనుకోరు. చర్చికి వెళ్లినా, మసీదుకి వెళ్లి వచ్చినా ఎవరూ ఏమీ చెయ్యరు.

హిందువుల్లో మస్తానయ్య వంటి ముస్లిం పేర్లు పెట్టుకుంటారు, దర్గాకు వెళ్లి ముస్లిం ఫకీర్ల చేత తావీజులు కట్టించుకుంటారు, హిందువో, ముస్లిమో తెలియని సాయిబాబాను కొలుస్తారు, సాయిబాబాను విషు?వు అవతారంగా విగ్రహాలు చేసి గుళ్లు కట్టేస్తారు, సత్యనారాయణస్వామితో కలిపి సాయిసత్యనారాయణ వ్రతాలు చేసేస్తారు. ఏం చేసినా ఎవరూ ఏమీ అనరు. వెలివేయడాలు లేవు. వెలివేసే దమ్మున్న పీఠాధిపతులూ లేరు. పీఠం నుండి ఒకవేళ శ్రీముఖం వస్తే పట్టించుకునేవారూ లేరు.

కంచి పీఠాధిపతిని జైల్లో పెట్టినా తిరుగుబాటు రాలేదు. (రాకూడదు కూడా) పోప్‌ని అరెస్టు చేస్తే (ఒకవేళ చేయడమనే అవసరం పడి చేస్తే) పరిస్థితి ఎలా వుంటుందో నేను ఊహించలేను. ముస్లిం ప్రవక్తను కారెక్టరుగా పెట్టి కార్టూన్ వేస్తే ఎంత సంక్షోభం వచ్చిందో చూశాం. హిందూ దేవుళ్లను కామెడీ కారెక్టర్లుగా పెట్టి నాటకాలు రాయవచ్చు, సినిమాలు తీయవచ్చు. భక్తులైన నటీనటులు కూడా ఆ పాత్రల్లో వేయడానికి ఏ మాత్రం సంకోచించరు. ఇక కార్టూన్లయితే చెప్పనే అక్కరలేదు. వినాయకచవితికి వినాయకుడి మీద కుప్పలుతిప్పలు కార్టూన్లు.

హేమామాలిని, శర్మిలా ఠాగూర్ వంటి హిందూ స్త్రీలు పెళ్లిళ్లు చేసుకోవడానికి ఇస్లాం స్వీకరించాం అంటారు. మళ్లీ హిందూత్వం గురించి మాట్లాడతారు. ఎవరూ ఏమిటిది అని అడగరు. నయనతార క్రైస్తవంలో వుండగా సీతగా నటించినా ఎవరూ ఏమీ అనుకోలేదు. వైయస్ వంటి క్రైస్తవ ముఖ్యమంత్రులు భద్రాచలం రాములవారికి పెళ్లివేళ బట్టలు, తలంబ్రాలు పట్టుకెళ్లి యిస్తారు. గుళ్లో స్వీకరిస్తారు తప్ప అడ్డు చెప్పరు.

ప్రభుత్వ పథకాల శంకుస్థాపన సమయంలో మంత్రిగారిది ఏ కులమైనా, ఏ మతమైనా సరే పూజలు చేయిస్తారు. అప్పుడు గాయత్రీమంత్రమూ పఠింపచేస్తారు. (మన హేతువాది గారు పక్కన వుండి వుంటే ఆపించేవారేమో) వైయస్ వంటి వాళ్లు ఓ పక్క క్రైస్తవులుగానూ, మరో పక్క రెడ్లగానూ చెలామణీ అయిపోతూంటారు. కులమనేది హిందువులకు ప్రత్యేకం, క్రైస్తవులలో కులం ఎక్కడుంది? అని నిలదీసేవారు ఎవరూ వుండరు. (

ఇంత మతస్వేఛ్ఛే ప్రపంచంలో ఎక్కడా వుండదు వంటి స్టేటుమెంటు నేను యివ్వను. ఎందుకంటే నేను ప్రపంచమంతా తిరిగి ఏ మతం ఏ మోతాదులో అమలవుతోందో స్టడీ చేయలేదు. కానీ యిక్కడ హిందువులు మెజారిటీలో వున్న భారతదేశంలో హిందూ సమాజంలో స్వేఛ్ఛే బాగానే వుందనే అనుకుంటున్నాను. ఎక్కడో యుపిలో సగోత్ర వివాహం జరిగిందని వెలి వేసారు వంటి వార్తలు అప్పుడప్పుడు వస్తూ వున్నంత మాత్రాన స్వేఛ్ఛే లేదని అనడం న్యాయం కాదు. ఇధర్ సబ్ కుఛ్ చల్తా హై !

మన హేతువాది నార్నె వారికి యింకో సందేహం కూడా వచ్చింది. '..ఇంతకూ వేరే మతం నుంచి హిందూ మతంలో చేరినవారికి హిందూ పీఠాధిపతులు ఏ కులాన్ని ఆపాదిస్తారు? బ్రాహ్మణకులం ఆపాదిస్తారా? లేక నయనతార శూద్ర స్త్రీగా మిగిలిపోతుందా?' అని ! పాపం నయనతార కూడా యింత ఆలోచించి వుండదు. కులాల గురించి రాజకీయాల్లో స్పృహ పెరుగుతోంది. కొన్ని వర్గాల్లో పెరుగుతోంది. కొట్టుకుని చచ్చిపోతున్నారు.

అదే సమయంలో మధ్యతరగతిలో ఆధునికత పెరిగి కులాంతర వివాహాలు పెరుగుతున్నాయి. వాళ్లెవరూ మా పిల్లలు ఏ కులం లెక్కలోకి వస్తారు? క్షేత్రప్రధానమా? బీజప్రధానమా? అన్నది ఆలోచించడమే లేదు. కులం పేరు చెప్పి రిజర్వేషన్లు కోరేవారికే యీ

చింతలన్నీ ! మామూలువాళ్ల స్థాయి సమానంగా వుందా లేదా అని చూసుకుంటున్నారు. ఆ మాటకొస్తే ప్రభుదేవాకు మొదటిభార్య ద్వారా కలిగిన సంతానానిది ఏ మతం? ఏ కులం? వాళ్లెవరికీ లేని కులచింత యీ సుబ్బయ్యగారికి ఎందుకో నాకు అర్థం కాకుండా వుంది.

'నయనతారకు బ్రాహ్మణకులం ఆపాదిస్తారా? లేక శూద్రస్త్రీగా మిగిలిపోతుందా?' అని యీయన ధర్మసందేహం. శూద్రస్త్రీగా మిగలడం ఏమిటి? ఆవిడ శూద్రులని ఎవరు చెప్పారు? ఆవిడ క్రైస్తవురాలు. అక్కడ కులం లేదు. బ్రాహ్మణ స్త్రీ కాకపోతే శూద్రస్త్రీ అయితీరాల్సిందేనా? మధ్యలో ఏవీ లేవా? అయినా 'శూద్రస్త్రీగా మిగిలిపోతుందా?' అని అనడంలో మన హేతువాదిగారికి శూద్రులపై చిన్నచూపు సూరేస్తోంది. అది చాలా గర్హించదగిన విషయం. ఇదే ముక్క ఏ బ్రాహ్మణ పురోహితుడైనా అని వుంటే యీపాటికి నిరసనలు వెల్లువెత్తేవి. ఈయన హేతువాది కాబట్టి బతికిపోయాడు.

అయినా మతాంతీకరణ జరిగినవాళ్లను ఏ కులంలో తీసుకుంటారన్న మీమాంస యీయనే తేల్చాలి. ఎందుకంటే చాలామంది హేతువాదులు రాసిన పుస్తకాలలో వున్న ప్రకారం – 'ఒకప్పుడు బౌద్ధం, జైనం దేశంలో చాలా వ్యాప్తిలో వుండేవి. అన్ని వర్గాల వారిలో బౌద్ధులు, జైనులు వుండేవారు. హిందూమతం ఆ మతాలను అణిచేసి, వాళ్లందరినీ మళ్లీ హిందువులుగా మార్చేసింది.' మరి అలా మారినప్పుడు వారిని ఏ కులాల్లో తీసుకున్నారో నేను చదివిన పుస్తకాల్లో లేదు. మన భారత హేతువాద సంఘం సంయుక్త కార్యదర్శిగారు ఆ విషయం పరిశోధన చేసి తెలిపితే నయనతారను ఆ కులస్త్రీగా పరిగణించమని మనం సిఫార్సు చేయవచ్చు.

సిఫార్సు ఎవరికి? అని అడగకండి. పైన చెప్పినట్టు ఇక్కడ ఎవరూ ఎవరికీ బాస్ కాదు. ఏ పీఠాధిపతో వచ్చి నయనతారకు నిన్ను ఫలానా కులస్త్రీగా పరిగణిస్తున్నాం అంటే 'ఇక్కడ నీకేం పని, వెళ్లి రా. నా జీవితం నా యిష్టం' అంటుంది నయనతార. ప్రభుదేవాను పెళ్లి చేసుకున్నంత మాత్రాన అతని కులం (ఏదైతే అది) ఆవిడకు సంప్రాప్తిస్తుంది అని కూడా లేదు. ఇటీవలే ఆవిడ ఓ గుళ్లో తులాభారం తూగి 50 కిలోల బెల్లమో ఏదో గుడికి యిచ్చింది. వాళ్లు నిక్షేపంలా తీసుకున్నారు. ముందే తెలిస్తే అక్కడ ఈ హేతువాదిగారు మాటు వేసి 'ఈమె కులం ఏదో తెలిస్తే తప్ప పుచ్చుకోకండి ' అని యాగీ చేసేవారేమో! హిందూ పూజలలో కులప్రస్తావన ఎక్కడా రాదు. గోత్రం, నామధేయం వస్తుంది. అంతే.

ఆచారాలంటూ పాటిస్తే వాటిల్లో కులం బట్టి, ప్రాంతాల బట్టి, కుటుంబాల బట్టి కొన్ని తేడాలు రావచ్చు. వాటి గురించి ఎవరైనా పట్టుబడితేనే అవి యిస్యూలవుతాయి. కులాంతర, రాష్ట్రాంతర వివాహాల్లో రెండు విధానాల్లోనూ పెళ్లి చేయగా చూశాను. రెండూ కలగలిపి చేయగానూ చూశాను. మనుష్యులు ముఖ్యం కానీ వీటన్నిటికీ పెద్ద ప్రాధాన్యత లేదన్న ఆలోచనాసరళి హిందూమతంలో ముందు నుంచీ వుంది, ఇప్పుడు మరీ పెరిగింది. అది గమనించని హేతువాదులు మనుస్మృతి చేతబట్టి మనల్ని అదలగొట్టబూనితే మనకు నవ్వు వస్తుంది.

పైగా ఆయన ఉత్తరం చివర్లో 'మిగతా మతాలలో మాదిరిగా హిందూమతంలో కూడా స్త్రీలకు స్వేఛ లేదు.. ఈ విషయాలన్నీ తెలియని నయనతార పెనంలోంచి పొయ్యిలోకి దూకారు' అని రాశారు. నయనతారపై జాలి పడడం అనవసరం. హిందూమతంలోని మతస్వేఛనూ, డైనమిజాన్ని ఇసుకలో తలదూర్చిన ఉష్ట్రపక్షి వంటి వెంకటసుబ్బయ్యగారి తరహా హేతువాదులు గుర్తించకపోయినా ఆమె గుర్తించింది కాబట్టే ఆవిడ (ప్రేమకోసమే అయినా) మతం మారడానికి సంకోచించలేదు. ఆమె పై జాలిపడడం మానేసి యీ హేతువాది ఛాందస హిందూమత పరిరక్షక అవతారం విప్పేసి ఆయన పని ఆయన చూసుకుంటే బాగుంటుందేమో! హిందూమతాన్ని తన అవస్థలేవో తనని పడనివ్వండి ! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**

**ఆగస్టు 60** **ఎమ్బీయస్ : నెహ్రూ – నిజామాబాద్**

తెరాసవారు, వారిని చూసి టిఉద్యమకారులు చాలాకాలంగా అనేక విషయాల్లో అబద్ధాలు ప్రచారం చేస్తూనే వున్నారు. (వారు చెప్పినవన్నీ అబద్ధాలని నేనటం లేదు) డిప్యూటీ సిఎం పదవి యివ్వలేదని, వెంగళరావు తెలంగాణ వారు కాదని.. యిలా ఎన్నో చెప్తూ వచ్చారు. వాటిని నా బోటివాడు యీ కాలమ్స్‌లో ఖండించడం తప్ప పబ్లిక్ ప్లాట్‌ఫాంపై సమైక్యవాదులు ఎవరూ గట్టిగా ఖండించకుండా యింతవరకూ తెచ్చారు. వేర్పాటు వాదులు చాలాకాలంగా చెప్తూ వచ్చిన విషయం మరొకటి యీ మధ్య చర్చకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడడానికి ఆర్నెల్లముందు నెహ్రూగారు నిజామాబాద్‌లో బహిరంగసభలో మాట్లాడుతూ – ఆంధ్ర–తెలంగాణ కలయిక 'గడుసు పిల్లవాడికి, అమాయకపు బాలికకు పెళ్లి చేసినట్టు వుంటుందని, ఎప్పుడు కావాలంటే అప్పుడు వాళ్లు విడాకులు తీసుకోవచ్చని అన్నారని చెప్తూ వచ్చారు.

అదే సుష్మా స్వరాజ్‌కు ఫీడ్ చేశారు. ఆవిడ సరిచూసుకోకుండా పార్లమెంటులో మాట్లాడుతూ చెప్పేసింది. అప్పుడు లగడపాటి, కావూరి కలిసి నెహ్రూ అలా అనలేదంటూ అడ్డుకున్నారు. ఈ పని యిన్నాళ్లూ చేయలేదో తెలియదు. లగడపాటి అక్కడితో వదలలేదు. ఓ టీవీ ఛానెల్‌లో కెటియార్‌తో తలపడ్డారు. ఆ మాట అనలేదని లగడపాటి, అన్నారు నా దగ్గర రుజువు వుందని కెటియార్.. చాలాసేపు వాదించుకున్నారు. మధ్యలో మోడరేటర్‌గా వున్న సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తిగారు రికార్డులు వెరిఫై చేసి ఎవరిది కరక్టో చెప్పడానికి టైము పడుతుందన్నారు. ఈ లోపున నేనే వెతక నారంభించాను. అది మీతో పంచుకుంటున్నాను.

దానికి ముందు నాకు ఆశ్చర్యంగా తోచిన విషయాలు రెండు – పెళ్లి సవ్యంగా సాగకపోతే విడాకులు తీసుకోవచ్చు అనే మాట ఎన్నాళ్లదాకా వర్తిస్తుంది? ఐదేళ్లా, పదేళ్లా, పాతికేళ్లా? ఆంధ్ర, తెలంగాణ కలిసి 50 ఏళ్లు కాపురం చేశాక, కుటుంబం 3 కోట్ల నుండి 8 కోట్లకు విస్తరించాక యిప్పుడు విడాకులు అంటే ఒప్పుతుందా? నెహ్రూగారు విడాకులు గురించి చెప్పినప్పుడు ఎన్ని శతాబ్దాలకైనా సరే విడిపోవచ్చు అనే అర్థంలో చెప్పారా? క్రైస్తవుల పెళ్లిళ్లలో చెప్తారుట– ''పెళ్లి పట్ల ఎవరికైనా అభ్యంతరం వుంటే యిప్పుడే చెప్పండి. ఇప్పుడు చెప్పకపోతే యింక ఎప్పటికీ నోరు విప్పకండి (హోల్డ్ యువర్ పీస్) అని. అలాగ కాపురం సవ్యంగా సాగకపోతే తొలి ఐదేళ్లలోనే దాని ఛాయలు కనబడతాయి. ఏభై యేళ్లు పోయాక ఆ రోజు అనుకున్నది దక్కకపోతే విడాకులు అంటే ఎలా?

రెండు – అమాయకపు వధువు, గడసరి వరుడు వుండడం తప్పా? సహజంగా వధువు ముగ్ధగానే వుంటుంది కదా. గడసానిలా, నాపసానిలా వుంటే వరహీనం అంటారు. గయ్యాళిభర్త, మెతకమొగుడు అయితే కార్టూన్లు వేసేందుకు మాత్రమే పనికి వస్తారు. భర్తకు లోకజ్ఞానం వుంటేనే భార్యకు రక్షణ. లేకపోతే సామెత చెప్పినట్టు 'వెర్రివాడి పెళ్లం వాడకంతా వదిన' అన్నట్టుగా సాగుతుంది. భర్త మేదకుడిగా వుండి, భార్యను ఎవరేం చేసినా వూరుకుంటూ వుంటే కాపురం అదుతేంగా నడిచినట్లా? ఇంకోటేమిటంటే ఏ అమ్మాయైనా పెళ్లి సమయంలోనే అమాయకంగా కనబడుతుంది. తర్వాత తెలివిమీరి బయటపడకుండానే భర్తను కంట్రోల్లో పెడుతూనే వుంటుంది. పాతికేళ్ల కాపురం గడిచేసరికి, అంతా ఆవిడ చెప్పినట్టే సాగుతుంది. అప్పటికి చూసుకుంటే అమ్మగారి దగ్గర బంగారం పోగుపడుతుంది, అయ్యవారికి కాలరు చిరిగిపోయిన పొడుగు చొక్కాలు మిగులుతాయి. ఇది లోకసహజం. అందుకని 'అమాయకపు వధువు – గడసరి వరుడు' అనే కాంబినేషన్ చాలా అక్రమమైన విధానం అన్నట్టు మాట్లాడుతూంటే నాకు ఆశ్చర్యం వేస్తుంది.

ఇంతకీ నెహ్రూ ఏమన్నారు? ఆయన ఉపన్యాసాలన్నీ పుస్తకాలుగా వచ్చాయి. ఈ ఉపన్యాసం వున్న భాగాన్ని స్కాన్ చేసి విశాలాంధ్ర డాట్ ఆర్గ్‌లో ఒకాయన పెట్టారు. (www.visalandhra.org/nehru-speech-in-nizamabad-on-merger/) దానిలో యీ ముగ్ధబాల గురించి, విడాకుల గురించి ఏమీ లేదు. ఇవాళ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వస్తుంది కదాని అప్పుడెప్పుడో వాటిని ఎడిట్ చేసి పెట్టి వుండరు కదా ! అయినా దానిలో నెహ్రూ తన అభిప్రాయాలను నిష్కర్షగా చెప్పారు. అవి రికార్డెడ్ హిస్టరీకి అనుగుణంగానే వున్నాయి. ఆయన స్వభావానికీ, మాట తీరుకీ తగ్గట్టే వున్నాయి. అందువలన దాన్ని మసిబూసి మారేడుకాయ చేసే ప్రమాదమే లేదు. ఆయన సభలో పూనకం వచ్చి ఏదో మాట్లాడేశాక తర్వాత ఎప్పుడో పుస్తకంగా వేసినప్పుడు బాగుండదనుకుని దాన్ని శానిటైజ్ చేసి, డాక్టర్ చేసి అచ్చు వేశారనుకున్నా, అప్పటి వార్తాపత్రికలు అబద్ధం చెప్పవు కదా. ఈయన 1956 మార్చి 6 న ప్రసంగించారు కాబట్టి 7 వ తారీకున పేపర్లు వున్నదున్నట్టు వేస్తాయి కదా. అవి కావాలన్నా తమ రికార్డులు మార్చలేవు కదా. ఆనాటి పేపర్లు ఎక్కడ దొరుకుతాయా అని చూస్తే ఓ బ్లాగ్‌లో (devika-puranam.blogspot.com) దొరికాయి.

మొత్తం అన్నీ కలిపి చదివి సారాంశం చెపుతున్నాను. అవధరించండి.

నెహ్రూగారికి విశాలకదృక్పథం హెచ్చు. ప్రాంతం, మతం, కులం, భాష పేరు చెప్పి తమలో తాము కలహించుకునే వారంటే మహా చికాకు. ఈ లిస్టులో దేశం కూడా కలపాలి. అందుకే ఆయన చైనా గురించి తనను హెచ్చరించుకునే వారిని చీదరించుకుని, చైనాను గుడ్డిగా నమ్మి మోసపోయాడు. ఆయన ఆచరణవాది కాదు, ఆదర్శవాది. హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగు, మరాఠీ, కరా?టక ప్రాంతాలు కలిసి వుండడం, హిందూ, ముస్లింలు శతాబ్దాలుగా కలిసి వుండడం ఆయనను ఆకట్టుకుంది. స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఆ రాష్ట్రాన్ని అలాగే వుంచేస్తే నష్టమేముంది అనుకున్నాడు. భాష కారణంగా మద్రాసు రాష్ట్రం నుండి విడిపోతామని ఆంధ్రులంటే చివరి నిమిషందాకా ఒప్పుకోలేదు. భాషాప్రయుక్త రాష్ట్రాలు జాతీయభావానికి వ్యతిరేకం అని నమ్మాడు. అందువలన నెహ్రూ ఆంధ్ర–తెలంగాణలు కలవడానికి వ్యతిరేకం కాదు, హైదరాబాద్ రాష్ట్రం మూడు ముక్కలయి మూడు రాష్ట్రాలలో కలవడానికి వ్యతిరేకం అని చెప్పుకోవాలి. ఆయన తన ఉపన్యాసంలో అదే చెప్పుకున్నాడు. 'హైదరాబాద్ విడగొట్టడానికి నేను విముఖుణ్నని నేను పదేపదే చెప్పాను కానీ ఫజలాలీ కమిషన్ సిఫార్సులు ప్రజలందరూ ఆమోదించినప్పుడు అడ్డుకోవడానికి నేనెవణ్ని? నా ఉద్దేశాలే అందరిమీదా రుద్దితే అది ప్రజాస్వామ్యం అనిపించుకోదు' అన్నారు.

ఫజలాలీ కమిషన్ సిఫార్సుల మీదా ఆయన మాట్లాడారు. 'తెలంగాణను ఆంధ్రతో కలపాలన్న వాదనలోను, విడిగా వుంచాలన్న వాదనలోనూ తర్కం వుంది' (బోత్ సైడ్స్ హేవ్ దెయిర్ ఓన్ లాజిక్) అన్నారు. అవి ఐదేళ్లపాటు విడిగా వుండాలన్న కమిషన్ సిఫార్సును, ఆంధ్రప్రాంతీయులు తమ ఉద్యోగాలను దోచుకుంటారన్న తెలంగాణ వారి భయాలనూ ప్రస్తావించి, ఫైనల్‌గా రెండు విడివిడి రాష్ట్రాలుగా వుంచడం భావ్యం తోచలేదన్నారు (ఇట్ సీమ్‌డ్ ఇమ్‌ప్రాపర్) రెండు ప్రాంతాలవారూ కలిసిమెలిసి జీవించాలని హితవు చెప్పారు. కమిషన్ సిఫార్సులు ఆమోదించకుండా బొంబాయి, ఒడిశాలలో జరిగిన అల్లర్లను ఖండించారు. (బొంబాయి రాష్ట్రాన్ని విభజించాలని 16-1-1956 న కేంద్రప్రభుత్వం చేసిన నిర?యాన్ని మహారాష్ట్రలోని కాంగ్రెస్, ప్రజాసోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టులు కలిసి సంయుక్త మహారాష్ట్ర సమితిగా ఏర్పడి ఎదుర్కొన్నాయి. అలాగే బిహార్, మధ్యప్రదేశ్‌లలోని కొన్ని ప్రాంతాలను ఒడిశాలో కలపనందుకు నిరసనగా ఒడిశాలో 20 మంది కాంగ్రెస్ నాయకులు రిజైన్ చేశారు. రెండు చోట్లా అల్లర్లు జరిగాయి)

ఇక నెహ్రూ దేశప్రజలంతా కలిసి వుండాలని, భారతదేశం అందరిదీ అనీ, నిజామాబాద్‌పై మీకెంత హక్కుందో నాకూ అంతే వుందనీ, అలాగే అలహాబాద్‌పై నాకెంత హక్కుందో, మీకూ అంతే వుందనీ నొక్కి చెప్పారు. రెండో పంచవర్ష ప్రణాళిక గురించి చెప్పి, భారతదేశాన్ని మనమంతా కలిసి నిర్మించాలన్నారు. ప్రపంచమంతా మనని గమనిస్తోందని, అందరూ కుటుంబసభ్యుల్లా కలిసి

వుండాలని పలికారు. ఐక్యత గురించి పదేపదే చెప్పారు. ఐక్యత గురించి మాట్లాడేటప్పుడు విడాకుల గురించి ఎందుకు మాట్లాడతారు? మాట్లాడనే లేదు. అంతేకాదు, గడుసుమొగుడు–పడుచు పెళ్లాం వంటి చెణుకులు వేయలేదు. ఉపన్యాసం అంతా గంభీరంగా సాగింది. తను చెప్పిన మాటలు అందరికీ, ముఖ్యంగా గ్రామీణులకి అర్థమవ్వాలని బూర్గుల రామక ృషా?రావుగారిని తర్జుమా చేయమని కోరానని చెప్పుకున్నారు.

ఇక తెలుగు పత్రికలలో ఏముందో చూద్దాం. ఆంధ్రపత్రిక హెడింగ్ – "దేశశ్రేయస్సు దృష్ట్యా విశాలాంధ్ర ఏర్పర్చాలని నిర?యించాము, రెండు ప్రాంతాల అభివ ృద్ధికీ సలహాసంఘాలు ఉంటాయని నెహ్రూ ప్రకటన" అని వేశారు. తమ నిర?యాన్ని సరిగా అమలు చేస్తామని యిరుపక్షాలూ హామీ యిచ్చాయని, తగాదాలు కూడవని ఆయన హితవు చెప్పారనీ రాసింది. తన ఉపన్యాసంలో విశాలాంధ్ర అనే పేరు పలుసార్లు ప్రస్తావించినా అదే కొత్త రాష్ట్రం పేరవుతుందని ప్రత్యేకంగా చెప్పలేదు అని కూడా ఆంధ్రపత్రిక అంది. (ఫైనల్‌గా పేరు ఆంధ్రప్రదేశ్‌గా మార్చారు. విశాలాంధ్ర అంటే కమ్యూనిస్టు పార్టీ గుర్తుకు వస్తుందని భయం) ఇకనుంచి ఆంధ్ర, తెలంగాణ అనే వాగ్వివాదాలు మరిచి, చెయ్యి చెయ్యి కలిపి పురోగమించాలని చెప్పిన మాటలను ప్రత్యేకంగా రాశారు.

విశాలాంధ్ర పేపర్ హెడింగ్‌లో ప్రాంతీయ కౌన్సిళ్లు ఏర్పడతాయనీ, విశాలాంధ్ర ఏర్పాటు నిర?యాన్ని విశాలాంధ్రవాదులు, తెలంగాణవాదులూ ఉభయులూ అంగీకరించారని స్పష్టం చేశారని రాశారు. సంకుచితతత్వాన్ని విసర్జించాలని, తగాదాలను విస్మరించాలని చెప్పారని ప్రస్తావించారు. నిజానికి నెహ్రూ నిజామాబాద్‌కు భారత నిర్మాణానికి గుల్జారీలాల్ నందాగారు నిర్వహిస్తున్న భారతసేవక్ సమాజ్ పనిమీద వచ్చారు. నిజామాబాద్‌లో మార్చి 6 సాయంత్రం సుభాష్ నగర్‌లో స్టేడియంలో ప్రసంగించారు. అంతకుముందు వాళ్ల వార్షికోత్సవ సభలో మాట్లాడుతూ ఉపన్యాసాల కంటె కార్యసాధనపై ద ృష్టి పెట్టాలని గట్టిగా చెప్పారు. పని చేయడం, తగాదాలకు దూరంగా వుండడం ముఖ్యం అంటూ అక్కడ కూడా పోట్లాట వద్దని (అసందర్భమే అనిపించినా చెప్పారంటే ఐక్యతకు ఆయన యిచ్చే ప్రాధాన్యత తెలుస్తోంది) చెప్పారు.

ఇటువంటి ఉపన్యాసంలో విడాకులు ఎక్కణ్నుంచి వచ్చాయో తెరాస వారే చెప్పాలి. కెటియార్ రుజువులు చూపిస్తానంటున్నారుగా చూదాం. దానితో బాటు ఆయన యింకోదాని ఎళీళీజువు కూడా చూపిస్తే మరీ సంతోషిస్తాను. ఓ ఏడాదిగా అనుకుంటా ఆయన పదే పదే చెపుతున్నారు – ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రులు వుండగా రాజాజీ "మీరు వెంటనే 24 గంటల్లో రాష్ట్రం విడిచి వెళ్లాలి, లేకపోతే మెడపట్టి గెంటిస్తాను" అన్నారని. నాకు తెలిసి యిది సర్వాబద్ధం. ఎందుకంటే –

01. రాజాజీ ఉపన్యాసాలు కానీ, రాతలు కానీ చూస్తే యిలాటి భాష రాజాజీ నోట ఎప్పుడూ రాదని తెలుస్తుంది. ఆయన కెసియార్ కాదు. స్టేట్స్‌మన్. జాతీయస్థాయి నాయకుడు. గవర్నర్ జనరల్‌గా చేసినవాడు.

02. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి తెలుగువారు వెళ్లిపోవడం రాజాజీకి ససేమిరా యిష్టం లేదు. ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును ఆయన చివరిదాకా ప్రతిఘటిస్తూనే వున్నాడు. గాంధీగారి వియ్యంకుడు కావటం వలన, నెహ్రూ గౌరవాన్ని చూరగొన్న మేధావి కావడం వలన ఆయన మాటే చెల్లుతూ వచ్చింది. లేకపోతే 1930లలోనే ఆంధ్రరాష్ట్రం ఏర్పడేది.

03. ఆంధ్రరాష్ట్రం యివ్వక తప్పని పరిస్థితి ఏర్పడినపుడు మద్రాసు యివ్వం అని మడతపేచీ వేసి దాన్ని మరో పదేళ్లు వాయిదా వేసినది రాజాజీయే. తన రాజకీయ ప్రత్యర్థి ప్రకాశం ఆంధ్రరాష్ట్రం గురించి పట్టుబట్టినకొద్దీ అది జరగకుండా చూసినది ఆయనే. చివరకు ప్రకాశం పొట్టి శ్రీరాములు చేత మద్రాసుతో కూడిన ఆంధ్రరాష్ట్రం కోసం నిరాహారదీక్ష చేయిస్తూంటే అదంతా ప్రకాశం ఆడిస్తున్న నాటకమే తప్ప తెలుగువాళ్లు ఎవరూ ప్రత్యేకరాష్ట్రం కోరుకోవడం లేదని కేంద్రానికి నివేదికలు పంపినది యీయనే. శ్రీరాములు దీక్ష నెల్లాళ్లు దాటేటప్పటికి ఆయనకి ఏమైనా అవుతుందేమోనని కేంద్రనాయకులు కంగారుపడి వాకబు చేస్తే "ఏమీ ఫర్వాలేదు, ఆయన రోజూ మొక్కల వేళ్లరసం తాగుతాడు. దానివలన శక్తి పుంజుకుంటాడు. ఎన్నాళ్లయినా చావడు" అని వారికి చెప్తూ వచ్చాడు.

04. చివరకు రాష్ట్రం ఏర్పడ్డాక 'తెలుగువాళ్లందరూ తమిళనాడు ఖాళీ చేసి వెళ్లిపోవాలి, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలు వదిలేయాలి, వాటిలో మా తమిళులు వచ్చి చేరతారు' అని ఒత్తిడి తేలేదు. ఎక్కడివాళ్లు అక్కడే వుండిపోయారు. తెలుగు పత్రికలు రాష్ట్రం ఏర్పడిన 40, 50 ఏళ్లదాకా అక్కణ్నుంచే వచ్చేవి. తెలుగు సినిమా పరిశ్రమా డిటోడిటో. హోల్‌సేల్ ధాన్యాల వ్యాపారం, వస్త్రాలు, బంగారం హోటల్స్, సినిమా హాల్స్, నిర్మాణం.. తెలుగువారు లేని వ్యాపారరంగం లేదు. కొన్నిటిలో యిప్పటికీ వారిదే డామినేషన్. ప్రభుత్వ ఉద్యోగాలలో, ప్రయివేటు ఉద్యోగాలలో లక్షలాది తెలుగువారు కనబడతారు. 24 గంటల్లో ఖాళీ చేయాలని అల్టిమేటమ్ యిస్తే వీరంతా అప్పుడే పారిపోయి వచ్చేవారుగా!

అయినా కెటియార్‌గారు ఆయన అలా అన్నాడనే చెప్తున్నారు. ఆయన మాట విన్న ఉద్యమకారులు కొందరు వాటిని రిపీట్ చేస్తూ హైదరాబాదునుండి మిమ్మల్ని అలాగ తరిమే రోజు వస్తుంది అంటూ హెచ్చరికలు చేస్తున్నారు. కెటియార్ తన స్టేటుమెంటుకి రుజువు చూపించలేకపోతే కనీసం అలా చెప్పడం మానేస్తే బాగుంటుంది. చూదాం నిజానిజాలు తేల్చవలసినది ఆయనే ! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**

**సెప్టెంబరు 07** **ఎమ్బీయస్ : ఉరి తీయాలా వద్దా?**

ప్రాసిక్యూషన్‌కు సహకరించిన సాక్షులకి – ముఖ్యంగా నిందితుల మధ్య సంబంధాన్ని, వారితో ఎల్‌టిటిఇ సంబంధాన్ని ఎస్టాబ్లిష్ చేస్తున్నవారికి – ఎల్‌టిటిఇ అనుకూల వర్గాలనుండి బెదిరింపులు వచ్చాయి. కేసు విచారణ సమయంలో వాళ్లకి భద్రత కల్పిస్తూ, వాళ్ల అసలు పేర్లు దాచిపెడుతూ, రకరకాలుగా వాళ్లని కాపాడుకున్నారు. దీనికోసం తమిళనాడు, కేరళ, కరా?టక రాష్ట్ర పోలీసుల సహాయం తీసుకున్నారు.

చెంగల్పట్టు సబ్‌జైలులో ముద్దాయిల్ని వేర్వేరు గదుల్లో వుంచితే నిందితులు మమ్మల్ని వేర్వేరు గదుల్లో వుంచటం అన్యాయం అని పిటిషన్ దాఖలు చేశారు. అది తమిళనాడు జైళ్ల మాన్యువల్ ప్రకారం కరక్టే. హైకోర్టులో డివిజన్ బెంచ్ ముందు విచారణకు వస్తే సిట్ వాళ్లు వాదించారు. వేర్వేరు గదుల్లో వుంచడం సమంజసమే అని కోర్టు తీర్పు నిచ్చింది.

1991 మే 21 న హత్య జరిగితే 1992 మే 20 న స్పెషల్ కోర్టులో 55 పేజీల చార్జిషీటుని దాఖలు చేశారు. వీళ్లు చార్జిషీటు దాఖలు చేయడానికి ముందే వివిధ కోర్టుల్లో 112 పిటిషన్లు ముద్దాయిలు దాఖలు చేశారు. వాళ్ల వకాల్తా తీసుకున్న లాయర్లు ఉద్దండపిండాలు. రకరకాల చిట్కాలు వేశారు. ఒకటేమిటంటే 283

నేరాన్ని నిరూపించడానికి సిట్ సహకారంతో ప్రాసిక్యూషన్ కోర్టుకి దాఖలు చేసిన పత్రాలు కానీ, సాక్షుల వాంగ్మూలాలు కానీ మొత్తం 10 వేల పేజీలుంటాయి. వాటిలో సిట్ నమోదు చేసిన అనేక వాంగ్మూలాలు ఇంగ్లీషులో వున్నాయి. వీటిని మొత్తం 26 సెట్‌లుగా చేసి చార్జిషీటుతో పాటు దాఖలు చేశారు. ఎందుకంటే 41 మంది నిందితులను పేర్కొన్నారు. ముగ్గురు పరారీలో వున్నారు. 12 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 26 మంది సబ్‌జైల్లో వున్నారు. ఈ 26 మందికి 26 కాపీలు కోర్టు ద్వారా అందజేశారు. వాళ్లు వెంటనే తమిళభాషలోకి తర్జుమా చేసి యివ్వాలని అర్జీ పెట్టుకున్నారు.

తర్జుమాలో తేడా వస్తే దాన్ని చూపించి దర్యాప్తు సరిగ్గా జరగలేదని గోల చేస్తారు. ఎక్స్‌పర్ట్‌స్ యిచ్చిన అభిప్రాయాల్లో చాలా టెక్నికల్ పదాలు ఇంగ్లీషులో వున్నాయి. వాటిని తర్జుమా చేయడం మాటలు కాదు. తమిళనాడు ప్రభుత్వాన్ని సహాయం కోరితే ఐదుగురు అనువాదకులను పంపారు. వారి సహాయంతో తర్జుమా పూర్తి చేయడానికి 10 వారాలు పట్టింది, అదీ అహోరాత్రాలు పనిచేస్తే.

పూనమల్లి సబ్‌జైలులో విచారణ జరపడానికి వీలుగా దాన్ని విశాలంగా మార్చారు. ప్రత్యేకంగా గదులు నిర్మించారు.

సుప్రీంకోర్టులో ఫైనల్‌గా నలుగురు – నళిని, శాంతన్, మురుగన్, అరివులకు ఉరిశిక్ష ఖరారైంది. పయాస్, జయకుమార్, రవిచంద్రన్‌లకు ఉరిశిక్ష యావజ్జీవశిక్షగా మారింది. షణ్ముగ వడివేలును టాడా కింద బుక్ చేస్తే ఆ చట్టం కింద నేరస్తుడు కాదన్నారు. 18 మంది ముద్దాయిల విషయంలో చిన్న చిన్న అభియోగాలన్నీ నిర్ధారితమయ్యాయి.

**సెప్టెంబరు టాపిక్స్ ఎమ్బీయస్ : జగన్ ఢిల్లీ యాత్ర**

**సెప్టెంబరు 07 ఎమ్బీయస్ : జగన్ ఢిల్లీ యాత్ర**

జగన్ ఢిల్లీ వెళ్లి వచ్చారు. సిబిఐ విచారణ పేర కేంద్రం నన్ను కష్టపెట్టేస్తోంది, చూడండి అని చెప్పడానికి వెళ్లారు. విషయం తెలియగానే ఢిల్లీ నాయకులు ఫక్కున నవ్వుకుని వుంటారు. 'మరి సిబిఐ వున్నదెందుకట?' 'ఏ ప్రభుత్వమైనా కానీ, ప్రతిక్షకులను సాధించడానికి వాడుకునేదే సిబిఐను. దానిలో వింతేముంది? రేపు నువ్వు పవర్‌లోకి వచ్చినా చేయబోయేది అదే' అని. ప్రతిపక్షాలలో వున్న ములాయం, లాలూలు అదే చెప్పి వుంటారు. ఇలాటివి మేం ఎన్ని పడ్డామో, పిల్లకాకివి. యిది యింకా ఆరంభమే, యిదేదో కొత్త విషయం అన్నట్టు మాకు చెప్తావేమిటి? రాజకీయం అంటే జనంలోకి వెళ్లి చేతులూపడం, ఛాలెంజ్‌లు చేయడం అనుకున్నావా? ఇలా ఎన్ని ఢక్కామొక్కీలు తింటే నిలదొక్కుకుంటావ్! అని చెప్పి పంపించి వుంటారు. తక్కినవాళ్లు ఎపాయింట్‌మెంట్ కోసం అడిగిన సబ్బం హరికి యివే ముక్కలు చెప్పి 'మళ్లీ అతను రావడం దేనికి, మీరే చెప్పేయండి, ఎలాగోలా వేగాల్సిందే అని నచ్చచెప్పండి. మేం చేసేదేమీ లేదు'. అని చెప్పి వుంటారు.

జగన్ వెళ్లిన టైమింగులో పొరబాటుంది. పార్టీ పెట్టగానే వెళ్లి కలిసి వుంటే అదో ముచ్చట. వైయస్ పథకాలు, 108 అంటే లోకల్‌గా బాగానే వుంటుంది కానీ జాతీయస్థాయిలో 'అసలు నీ ఫిలాసఫీ ఏమిటి? రైటా, లెఫ్టా, ఏ సిద్ధాంతం లేని లెఫ్ట్‌రైటా?' అని తెలుసుకుందా మనుకుంటారు. జాతీయ, అంతర్జాతీయ విధానాలపై ఆలోచనాసరళి ఏమిటో కాస్త చెప్పమంటారు. జగన్ అప్పుడేమీ పట్టించుకోలేదు.మనకంటూ గట్టిగా ఓ 10 ఎంపీ సీట్లు గెలుచుకుని తడాఖా చూపించి అప్పుడు ఈ యుపిఏ, లెఫ్ట్ ఫ్రంట్‌లలో ఎవరికి ఛాన్సుందో చూసి అప్పుడే అటు వెళదాం అని ఊరుకుని వుంటారు. కానీ ఆ 10 ఎంపీ సీట్లు గెలుచుకోవాలంటే పార్టీ నిర్మించాలి. ప్రజల్లో సింపతీ రగిలించాలి. దాన్ని ఓట్లగా మార్చే పని చేపట్టాలి. ఉపయెన్నికలు రప్పించి, వాటిలో గెలిచి తనకు నాయకులలోను, ప్రజలలోను బలం వుందని నిరూపించుకోవాలి.

ఎందుకంటే శక్తిమంతుడన్నవాణ్నే ఎవరైనా పట్టించుకుంటారు. నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పటేనాటికి ఆ ఫ్రంట్ వ్యవస్థాపకుడైన

ఎన్టీ రామారావును పట్టించుకోలేదు. ఎందుకంటే ఆ ఎన్నికలో టిడిపికి రెండో ఎన్నో ఎంపీ సీట్లు వచ్చాయి. అంతకుముందు మనల్ని ఎంత గౌరవించాడు, ఎలా ప్రోత్సహించాడు, ఎంత బలంగా వుండేవాడు అవేమీ లెక్కలోకి తీసుకోలేదు. ఆ పాటికి మనకు పనికి రాడు, అంతే తీసి పారేయ్. ఉపప్రధాని పోస్టు ఆఫర్ చేస్తారేమో వద్దందామని ఎన్టీయార్ అనుకున్నారు పాపం. అడిగినవాడే లేకపోయాడు. ఇవి తెలిసిన జగన్ ఉపయెన్నికలలో గెలిచాక జాతీయస్థాయిలో నాయకులను పలకరిద్దామని గాబోలు వూరుకున్నారు.

అయితే మధ్యలో యీ సిబిఐ దాడులు ప్రారంభమయ్యాయి. సిబిఐ ఎప్పుడైనా రావచ్చు, నన్ను విచారించుకోవచ్చు అని పలుమార్లు ప్రకటించిన జగన్ దాడులు ప్రారంభమయ్యాక కళ తప్పారు. ఎందుకంటే వాళ్లు యీయన కంటె ముందు యీయనకు తోడ్పడిన పారిశ్రామిక వేత్తలను వేధించడం మొదలుపెట్టారు. 'నీకు సాయపడిన పాపానికి మాకు యీ శిక్ష పడింది.' అని వాళ్లు కొరకొరలాడుతూ వుండవచ్చు. సహజమే, ఎందుకంటే ఎవరికైనా గుట్టుగా వ్యాపారం చేసుకోవాలనే వుంటుంది. ఎక్కవుంటు పుస్తకాలు పట్టుకుని సిబిఐ గడప ఎక్కిదిగాలని వుండదు. బ్యాంకు ఎక్కవుంట్లు స్తంభించేస్తే అదో పెద్ద చికాకు. చివరకు ఏం తేల్చినా, ఏమీ తేల్చకుండా ఎత్తేసినా యీ త్రిప్పట అయితే తప్పదు కదా. ఇంతకుముందు ఓ సారి రాశాను. జగన్ తన బలాన్ని నిరూపించుకున్నాక కాంగ్రెస్‌కు అతనికీ రాజీ కుదిరినా ఆశ్చర్యపడనక్కరలేదని.

ఎందుకంటే కాంగ్రెస్‌కు తన పక్షాన ఎవరూ బలమైన నాయకుడు కనబడటం లేదు. కిరణ్ కుమార్ లాభం లేదని తేలిపోయింది. ఆయన నాయకులకూ చేరువ కావటం లేదు, ప్రజలకూ చేరువ కావటం లేదు. బొత్స వచ్చాక కాస్త ఆరాటం పెరిగింది. డి శ్రీనివాస్ కంటె చాలా రెట్లు చురుగ్గా వున్నారు. కానీ ఓట్లు రప్పించగలరా లేదా అన్నదే ప్రశ్న. అది జగన్ ఎమ్మెల్యేల కారణంగా వచ్చే ఉపయెన్నికలలో తేలిపోతుంది. వాటిల్లో జగన్ ఓ 20 సీట్లు గెలుచుకున్నా చాలు, కాంగ్రెస్‌కు గుబులు పుట్టడానికి. 2014 నాటికి జగన్‌తో ఓ విధమైన రాజీకి వచ్చినా రావచ్చు. జగన్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకోకపోయినా శరద్ పవార్ వైపు ఒప్పందానికి ఆహ్వానించవచ్చు. అయితే దానికి జగన్ ఎందుకు ఒప్పుకుంటాడు? తనకు అంత బలం వుంటే తనే సర్వం సహా నాయకుడిగా వుండవచ్చుగా, కాంగ్రెసుతో పొత్తు ఎందుకు? పైగా తను నరనరాన ద్వేషించే సోనియాతో !?

దీనికి నేను చెప్పిన కారణం – మధ్యలో యిరుక్కున్న పారిశ్రామిక వేత్తల ఒత్తిడికి లొంగి ఐనా జగన్ ఒడంబడతాడు అన్నాను. ఇప్పుడు కూడా ఆ ఒత్తిడికి లొంగే జగన్ ఢిల్లీ వెళ్లి వుంటారని నా అనుమానం. మీరైనా చెప్పి సిబిఐ దాడులు ఆపించండి, లేకపోతే ఏ పారిశ్రామిక వేత్తా మన రాజకీయపార్టీలకు తోడ్పడటం మానేస్తాడు. విరాళాలు యివ్వడు. ఎవరికైనా యిస్తే దాని వెనువెంట వచ్చిన ప్రభుత్వం దుంప తెంచుతుందన్న భయంతో దూరం పెట్టేస్తారు అని జాతీయ నాయకులకు చెప్దామని వెళ్లి వుంటారు.

అయితే వెళ్లిన సమయం బాగా లేదు. దేశమంతా అవినీతి వ్యతిరేక పవనాలు గట్టిగా వీస్తున్నాయి. కోర్టులు చురుగ్గా వుండటంతో పాతపాత కేసులు కూడా తవ్వి తీసి జైళ్లు నింపుతున్నారు. యుపిఏ 1 కాలం నాటిది అమర్ సింగ్ క్యాష్ ఫర్ ఓట్ కేసు. దాన్ని పైకి తీసి ఆయన్ను లోపలికి తోశారు. ఏళ్ల తరబడి నలుగుతున్న గాలి జనార్దనరెడ్డి గనుల కేసు కూడా తవ్వి అప్పుడే అతన్ని జైలుకి పంపారు. అన్నా హజారే వూపులో జనమంతా ఏదో సాధించేస్తున్నామన్న మైకంలో వున్నారు. ఈ టైములో సిబిఐ దాడులను, విచారణను ఎదుర్కుంటున్న వారి నెవరైనా సరే వెనక వేసుకుని వస్తున్నట్టు కనబడితే ప్రజలు ఛీత్కరించు కుంటారు. రాజకీయ ప్రయోజనాలకోసం శత్రువు శత్రువు మిత్రుడు అనే లాజిక్‌పై అవినీతిని ప్రోత్సహిస్తున్నారు, కనీసం భరిస్తున్నారు అనుకుంటారు. ఆ యిమేజి తెచ్చుకోవడానికి ఏ నాయకుడూ యిష్టపడలేదు. అందుకే ములాయం, లాలూ స్వాంత వచనాలు పలికి పంపించేశారు. ఫరూఖ్ కేసు గురించి స్టడీ చేస్తానని చెప్పారు. శరద్ పవార్ ఒక్కరే కాస్త రెస్పాన్సు యిచ్చి వుంటారు. ఎప్పటికైనా జగన్‌ను తనవైపు తీసుకురావాలన్న పథకంలో వున్నారు కాబట్టి ! మొత్తం మీద ఢిల్లీ షో ఫ్లాప్ షో అయింది. దానికి సబ్బం హరి ద్వారా ప్రచారం యివ్వకుండా రహస్యంగా వెళ్లి కలిసి వచ్చి వుంటే ఏదో గూడుపుఠాణీ జరిగిపోతోందని అవతలివాళ్లు అదలిచచ్చేవాళ్లు. ఇలా డప్పు కొట్టుకుంటూ వెళ్లడంతో పని కాలేదని అందరికీ తెలిసిపోయింది.

యుపిఏకు మద్దతు ప్రకటించడంపై మరో వ్యాసంలో... **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**

## సెప్టెంబరు 08 — ఎమ్బీయస్ : జగన్ – యుపిఏ

జగన్ వెళ్లిన ఢిల్లీ యుపిఏకు మద్దతు ప్రకటించడం చాలామందిని విస్మయపరచింది. అదిగో, కాంగ్రెస్‌లో కలిసిపోతున్నాడు అనేశారు కొందరు. తోక ముడిచాడు, కళ్లు తేలేశాడు, అబ్బాయిగారి పని అయిపోయింది – యిలాటి శీర్షికలతో కథనాలు వెలువడ్డాయి.

అసలు జగన్‌ముందున్న ఆప్షన్స్ ఏమిటి అని చూద్దాం. జగన్–బిజెపి గురించి ఆలోచిస్తే కడప ఉపయెన్నికల నాటినుండి తెలుగు మీడియా జగన్‌కు బిజెపికి పెళ్లి చేసేసింది. మాకే సంబంధమూ లేదని యిద్దరూ మొత్తుకున్నా వినటం లేదు. లేదు, లేదు మీ యిద్దరూ కలిసే వున్నారు అని దబాయిస్తోంది. అసలు జగన్ బిజెపికి ఎందుకు కలవాలో ఎవరూ సహేతుకంగా చెప్పలేదు. టిడిపిలాగ జగన్ బిజెపితో ఎప్పుడూ కలిసి పని చేయలేదు. రాష్ట్ర స్థాయిలో కాని, జాతీయస్థాయిలో కాని బిజెపి నాయకులు అతనికి మిత్రులు లేరు.

నిధుల కొరత కారణంగా బిజెపిని ఆశ్రయించాలన్న చింత లేదు. తను బలం పుంజుకుంటున్న కోస్తా, సీమలలో బిజెపికి చాలా ఓటు బ్యాంక్ వుంది కాబట్టి వాళ్లతో పొత్తు పెట్టుకోవాలన్న చింత లేదు. బిజెపికి వున్న కాసింత బలం తెలంగాణాలో వుంది.

అందునా ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో వాళ్లు అందరికంటె తీవ్రవాదం అవలంబించారిప్పుడు. ఆంధ్రప్రాంతంలో కూడా ప్రత్యేక రాష్ట్రం కోసం ఆందోళనలు చేద్దామని ఉద్దేశంలో వున్నారు కానీ క్యాడర్ లేక ఆగారు. ఒకటో రెండో సమావేశాలు పెట్టక మానరు. ఇటు జగన్ చూస్తే తెలంగాణ విషయంలో గోడ మీద పిల్లే. బిజెపి విధానాన్ని సమర్థించి కోస్తా, సీమల్లో చెడ్డపేరు తెచ్చుకోలేదు.

బిజెపికి ప్రధానంగా వున్న ముద్ర హిందూ మతతత్వ పార్టీ అని. దానిలో ముస్లిములు కూడా వున్నా, ముస్లిములు అధిక సంఖ్యలో వున్న రాష్ట్రాలలో కూడా అది అధికారంలోకి వచ్చినా, వారి పాలనలో హిందూ-ముస్లిం కలహాలు పెద్దగా జరగకపోయినా బిజెపి అంటే భయపడి తీరాలి అని మైనారిటీలకు నిరంతరం నూరిపోస్తూనే వుంటారు, లెఫ్టిస్టులు, వారి స్కూలుకి చెందిన మేధావులు. అందువలన మరీ తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప బిజెపికి ఓటేయడానికి యిచ్చగించరు మైనారిటీలు. జగన్‌కు బాగా ఓటుబ్యాంకు వున్న రాయలసీమలో ముస్లిముల జనాభా గణనీయంగానే వుంది. ఆ ప్రాంతాలన్నీ నవాబులు చాలాకాలం ఏలారు. అక్కడ క్రైస్తవులూ ఎక్కువే. క్రైస్తవంలోకి మార్పిళ్లలో కడప జిల్లా అగ్రస్థానంలో వుందనుకుంటా. జగనే స్వయంగా క్రైస్తవుడు. వైయస్ హయాంలో అనేక చర్చిలను పునరుద్ధరించారని అంటారు.

అందువలన జగన్ ఓటుబ్యాంకులో మైనారిటీల పాత్ర గణనీయం. కడప ఉపయెన్నికలో ఆ మైనారిటీలను జగన్‌కు దూరం చేయాలనే 'జగన్-బిజెపి కుమ్మక్కు' అంటూ జగన్ వ్యతిరేకులందరూ హోరెత్తించేశారు. వారిలో అందరికంటె ముందు నిలిచి గొంతు చించుకున్నది టిడిపి ! బిజెపితో కొన్నేళ్లపాటు సహచర్యం చేసి, ఊరేగిన ఆ పార్టీయే బిజెపి అంటే అంటరానిదన్నట్టు, ఆ పార్టీతో చేతులు కలపడం కారణంగా జగన్ మరీ అంటరాని వాడైనట్టు చాటడం చాలా హాస్యాస్పదంగా తయారైంది. ఎంత గోల చేసినా కనీసం మైనారిటీలతో సహా కడప ఓటర్లు ఎవ్వరూ నమ్మలేదు. అత్యధిక మెజారిటీతో జగన్‌ను గెలిపించారు.

అక్కడితో ఆ ప్రచారం ఆపి వుంటే బాగుండేది. కానీ బిజెపి బడితె వదులుకోవడం బిజెపియేతర పక్షాలు వేటికీ యిష్టం వుండదు. తనకు ఎవరు నచ్చకపోయినా - గతంలో సిఐఏ ఏజంటు అన్నట్టు - బిజెపికి ఆప్తుడు అని ముద్ర కొట్టి యాగీ చేస్తారు. జగన్ విషయంలో వారికి బిజెపి లింకు కట్టడానికి దొరికిన ఒక ఆధారం - గాలి జనార్దనరెడ్డి. గాలి వైయస్ కుటుంబానికి ఆప్తుడు కాబట్టి, కరా?టకలో అతను బిజెపి నాయకుడు కాబట్టి జగన్ యీజ్ యీక్వల్ టు బిజెపి అన్న సమీకరణానికి వచ్చేశారు. ఎన్నో కేసుల్లో చూస్తున్నాం - అన్న ఒక పార్టీ, తమ్ముడొక పార్టీ. భార్య ఒక పార్టీ, భర్త ఒక పార్టీ. తండ్రి ఒక పార్టీ, కొడుకు మరో పార్టీ. అలాటప్పుడు స్నేహం వున్నంత మాత్రాన ఒకే పార్టీ వాళ్లవుతారా, పార్టీ బంధం వుంటుందా?

మొన్న చూశాంగా, జగన్‌ను గాలి గురించి అడిగితే 'నాకేం సంబంధం? బిజెపి వాళ్లను అడగండి' అన్నాడు. (నాకెవరో తెలియదని అన్నాడని మనవాళ్లు రాసి పారేశారు) సుష్మా స్వరాజ్ 'వాళ్లది వేరే రాష్ట్రం. పైగా అరుణ్ జైట్లీ మనుష్యులు, నాకేం సంబంధం?" అనేసింది. అంతేమరి గొడవల్లో చిక్కుకుంటే అలాగే వుంటుంది. కోర్టు వాళ్లు బెయిలు యిచ్చి కేసు పెండింగులో పెట్టారనుకోండి. చాలు ఎవరైనా పార్టీలోకి రమ్మంటారు. అనంత పద్మనాభస్వామి అసూయ పడేలా బయటపడిన గాలి బంగారు గని చూశాక కరా?టకలో దేవెగౌడ పార్టీ నుండి, కాంగ్రెస్ దాకా అందరూ గాలికి ద్వారాలు తెరవవచ్చు. గాలి కూడా బిజెపి సిద్ధాంతాలు నరనరానా జీరి?ంచుకుని వున్నాడనుకుంటున్నారా? ఎవరు రానిస్తే ఆ పార్టీకి హాయిగా వెళతాడు. అలాటి గాలికోడి కారణంగా జగన్‌కి బిజెపికి లింకు వుందని తీర్మానించేయడం శుద్ధ పొరబాటు.

సుష్మా స్వరాజ్ పార్లమెంటులో జగన్ విషయంలో ప్రభుత్వాన్ని నిలదీసింది కాబట్టి లింకు వుందనుకోవడమూ అనవసరమే. బంగ్లాదేశ్‌తో ఒప్పందం విషయంలో కూడా సుష్మా ప్రభుత్వాన్ని కడిగి పారేయగలదు. అంతమాత్రం చేత సుష్మాకి బంగ్లాదేశ్ వాళు
్ల చేరువ అనుకోకూడదు. అదే వూపులో అరేబియా పట్ల భారత్ విదేశాంగ విధానాన్ని, అన్నా హజారే, రామ్‌దేవ్, మావోయిస్టుల పట్ల విధానాలనూ తప్పు పట్టగలదు. ఏ చిన్న అవకాశం దొరికినా వాళ్లు వదలరు. అది వినగానే బిజెపి మావోయిస్టులు కలిసి పోయారని, అన్నా హజారే వెనుక బిజెపియే వుండి నాటకమాడిస్తోందనీ అనుకోకూడదు. 'ప్రజలకెంతో సేవ చేసిన వైయస్..' అని సుష్మ అందంటే వైయస్‌మీద ప్రేమతో కాదు (అంత ప్రేమ వుంటే అతను బతికున్నంతకాలం బిజెపి అతనికి వ్యతిరేకంగా ఎందుకు ఉద్యమాలు చేసింది?). కాంగ్రెస్‌ను కవ్వించడానికి చేసిన పని అది. వైయస్ యిమేజితో ఏం చేయాలో తెలియక కొట్టుమిట్టులాడుతున్న కాంగ్రెస్ హై కమాండ్‌ను మరింత యిరకాటంలో పెట్టడానికి చేసిన పని అది.

అక్కడ వైయస్ కొడుకు రాజకీయాల్లో వున్నాడా లేడా అన్నది ప్రశ్న కాదు. లేకపోయినా సుష్మ అలాగే మాట్లాడేది. అందుకే జగన్ వచ్చి థ్యాంక్స్ చెప్తానంటే యిప్పుడు కాదు అని పంపించేసింది. ఇన్నేళ్లగా వరలక్ష్మీ వ్రతం చేయించిన గాలినే వదుల్చుకోగా లేనిది, యిప్పుడు కొత్త సిబిఐ బాధితుణ్ని వదుల్చుకోలేదా? రేపట్నుంచి జగన్ నుండి ఎంత ముట్టిందని మీడియా అడగదూ?

బిజెపి సిద్ధాంతాలతో ఏకీభవించనివారు కూడా ఎన్‌డిఏ కూటమిలో సభ్యులుగా వున్నారు, లేదా చంద్రబాబులా బయటనుండి మద్దతు యిచ్చారు. కానీ దాని తర్వాత్తర్వాతి పరిణామాలు తట్టుకోగలగాలి. చంద్రబాబే యిప్పుడు బిజెపి అంటే ఎవరు వారు? అన్నట్టు నటిస్తున్నారు. బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి ముందు పదిహేనేళ్లు టిడిపి స్వతంత్రమైన ఆలోచనాధోరణిలో మనిన పార్టీ. అందువలన బిజెపితో పొత్తు దానిని అంతగా అంటలేదు. కానీ జగన్ యీ దశలో బిజెపితో పొత్తు పెట్టుకుంటే అతనికి కాషాయరంగు అంటడం ఖాయం. అందువలన జగన్ ఎన్‌డిఏవైపు వెళ్లకపోవడంలో ఆశ్చర్యం లేదు.

ఇక మూడో కూటమి - ఇది ఒక సన్యాసుల మఠం లాటిది. అక్కడ పెర్మనెంటుగా వుండేవాళ్లు మాఠాధిపతులైన లెఫ్ట్ వాళ్లు.

వాళ్లకు ఎంతమంది లోపలకు వచ్చినా యిబ్బంది లేదు. ఖాళీ వుంటుంది. గతంలో నేషనల్ ఫ్రంట్ పేరుతో వుండేది. ఇప్పుడు తృతీయ కూటమి అంటున్నారు. దీనిలోని వారు నాన్-కాంగ్రెస్, నాన్-బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పరుస్తాం అని ప్రకటిస్తారు. అలా అంటూనే కొందరు ఎన్‌డిఏను సమర్థిస్తారు, ఒక్కోప్పుడు వాళ్లే యుపిఏను సమర్థిస్తారు. మళ్లీ వెనక్కి వచ్చేస్తుంటారు. వెళ్లేవారు వెళుతూంటారు, వచ్చేవాళ్లు వస్తూ వుంటారు. ఇలా నిరంతర ట్రాఫిక్ నడుస్తూ వుంటుంది. మతాధిపతులైన లెఫ్ట్ వాళ్లు కూడా మడి గట్టుకుని వుండరు. మొదటి యుపిఏ ప్రభుత్వాన్ని చాలాకాలం మోశారు. ప్రస్తుతం మన రాష్ట్రం నుండి టిడిపి దానితో వుంది. ఈ కూటమి జాతీయస్థాయి నాయకుల్లో బాబు కూడా ఒకరు.

జగన్ ఢిల్లీ వెళుతున్నారనగానే యీ కూటమితో కలవడానికి వెళుతున్నారని, అక్కడకు వెళ్లి 'మీ కూటమిలోంచి తెలుగుదేశాన్ని పంపించి వేస్తేనే వస్తా' అని జగన్ కండిషన్ పెడతారని యిక్కడి మీడియా వూహించింది. అదే జరిగివుంటే 2014 ఎన్నికల్లో టిడిపి, జగన్ పార్టీల్లో ఎవరికి ఎక్కువ సీట్లు వచ్చాయో చూసుకుని తక్కినవాళ్లను మూడో ఫ్రంట్ పంపించేయగలదు. గతంలో టిడిపి లేవదీసిన నేషనల్ ఫ్రంట్‌లో మొదట్లో ఎడిఎంకె వుండేది. రెండు మూడు మీటింగుల తర్వాత తమిళనాడునుండి డిఎంకె వచ్చి చేరింది, ఎడిఎంకె వెళ్లిపోయి కాంగ్రెస్ చెంత చేరింది.

యుపిఏ రైతు వ్యతిరేకమనో, అవినీతిలో కూరుకుపోయిందనో దేశమంతా ఉద్యమాలు లేవనెత్తి ప్రజలను సమీకరించాలంటే ఈ కూటమికి జగన్ సహాయం కూడా అవసరమే. అందువలన సరేనన్నా ఆశ్చర్యపడనక్కరలేని పరిస్థితి. అయితే జగన్‌కు లెఫ్ట్ పెద్దన్నలెవరూ ఎపాయింట్‌మెంట్ యివ్వలేదు. కారణం – స్థానికంగా జగన్ లెఫ్ట్ నాయకులను మచ్చిక చేసుకోకపోవడం. గతంలో ఓ సారి రాఘవులు జగన్ మానిఫెస్టో వచ్చాక ఆలోచిస్తామని కాస్త సానుకూల ప్రకటన చేసినా, దాన్ని లాజికల్ ఎండ్‌కు తీసుకురాలేదు. జగన్ కూడా సానుభూతి కూడగట్టుకోవడంలోనే మునిగి, స్థానిక సమీకరణాలను పట్టించుకోలేదు.

ఇక్కడి లెఫ్ట్ పార్టీ నాయకులు రాఘవులు, నారాయణ చంద్రబాబుకి బాగా క్లోజ్. ఆయనతోనే కలిసి పనిచేస్తున్నారు. ఆయనను విమర్శించరు. 2009 ఎన్నికల్లో మహాకూటమి అని ఆయన నాయకత్వంలో కలసికట్టుగా పోటీ చేసి ఘోరంగా దెబ్బ తినేసినా (టిడిపి సీట్లు పెరిగాయి, లెఫ్ట్ సీట్లు తగ్గాయి) ఆయనను వదలలేదు. ఇటువంటి పరిస్థితుల్లో జగన్ వీళ్ల రికమెండేషన్ లేకుండా జాతీయస్థాయిలో నాయకులను పలకరించబోతే వాళ్లు పలుకుతారా? బాబుతో చెడగొట్టుకుంటారా?

దక్షిణాన ఎడిఎంకె ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తుందో తెలియదు. దేవెగౌడ కూడా డిటోడిటో. కరా?టకలో మళ్లీ ముక్కోణ ఫలితాలు వస్తే కాంగ్రెస్‌తో కాని, బిజెపితో కాని చేతులు కలపడానికి సందేహించడు. ఆంధ్రలో బాబు ఒక్కరే నికరంగా నిలబడుతున్నారు. అటువంటివాణ్ని జగన్‌కోసం విడుచుకుంటారా? అందునా సరిగ్గా సిబిఐ విచారణ ఎదుర్కుంటున్న యీ తరుణంలో?

ఇక చివరకి మిగిలింది యుపిఏ. జగన్ అందువలన యుపిఏను సమర్థిస్తాను అని ప్రకటించారు. స్థానికంగా కాంగ్రెస్‌తో పోరాడుతూ, జాతీయంగా కాంగ్రెస్ సూత్రధారిగా వున్న యుపిఏను సమర్థించడం ఏమిటి? అని ఆశ్చర్యపడడం వేస్టు. ఇలాటివి రాజకీయాల్లో ఎన్నో జరుగుతూ వస్తున్నాయి. 'ఫలానా రెండు పార్టీలకు రాష్ట్రమంతా పొత్తు, కానీ 12 నియోజకవర్గాల్లో మాత్రం స్నేహపూర్వకమైన పోటీ' అనే కాప్షన్లు చదివే చిన్నప్పుడు అర్థంకాక తికమకపడేవాణ్ని. మరి ఆ నియోజకవర్గాల్లో కార్యకర్తలు ఏం చేయాలా అని. ఇంతకీ వీళ్లు శత్రువులా? మిత్రులా? అని. పెద్దవుతూన్నకొద్దీ యిలాటివి చూసి చూసి నవ్వడం మానేసా. ఎనీ థింగ్ గోస్ హియర్ అని అర్థమైంది.

అలాగే ఎన్నికల సమయంలో పార్టీ నాయకులు బూతులు తిట్టేసుకుంటారు. ఎదుటివాళ్లు దేశానికి పట్టిన చీడ అంటారు. ఎన్నికల తర్వాత తగినన్ని స్థానాలు రాకపోతే మళ్లీ వాళ్ల మద్దతే కోరతారు. తన పార్టీ వాళ్లను కాదని వాళ్లకు మంత్రిపదవులు కట్టబెడతారు. చిన్నప్పటినుండీ యివి ఎన్నో చూశాను. అందుకే కాంగ్రెస్‌వారిని పడతిట్టిన చిరంజీవి రెండేళ్లు తిరక్కుండా కాంగ్రెస్ తీర్థం తీసుకుంటే నేను మూర్ఛపోలేదు. కానీ పాతికేళ్ల లోపు చిరంజీవి అభిమానులు మాత్రం తీవ్రంగా గాయపడి వుంటారు. వాళ్లూ క్రమేపీ అలవాటు పడతారు.

అంతెందుకు కేరళ, పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్ పార్టీలు కాంగ్రెస్‌తో తలపడతాయి. వీళ్ల వలననే దేశం యిలా అఘోరించిందని నిందిస్తాయి. మళ్లీ ఢిల్లీకి వచ్చే అదే కాంగ్రెస్ ప్రభుత్వానికి కొమ్ము కాస్తాయి. యుపిఏ రెండో విడత ప్రభుత్వానికి యిప్పటిదాకా సపోర్టు యివ్వలేదు కానీ మొదటిదానికి యిచ్చారు కదా. రేపు బిజెపి బలపడుతోందన్న సంకేతాలు రానీయండి, లేదా మమతా బెనర్జీ బెంగాల్‌లో సిపిఎం వారిని కేసుల్లో యిరికించనివ్వండి, వీళ్లు తమను తాము కాపాడుకోవడానికి యుపిఏకు మద్దతు యివ్వడానికి తయారవుతారు.

ఇలాటి పరిస్థితుల్లో జగన్ రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యతిరేకి, కేంద్రంలో యుపిఏ సమర్థకుడిగా వుండడంలో ఏ మాత్రం బేసబబు లేదు. రాష్ట్రానికి సంబంధించినంత వరకు, కోస్తా, సీమల్లో యిప్పుడు రెండే శక్తులు. బాబు, జగన్. కాంగ్రెస్ మూడో స్థానంలో వుంది. బాబు, జగన్ కలిసే ప్రసక్తి లేదు. ఇద్దరూ వేరువేరు క్యాంపుల్లో వుండడమే సహజం. బాబు మూడో కూటమిలో ముఖ్యనాయకుడు కాబట్టి అతనితో యుపిఏ ద్వారానే తలపడగలడు.

సరే, ఉత్తరోత్రా యుపిఏతో కలిసి వూరేగక తప్పని పరిస్థితి వస్తుందని అనుకున్నాడే అనుకో. ఆ ముక్క యిప్పుడు చెప్పి పలుచన కావడం దేనికి? ఇంతోటి మద్దతు మాకేం అక్కరలేదు అని అభిషేక్ సింఘ్వీ చేత అనిపించుకోవడం దేనికి? మన్‌మోహన్ అక్కరలేదన్నారని

పేపర్లో వచ్చింది కానీ ఆయన అని వుండకపోవచ్చు. ఉన్న రెండు నిమిషాల్లో అప్రియమైన మాట అని పంపించడం దేనికి అని ఆయన అనుకుని వుంటారు. అయినా రాజకీయాలు మాట్లాడడానికి మిగతావాళ్లు వున్నారుగా అని ఆయన ఉద్దేశం.

యుపిఏకు మద్దతు యిస్తానని జగన్ ప్రకటించడం వెనుక 'రాజీ పడడానికి సిద్ధంగా వున్నాను' అనే సందేశం వుంది. కాంగ్రెస్‌లో వుండగా హై కమాండ్‌ను ధిక్కరించి మెహబూబాబాద్ వెళ్లిన జగన్‌లో ధీరత్వం ఇప్పుడు లేదు. అవసరార్థం రంగులు మార్చే రాజకీయత్వమే వుంది. తెలంగాణ విషయంలో ఏమీ తేల్చకుండా గోడ మీద పిల్లిలా వున్నపుడే తెలిసింది, జగన్‌కు తక్కిన రాజకీయనాయకులకూ తేడా లేదని. యువతరం ప్రతినిధిగా ముందుకు వచ్చిన జగన్ రొటీన్ రాజకీయ నాయకుడిలా తయారవడం ఓ విషాదం.

రాజీ పడవలసిన అవసరం జగన్‌కి అర్జంటుగా ఏమొచ్చింది? అంటే జగన్ ఢిల్లీ యాత్ర వ్యాసంలో రాశాను. పార్టీ పెట్టడానికి ముందే జగన్ సకలవిధమైన జాగ్రత్తలు పడి వుంటారని, సిబిఐకు చిక్కరని అనుకున్నాను. ఇప్పుడు కూడా అతనిపై కేసు నిలుస్తుందని నేను అనుకోవడం లేదు. సిబిఐ దాడులు అకస్మాత్తుగా జరగలేదు. మీడియా దగ్గర్నుంచి అందరికీ ముందస్తు సమాచారం అందాకనే సిబిఐ కదిలింది. ఎంతటి మూరు?డైనా సాక్ష్యాలను మిగల్చడు. సిబిఐ అది పట్టుకుంది, యిది పట్టుకుంది అని కొన్నాళ్లు అడావుడి కనబడుతుంది. చివరకు కోర్టు దగ్గరకి వెళ్లేసరికి సాక్ష్యాలు చాలలేదంటూ కోర్టు కొట్టేస్తుంది. సిబిఐకు అక్షింతలు వేస్తుంది. సిబిఐ తలనిండా అక్షింతలే. ఓ సారి తలకాయ దులిపేసుకుని మళ్లీ పనిలో పడుతుంది సిబిఐ.

గాలి జనార్దనరెడ్డి కేసులో కూడా చూడండి, ఆయన కంపెనీ ఎండీని అరెస్టు చేశారు కానీ, అక్రమమైన మైనింగ్ అనుమతించిన అధికారులపైన కూడా కేసులు పెట్టవద్దా? అదే అడిగారు గాలి తరఫు న్యాయవాది. ఇలా కుంటు కుంటూ నడుస్తాయి సిబిఐ దర్యాప్తులు. నాకు ఎకనమిక్ క్రైమ్స్ అంటే చాలా ఆసక్తి. 1975 నుండి పత్రికలలో వచ్చిన ఆ తాలూకు రిపోర్టలన్నిటిని కట్ చేసి దగ్గర పెట్టుకున్నాను. రిలయన్సు–బాంబే డైయింగ్, కల్పనాథ్ రాయ్ ఆయిల్ స్కామ్, స్టాక్ మార్కెట్ స్కాములు.. ఎన్నో, ఎన్నెన్నో.. అప్పట్లో దేశాన్ని వూపేసినవే ఆ కేసులు. అల్టిమేట్‌గా వాటిల్లో శిక్ష పడిందా అని అడిగితే చెప్పలేను. మహా అయితే ఆ నాయకుడెవరో అతనికి పదవి పోతుంది, అంతే. ఎందుకంటే కోర్టులో ఎప్పటికో విచారణ జరుగుతుంది. సాక్ష్యాలు తారుమారవుతాయి. ప్రభుత్వాలు మారతాయి. రాజకీయ అవసరాలు మారతాయి.

జగన్ వ్యవహారంలో కూడా ఆయన జైలు కెళ్లడం ఖాయం అంటూ ఈనాడు ఎన్ని కార్టూన్లయినా వేయనీ, జైలుకి వెళ్లకపోయినా మీరు తెల్లబోవద్దు. వెళ్లినా బయటకు రావచ్చు, ఫైనల్‌గా కేసు నిలవకపోవచ్చు. ఎందుకంటే జైల్లో పెట్టి ఉపయెన్నికలు నిర్వహిస్తే అతనికి సింపతీ పెరిగి అతని తరఫు కాండిడేట్లు అందరికీ ఓట్ల వర్షం కురవవచ్చు. అవినీతి ఆరోపణలపై జైలుకి వెళ్లినవాడిపై జాలి ఏమిటి? అని నవ్వవద్దు. ఈ ఓటరు ప్రజలు యిలాగే వుంటారు. ఇందిరా గాంధీ, సంజయ్ గాంధీలపై ఎన్ని కేసులు పెడితే అంత ఘనంగా గెలిపించారు.

కాంగ్రెస్ హై కమాండ్ వారికి జగన్‌ను, ఇందిరా గాంధీతో పోల్చుకోవడం యిష్టం లేకపోవచ్చు. జైలుకి పంపించి ఎన్నికలు నిర్వహించినా ఏమీ కాదులే అనే ధైర్యంతో వుండవచ్చు. చివరకు ఏది ఏమవుతుందో భవిష్యత్తే చెపుతుంది. ఒకవేళ జగన్ తనకు ప్రజాబలం వుందని, 30 ఏళ్ల టిడిపిని, కేంద్ర రాష్ట్రాలలో అధికారంలో వున్న కాంగ్రెస్‌ను ఎదిరించి నిలవగలనని నిరూపించుకుంటే కాంగ్రెస్ రాజీ ప్రయత్నాలు చేయవచ్చు. ఈ స్కాముల కారణంగా అవిశ్వాస తీర్మానం పెట్టి అధికారం అంచుల్లో వేలాడుతూ వుంటే యుపిఏ కూడా జగన్ పార్టీ మద్దతు తీసుకోవడానికి సందేహించదు.

అటువంటి పరిస్థితి వస్తుందా అంటే అని గట్టిగా అడిగితే రాదా? అని నేను తిరిగి అడుగుతాను. ఎవరైనా వూహించగలిగారా, కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోకుండా టిడిపి కొమ్ము కాస్తుందని? ఎవరైనా వూహించగలిగారా సాక్షి పేపరు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తుందని? ఎవరైనా వూహించారా, రఘువీరా రెడ్డి, బొత్స యిత్యాదులు వైయస్ జగన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తారని?

రాష్ట్రంలో పోట్లాటలు ఎలా వున్నా, కేంద్రంలో మాత్రం సఖ్యత నెరపడానికి నేను రెడీ అని యిప్పుడే చెప్పడం ద్వారా జగన్ తనపై దాడి తీవ్రతను తగ్గించుకుందామని చూస్తున్నారన్నది నిస్సందేహం. దీనికి కాంగ్రెస్ ఎలా స్పందిస్తుందో యిప్పుడే తెలియదు. ఉపయెన్నికలలో ఫలితాల బట్టి అప్పుడు నిర?యం తీసుకుంటారు. చిరంజీవి ఉద్ధరించేది ఏదీ లేదని తేలితే, కిరణ్ యిమేజి యింతకంటె పెరగకపోతే, బొత్స ఏమీ సాధించలేకపోతే 2014 ఎన్నికలలో గట్టెక్కించగల ప్రజానాయకుడు కోసం చేసే అన్వేషణలో జగన్‌పై దృష్టి నిలపవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**

**సెప్టెంబరు 15** **ఎమ్బీయస్ : కమ్మలందరూ చౌదర్లు కారా?**

నిజాం కథల్లో "చౌదర్లు" గురించి నేను రాసినది చదివి చాలామందికి సందేహం వచ్చింది. కమ్మవారందరూ చౌదర్లు కారా? అని. కాదు. నేను ఆ వ్యాసంలో రాసినట్టుగా కుతుబ్‌షాహీల పాలనలో ఈ పదం వాడుకలోకి వచ్చింది. ఇబ్రహీం కుతుబ్ షా 1579లో కొండవీడు జయించినపుడు అతని వద్ద పనిచేసే రాయరావు అనే మరాఠా సేనాని కృషా?, గుంటూరు జిల్లాలలో 497

గ్రామాల్లో పన్ను వసూలు చేసే అధికారులుగా కమ్మ?వారిని నియమించాడు. అప్పటినుండి ఆ కుటుంబాల వారికి చౌదర్లు అనే పేరు వచ్చింది. శివాజీ కాలం నుండి మహారాష్ట్రలో పన్నును చౌత్ (ఆదాయంలో పావువంతు అనే అర్థంలో) అనేవారు. అది వసూలు చేసేవారు చౌదర్లు. అది ఒక పదవిని సూచించే పేరే తప్ప గౌరవ నామధేయం కాదు.

అది కూడా ఆ రెండు జిల్లాలలో మాత్రమే వచ్చింది. కమ్మవారు అంతకు ముందూ, దాని తర్వాతా కూడా అనేక జిల్లాలలో విస్తరించి వున్నారు. అక్కడ ఎక్కడా 'చౌదరి' అని పెట్టుకోలేదు. పైకి వచ్చిన శూద్రులందరూ తమ పేరు వెనుక 'నాయుడు' అని పెట్టుకోవడం రివాజు. ఆదికేశవులు నాయుడు, ఎర్రన్నాయుడు, డి రామానాయుడు – వీళ్లందరికీ చివరిలో 'నాయుడు' అని వున్నా వీరందరూ ఒకే కులస్తులు కాదు. దక్షిణాదిన కమ్మవారిని యిప్పటికీ 'కమ్మనాయుళ్లే'నే అంటారు. కోయంబత్తూరు ప్రాంతాలలో ఎంతో ప్రాముఖ్యత గడించిన జిడి నాయుడు యిత్యాదులు 'నాయుడు' అనే తమ పేరు చివర పెట్టుకుంటారు. ఎందుకంటే గ్రామంలో ఎక్కవుంట్లు చూసేవాణ్ని 'కరణం' అన్నట్టుగా. 'చౌదరి' అనేది పన్ను వసూలు చేసే ఒక పదవి సూచించే పదం మాత్రమే. ఆ పదవికి సంబంధించని వారికి 'చౌదరి'తో పని లేదు.

బ్రాహ్మణులలో ఆరువేల నియోగులు అనే ఒక శాఖ వుంది. ఆరువేల మంది బ్రాహ్మణులను ఒక మంత్రిగారు ఒకేసారి ఉద్యోగాలలో నియోగించాడట. అప్పటినుండి వారందరూ 'ఆరువేల నియోగులు' గా పేరు బడ్డారు. అంతమాత్రం చేత బ్రాహ్మణులందరూ నియోగులు కారు. బ్రాహ్మణులలో వైదిక వృత్తి నమ్ముకుని వుండిపోయినవారు వైదికులు అన్నారు. వారు తమలో తాము 'బ్రహ్మశ్రీ వేదమూర్తులైన' అని సంబోధించుకుంటారు. కానీ నియోగులు 'మహారాజశ్రీ' అని సంబోధించుకుంటారు – రాజరికం ఛాయలు అంటినందిన ! వీళ్ల యింటి పేర్లలో కొందరికి '..రాజు' అని వుంటుంది. (భావరాజు, బసవరాజు..యిలా) అంతేకాదు, మామూలుగా ఆచారప్రకారం బ్రాహ్మణుడికి మీసం వుండకూడదు. కానీ నియోగులు మీసాలు పెంచేవారు.

ఈ కమ్మ 'చౌదరి'కి, ఉత్తరాదిన కనబడే 'చౌధురి'కి సంబంధం వుందనీ, భూస్వాములైన కమ్మలు తమ పేరు చివర 'చౌదరి' అని పెట్టుకునేవారని కొందరు పొరబడతారు. భూస్వాములు, జమీందారులు ఐన కమ్మలు తమ పేరుకు ముందర 'రాజా' అని, చివర 'నాయుడు' అని పెట్టుకున్నారు. అమరావతి పాలించిన వాసిరెడ్డి కుటుంబీకులు, చల్లపల్లి పాలించిన యార్లగడ్డ కుటుంబీకులు వారు తమ పేర్లకు చివర 'చౌదరి' అని పెట్టుకోలేదుగా !

ఈస్టిండియా కంపెనీ పాలించిన బెంగాల్, బిహార్‌లలో పన్నుల వసూలును వేలం వేసి జమీందార్లకు అప్పగించేవారని 'నిజాం కథలు'లో రాశాను కదా. వాళ్లు నాలుగోవంతు భూమికి హక్కుదారులు అనే అర్థంలో 'చౌధురి', 'రాయ్ చౌధురి' 'ఠాకూర్' అనే టైటిల్స్ యిచ్చేవారు. వీళ్లలో అన్ని కులాల వాళ్లు కనబడతారు. అది వాళ్లు యింటిపేరుగా స్వీకరించారు. (కమ్మలలో చౌదరి యింటిపేరు కాదు) చౌధురి, రాయ్ చౌధురి యింటిపేరు వున్న బ్రాహ్మణులు, ముస్లిములు అనేకులు కనబడతారు. రవీంద్రనాథ్ టాగోర్ తన పేరును బెంగాలీలో 'ఠాకూర్' అనే రాసుకుంటారు. ఆయన పిరాలీ శాఖకు చెందిన బెంగాలీ బ్రాహ్మణుడు. అనేకమంది ఠాకూర్లు రాజపుత్రులలో కూడా కనబడతారు. ప్రధానిగా చేసిన వి పి సింగ్ క్షత్రియ కులానికి చెందిన ఠాకూర్. జమీందారీ వ్యవస్థ దేశమంతా వుంది. అయినా దక్షిణాదిన కానీ, పశ్చిమాన కానీ జమీందార్లు ఎవరూ పేరు చివర 'చౌధురి' అని పెట్టుకోలేదు.

మొగలాయిలు పంజాబ్ ప్రాంతంలో తాలూక్‌దార్లకు (తాలూక్‌దార్ క్రింద 84 గ్రామాలు వుంటాయి)కి చౌధురి అనే బిరుదు యిచ్చేవారు. క్రమేపీ అది ఉత్తరభారతంలో జమీందార్లకు విస్తరించారు. వారిలో క్షత్రియులు, గుజ్జర్లు, జట్‌లు, యాదవులు ఇలా అన్ని కులాలవారూ వుండేవారు. ఆ 84 గ్రామాలకు అధికారి అయిన ఆ 'చౌధురి'కి, ఒక గ్రామంలో పన్ను వసూలు చేసే ఒకే కులస్తులైన మన కమ్మ 'చౌదరి'కి ముడిపెట్టడం సమంజసం కాదు. మరి అది తరతరాలుగా ఎందు ధరిస్తున్నారు అంటే అదీ సహజమే ! ముస్లిములలో హజ్ యాత్ర చేసిన వాడు పేరుకి చివర 'హాజీ' అని తగిలించుకుంటాడు. అలాగే హిందువులలో యజ్ఞం చేసినవాడు పేరు చివర 'సోమయాజి' అని తగిలించుకుంటాడు. 'చైనం' అనే కాస్త భారీ యజ్ఞం చేసినవాడు 'చైనులు' అని పెట్టుకుంటాడు. వాళ్ల మనుమళ్లకు కూడా 'సోమయాజి', 'చైనులు' అని పెట్టేస్తారు – వాళ్లకు యజ్ఞం స్పెల్లింగ్ తెలిసినా తెలియకపోయినా.

గ్రామకరణాలలో చాలామంది నియోగిబ్రాహ్మణులుండేవారు. కానీ వారు మాత్రం తమ పేర్లకు చివర 'కరణం' అని పెట్టుకోలేదు. మునసబులుగా వున్నవారు కానీ మునసబు అని పెట్టుకోలేదు. కానీ కృష్ణా? గుంటూరు జిల్లాలలోని యీ 497 పన్ను వసూలుదార్ల కుటుంబాల వారు మాత్రం తమ పేరుకి చివర 'చౌదరి' అని పెట్టుకోసాగారు. (కొన్ని ప్రాంతాల్లో మునసబు, కరణాల పని చేసిన దేశ్‌ముఖ్, దేశ్‌పాండేలు వాటిని యింటిపేర్లుగా స్వీకరించారు. కానీ వీరు తమ యింటిపేరును కంటిన్యూ చేస్తూ పేరు చివర యీ హోదాను చేర్చుకున్నారు) అది ఆ జిల్లాలలోనే వాడుక. మిగతా జిల్లాలలో కాదు. (చిత్తూరు జిల్లాలో నాయుడు అని పెట్టుకుంటారని మన చంద్రబాబు నాయుడు గార్ని చూస్తే తెలుస్తుందిగా. ఆయన తన కుమారుడి లోకేష్‌కు ఆ 'నాయుడు' కూడా వదిలేశారు.) అయితే పోను పోను అదేదో గౌరవప్రదం అనే భ్రమలో తక్కినవారు కూడా పెట్టుకోవడం చూస్తున్నాం. అది వాళ్ల యిష్టాయిష్టాలపై ఆధారపడి వుంటుంది. ఏది ఏమైనా కమ్మ, చౌదరి అనే పదాలు సమానార్థకాలు కావు. చౌదర్లు కమ్మలే కానీ, కమ్మలందరూ చౌదర్లు కారు. **ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**

**సెప్టెంబరు 21** **ఎమ్బీయస్ : సకల జనుల సమ్మె**

సకల జనుల సమ్మె నడుస్తోంది. సకల జనులు అంటూ మీరూ, నేనూ, మనమందరమూ అని కాదు. సకల... అంటే ఉద్యోగులే అని అర్థం. అందునా రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు అనే అర్థం. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ప్రయివేటు సంస్థలు, కార్పోరేట్లు, మీడియా ఆఫీసులు, ఫ్యాక్టరీలు, దుకాణాలు.. వీటన్నిటిలో పనిచేసే ఉద్యోగులు యథావిధిగా పని చేయాల్సిందే. మనందరికీ వేళకు పాలు, నీళ్లు, పేపరూ, టీవీ అందించాల్సిందే. వీళ్లందరూ సకల జనుల.. నిర్వచనంలోకి రాకపోవడం వలన మనకు బండి నడుస్తోంది. ప్రభుత్వోద్యోగులలో కొంతమంది సమ్మె చేస్తున్నారు, కొంతమంది.. అంటే ఆంధ్రప్రాంతం నుండి రిక్రూట్ అయి, తెలంగాణలో పనిచేస్తున్నవారు సమ్మె చేయడం లేదు. గతంలో అయితే వాళ్లూ పెన్‌డౌన్, వర్క్ టు రూల్.. లో పాల్గొనేవారు. ఈ సారి 'నో వర్క్, నో పే' అనేటప్పటికి 'అయితే మేం డ్యూటీలకు వెళతాం బాస్, కావాలంటే మధ్యమధ్యలో వచ్చి స్లోగన్స్ యిచ్చి పెడతాం' అన్నారు తెలంగాణ కొలీగ్స్‌తో. ప్రభుత్వాన్ని నష్టపరచడానికి వెనకాడరు కానీ తమకు తాము ఆర్థికనష్టం చేసుకునేవా రెవరుంటారు?

వాళ్లను చూసి తెలంగాణ ఉద్యోగులు కొందరు పని మాట ఎలా వున్నా, అటెండెన్సు రిజిస్టర్‌లో సంతకాలు పెట్టేస్తున్నారట. వాళ్లను ఉద్దేశించే 'సమ్మె కాలంలో పని చేస్తే తెలంగాణ వచ్చేక తీసిపారేస్తాం అని హెచ్చరిస్తున్నారు కోదండరాం. 'తెలంగాణ వచ్చేక ఆయన ఉద్యోగి హెూదా నుండి ఉద్యోగాలు పీకగల హెూదాకు ఎదుగుతారన్నమాట ! రేవు దాటాక కూడా ఓడ మల్లయ్యే అంటారని ఆయన ఊహ. మహామహా గాంధీకే భంగపాటు తప్పలేదు.' అనుకుని లక్ష్యపెట్టటం లేదు, అలా సంతకాలు పెట్టేవారు. ఎందుకంటే జీతం ఠంచనుగా వస్తేనే హానిహానిగా సరిపోయే పరిస్థితుల్లో చాలామంది వున్నారు. పై మేతకు అలవాటు పడ్డవారికి యీ సమ్మెకాలమంతా నోట్లో కరక్కాయే. జీతంతో పాటు గీతమూ రాదు. అలాటప్పుడు జీతానికే ఎసరు పెడతానంటే ఎలా? గతంలో అయితే ఆఫీసుకి వచ్చి హాయిగా తొక్కుడుబిళ్ల ఆడుకున్నా ప్రభుత్వం జీతాలిచ్చేసింది. ఈ సారి కోర్టులు యివ్వద్దంటున్నాయి, నేనేం చేయగలను అంటూ బూచి చూపించి ఎగ్గొడుతోంది.

జీతం నష్టం అయినా ఫర్వాలేదు, మై హూ న? తెలంగాణ రాగానే అవన్నీ పువ్వుల్లో పెట్టి, బోనస్‌తో సహా యిస్తాం అంటున్నారు కెసియార్. ఈ జీతాన్ని మీ పిల్లల పేర ఫిక్సెడ్ డిపాజిట్ వేశామనుకోండి అంటున్నారు. ఈ కెసియార్ హామీలు ఎంతవరకు నమ్మాలో తెలియదు. రెండు వారాల్లో తెలంగాణా వస్తుందంటారు, అదే నోటితో రెండేళ్లయినా రాదంటారు. 2014లో దొరక్కపోతారా అంటారు. ఆర్నెల్లలో వచ్చుడో, చచ్చుడో అని విని విని ఆరేళ్లు దాటిపోయింది. నిజంగా యీయన నెగ్గాక యివన్నీ గుర్తుంటాయో లేదో తెలియదు. వెళ్లి నిలతీద్దామంటే కనబడకపోవచ్చు. టిక్కెట్ల పంపిణీ సమయంలో వుపయోగించే వ్యానిషింగ్ ట్రిక్ వుపయోగించవచ్చు. ఎక్కడైనా దొరికి నిలదీస్తే "సిఎం పోస్టులో నేను కూర్చోబెట్టిన దళితుణ్ని పోయి అడగండి" అని జవాబివ్వవచ్చు.

ఇంత రిస్కు వున్నా ఉద్యోగులు మాత్రం సమ్మె చేస్తున్నారు. ఎందుకంటే నిజంగా తెలంగాణ వచ్చేసి ఆంధ్ర వుద్యోగులు యిక్కణ్నుంచి వెళ్లిపోతే వాళ్లకు ప్రమోషన్లు సులభంగా వస్తాయి. కెసియార్ చెప్పిన కోటి ఉద్యోగాలు వచ్చినా రాకపోయినా ఉన్న ఉద్యోగాలుంటాయి కదా, వాటిలో ప్రమోషన్లకోసం ఆంధ్ర వుద్యోగులతో పోటీ పడనక్కరలేదు కదా అన్న తృప్తి వారిది. (రాష్ట్రం విడిపోయాక ఉద్యోగాలు కూడా తరలి వెళ్లిపోతే మాత్రం యీ లెక్క తప్పవచ్చు)

రాష్ట్ర ఉద్యోగుల సమ్మె ప్రభావం సాధారణ జనజీవితంపై అంతగా పడదు కానీ రెండు రోజులుగా ఆర్టీసీ బస్సులు లేకపోవడం వలన సమ్మె ప్రభావం కాస్త గట్టిగా తెలుస్తోంది. లోకల్ రైళ్లు కూడా లేకపోతే యింకా గట్టిగా తెలిసేది. ఆటో వాళ్లను తిరగనిస్తున్నారు కాబట్టి వాళ్లు గూబ పగిలేట్లా వసూలు చేస్తున్నారు. స్వంత వాహనాలను తిరగనిస్తున్నారు కాబట్టి నగరంలో చాలామంది అటువంటి జీవులే కాబట్టి నడిచిపోతోంది. సింగరేణిలో బొగ్గు రవాణా సాంతం నిల్చిపోయి, విద్యుత్ కోత పూర్తిగా అనుభవిస్తే అప్పుడు మరి కాస్త తెలుస్తుంది. ఇక యీ మధ్యలో ఓ రోజు రస్తా రోకో, మరో రోజు రైల్ రోకో అన్నపుడు ఆ రోజు దాని ప్రభావం తెలుస్తుంది.

ఇవన్నీ మనకు కొత్త కానీ అధిష్టానానికి సాధారణమేమో ! రేణుకా చౌదరి పరిస్థితి 80% ఓకే అనడం హై కమాండ్ మానసిక స్థితిని సూచిస్తోందా? అన్న భయం ఉద్యమకారులకూ వుంది. అందుకే ఆవిడ మాటలను అంత సీరియస్‌గా తీసుకుని అన్ని దిష్టిబొమ్మలు తగలేశారు. అభిషేక్ సింఘ్విగారు యిదే అభిప్రాయాన్ని అక్కణ్నుంచి ప్రతిధ్వనించారు 'గోరంతలు కొండంతలు చేస్తున్నారు' అని. అంతే మరి, యీ బాధలన్నీ మనం పడుతున్నాం కానీ ఢిల్లీ వారు కాదు కదా.

దేశం మొత్తం మీద చూస్తే యిలాటివి ఎక్కడో అక్కడ ఎప్పుడూ జరుగుతూనే వుంటాయి. అసాం, ఈశాన్య రాష్ట్రాలలో ఎప్పుడూ ఏదో ఒక గొడవ నడుస్తూ వుంటుంది. యుపిలో ఎన్‌జిఓలు రెండు నెలలపాటు సమ్మె చేశారని, తమిళనాడులో నెల్లాళ్లు చేశారని, బెంగాల్‌లో నెలకోసారి చేస్తున్నారని.., రాజస్థాన్‌లో గుజ్జర్లు రోడ్లు తవ్వేశారని, హర్యాణాలో జట్‌లు పట్టాలు పీకేశారనీ.. యిలా పేపర్లో చదివి పెదాలు చప్పరించి వూరుకుంటాం. అలాగే ఢిల్లీ వాళ్లూ మన అవస్థలు విని నోరు చప్పరించి 'వాట్ నెక్స్‌ట్?' అంటున్నారు. ఎంతకాలం చేస్తారో చూదాం అంటున్నారు. ఫీలర్స్ వదులుతున్నారు. నెలాఖరుకి ఆజాద్ తమ నివేదిక సమర్పిస్తారట. అది చూసి అక్టోబరు మొదటివారంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీవారు చర్చిస్తారట. ఆపై నవంబరులోగా నిర?యం తీసుకుంటారట. ఆ నిర?యం తమకు నచ్చితే తప్ప మనవాళ్లు సమ్మె మానరు. అంటే అప్పటికి సమ్మె వయసు నెలన్నర అవుతుందన్నమాట.

ఈ లోపున మనకు కరంటు వుండదు, పిల్లలకు చదువులుండవు, మునిసిపల్ ఉద్యోగులు కూడా సమ్మెలో చేరుతున్నారు కాబట్టి రోగాలకు లోటుండదు, ఆస్పత్రి కెళితే డాక్టర్ల సమ్మె కాబట్టి డాక్టర్లుండరు. నెలన్నర పాటు సమ్మె చేసేందుకు మన ఉద్యోగుల ఆర్థిక

స్తోమత అనుమతిస్తుందా? అనుమతించకపోయినా సమ్మె చేయాల్సిందే. ఎందుకంటే కెసియార్ చెప్పినట్టు యిది పులిస్వారీ. ఇలాటిది ప్రారంభించేటప్పుడు హుషారుగా వుంటుంది కానీ, మానడమే కష్టం. పరువు పోకుండా ఉద్యమాన్ని విరమించడం అంత యీజీ కాదు. మధ్యలో దిగితే పులి తినేస్తుంది.

మరి యిలాటి పులిస్వారీ మొదలుపెట్టేటప్పుడు కెసియార్ యితరులను సంప్రదించారా? ఎంతమాట! అలాటి పని చేస్తే తక్కినవారూ తనతో సమానమని ఒప్పుకున్నట్టవదూ? సకల జనుల సమ్మె ప్రారంభించేటప్పుడు 'జాక్ లేదు, గీక్ లేదు, మనమే నడుపుతాం' అని ప్రకటించి మరీ దిగారు ఆయన. ఆయన అలా తీసిపారేసినా వెనక్కాల తోకలా వేళ్లాడవలసినది కాబట్టి జాక్ ఆయనను వెంటనంటే నడుస్తోంది. జాక్‌లో వున్న పార్టీలు మూడే. వాటికి వున్న ప్రాధాన్యత ఏమిటో తెలుసుకోవడానికి ఒక చిన్న ఉదాహరణ చాలు. ఈ నెల 24, 25లలో రైల్ రోకో వుంది. 27 చోట్ల రైల్ రోకో ప్లాన్ చేశారు. ఆ 27టిల్లో 19 చోట్ల తెరాస చేస్తుంది. బిజెపి 5 చోట్ల, న్యూ డెమోక్రసీ 3 చోట్ల. రేపు తెలంగాణ వస్తే అధికారం ఏ నిష్పత్తిలో పంచుకోబోతున్నారో యిది సూచిస్తోంది.

దీనిలో కాంగ్రెస్‌కు, టిడిపికి చోటు లేదు. కాంగ్రెస్ చర్చలంటూ సమయం పొడిగిస్తూ పోతోంది. సోనియమ్మగారి ఆరోగ్యం కుదుటపడి దీనిపై ద ృష్టి సారించేవరకూ ఏదీ తేల్చకుండా లాక్కుని వస్తున్నారు. ఏదో ఒక టార్గెట్ పెట్టుకుని చర్చల ద్వారా ఉభయప్రాంతాల కాంగ్రెస్ నాయకుల మధ్య సయోధ్య సాధించి ఏ నవంబరు 1 కి ముందో పరిష్కారం ప్రకటించిందనుకోండి. మీరూ నేనూ సంతోషించవచ్చు – హమ్మయ్య, యిప్పటికైనా రావణకాష్టం చల్లారవచ్చని. కానీ కేసియార్‌కు ఆనందం లేదు. ఎందుకంటే తెలంగాణ క్రెడిట్ అంతా కాంగ్రెస్‌కు పోతుంది. అందుకని ఇప్పుడు అడావుడిగా మొదలుపెట్టారు.

సకల జనుల సమ్మె అని కోదండరాం చేత ప్రకటించినపుడు గద్దర్ చాలా విలువైన ప్రశ్నలు లేవనెత్తారు. ఎవరికి వ్యతిరేకంగా సమ్మె? అని. ఎందుకంటే సమ్మె అనేది యజమాని అన్యాయం పట్ల ఉద్యోగి ప్రకటించే నిరసన. దానివలన యజమానికి నష్టం కలగాలి. అప్పుడు అతను దిగి వస్తాడు. ఇక్కడ యీ సమ్మె వలన నష్టపోయేది తెలంగాణ ప్రజలే. వచ్చేవారంలో ఓ రోజు క్షురకర్మలు బంద్ చేస్తారట. ఎవరికి నష్టం? రోడ్లు తుడిచేవారు రోడ్లు తుడవకపోతే రోగాలు వచ్చేది ఎవరికి? డాక్టర్లు చికిత్స చేయకపోతే పోయే ప్రాణాలు ఎవరివి? రాస్తా రోకోలో రైలు తప్పిపోయి నష్టపోయేది ఎవరు? ఊళ్లలో బస్సులు తిరక్క, సిటీబస్సులు తిరక్క రోజు కూలీ పోయేది ఎవరికి? ఇలా మనను మనమే నష్టపరుచుకోవడం సబబా? అని ఆయన అడిగాడు. ఇది ఒక రోజు, రెండు రోజులు అంటే ఆ మాత్రం చేయందే ఏం వస్తుంది కనక? అనుకోవచ్చు. నిరవధిక సమ్మె తలపెట్టినపుడు యివన్నీ సంబంధిత వ్యక్తులతో కూలంకషంగా చర్చించాలి. అలాటిది జరగలేదు.

స్వామిగౌడ్ కూడా చాలా స్పష్టంగా చెప్పారు – 'పహలే ఆప్' అని. ''మా ఉద్యోగుల భుజాల మీద బందూకులు పెట్టి కాల్చకండి. మీ రాజకీయ నాయకులు ముందు వుండి రాజీనామాలు ఆమోదింప చేసుకుని ఆ పై మమ్మల్ని అడగండి. మేమే ఎందుకు త్యాగాలు చేయాలి?" అని. మమ్మల్ని రాజీనామా చేయమనడానికి స్వామి గౌడ్ ఎవరు? అతను మాకు పదవులిచ్చాడా? అని నాయకులు బోల్డు కోపం తెచ్చేసుకున్నారు. ''మీరు పదవులు, హోదాలు, జీతాలు, భత్యాలు అనుభవిస్తూ మమ్మల్ని మాత్రం జీతం నష్టం మీద సమ్మె చేయమనడం ధర్మం కాదు" అని భేషైన మాట మాట్లాడిన స్వామి గౌడ్ ఎందుకో గాని చడీచప్పుడూ లేకుండా తనన్నదానికి 180 డిగ్రీల టర్నింగ్ తీసుకున్నారు. కెసియార్ మాయాజాలమో, మరోటో గాని కాంగ్రెస్ మంత్రులు, యితర లెజిస్లేటర్లు రాజీనామా చేయకుండానే సమ్మెకు సై అన్నారు. కెసియార్ టైమ్‌టేబుల్ ప్రకారం వెళ్లడానికే ఒడంబడ్డారు.

కెసియార్ టైమ్‌టేబుల్ ఏమిటో, టైమ్ సెన్స్ ఏమిటో ఆయనకే తెలియాలి. మనలాటి వాళ్లకు యిది రాంగ్ టైమింగ్ అనిపిస్తుంది. ఎందుకంటే తెలంగాణ యివ్వవలసినది యుపిఏ ప్రభుత్వం. యుపిఏ కన్వీనర్ సోనియా గాంధీ దేశంలోనే లేరు. మొన్ననే వచ్చారు. ఆరోగ్యం యింకా కుదుటబడలేదు. ఎవర్నీ చూడడం లేదు. ఇంకో నెల పడుతుందట. ఆవిడ కూడా తొందరపడి నిర?యం తీసుకోదు. డిసెంబరు 9 తర్వాత ఏ నిర?యం తీసుకోవాలన్నా తెనాలి రామలింగడి పిల్లిలా అయిపోయింది ఢిల్లీ. (రామలింగడు తన పిల్లికి ఓ సారి వేడిపాలు పోసి పెడతాడు. అది తాగబోయి దానికి మూతి కాలుతుంది. ఇక అప్పణ్నుంచి పాల జోలికి వెళ్లదు. కానీ పిల్లి పోషణ ఖ్చ అంటూ రామలింగడు రాజు నుండి డబ్బు గుంజుతూంటాడు) ఆ నిర?యానికి బాధ్యత నీదంటే నీదని కలహించుకుంటున్నారు. ఈ మధ్య వికీలీక్స్ (దీనికి మరో పేరు ఉబుసుపోక కబుర్లు) ద్వారా అమెరికా రాయబార్లు కూడా అది తప్పుడు నిర?యమని అనుకుంటున్నారని బయటకు వచ్చిన దగ్గర్నుంచి మరింత ఉలిక్కిపడుతూ వుండవచ్చు. ఈ సారైనా కాస్త నలుగురితో చర్చించి మంచి నిర?యం తీసుకోవాలని అనుకోవడంలో ఆశ్చర్యం లేదు.

అందుకే యిన్నాళ్లకు యిరుప్రాంతాల వారితో చర్చలు మొదలు పెట్టారు. విడివిడిగా చర్చలు అయ్యాయి. ఇప్పుడు కలివిడిగా కూర్చోబెట్టి చర్చించాలి. ఓ రాజీమార్గం వచ్చాక మిగతా పార్టీల ముందు అది పెట్టి వాళ్ల అభిప్రాయాలు కనుక్కోవాలి. అప్పుడు దాన్ని ప్రకటించి ప్రజల రియాక్షన్ ఏమిటో చూడాలి. ఈ ప్రాసెస్ యిన్నాళ్లకు ప్రారంభమై కుంటుకుంటూ నడుస్తోంది. ఈ టైములో సోనియా మంచాన్న పడిన టైములో ఎవరు నిర?యం తీసుకుంటారని కెసియార్ యిది ప్లాన్ చేశారు? ప్రధాని కూడా ఆరు రోజుల పాటు దేశంలో లేరు. ఆయన బదులు ఆయన సీట్లో కూర్చునేవారు కూడా లేరు. కేంద్రం 2 జి స్పెక్ట్రమ్ స్కామ్‌లో పడి కొట్టుకుంటోంది. అన్నా హజారేతో వేగుతోంది. మరో పక్క బిజెపి అవినీతివిరోధ రథయాత్ర అంటోంది. గాలి జనార్దనరెడ్డి గొడవలు ఎంతవరకూ వస్తాయో తెలీదు. ఆ గాలి కాంగ్రెస్ నాయకులను కూడా తాకిందేమో తెలియదు. ఇంకో పక్క జగన్ భరతం పట్టే పని కూడా యిప్పుడే

పెట్టుకుంది కాంగ్రెస్. ఇంత అడావుడి మధ్య ఏడేళ్లగా నానుతున్న తెలంగాణ సమస్యను తేల్చేయడానికి యిది సమయమా? వారిపై ఒత్తిడి తేవడానికి యిది సరైన అదనా?

ఇవన్నీ ఎలాగోలా తెలంగాణ రావాలని అనుకున్నవారు ఆలోచించే ఆలోచనలు. కానీ తెలంగాణ రావాలి, దానికి మనమే రాజులం కావాలి అనుకునే కెసియార్ యిలా ఆలోచించలేదు. పోరాటంలో తను తప్ప వేరెవరూ వుండకూడదన్న ఆలోచనతోనే సమయంకాని సమయంలో యిది మొదలు పెట్టించారు. కాంగ్రెస్ వారు యిన్నాళ్లకు చర్చలు మొదలుపెడితే హర్షించకుండా, ఫలితం వెలువడేవరకూ ఆగకుండా ఆ క్రెడిట్ వారికి ఎక్కడ పోతుందోనన్న ఆతురతతో యుద్ధంలోకి దిగారు. నిజానికి కాంగ్రెస్ వారందరూ రాజీనామాలు చేశాకనే హై కమాండ్ చర్చల ప్రక్రియ ప్రారంభించింది.

అయితే ఆ క్రెడిట్ కూడా వారికి దక్కనీయకుండా కెసియార్ మొన్న మీటింగులో చెప్పుకున్నారు– ''నేను కాంగ్రెస్‌వాళ్లను బతిమాలి వాళ్లచేత రాజీనామా చేయించాను. కానీ వాళ్లు స్పీకరుతో కుమ్మక్కయి రాజీనామాలు ఆమోదం కాకుండా చూసుకున్నారు'' అని. ఈయన బతిమాలడం చేతనే రాజీనామాలు చేసేటట్టయితే మళ్లీ వెళ్లి బతిమాల లేకపోయారా? పనిలో పని స్పీకరుని కూడా బతిమాలేస్తే పోయేది. తెలంగాణ గురించి ఏ అడుగు ముందుకు పడినా అది నా ఖాతాలోనే పడాలి అన్నది కెసియార్ తపన. దాని గురించి అవతలివాళ్లను బద్‌నామ్ చేయడానికి ఆయన ఏమాత్రం సంకోచించరు.

'తెలంగాణ కోసం అందరం జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి ఉద్యమించాలి' అంటూ అందరూ స్టేటుమెంటు యిచ్చేవారే. మీటింగుల్లో ఎత్తిన చేతులు కలిపి మనకు బాహుమూలప్రదర్శన చేసేవారే. కానీ నిజంగా వీళ్లంతా కలిసి పని చేస్తున్నారా? ఒకరి నొకరు ఎంత తిట్టుకుంటున్నారు! ''కోమటిరెడ్డి సోదరులు దీక్ష చేస్తే ప్రజలు చెప్పుల దండ వేస్తారు'' అని పాల్వాయి గోవర్ధనరెడ్డి అంటారు. వాళ్లదీ వీళ్లదీ ఒకే ప్రాంతం, ఒకే పార్టీ. అయినా యిలాటి బహిరంగ ప్రకటనలు.

తెలంగాణ కోసం విభేదాలు మరచి ఒకటవుదాం అని స్టేటుమెంటు యిచ్చి పారేయడం ఒక యెత్తు, అమలు చేయడం మరో యెత్తు. 'కాంగ్రెస్‌వాళ్లు తెలంగాణ యిస్తే చాలు, వాళ్లనే ఏలుకోనీ, మాకు పదవులే అక్కర్లేదు' అన్న కెసియార్ 'తెలంగాణ కనుచూపు మేరలో కనబడసాగగానే 'తెలంగాణ తేవడమే కాదు, దాన్ని చక్కగా పాలించవలసిన బాధ్యతా మాపై వుంది' అని మొదలుపెట్టారు. ఇప్పుడు మేము తప్ప వేరెవరూ దాని జోలికి వెళ్లడానికి వీల్లేదు అన్న పద్ధతిలో తరిమేస్తున్నారు. ''రాజీనామాలు మళ్లీ చేయని కాంగ్రెస్, టిడిపి వాళ్లను తరిమికొట్టండి, దంచండి, దంచి పొడి చేయండి, దంచితేనే దయ్యం దిగుతుంది. వాళ్లు అడ్డగాడిదలు.'' అని ప్రజలను రెచ్చగొడుతున్నారు.

రాజీనామాలు చేస్తే తెలంగాణ వస్తుందని యిన్నాళ్లూ ఊదరగొట్టారు. వీళ్లు చేశారు. అయితే ఏమొచ్చింది? ఇప్పటిదాకా తెరాసవారు చాలాసార్లు చేశారు. ఏమొచ్చింది? ఉపయెన్నికలు వచ్చి ఉన్న బలం వూడింది. తెలంగాణ వుద్యమం చప్పబడిపోయింది, చల్లారిపోయింది అన్న పేరు వచ్చింది. ఆఖరి అస్త్రమైన రాజీనామాలు ముందే వాడేశాం, హై కమాండ్ దృష్టిలో పలుచన పడిపోయాం అనే పునరాలోచన కాంగ్రెస్ వాదుల్లో వ్యాపించింది. మళ్లీ రాజీనామాలు చేయమంటే ఎంపీల్లో కనీసం ముగ్గురు డౌటు. ఎమ్మెల్యేల్లో అయితే చాలామంది డౌటు. కాంగ్రెస్ వాళ్లు చేస్తే 28 న మేం చేస్తాం అంటారు టిడిపి వాళ్లు. ఈ సారి యిద్దరూ కలిసే మ్యానిఫెస్టో రాసుకోవచ్చు అంత మమేకం అయిపోయారు.

తెలంగాణ ప్రాంతపు ఎమ్మెల్యేలలో దాదాపు సగం మంది ఎమ్మెల్యేలు, సగం మంది ఎంపీలు వున్న కాంగ్రెస్ పార్టీని యింత అయోమయంలో పడేసిన రాజీనామాల ప్రహసనం చూసైనా వాటి గురించి యిక మౌనం వహిస్తే ఎంతో బాగుండేది. ఆ ఆయుధాన్ని పక్కనపెట్టి మరో ఆయుధాన్ని చేపట్టాల్సింది. కానీ మళ్లీ మళ్లీ అదే పాట – రాజీనామాలు చేయండి, రాజీనామాలు చేయండి అని. కెసియార్‌కు వచ్చిన దంపుళ్ల పాట అదొకటే. తమాషా ఏమిటంటే తన రోటి దగ్గరకు వచ్చేసరికి పాట మారుస్తారు. ఆ మధ్య ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించి, తనూ విజయశాంతీ మాత్రం చేయలేదు. తన నియోజక ప్రజలతో అంత సయోధ్య వుంది మరి! అదే సమస్య కాంగ్రెస్ వాళ్లదీ అని ఆయన అర్థం చేసుకోకపోతే ఎలా? చేసుకున్నారు. అందుకే రాజీనామా చేయమంటున్నారు. వాళ్లు యిన్నాళ్లూ చేసిందేమీ లేదు కాబట్టి ఓడిపోవడం ఖాయం. తన కాండిడేటు గెలవడం ఖాయం.

తన కాండిడేటు అంటే – రాజీనామా చేసిన కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా వుప యెన్నికలలో తెరాసవారు తమ కాండిడేట్లని నిలబెడతారని మీ డౌటా? అని మీరడగవచ్చు. అవును డౌటే. టిడిపి వారితో వారు యిప్పటికే ఆ ఆట ఆడుతున్నారు. తెరాస వారు రాజీనామా చేసినట్టే టిడిపివారూ చేశారు. అందుకు హర్షించవచ్చు, అభినందించవచ్చు. అబ్బే తెరాసవారు ఒక్క మాట పలకలేదు. 'మేం మళ్లీ రాజీనామా చేస్తాం, మీరు మమ్మల్ని సపోర్టు చేస్తారా?' అని కబురంపితే 'అలాటి హామీ ఏమీ యివ్వం' అనేశారు. టిడిపి యిప్పుడు తెలంగాణలో జీవఛవంలా పడి వుంది. దానికి మన చేతులతో మనమే ప్రాణం పోసి, మనకు ప్రత్యర్థిగా నిలబెట్టుకోవాలా? అని తెరాస బాధ. పనిలో పనిగా తొక్కిపారేస్తే పీడ వదిలిపోతుంది అని ఆశ. వాళ్లు బస్సుయాత్ర చేస్తే – బాబు ఫోటో వుందని అడ్డుకోవడం. మాట్లాడితే 'బాబును నోరిప్పమను' అని గోల.

ఈ మధ్య కోమటిరెడ్డి కూడా మొదలెట్టారు – 'బాబు లేఖ యిస్తే వారం రోజుల్లో తెలంగాణ వచ్చేస్తుంది' అని. ఆ ముక్క సోనియా యీయన చెవిలో చెప్పారా? 'మేమంతా రాజీనామాలు యిస్తే సోనియా ఢిల్లీనుండి ఎగురుకుంటూ వచ్చి బంగరు పళ్లెరంలో యిస్తుంది' అనుకుని ఎగురుకుంటూ వీళ్లు యిచ్చారు. ఏమైంది? పిల్చి ఎందుకర్రా యిచ్చారు? అని కూడా అడగలేదు. ఇప్పుడు బాబు లేఖ యిస్తే

వచ్చేస్తుందట. 'పట్టపగలు చెయ్యి పట్టుకుంటే దిక్కు లేదు కానీ, అమావాస్యనాడు కన్నుకొడితే పడిపోతుందట!' అని సామెత. అప్పుడు యిచ్చిన లేఖను మడిచి ఏ జేబులో పెట్టుకున్నారో తెలియదు, యిప్పుడు యింకోటి యిస్తే యింకో జేబులో పెట్టుకుంటారా? ఇప్పుడు ఒకవేళ లేఖ యిచ్చినా "బతిమాలి, బామాలి, కాల్మొక్కి నేనే దగ్గరుండి యిప్పించాను" అని కెసియార్ ఆ క్రెడిటంతా లాగేసుకుంటారు. బాబుకి వున్న క్రెడిబిలిటీయే అంతంత మాత్రం. అంతా కెసియార్ మాటే నమ్ముతారు. ఆ కాడికి యివ్వనేల అని బాబు ఆలోచన.

తెలంగాణలో కాంగ్రెస్‌కి ఎక్కువ సీట్లు రావచ్చు కానీ క్యాడర్, ఓటు బ్యాంక్ బాగా వున్నది టిడిపికే. అందులో సందేహం లేదు. ఈ కెసియార్ బెల్లింపులకు భయపడి చెడగొట్టుకోవడం దేనికి? 2009లో తెరాసతో చేతులు కలపడం తప్పే అని బాబు బహిరంగంగా నెల్లూరులో ఒప్పేసుకున్నారు. మళ్లీ మళ్లీ వాళ్లతో వూరేగడం దేనికి, వాళ్లు చెప్పినట్టు ఆడడం దేనికి అని బాబు ఆలోచన. మేం చెప్పినట్టు ఆడడం కాదు, చడీచప్పుడూ లేకుండా వాళ్లు కనుమరుగై పోవాలి అని కెసియార్ దురాశ. పిల్లి శాపాలకు ఉట్లు తెగుతాయా? కెసియార్ గుర్తించవలసిన కఠోర వాస్తవం ఒకటుంది. తెలంగాణలో 2009లో ఆయన బలం 10% సీట్లు మాత్రమే. డిసెంబరు 9 ప్రకటన తర్వాత తెరాస పలుకుబడి పెరిగింది.

కానీ ఏ మేరకు పెరిగింది? మహా అయితే ఏ 25% సీట్లకో పెరిగి వుండాలి. ఎందుకంటే తెలంగాణ రావాలని కోరుకునేవారందరూ కెసియార్ సమర్థకులు కారు. ఆయన సిద్ధాంతాలను కాని, వ్యవహారశైలిని కాని వారిలో చాలామంది సమర్థించరు. తెలంగాణ కోరుకునేవారిలో ఒక్కొక్కరికి ఒక్కొక్కరకమైన ద ృక్పథం వుంది, కారణం వుంది. కెసియార్ పదేళ్లగా ఉద్యమానికి వూపిరిపోసి నిలిపేరు కాబట్టి గౌరవం వుంది. దాన్ని నిలుపుకోవాలంటే కెసియార్ కాస్త వెనక్కు తగ్గి యితరులకూ చోటివ్వాలి. 2014 ఎన్నికలలో 119 సీట్లలో 110 సీట్లు మనవే అనకూడదు.

స్వాతంత్ర్యోద్యమ చరిత్ర చూస్తే ఎన్నిరకాల, ఎన్ని సిద్ధాంతాల వ్యక్తులు కలిసి పనిచేశారో తెలుస్తుంది. మహాత్మా గాంధీ వంటి మహానుభావుడు కూడా ఒంటి చేత్తో స్వాతంత్ర్యం తేలేకపోయాడు. వివిధ రాజకీయ సిద్ధాంతాలకు కట్టుబడిన పార్టీలు ఏక లక్ష్యంతో పని చేశాయి. ఒకే పార్టీ – కాంగ్రెస్ లోనే అనేక వర్గాలు. సోషలిస్టులు, స్వరాజ్యిస్టులు. మోతీలాల్ నెహ్రూది ఒక బాట, కొడుకు జవాహర్‌ది మరో బాట. వీళ్లందరినీ సమన్వయం చేసుకుంటూ సాగింది స్వాతంత్ర్యోద్యమం. మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్రరాష్ట్రం విడిపోయినప్పుడు కూడా రకరకాల నాయకులు, రకరకాల వూహలతో, వైరుధ్యాలతో కలిసి పని చేశారు. విశాలాంధ్ర ఉద్యమంలో కమ్యూనిస్టులది గణనీయమైన పాత్ర. కానీ విశాలాంధ్ర (ఆంధ్రప్రదేశ్) ఏర్పడిన తర్వాత రాజకీయంగా కాంగ్రెస్‌కే అగ్రస్థానం దక్కింది.

అలాగే తెలంగాణ ఏర్పడ్డాక ఎవరు రాజో, ఎవరు రంగడో ప్రజలు తేలుస్తారు. అప్పటిదాకా కలిసి పని చేయవలసిన అగత్యం ఉద్యమనాయకత్వంపై వుంది. అది గుర్తించకుండా రాష్ట్రం వచ్చేలోపునే ప్రత్యర్థులందరినీ మట్టుపెట్టేద్దామని చూడడం ఉద్యమానికే ద్రోహం. నిజమే, కాంగ్రెస్, టిడిపిలు ప్రస్తుతం బలహీనంగా వున్నాయి. తెరాసకు దమ్ముంటే ఆ శూన్యంలోకి, వారి స్థానాల్లోకి చొచ్చుకుని పోయి వుండాల్సింది. గ్రామస్థాయిలో ఉద్యమాన్ని నడిపి తమ క్యాడర్ పెంచుకుంటూ పోయివుండాల్సింది. కానీ కెసియార్‌కు ఆ ఓపిక లేదు. ఇప్పటిదాకా తెలంగాణ తల్లి విగ్రహాలే పెట్టించలేదు. బస్సుయాత్ర, పల్లె నిద్ర.. యిలా ఎనౌన్సు చేయడం వాటికి కావలసిన సరంజామా తెప్పించడమే తప్ప కాలు కదపలేరు. గడప దాటరు. ఎంతసేపూ మీడియా ముందు చెలరేగిపోవడమే తెలుసు.

తెరాస బలం ఎంత పెరిగింది అన్నది నిర్ధారణగా తెలియదు. ఇప్పటిదాకా వారు రిజైన్ చేసిన స్థానాల్లోనే ఉపయెన్నికలు జరిగాయి. రాజీనామాలు చేశారు కదాన్న సానుభూతితో యిబ్బడిముబ్బడిగా ఓట్లు వేశారు. కానీ ఆ సింపతీ ఎల్లకాలం అలాగే వుంటుందా, వీళ్లు మన నియోజకవర్గానికి ఏం చేశారు అన్న ప్రశ్న వస్తే ఎంతమంది మళ్లీ గెలుస్తారు అన్నది మరో ప్రశ్న. ఇతర స్థానాల్లో ఏ మేరకు బలం వుందో తెలియదు. జంట నగరాల్లో ఎమ్మెల్యేలందరూ అటూ యిటూగానే వున్నారు. బిజెపి కిషన్ రెడ్డి కానీయండి, కాంగ్రెస్ జయసుధ కానీయండి – తెలంగాణ పేరు చెప్పి మళ్లీ గెలుస్తామో లేదోనన్న భయంతోనే వున్నారు. ఉపయెన్నికల సంగతి వేరు, జనరల్ ఎలక్షన్ల దగ్గరకి వచ్చేసరికి అనేక ఫ్యాక్టర్లు ముందుకు వస్తాయి. అవేమిటో విడిగా చెప్పనక్కరలేదు. వాటిల్లో గెలుపెవరిదో చెప్పలేం.

టిడిపివారు ఆకర్షణీయమైన స్లోగన్ చేపట్టారు. 'తెలంగాణ వచ్చేవరకు ఎన్నికలకు వెళ్లవద్దు. ఎన్నికలకు వెళితే మళ్లీ అదే పదవి, అదే అసెంబ్లీ, అదే పరిస్థితి కదా..' అని. ఒకవేళ అభ్యర్థి అంటూ వుండాలంటే అమరవీరుల కుటుంబాల వారిని నిలబెడదాం అని కూడా చేర్చారు. ఇది చాలా న్యాయపరమైన ఆలోచనలా తోస్తుంది. ఎన్నికలు ఎలాగైనా యింకో రెండేళ్లు తోసుకుపోతే అప్పటికి తమపై వ్యతిరేకత తగ్గిపోయి, తాము వెనుకటి బలాన్ని పుంజుకోగలమన్న ఆశ వుండి వుండవచ్చు. తప్పు లేదు. ఈ నినాదం కలిగించే ప్రభావాన్ని కూడా లెక్కలోకి వేసుకోవాల్సిందే. వీడు నిజమైన తెలంగాణవాది కాదు, కొంతకాలం మంత్రిపదవి చేశాడు, కెసియార్‌ను నిందించాడు, అంటూ కొంతమంది మీద ముద్ర కొట్టి తెరాస పోటీ అభ్యర్థులు నిలబడితే..? ఆ భయం కాంగ్రెస్, టిడిపి వారందరికీ వుంది. సోనియా చేత ప్రకటన చేయిస్తేనే కాంగ్రెస్ వారికి ఓటేయండి, బాబు చేత జై ప్రత్యేక తెలంగాణా అనిపిస్తేనే టిడిపికి ఓటేయండి అని తెరాస ఓ నినాదం చేపడితే..? గౌహెూవిందా. అందువలన వారందరూ తెలంగాణపై నిర?యం వెలువడేదాకా

ఎన్నికలకు ససేమిరా నిలబడరు. తాము ఏదో సాధించామని చూపించుకోకపోతే ఎలా?

ఇది గ్రౌండ్ రియాలిటీ. దీన్ని గమనంలో పెట్టుకుని కెసియార్ వ్యవహరించాలి. కాంగ్రెస్, టిడిపి వారి కష్టసుఖాలను, పరిమితులను కూడా పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ పథకం రూపొందించాలి. కానీ ఆయన అదేమీ చేయలేదు. సకల జనుల సమ్మె అంటూ తనే గోదాలోకి దిగేశారు. తెరాసయే దీన్ని నడుపుతోంది అని ఆయనా, ఆయన సహనాయకులు ప్రకటిస్తున్నారు. సందట్లో సడేమియాగా నాగం జనార్దనరెడ్డి తిరుగుతున్నారు. ఆయనకి ఏ పాత్ర మిగులుతుందో తెలియదు. మొత్తం క్రెడిటంతా వాళ్లకు అప్పగించడం దేనికని కొన్ని కొన్ని చోట్ల, కొందరు కొందరు కాంగ్రెస్, టిడిపి నాయకులు తమ పాటికి తాము విడిగా నిరసనలు తెలుపుతున్నారు. అధికారపక్షం కాబట్టి కాంగ్రెస్ తక్కువగా, ప్రతిపక్షం కాబట్టి టిడిపి ఎక్కువగా చేస్తున్నారు. టిడిపివారు అసెంబ్లీకి తాళం వేసినా, అక్కడే భోజనాలు చేసినా, పిల్లిమొగ్గలు వేసినా టి ఉద్యమకారులు పెదవి విరుస్తున్నారు. ఇంత చేసినా ప్రయోజనం కనబడకపోతే ఎలా అని వారు అర్ధమనస్కంగా చేస్తున్నారనేది స్పష్టంగా తెలుస్తోంది. అధిష్టానం కూడా అది గుర్తించే సమ్మె కారణంగా తాము తెలంగాణపై నిర?యం తీసుకున్నాం అనే యింప్రెషన్ కలిగించకూడదనుకుని, అభిషేక్ సింఘ్వీ చేత సమ్మె ప్రభావం ఏమీ లేదు అని చెప్పిస్తున్నారు.

దాన్ని బట్టి ఈ సమ్మె పర్యవసానం ఏమిటో మనకు క్లియర్‌గా తెలుస్తోంది. అది నాకు బాధగా వుంది. ఎందుకంటే యిలాటి సమ్మె ఎప్పుడో ఒకప్పుడు రాక తప్పదని నాకు ముందే తెలుసు. ఆజాద్ చర్చల అనంతరం ఒక రాజీ ఫార్ములాను ప్రకటించగానే అది నచ్చక, దాన్ని ఆమోదించకుండా యిలాటి సమ్మె వస్తుందనుకున్నాను. ఆ ఫార్ములా రాకుండానే ముందే ఒక సమ్మె, తర్వాత మరొకటి అంటే 'టూ'మచ్ అయిపోతుంది.

ఆజాద్ నిర?యం తర్వాత సమ్మె వచ్చి తీరుతుందని ఖచ్చితంగా ఎలా చెప్పగలవు అంటే కామన్‌సెన్స్. ఏ ఆందోళనలోనూ అడిగినదంతా యివ్వరు. తెలంగాణ యిస్తాం కానీ, యిప్పుడు కాదనో, హైదరాబాదు లేదనో, హైదరాబాదు యూటీ అనో, కామన్ కాపిటల్ అనో, నీటిజలాల వివాదం తేలాకనో.. యిలా ఏదో ఒక కొక్కెం (రైడర్) వేసే మరీ చెప్తారు. అది ఒప్పుకోం అని మళ్లీ ఆందోళన జరగకమానదు. ఒకవేళ దారి తప్పి అడిగినదంతా యిచ్చినా, అది యిప్పుడే యివ్వాలి అనే కారణంతోనైనా ఆందోళన చేస్తారు. అందువలన యిది ఆఖరి పోరు అంటున్నారు కానీ కానే కాదు. అదీ యిదీ కలిపి యిప్పుడే ఒకేసారి అయిపోతే బాగుండును అని నా గోడు.

వినేవాళ్లెవరు? దేవుడైనా వింటాడేమోనని గుడి కెళితే అదీ మూసేస్తున్నారు. అర్చకులకు ప్రత్యేక తెలంగాణ కావాలట. బార్లు తెరిచి వుంచుతున్నారు కానీ గుళ్లు మూసేస్తున్నారన్నారంటే ఎంత ఫన్నీగా వుంది? బొత్తిగా భయమూ, భక్తీ లేకుండా పోయింది. కేంద్ర నాయకులకు బుద్ధీ, వివేకమూ, సమయజ్ఞానమూ తెప్పించు అని విన్నపం వినిపించుకోవాలంటే కావాలంటే అంబేద్కర్ విగ్రహం ముందు పెట్టాలి తప్ప దేవుడి గుళ్లో చెప్పుకోవడానికి లేదు.

ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా లాభం లేదు. వాళ్లు ఉద్యోగులపై చర్యలు చేపట్టలేదు. ఎస్మా ఎస్మా అనడమే అమలు చేసి చూపరు. నో వర్క్ నో పే కూడా హైకోర్టు బూచి చూపించి అనడమే తప్ప, మా పాలసీ యిది అని గట్టిగా అనే చేవ లేదు. ప్రభుత్వోద్యోగం వెంట్రుకతో సమానం అని యూనియన్ లీడర్లు అంటున్నా, అలాగా, వెంట్రుకేగా, పీకేసి పెడతాం అని ప్రభుత్వం అనదు, అనలేదు, అనకూడదంటారు సివిల్ రైట్స్ వారు. వీళ్ల సంగతి సరే, సమ్మెలో పాల్గొనకుండా పనిలోకి వచ్చేవాళ్లకు రక్షణ కల్పించడం లేదు. పోలీసులను పెడితే అదో చిక్కు. సమ్మె చేసేవారిని అవమానించినట్టు అయిపోతుంది. పొన్నాల లక్ష్మయ్య గారి యింటిమీద దాడి చేసి ఫర్నిచర్ పగలకొట్టే హక్కు ఉద్యమకారులకు వుంటుంది కానీ వారిని అదుపు చేసే హక్కు మాత్రం ప్రభుత్వోద్యోగికి వుండకూడదట. అక్కడి డియస్పీని బదిలీ చేయాలట. చేసినా చేయవచ్చు, ఈ చేతకాని ప్రభుత్వం !

కాంట్రాక్టు ఉద్యోగులను పీకేస్తామని భయపెడుతున్నారు. వాళ్లకూ తెలుసు, వీళ్లకూ తెలుసు, వాళ్లు లేకపోతే పని నడవదని. ఉద్యోగస్తులు రిటైరై వెళ్లిపోతున్నా ప్రభుత్వం ఖాళీలు అలాగే వుంచుతోంది. 3 లక్షల వేకెన్సీలు వున్నాయట. కిరణ్ నిజంగా తలచుకుంటే ఒక్క రోజులో లక్ష ఉద్యోగాలు యిచ్చినా యివ్వగలరు (జీతం విషయమే డౌటు). ఆ ఖాళీలలో ఔట్‌సోర్సింగ్ వాళ్ల చేత పనులు చేయిస్తున్నారు. ఈ రోజు ప్రభుత్వాఫీసుల్లో చురుకుగా అటూ యిటూ తిరుగుతూ పనిచేసేవాడు ఎవడైనా వున్నాడా అంటే వాడు కాంట్రాక్టు ఉద్యోగి అయి వుంటాడు. అందువలన సమ్మె తర్వాత వాళ్ల వుద్యోగాలు వాళ్లకు ఎలాగూ వస్తాయి.

ప్రత్యేక ఉద్యమాలు మన రాష్ట్రంలో ఎప్పుడూ సగభాగంలోనే వస్తాయి. 1969, 1972, మళ్లీ యిప్పుడు – ప్రతీసారీ సగం భాగం సమ్మెల్లో, సగభాగం మామూలుగా వుంటుంది. అందువలన ప్రభుత్వం ఏదోలా మేనేజ్ చేసేస్తోంది. 1969, 1972లలో కూడా నెలల తరబడి ప్రభుత్వోద్యోగుల సమ్మె, విద్యార్థుల సమ్మె నడిచింది. ప్రజలు అవస్థలు పడ్డారు కానీ ఉద్యమాలు విజయవంతం కాలేదు. కెరటం లాగ తారస్థాయికి వెళ్లి, ఒక్కసారి దబ్బున పడిపోయాయి – వెనకాల ఏ మతలబులు జరిగాయో ఏమో కానీ. సమ్మె కూడా ఎక్కువ కాలం సాగితే ఫిషర్స్ వస్తాయి. హన్మకొండలో ఆర్టీసీ వాళ్ల ఉద్యోగాలు యిస్తామని ఇంటర్వ్యూలకు పిలిస్తే నిరుద్యోగులు చాలామంది వచ్చారు. ఉద్యమకారులు అడ్డుకున్నారు. ఓ మహిళా అభ్యర్థి వారికి చెప్పు చూపించింది. నిజమే ఎవరి కడుపు వాళ్లకు నిండాలి కదా. పోటీ పరీక్షలు పంతం పట్టి వాయిదా వేయిస్తున్నారు. వయసు మీరి, అవకాశాలు పోగొట్టుకునే వారెందరో !

కాంగ్రెస్‌లో తెరాస విలీనం అయితే తప్ప సమస్య పరిష్కారం కాదని కాంగ్రెస్ నాయకులు బాహాటంగా చెప్తున్నారు. కానీ

కెసియార్ దానికి ససేమిరా ఒడంబడటం లేదు. ఈనగాచి నక్కలపాలు చేసినట్టే అని ఆయన అభిప్రాయం. విలీనం తర్వాత 'చూద్దాంలే, ఆగు' అంటే.. చేయగలిగేది ఏమీ లేదు. మెగాస్టార్ ఏం ఉద్ధరించారో చూశాంగా. సామాజిక న్యాయం చేద్దామా, సోనియమ్మా అని వెళ్లి అడిగితే 'ఇదిగో అసాంలో వందమంది తెలుగువాళ్లు వున్నారట, వెళ్లి మునిసిపాలిటీ ఎన్నికల్లో ప్రచారం చేసి రా పో' అని పంపించేయగలదు.

విలీనం చేయకుండా స్వతంత్ర ప్రతిపత్తి కాపాడుకోవాలంటే కెసియార్ సహనంతో, చాకచక్యంతో ఉద్యమాన్ని నడుపుకు రావాలి. తను తప్పు వేరెవరూ యిటు తొంగి చూడకూడదంటే తప్పు. అసలు ఆయన వ్యవహారం చూస్తే తెలంగాణ కోరుకుంటున్నారా లేదా అన్న అనుమానం వచ్చినా తప్పు లేదు. ఆయన అందర్నీ ఊదరగొట్టి ఒక్కో అస్త్రాన్నీ నిర్వీర్యం చేసేస్తున్నాడు. రాజీనామాలు బ్రహ్మాస్త్రాలన్నాడు. వేసి చూస్తే కాకి కన్నయినా లొట్ట పోలేదు. (రాములవారు గడ్డిపరకతో కాకి కన్ను పోగొట్టాడు. బాణం వేసేవాడిలో వుంటుంది సత్తా) ఇప్పుడు ఎవర్నీ సంప్రదించకుండా ఏకపక్షంగా సమ్మె మొదలు పెట్టి యిదిగో యీ గతి పట్టించారు. దీని పర్యవసానం ఆయనకీ తెలిసిపోయింది. ఇప్పుడు అక్టోబరు 2 నుండి నిరాహారదీక్ష చేస్తారట. 'మళ్లీ దీక్ష చేస్తే మా నాన్న ప్రాణానికి ముప్పు (ఏం నిమ్స్‌లో చేర్చరా? అక్కడైతే ఏ ముప్పూ రాకుండా చూసుకోవడానికి వైద్యులున్నారు) అయినా చేస్తానంటే ఒక తెలంగాణ బిడ్డగా కాదనలేకపోతున్నాను' అని తెలంగాణ కోసం పితృప్రాణానికి త్యాగం చేయడానికి కవిత రెడీ అయ్యారు. కానీ ఆవిడ అన్నగారికి అంత సాహసం లేదు. నాన్న దీక్ష చేస్తే సీమాంధ్రులు కుట్ర చేసి చంపేస్తారు అని భయపడుతున్నారు. 2009లో చంపారు కనుకనా, యిప్పుడు చంపడానికి? ఏమొచ్చినా 'సీమాంధ్రుల'ను ఆడిపోసుకోవడమే పనై పోయింది. ఆయన అనారోగ్య ఉపద్రవానికి కూడా ఆంధ్రప్రాంతంలో తయారైన ఉత్పత్తులే కారణమని రేపు అనవచ్చు.

దీక్షాస్త్రం కూడా ఎగ్జాస్ట్ అయిపోతే యింకెలా అన్నది ఆలోచించాలి. ఎందుకంటే కితం సారి దీక్ష చేసినపుడు హోం మంత్రి చిదంబరంగారు మంచి జోరుమీద వున్నారు. ఇప్పుడు 2 జి స్పెక్ట్రమ్‌లో పడి గిలగిల లాడుతున్నారు. ప్రణబ్‌పై ఫిర్యాదు చేసి మన్‌మోహన్‌కి చెప్పాడట – రాజీనామా చేసేస్తానని. కేంద్రంలో ప్రత్యేక తెలంగాణ పట్ల కాస్తో కూస్తో సానుభూతి వున్నది చిదంబరానికే. దానికి కారణాలు ఏమైనా కావచ్చు. 2009లో ఆయన వహించిన పాత్ర గురించి రోశయ్యగారు గవర్నరుగా వెళుతూ వెళుతూ టీవీ ఇంటర్వ్యూలలో కుండ బద్దలుకొట్టి మరీ వెళ్లారు.

డిసెంబరు 9 ప్రకటన నేను చూడలేదు, నాకు చూపించినది వేరు, వాళ్లు విడుదల చేసినది వేరు అని రోశయ్యగారు చెప్తూ వచ్చారు యిన్నాళ్లూ. ఇప్పుడు అసలు విషయం చెప్పేశారు – ఆ ప్రకటన చిదంబరం రోశయ్యకి చూపించారు. అసెంబ్లీలో తీర్మానం పాస్ చేయించడం నా తరం కాదు, యిది విడుదల చేయవద్దు అని రోశయ్య చెప్పారు. 'మరి యిది విడుదల చేయకపోతే డిసెంబరు 10 చలో అసెంబ్లీ అత్యంత హింసాత్మకంగా మారి వేలాది ప్రాణాలు పోతాయని మా యింటిలిజెన్సు రిపోర్టులు చెపుతున్నాయే' అన్నారు చిదంబరం. 'అవన్నీ మర్చిపోండి. వాటి సంగతి ఎలా వున్నా, శాంతి భద్రతలు కాపాడగలనన్న నాకు ధైర్యం వుంది. ఒకవేళ నేను విఫలమైతే సాయంత్రం 5 గంటలకల్లా నా రాజీనామా మీ ఆఫీసుకి ఫాక్స్ చేస్తాను' అన్నారు రోశయ్య. 'మధ్యలో మీ రాజీనామా ఎవరడిగారు? దాని గురించి ఎత్తకండి' అన్నారు ఓ పెద్ద తలకాయ. (బహుశా సోనియా). 'సరే అయితే, మీరు హైదరాబాదు వెళ్లండి. మీతో ఫోన్లో మాట్లాడతాను' అని చిదంబరం పంపేశారు. రోశయ్య అలా విమానం ఎక్కినదాకా వుండి ప్రకటన విడుదల చేసేశారు.

ఒరిజినల్ ప్లాను ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుండి రోశయ్య కెసియార్ వద్దకు వెళ్లి 'ఢిల్లీలో అన్నీ చెప్పి వచ్చాను, మీరు దీక్ష విరమించండి' అని చెప్పాలి. కానీ ఎయిర్‌పోర్టులోనే చీఫ్ సెక్రటరీ చెప్పేశారు – అయ్యా ప్రకటన వచ్చేసింది, అప్పుడే దీక్ష విరమణ కూడా అయిపోయింది. సంబరాలు జరుపుకుంటున్నారు అని. ఆ ప్రకటన రోశయ్య చేత పట్టుకుని వచ్చి కెసియార్ చేతిలో పెట్టి మరో చేతిలో నిమ్మరసం గ్లాసు పెట్టి వుంటే ఆ ప్రకటన చేయించిన ఘనత రోశయ్యకు, తద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కి వుండేది. అయితే చిదంబరం మహాశయుడి అతి తెలివితేటల వలన కాంగ్రెస్‌కు ఆ పాటి గౌరవం కూడా దక్కకుండా పోయింది. ఇది పూర్తి కెసియార్ విజయంగానే ప్రచారంలోకి వచ్చేసింది. ఇది గ్రహించిన రోశయ్య నిమ్స్ కెందుకులే, యింటికే పోదాం అన్నారు. ఆయన ఇంట్లోకి అడుగు పెడుతూంటే కెసియార్ ఫోన్ 'ఇటు వస్తారా' అని. 'ఎందుకులే, దీక్ష విరమణ అయిపోయిందిగా, రేపు చూద్దాం' అని రోశయ్య యింటి లోపలికి వెళ్లిపోయారు. ఇక ఆ ప్రకటనకు, తనకూ సంబంధం లేదన్నట్టుగానే వ్యవహరించారు. అసెంబ్లీ తీర్మానం చేయించలేనని ముందే చెప్పేశారు కాబట్టి సోనియా కూడా ఆయన్ని నిందించలేకపోయారు, పదవి నుండి తప్పించలేకపోయారు.

ఈనాటి చిదంబరం ఆనాటి చిదంబరం కాదు. ఈ మధ్యలోనే ఆయనకు చాలా బొప్పులు కట్టాయి. 'నేనుంటే అలా జరిగేది కాదు' అనే ప్రణబ్ ఎకసెక్కాలు భరించలేకుండా వున్నాడు. 'డిసెంబరు 9 తర్వాతే దీనిపై చాలా విషయాలు తెలిసివచ్చాయి' అని చిదంబరం బాహాటంగా చెప్పేశారు కూడా. అప్పట్లో ఆయనకు కుడిభుజంలా హోం మినిస్ట్రీలో పిళ్లయ్ అని వుండేవారు. రిటైరై పోయిన తర్వాత కూడా తెలంగాణ యిచ్చి తీరాలి అని బహిరంగ ప్రకటన చేసేటంత తెలంగాణవాది. ఇప్పుడు రిటైరై పోయాడు. వీటన్నిటికి తోడు మంత్రిగారికి యిప్పుడు 2 జి స్పెక్ట్రమ్ ఒకటి చుట్టుకుంది. అందుకని కెసియార్ దీక్ష చేసేముందు కాస్త ఆలోచిస్తే మంచిది. ప్రకటన రాకపోగా అలా వదిలేస్తే మరీ ప్రమాదం. పైగా వైద్యులు సమ్మెలో వున్నారు.

ఇప్పుడు కెసియార్ ముందున్న మార్గాలు ఏమిటి? నాకైతే ఏమీ కనబడటం లేదు. సకల జనుల సమ్మె విరమిస్తే పరువు పోతుంది.

కాంగ్రెస్, టిడిపివారు చంకలు గుద్దుకుంటారు, మమ్మల్ని అడక్కుండా చేసినందుకు మాబాగా అయిందని. అందుకే పులిస్వారీ అంటున్నారు. ఇప్పుడు మానేస్తే మన బతుకు కుక్కబతుకే, ఆంధ్రోళ్లు మనల్ని హీనంగా చూస్తారు అంటూ రెచ్చగొడుతున్నారు. 1969 ఉద్యమం ఫెయిలయితే అలా చూశారా? 1972 ఆంధ్ర ఉద్యమం ఫెయిలయితే తెలంగాణవాళ్లు ఆంధ్రోళ్లని అలా చూశారా? సమ్మె వలన తెలంగాణ నిర?యం వస్తుందో రాదో అక్టోబరు మొదటివారానికి తెలుస్తుంది. రాకపోతే సమ్మె విరమించాలి. దానికి కెసియార్ తన మిత్రుడు కేకే మీద ఆధారపడాలి. ఆయనే ఎవర్నో బతిమాలి ఏదో ఒక రకమైన ప్రకటన పుట్టించుకుని రావాలి. చూదాం ఏమవుతుందో !

ఇక ప్రభుత్వం తరఫునుండి చూడబోతే అసలు యీ సమ్మెకు కారణం వాళ్ల నెత్తికే చుట్టాలి. ఏదో ఒక నిర?యం ఏడిస్తే యివన్నీ కలిసి వచ్చేవి కదా. సమ్మె ఎలాగూ ఆరంభమైంది కాబట్టి పనిలో పనిగా నిర?యం కూడా యిప్పుడే చెప్పేస్తే కష్టాలన్నీ ఒకేసారి అనుభవించేయవచ్చు. ప్రభుత్వం చేతకానితనం వలన ప్రజలు కష్టపడుతున్నారు. సమ్మెచేసేవారు మరీ మితిమీరితే గవర్నరు రూల్ కూడా వచ్చేయవచ్చు. 1972లో అలాగే వచ్చింది. కిరణ్‌గారికి అది వచ్చేస్తుందన్న అనుమానం వుందేమో. అందుకనే కిలో రూపాయి బియ్యం పథకం ప్రవేశపెట్టారు. ఓ పక్క వైయస్ పథకాల వల్లనే రాష్ట్రం అడుక్కు తింటోందంటారు. ఇంకో పక్క అంతకుమించిన పథకాలు పెడతారు. రామారావు 1983లో కిలో బియ్యం రెండు రూపాయలంటేనే ఆర్థికవేత్తలు విమర్శించారు. మార్కెట్ రేటులో సగానికి యిస్తున్నారని. మరి యిప్పుడు..? మార్కెట్ రేటులో 30 వ వంతుకి యివ్వడమా? అవసరమా? అదీ బోగస్ రేషన్ కార్డులు ఏరివేయడం పూర్తి కాకుండా..!? క్రాప్ హాలీడే కారణంగా మార్కెట్లో బియ్యం రేటు యింకా పెరగబోతోంది. అయినా రూపాయికి యిస్తారట.

నా అనుమానం కిరణ్ ధైర్యం ఏమిటంటే – స్కీము పెట్టిన పేరు ఆయనకు వస్తుంది కానీ అమలు చేసే బాధ్యత వుండదని. అదంతా గవర్నరు నరసింహన్, ఆయన సలహాదారుల బాధ్యత కాబోతోందేమో ! **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**

**సెటప్టెంబరు 37** **ఎమ్బీయస్ ః ఇంకో నివేదిక...**

ఆజాద్‌గారు నివేదిక సోనియమ్మగారి చేతిలో పెట్టేశారట. కాస్సేపటిలో కోర్ కమిటీ మీటింగు జరగబోతోంది. దాన్లోంచి ఏమైనా ఊడిపడుతుందేమోనని మన టీవీ ఛానెల్స్ ఊదరగొట్టేస్తున్నాయి. నిజంగా ఏమైనా పడుతుందా !? ఈ సమస్య మనందరి కంటె ఎక్కువగా కోమటిరెడ్డి వెంకట రెడ్డి గారిది. ఇవాళ నిర?యం వెలువడకపోతే ఎమ్మెల్యే పదవికి, మంత్రి పదవికి రాజీనామా చేసేస్తానని కూర్చున్నారు. అందువలన అందువలన ఆయన తన గదిలో టీవీ ముందు కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ వుండవచ్చు. ఆయన కోసమైనా మనం యీ విషయంపై గట్టిగా ఆలోచించాలి.

అసలు ఆజాద్‌గారు ఏమిచ్చారో తెలిస్తే కదా, మనం నిర?యంపై ఏదైనా ఆశ పెట్టుకోవడానికి..! సకల జనుల సమ్మె తీవ్రంగా జరుగుతోంది కాబట్టి మనమంతా యిక్కడ అవస్థలు పడతున్నాం కాబట్టీ ఆదరాబాదరాగా ఏదో ఒకటి చేసి మన కష్టాలు గట్టెక్కించే ఉద్దేశం ఢిల్లీవాళ్లకు ఏమీ లేదు. చిదంబరంగారు కాస్సేపటి కిందే తేల్చారు – ఇది యిప్పట్లో తేలే అల్రీబుర్రీ యవ్వారం కాదని. ఆజాద్ యిచ్చే నివేదిక కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సంబంధించినది. ఆ తర్వాత కాంగ్రెస్‌తో సహా నాలుగు పార్టీలు దానిపై మాట్లాడాలి. దానిపై యుపిఏ భాగస్వామ్యపక్షాలు చర్చించి ఓకే చేయాలి. లగడపాటి హై కమాండ్ భాష మాట్లాడతారని ఎప్పుడో చెప్పాను. ఆజాద్ నివేదికపై నిర?యం కేవలం కాంగ్రెసు నిర?యం మాత్రమే అని ఆయన మొన్నే చెప్పాడు. హై కమాండ్ వాళ్లు అమలు చేసి చూపిస్తున్నారు.

ఇంతకీ ఆజాద్ ఏం నివేదిక యిచ్చి వుంటారు? నిర?యం తీసుకోవడానికి కృష? కమిటీ నివేదిక చాలదా? అసలు అంత తీరుగా, అంత లోతుగా తెలంగాణ గురించి ఏ ఒక్కరైనా అధ్యయనం చేశారా? అంతలా ఎవరైనా తిరిగారా? అంతమందిని ఎవరైనా కలిశారా? వాళ్లు చక్కగా అన్నీ అధ్యయనం చేసి వాస్తవాలను బయటపెట్టి, భ్రమలు దూరం చేసి, అసత్యాలు ఎండగట్టి రిపోర్టు ముందు పెట్టారు. ఆరు ఆప్షన్లున్నాయి అని చెపుతూ ప్రతీ దానిలోని కష్టనష్టాలు చెప్పారు. చివరకు ఇది బెస్ట్ ఆఫ్ ద లాట్, యిది సెకండ్ బెస్ట్ అని ర్యాంకింగ్ కూడా యిచ్చారు. ఒక్కటే చెప్పి వుండాల్సింది అని యిప్పుడు అనేవాళ్లు ఒక్కటే యిచ్చి వుంటే అలా చెప్పి వుండాల్సింది అనేవారు. అందుకని అది కూడా చెప్పి, దానిలో యీ చిక్కులున్నాయి అని ఆ సందేహాల నివృత్తికూడా అతి సైంటిఫిక్‌గా చేశారు. రిపోర్టులో రెండు, మూడు ఫాక్చువల్ ఎర్రర్స్ వున్నాయి. ఎనిమిదో చాప్టర్‌లో అధికప్రసంగాలున్నాయి. అంతమాత్రం చేత మొత్తం రిపోర్టు చెత్త అయిపోదు. దాన్ని మించి ఎవరూ ఏదీ తయారుచేయలేరు.

ఆజాద్ చేయవలసినది ఏమిటి? ఆ రిపోర్టు దగ్గరపెట్టుకుని ఈ ఆప్షన్ ఎందుకు పనికిరాదు? ఆ ఆప్షన్ ఎందుకు నచ్చలేదు? అని అడిగి వుండాల్సింది. విడివిడిగా ఒకటి రెండు సార్లు మాట్లాడినా, యిరు పక్షాలనూ కూర్చోబెట్టి రెండు మూడు విడతలైనా మాట్లాడి విభేదాలను లోకలైజ్ చేస్తూ, గ్యాప్ తగ్గిస్తూ వస్తే పరిష్కారం సులభమయ్యేది. కానీ అది జరిగిందా? లేదు. ఎవరి పాటికి వాళ్లు వాళ్ల దంపుళ్లపాట వినిపించారు. కృష? కమిటీ ముందు అదే పాట. ప్రణబ్ ముందు అదే పాట. చిదంబరం ముందు అదే పాట. అహ్మద్ పటేల్ ముందు అదే పాట. అవే స్టాటిస్టిక్స్, అవే పవర్ పాయింట్ ప్రెజంటేషన్స్. వాళ్లు వెళ్లగానే వీళ్లు వెళ్లి అవన్నీ తప్పుల తడకలంటూ

మరో స్టాటిస్టిక్స్. కృష? కమిటీని రిఫరెన్సుగా ఎవరూ తీసుకోలేదు. ప్రాంతానికి ఐదుగురు వచ్చి మాట్లాడితే చాలంటే, తొంబలు తొంబలుగా ఆజాద్ గదిలోకి వెళ్లిపోవడం. ఎవరికీ పక్కవాడిమీద నమ్మకం లేదు. చివరికి వారినీ వీరినీ ఎదురుబొదురుగా కూర్చోబెట్టి మాట్లాడుకోవడం జరగనే లేదు. మేం వాళ్లతో కూర్చోం అని టి కాంగ్రెస్‌వాళ్లు మొండికేశారు, అక్కడికి అవతలివాళ్లేదో అస్పృశ్యులైనట్లు.

నాకు తమాషాగా తోచేది యిదే – వీళ్లూ వీళ్లు కలిసి వ్యాపారాలు చేస్తారు, వియ్యాలందుతారు. వాళ్ల పిల్లల్ని వీళ్ల ప్రాంతాల్లో చదివిస్తారు. వీళ్ల పిల్లల్ని వాళ్ల ప్రాంతాల్లో చదివిస్తారు. కలిసి పరిష్కారం చేయండర్రా మీ దుంపతెగ, యీ రావణకాష్టం తేలితే తప్ప రాష్ట్రం బాగుపడే సూచన కనబడటం లేదు అంటే కలిసి కూర్చోరట. ఇద్దరూ కలిసి మాట్లాడుకోకుండా ఎవరి పాటికి వాళ్లు ప్రకటనలు యిచ్చేస్తే ఎలా? అదే ఆజాద్ కూడా చెప్పాడు. 'నేను 1,2,3 ఆప్షన్లు అడిగాను. తెలంగాణ వాళ్లు మూడు ఆప్షన్లూ తెలంగాణయే అన్నారు. ఆంధ్రప్రాంతం వాళ్లు మూడూ సమైక్యాంధ్రయే అన్నారు. ఇక నేనేం చేస్తాను? ఎవడూ మెట్టు దిగకపోతే..?" అన్నాడు. బహుశా నివేదికలో అదే యిచ్చి చేతులు దులుపుకుంటాడేమో.

ఈ నాయకులందరికీ వ్యాపారాలుంటాయి. వాళ్లు వాళ్ల యూనియన్లతో యిలాగే మొండిగా వ్యవహరిస్తారా? వీళ్లూ కొన్ని యూనియన్లకు గౌరవ అధ్యక్ష పదవులు నిర్వహిస్తారు. మేనేజ్‌మెంట్లతో యిలాగే మొండిగా వ్యవహరిస్తారా? హైదరాబాదుతో కూడిన తెలంగాణ మొదటి ఆప్షన్, హైదరాబాదు పదేళ్లపాటు కామన్ కాపిటల్‌గా ప్రత్యేక తెలంగాణ రెండో ఆప్షన్.. అని కాస్తయినా వెసులుబాటు చూపించవద్దా? అలాగే సమైక్యవాదులు కూడా సమైక్యం మొదటి ఆప్షన్. హైదరాబాదు ఎప్పటికీ కామన్ కాపిటల్‌గా విభజన రెండో ఆప్షన్ అని చెప్పవద్దా?

ఇలా యిన్నేళ్లు ఆడుతూనే వున్నారు. ఒక్క మెట్టు దిగినా తాము ఆ వాదానికి కట్టుబడి లేమని జనాలు అనుకుంటారేమోనన్న భయం వారిది. నాయకుడన్నాక జనాలకు నచ్చచెప్పగలగాలి – మారిన పరిస్థితుల్లో మనం కూడా కాస్త స్ట్రాటజీ మార్చుకోవాలి. లేకపోతే మొదటికే మోసం అని వాళ్లను కాస్త అడలగొట్టాలి. ఆ విద్య వీళ్లకు రాక కాదు. పార్టీ మారినపుడు వీళ్లు దబాయించడం లేదా? ప్రజాభీష్టం మేరకే అలా చేశానని ! తాము ఆజాద్‌కు యిచ్చిన యిన్‌పుట్స్ ఏమున్నాయని ఆయన నుండి ఏదైనా కొత్తది ఆశించడానికి..? గార్బేజ్ యిన్, గార్బేజ్ ఔట్ అన్నారు. విత్తు కొద్దీ ఫలం. నువ్వు ఆజాద్‌కు ఏ విధమైన ఫ్రీ హ్యాండ్ యివ్వలేదు. ఆయనను మాట్లాడనివ్వలేదు. అంతా నువ్వే చెప్పి అదే జరగాలి లేకపోతే వూరుకోం అని చెప్పి వచ్చేసావు. ఇక ఆయన పరిష్కారం ఏం సూచిస్తాడు? ఓ పరిష్కారం అంటే సూచిస్తే దానివలన లాభనష్టాలు, దానికి ఎదుటి వాళ్ల స్పందన రికార్డు చేసి కోర్ కమిటీకి యిచ్చేవాడు. ఆయనకు ఆ ఛాన్సు లేదు.

అందువలన పరిష్కారం విషయంలో ఆజాద్ చేయడానికి ఏమీ లేదు. అయితే మరి 45 పేజీల నివేదిక ఏం యిచ్చి వుంటాడు? అంతా పార్టీ పరంగానే వుండి వుంటుంది. రాష్ట్రం విభజిస్తే యీ ప్రాంతాల్లో మనకు యిన్ని సీట్లు రావచ్చు, సమైక్యంగా వుంచితే యిదీ పరిస్థితి... అని అంచనాలు వేసి యిచ్చి వుండవచ్చు. తెలంగాణలో విభజనవాదానికి ఎంత బలం వుందో, సమైక్యవాదానికి ఎంత బలం వుందో అది ఎవరికీ తెలియని బ్రహ్మపదార్థం. ఎవరి అంచనాలు వాళ్లవి. ఎవరి భయాలు వారివి. కేవలం తెలంగాణ యిస్యూ మీదనే 2014 ఓటింగ్ జరుగుతుందా అన్నది కూడా అప్పటికి గాని చెప్పలేం. అప్పుడు ఏ యిస్యూలు తలెత్తుతాయో ! వాటి గురించి మూడేళ్ల ముందే ఎవరూ దివ్యదృష్టితో చూడలేం. ధైర్యం చేసి స్థానిక ఎన్నికలు జరిపితే వాటి ఫలితాల బట్టి కాస్త అంచనా వస్తుంది. అదే పరిస్థితి మూడేళ్లపాటూ కొనసాగుతుందని కూడా ఎవరూ చెప్పలేరు.

ఏది ఏమైనా తెరాస కాంగ్రెస్‌లో విలీనం అయితే విభజన చేసినా కాంగ్రెస్ నష్టపోదు అన్న అభిప్రాయానికి ఆజాద్ వచ్చి వుండవచ్చు. అయితే కెసియార్ దానికి అంగీకరిస్తారా? అంగీకరిస్తే ఏ షరతులు పెడతారు? అన్నది చర్చించి వుండవచ్చు. ఆ విషయం కాంగ్రెస్ కోర్ కమిటీలో చర్చించి తమలో తాము ఓ అభిప్రాయానికి వస్తారు తప్ప మనందరితోనూ అవన్నీ పంచుకోరు. అందునా సమస్యలను నాన్చడంలో దిట్ట అయిన కాంగ్రెస్ ఏదీ తేల్చదు. సకల జనుల సమ్మె జరుగుతున్నా ఏమీ పట్టనట్టు వుంది అని అనిపించుకోవడం యిష్టం లేక ఓ యిద్దరు ముగ్గురు నాయకులు వచ్చి సమ్మె చేసే ఎన్‌జీవో నాయకులతో మాట్లాడి వెళ్లవచ్చు. అందువలన కోర్ కమిటీ ఇంకా నడుస్తోంది.. కాస్సేపటిలో ముగుస్తోంది.. వంటి స్క్రోలింగ్స్ చూసి ఉలిక్కిపడకండి, వేచి చూడకండి. ఎందుకైనా మంచిది, కోమటిరెడ్డిగారు సెక్రటరీ యింటికి వెళ్లిపోయేలోగా రాజీనామా లేఖ డిక్టేట్ చేసి పెట్టేసుకుంటే బెటర్. – **ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**

**సెప్టెంబరు 38** **ఎమ్బీయస్ : ఆఖరి బంద్..?**

తెలంగాణ ఇస్యూలో హైదరాబాద్ కీలకస్థానం వహించబోతోంది కాబట్టి యికపై ఉద్యమం హైదరాబాదు చుట్టూనే పరిభ్రమించాలి అని తెరాస నిర?యించింది. తెరాస ఆ నిర?యం తీసుకుంది కాబట్టి జాక్ కూడా తీసుకుంది. (ఇట్ యీజ్ నాట్ ద అదర్ వే రౌండ్). చాలా మంచి నిర?యం. ఎందుకంటే బంద్, రాస్తా రోకో, రైల్ రోకో, అలాయ్ బలాయ్, వంటా వార్పూ, లక్షలాది మందితో బహిరంగసభ అనగానే ఎంతసేపూ వరంగల్, కరీంనగర్‌లో చేసి ప్రయోజనం ఏమిటి? ఉద్యమానికి ఆ జిల్లాలు పట్టుగొమ్మలని

తెలుసు. ఎక్కడ వుద్యమం చేసినా అక్కడి వాళ్లనే తీసుకుని వస్తున్నారని తెలుసు. పదేళ్ల వుద్యమం తర్వాత కూడా అవే చోట్ల చేస్తూ వుంటే వాటికే పరిమితం అనుకుంటారు.

అందుకని హైదరాబాదుకి విస్తరించాలి. విద్యార్థి వుద్యమాలు కూడా వరంగల్‌లో కాకతీయ యూనివర్శిటీలో జరుగుతాయి. హైదరాబాదులో ఉస్మానియాలో జరుగుతాయి – అదేమిటో హైదరాబాదులో విద్యార్థులందరూ ఉస్మానియాలోనే గూడుకట్టుకుని వున్నట్టు..! దానితో బాటు నిజాం కాలేజీ హాస్టల్ మరో అడ్డా..! పోలీసులు యీ రెండూ చూసుకుంటే చాలు విద్యార్థులందర్నీ కట్టడి చేసినట్టే! హైదరాబాదు తెలంగాణలో అంతరాగేం అంటూనే ప్రత్యేక వుద్యమం ఇక్కడ జోరుగా చేయడానికి ఓ జంకు వుంది. కరీంనగర్, వరంగల్ ఎమ్మెల్యేలంత హుషారుగా యిక్కడి ఎమ్మెల్యేలు వుండరు. అక్కడి వాళ్లు ఏ పార్టీకి చెందినవాళ్లయినా సరే, జోరుగా మాట్లాడతారు, లేకపోతే వాళ్ల యిళ్ల మీద రాళ్లు పడతాయి. ఫర్నిచర్లు విరుగుతాయి. పోలీసులు రక్షణకు వెళితే వాళ్లను బదిలీ చేయాలనే డిమాండ్లు వస్తాయి.

హైదరాబాదులో ఆ సీను లేదు. తెలంగాణ వీరతాడు ధరించి ఊరేగుతున్న బిజెపి శాసనసభా పక్ష నాయకుడు కిషన్‌రెడ్డి కూడా రాజీనామా చేయడానికి సాహసించలేదు. జయప్రద క్కూడా భయమే, చటుక్కున రాజీనామా ఆమోదిస్తే దిక్కేమిరా దేవుడా అని. వాళ్ల అమ్మగారి అనారోగ్యం వలన ఆ రోజున కొండా సురేఖతో కలిసి రాలేదన్నారు. ఇంకా తగ్గినట్టు లేదు. ఎంత వయసు వచ్చినా తల్లులు బిడ్డలకు అక్కర వస్తారు. అసలు తెలంగాణ నిర?యం ఢిల్లీలో జరగాలి కాబట్టి అక్కడకు వెళ్లి ఆందోళన చేస్తే భేషుగ్గా వుండేది. ముఖ్యంగా సోనియా యింటి ముందు. ఢిల్లీలో టి కాంగ్రెస్ నేతలందరూ బస చేసి వున్నారు. నిర?యం తేలేదాకా అక్కణ్నుంచి కదలకూడదని నిశ్చయించుకున్నారు. ఇది వాళ్లకు ఉభయతారకంగా వుంది.

ఇక్కడ వుంటే ఉద్యమంలో పాల్గొనే ఛాన్సు తెరాస ఎలాగూ యివ్వడం లేదు. ఇదంతా నాదే, మీకేం చోటు లేదు పొండి అంటోంది. పైగా ఇళ్లపై దాడి జరిపించి వేడి తగిలిస్తోంది. ఢిల్లీ కెళితే చల్లగా వుంటుంది. ఇవాళ ఆంటోనీని కలిశాం.. సానుభూతితో విన్నారు, మీకు మంచి జరుగుతుందని హామీ యిచ్చారు... ఇవాళ షిల్దాను కలిశాం. విషయాలు తెలుసుకుని చ్చొచ్చొచ్చొ అన్నారు.. హర్యాణా ఆర్థికమంత్రి తన పని మీద ఢిల్లీ వస్తే ఆయన్ను యివాళ కలిశాం. తెలంగాణ వస్తే తప్ప మోక్షం లేదన్నారు... కేరళ గవర్నరు కుటుంబంతో విహారయాత్ర వెళుతూ ఢిల్లీలో ఆగితే ఆయన్ను కలిసి చెప్పాం. ఆయన మా కష్టం వూరికే పోదని దీవించారు.. యుపీ ఎంపీలకు విందు యిచ్చి హైదరాబాదు బిర్యానీ పెట్టి హైదరాబాదు గొప్పతనం చెపితే, వాళ్లు భలేభలే అని మెచ్చుకుని హైదరాబాదు తెలంగాణ నుండి విడిపోతే యిలాటి రుచి రాదన్నారు...

ఇలా రోజూ టీవీ ఛానెల్స్ ముందు కబుర్లు చెపుతూ కాలక్షేపం చేయవచ్చు. అక్కడేదో లాబీయింగ్ చేసేసి తెలంగాణ తెచ్చేస్తున్నారన్న బిల్డప్ యివ్వచ్చు. ఈ బిర్యానీ లాబీయింగ్ కెసియార్ ఏళ్ల పాటు చేసి ఏమీ సాధించలేదు. పలకవలసిన దేవత సోనియా. ఈ మధ్య కెసియార్‌ని పదేళ్లగా ఉద్యమం చేస్తున్నా తెలంగాణ యింకా రాలేదేం అని ఎవరో నిలదీస్తే ఉక్రోషంగా సమాధానం చెప్పారు – "మీరు ఓట్లు కాంగ్రెస్, టిడిపి వాళ్లకు వేసి, మమ్మల్ని అడిగితే ఎలా? గాడిదకు గడ్డి వేసి ఆవునుండి పాలు పిండుదామని చూస్తే పాలు వస్తాయా?" అని. నిజమే కదా, తెరాసకు వచ్చినవి కేవలం 10% సీట్లు. తెలంగాణ రానందుకు వాళ్లని దండిస్తే ఎలా?

అలాగ సోనియానుండి పిండవలసిన నిర?యం కోసం యితరులను కలిసి ప్రయోజనం ఏముంది? వీళ్ల టైమూ, వాళ్ల టైమూ దండగ తప్ప ! వాళ్లకు తెలియాల్సినవన్నీ ముందే తెలిసాయి. కొత్తగా చెప్పాల్సినవి వీళ్లకీ లేవు, వినాల్సింది వాళ్లకూ లేవు. తెలంగాణ యివ్వకపోతే మా నియోజకవర్గాల్లో తంతారు అని వీళ్ల పాట. ఇస్తే తెరాసకు క్రెడిట్ పోతుంది కదా, తెరాసను కాంగ్రెస్‌లో విలీనం చేయమని కెసియార్‌కు చెప్పండి అని వాళ్ల పాట.

ఢిల్లీ సంగతి 'వాగ్ధీర' కేకే నేతృత్వంలో టి కాంగ్రెస్ చూసుకుంటున్నారు కాబట్టి హైదరాబాదులో ఉద్యమం ఫుల్ స్వింగ్‌లో తెరాస నడిపించవచ్చు. 18 రోజులుగా 'సకల' సమ్మె జరుగుతున్నా జాతీయ మీడియా కవర్ చేయడం లేదు. అంబికా సోనీ కుట్ర చేస్తోందని టి ఉద్యమకారులు అన్నా నమ్మనక్కరలేదు. న్యూస్ వర్దీ అనుకుంటే చాలు, జాతీయ మీడియా వదిలిపెట్టదు. ఎద్దుపుండు కాకికి రుచిగా కూడా లేదు, పట్టించుకోకుండా పోతోంది. మీడియా ఈగలు కూడా వాలటం లేదు. వాళ్లకి తెలంగాణ జిల్లాలు వెళ్లే ఓపికలేదు. హైదరాబాదులో ఓ ప్రతినిథి వుంటాడు. అతను కూడా స్వంత వెహికల్‌లోనే తిరుగుతాడు కాబట్టి, ఆర్టీసీ బస్సుల్లో తిరగడు కాబట్టి, ఉద్యమం వలన ప్రభావం పడటం లేదు.

హైదరాబాదులో తెరాసకు బలం లేదని అందరి అభిప్రాయమూ, అదిగో అప్పుడు కార్పోరేషన్ ఎన్నికలలో నిలబడడానికి జంకారు చూశారా, అప్పణ్నుంచి బొత్తిగా లోకువ అయిపోయింది. అంతకుముందు 2009 ఎన్నికలలో తెరాస కాండిడేట్లే కాదు, తెరాసతో పొత్తు పెట్టుకున్న పాపానికి హైదరాబాదు అభివృద్ధికి కారకుడైన బాబును కూడా శిక్షించేశారు గ్రేటర్ హైదరాబాదువాసులు.

దాంతో తెలంగాణ అంతటిదీ ఓ దారి, హైదరాబాదుది మరో దారి అనడం సాగించారు సమైక్యవాదులు. హైదరాబాదు జనాభాలో ఆంధ్రప్రాంతీయులు 50 లక్షలు అని సమైక్యవాదులంటే అబ్బే 5 లక్షలమందే అని ఉద్యమకారులంటారు. తెలంగాణ వారెవరో, తెలంగాణేతరులెవరో ఎవరైనా నిర్వచిస్తే అప్పుడు లెక్కలు తేలతాయి. కానీ ఆ నిర్వచనం అనేది, ఎంత అడిగినా, తస్సదియ్యా, ఎవరూ చెప్పరు. రాజకీయనాయకులే కాదు, నాకు మెయిల్స్ రాసే పాఠకులు కూడా..! వాళ్లకు ఒకటే కొండగుర్తు. విభజన కోరేవారందరూ తెలంగాణ వారు, కోరనివారందరూ ఆంధ్రులు. వారు ఎక్కడ పుట్టినా, ఎక్కడ పెరిగినా, ఎక్కడ చదివినా, ఏం చేసినా జాన్తానై.

తరతరాలుగా యిక్కడివాళ్లమేరా బాబూ అని మొత్తుకుంటే అయితే నువ్వు తెలంగాణ వాడికి పుట్టి వుండవ్ అని మీ తల్లిమీద అభాండం వేస్తారు.

హైదరాబాదు తెలంగాణ అంశానికి ఆయువుపట్టు. దానితో సహా తెలంగాణ యివ్వకపోతే ఉద్యమకారులు ఒప్పుకోరు. ఇస్తే యితర ప్రాంతాల వారు ఒప్పుకోరు. ఎందుకంటే మొత్తం రాష్ట్రంలో హైదరాబాదు తప్ప మరో నగరం లేకుండా చేశారు దూరదృష్టి లోపించిన మన నాయకులు. "మీరు 1953లో మద్రాసు వదులుకున్నారు, మాతో కలిసినపుడు కర్నూలు వదులుకున్నారు, వదులుకోవడం మీకు బాగా అలవాటు కాబట్టి యీసారి హైదరాబాదు వదులుకోండి" అని ఆంధ్రప్రాంతీయులకు ఉద్యమకారులు సలహా యిస్తున్నారు. "విడిపోతానన్నవారికి రాజధాని పోగొట్టుకోవడం పరిపాటి. 1953లో మాకు మద్రాసు పోయింది, తర్వాత గుజరాతీలకు బొంబాయి పోయింది. ఈ సారి విడిపోతానంటున్నది మీరు. అందుకని మీరే హైదరాబాదు వదిలేసి ఏ వరంగల్‌లోనో రాజధాని కట్టుకోండి అంటున్నారు." అంటున్నారు ఆంధ్రప్రాంతీయులు.

ఆంధ్రప్రదేశ్‌ను ఆంధ్ర, తెలంగాణలుగా విడగొట్టాలని నిర?యించినపుడు హైదరాబాదు వాసులు ఓ యూనిట్‌గా ఏర్పడి "మీరూ మీరూ ఎవరిదారిన వారు పొండి. మా సంగతి మేం చూసుకుంటాం" అనవచ్చు. ఎందుకంటే హైదరాబాదు విడిగా చూస్తే ధనద్వీపం. దానికి ఆంధ్ర కానీ, తెలంగాణ కానీ గుదిబండలే. వాటితో కలవడం వలన దాని ఖర్చు పెరుగుతుంది తప్ప, కలిసి వచ్చేది లేదు. పైగా హైదరాబాదు జనాభా మరీ అంత కాకపోయినా కాస్మోపాలిటనే. ఇటీవలి కాలంలో దానికి అంతర్జాతీయంగా గుర్తింపు కూడా వచ్చింది. జాతీయంగా అనేక జాతులవారు వచ్చి స్థిరపడుతున్నారు. వాతావరణం బాగుందని, కాస్ట్ ఆఫ్ లివింగ్ మరీ అంత ఎక్కువ కాదనీ ఉద్యోగాలకై వస్తున్నారు, నచ్చి వుండిపోతున్నారు. బ్రాండ్ హైదరాబాదును తమ కృషితో పెంచుతున్నారు. దీనిలో అందరూ భాగస్వాములే. ఒక్క తెలంగాణ వారు మాత్రమే కాదు. ఈ బ్రాండ్ హైదరాబాదును చెడగొట్టకూడదని మన్‌మోహన్ చాలా పట్టుదలతో వున్నారని వింటున్నాం.

ఉద్యోగస్తుల్లో కూడా ఎలాగోలా హైదరాబాదు వచ్చి పడినవారు వదిలిపెట్టకూడదని చూస్తారు. అందుకే 610 జీవో అమలు కాలేదన్న గొడవలు యిక్కడే వినబడతాయి. వరంగల్‌లో వున్న ఆంధ్రప్రాంతీయుడు అక్కణ్నుంచి స్వంతవూరికి బదిలీ కావడానికి ఏమాత్రం చింతించడు. కానీ హైదరాబాదు వచ్చాడో – ఆమదాలవలస వాడు కావచ్చు, ఆదిలాబాదు వాడు కావచ్చు – మళ్లీ వెళ్లడానికి యిచ్చగించడు. తెలంగాణ వుద్యమం ఉధృతం అయినకొద్దీ తెలంగాణ జిల్లాల్లో చదువుల్ని గుంటలో పెట్టి గంట వాయించిన కొద్దీ హైదరాబాదుపై మోజు మరీ పెరిగిపోతోంది. ఇక్కడైతే ప్రశాంతంగా వుంది. చదువులు సాగుతాయి. దిసీజ్ ఐలండ్ ఆఫ్ పీస్. అందుకని ఇక్కడకు వచ్చేద్దామని ముమ్మరమైన ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

తెలంగాణ ఉద్యమం ధాటి పెరిగినకొద్దీ యిక్కడున్న వ్యాపార, వాణిజ్య వర్గాల వారు ఢిల్లీకి వెళ్లి తమ లాబీయింగ్ చేసుకుంటున్నారు. తమకు నష్టం వాటిల్లుతోందని, తమకు రక్షణ కల్పించకపోతే దెబ్బతినిపోతామని గోలపెడుతున్నారు. ఫ్యాప్సి యిప్పటికే మూడు, నాలుగు బహిరంగ ప్రకటనలు యిచ్చింది. ఇక రియల్ ఎస్టేటు వ్యాపారులు, మూడు, నాలుగు రూపాయల వడ్డీతో అప్పులు తెచ్చి హైదరాబాదులో స్థలాలు కొని పడేసిన మధ్యతరగతివాళ్లు (వీరిలో అన్ని జిల్లాల వారే కాదు, అన్ని రాష్ట్రాల వారూ వున్నారు) తెరాస ఉద్యమాన్ని రోజుకి ఓ సారైనా తిట్టుకుంటారు. వీళ్ల కారణంగానే ధరలు పడిపోయాయని. వాళ్లకు ఉద్యమం ఔచిత్యం, అవసరం పట్టవ్. తమ పెట్టుబడికి మోసం వచ్చింది. దానికి కారణం ఉద్యమం, అది అణిగిపోతే మన పెట్టుబడి వెనక్కి వస్తుంది. దట్సాల్ !

వీళ్లంతా కలిసి "సేవ్ హైదరాబాద్", "హైదరాబాద్ యీజ్ ఫర్ హైదరాబాదీస్" అని ఓ ఉద్యమం మొదలుపెడితే దానికి వూతం వచ్చి తీరుతుంది. అదేమిటి, తెలంగాణలో హైదరాబాదులో భాగం కదా అని ఉద్యమకారులు అంటే 'ఆత్మాభిమానం', 'స్వపరిపాలన', 'భూమిపుత్రులం' వంటి వాదనలు యిక్కడివారూ వినిపించగలరు. 'హైదరాబాద్ హైదరాబాదీలకే'. 'చిన్న రాష్ట్రాలు సమర్థవంతంగా పాలించబడతాయి అని మీరు చెప్పారు, అతి చిన్న రాష్ట్రాలు అతి సమర్థవంతంగా పాలింపబడతాయి. కోటి జనాభా అంటే తక్కువేమీ కాదు. దేశంలో ఎన్నో రాష్ట్రాలకంటె ఎక్కువే' అని వాదనకు దిగవచ్చు. ఈ ఉద్యమానికి నాయకత్వం ముకేష్ గౌడ్, దానం నాగేందర్, తలసాని శ్రీనివాస యాదవ్, తీగల కృషా?రెడ్డిలదే. రియల్ ఎస్టేటు వ్యాపారులు దీనికి ఆర్థికంగా తోడ్పడంలో ఆశ్చర్యం లేదు.

మజ్లిస్‌కు కావలసినది యిదే ! సమైక్యం లేకపోతే రాయల్ తెలంగాణ అని నినాదం చేపట్టి చివరకు మీరు చెప్పారు కాబట్టి ఒప్పుకుంటున్నాం అని హైదరాబాదును విడిగా రాష్ట్రం చేయమనవచ్చు. ఇది ముందే చెపితే వాళ్లు రాజ్యం చేద్దామని యీ ఎత్తు ఎత్తారంటారని వూరుకున్నారు. సమైక్యంగా వుండడం కష్టం అని నిర?యించుకున్న రోజున తక్కిన ఆప్షన్ల గురించి ఆలోచించినపుడు రాయల్ తెలంగాణ ఆచరణయోగ్యం కాని ఆలోచన అని వారికీ తెలుసు. ఒకసారి హైదరాబాదు యుటీ గానీ, రాష్ట్రం కానీ అయిందంటే వారి తడాఖా చూపించగలరు. కార్పోరేషన్ ఎన్నికలలో వారు మూడోవంతు స్థానాలు గెలుచుకున్నారు. సామాన్యప్రజలతో నిరంతరం టచ్‌లో వుండడం, అందుబాటులో వుండడం, హిందువులను కూడా అభ్యర్థులుగా నిలబెట్టి ముస్లింలచేత ఓట్లు వేయించగల సత్తా వుండడం వారి ప్లస్ పాయింట్లు. హైదరాబాదు విడిగా ఏర్పడినపుడు వారు సగం సీట్లు గెలుచుకున్నా ఆశ్చర్యపడనక్కరలేదు. మూడోవంతు గెలుచుకున్నా ఎవరితోనైనా కలిసి సంయుక్తంగా ప్రభుత్వం ఏర్పరచే స్థితిలో వుంటారు. అప్పుడు స్థానికంగా పెట్టే పరిశ్రమలకు లైసెన్సు కావాలంటే ముస్లిములకు కొంత శాతం మేరకు ఉద్యోగాలు యిప్పించమని, వ్యాపారవేత్తలను ఒత్తిడి చేయగల స్థితిలో వుంటారు.

వీటన్నిటికంటె మించినది – నిర్బంధ హిందీ అధ్యయనం. ఇంగ్లీషు వారికి వ్యతిరేకంగా భారతదేశవాసులందరూ ఐకమత్యంతో నిలవాలంటే వారి మధ్య కమ్యూనికేషన్ ముఖ్యం. ఇంగ్లీషు చదువుకున్నవారి సంఖ్య దేశజనాభాలో అప్పట్లో 2% కూడా వుందో లేదో. అందుకని లింకు భాషగా హిందుస్తానీని ప్రచారం చేశారు గాంధీ. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా చరఖా వడకడం, హిందీ నేర్చుకోవడం వుండేవి. ఇంగ్లీషువాళ్లు యిది గ్రహించి స్కూళ్లలో హిందీ లేకుండా చేసేవారు. రాజాజీ ముఖ్యమంత్రి కాగానే మద్రాసులో హిందీని నిర్బంధ అంశంగా చేర్చారు. తక్కిన ప్రాంతాలలో దీనికి వ్యతిరేకత రాలేదు కానీ తమిళ ప్రాంతాల్లో ద్రవిడ ఉద్యమకారులు దీన్ని పెద్ద వివాదంగా చేశారు.

పెరియార్ గురించి చెప్పినప్పుడు విశదీకరించాను కదా – ఆయన దృష్టిలో బ్రాహ్మణులు ఆర్యులు, వారి భాష సంస్కృతం. దానిలోంచి పుట్టినదే హిందీ. వాళ్లు తమిళులు కారు. స్థానికులైన బ్రాహ్మణేతరులు మాత్రమే తమిళులు. వారి భాష తమిళం. అందుకే బ్రాహ్మణులు తమిళాన్ని అణగదొక్కుతున్నారు. ఇదే వాళ్ల ఉద్యమానికి పట్టుగొమ్మ. రాజాజీపై వారికి కోపం దేనికంటె ఓ పక్క పెరియార్ రామాయణాన్ని చీల్చి చెండాడుతుంటే ఆయన రామాయణాన్ని తమిళ వచనంలోకి "చక్రవర్తి తిరుమగన్" పేర అనువదించి, ప్రాచుర్యంలోకి తెచ్చాడు. వేదాలు, ఉపనిషత్‌లపై అపారమైన గౌరవంతో వాటిని ప్రచారం చేసేవాడు.

ఆయన తమిళంలో సంస్కృతజన్య పదాలు చాలా వుండేవి. (నిజానికి తమిళంలో అనేక తత్సమాలు, తదహేలు వున్నాయి. ద్రవిడ ఉద్యమకారులు పంతం పట్టి వాటినన్నిటికీ తొలగిస్తూ పోయి భాష రూపాన్ని మార్చారు.) ఈ కారణాల చేత రాజాజీ హిందీ ఉద్యమాన్ని వారు విపరీతంగా వ్యతిరేకించారు. 1200 మంది జైలుపాలయ్యారు. పోలీసు కాల్పుల్లో ఇద్దరు మరణించారు. ఈ ఉద్యమం కారణంగా పెరియార్ అణ్నాదురైలకు మంచి పేరు వచ్చింది. ఆ రోజుల్లోనే కరుణానిధి ఆ ఉద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. ఇప్పటికీ హిందీ విరోధిగానే వున్నాడు. తమాషా ఏమిటంటే రాజాజీ 1965లో తమిళనాడులో ఉధృతంగా నడిచిన హిందీ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు యిచ్చారు. ఎందుకంటే ఆయన అప్పటికి కాంగ్రెస్ వ్యతిరేకి అయిపోయాడు.

రాజాజీ ఆలోచనావిధానం మేధావులను ఆకర్షించేది కానీ సామాన్యప్రజలు గందరగోళపడేవారు. ఉత్తరోత్రా ఆయన కాంగ్రెస్ విడిచి స్వతంత్ర పార్టీ పెట్టినపుడు కూడా రాజాలు, మహారాజాలు , మేధావులు దానిలో చేరారు తప్ప సామాన్యులలోకి చొచ్చుకుపోలేదు. 1942లో ఆయన క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించారు, దేశవిభజనను సమర్థించారు. ముస్లిం లీగుతో చర్చలు జరపాలనేవారు. ఆయన ఆలోచనలను కామరాజ్ నేతృత్వంలోని మద్రాసు కాంగ్రెస్ పార్టీ ప్రతిఘటిస్తూ తీర్మానాలు చేయడంతో కాంగ్రెస్ పార్టీ నుండి తప్పుకున్నారు.

జాతీయ రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగి, యుద్ధానంతరం జరిగిన కాంగ్రెస్ మళ్లీ చేరడమే కాక 1946 ఎన్నికలలో పాల్గొందామని చూడడం కామరాజ్ వర్గానికి చాలా కోపం తెప్పించింది. ప్రజల్లో యింత అన్‌పాప్యులర్ అయిన వ్యక్తికి కాంగ్రెస్ నాయకత్వం కట్టబెట్టడమేమిటని వారి బాధ. అయినా మద్రాసులో సుస్థిర ప్రభుత్వం పాలించగల వ్యక్తి రాజాజీయే అని గాంధీ స్థిరాభిప్రాయం. అందుకే ఆయనను మళ్లీ కాంగ్రెస్‌లోకి తీసుకున్నారు. కామరాజ్ గాంధీని ఏమీ అనలేకపోయినా ప్రకాశం గారిని తన తరపున ప్రచారం చేయమని కోరారు. మద్రాసు ప్రెసిడెన్సీలో ఆంధ్ర ప్రాంతీయ కాంగ్రెసు అధ్యక్షుడు ప్రకాశం కాగా, తమిళ ప్రాంత అధ్యక్షుడు కామరాజ్, కేరళ ప్రాంత అధ్యక్షుడు మాధవ మేనోన్. ప్రకాశం కామరాజు పేర ప్రచారం చేయసాగారు.

ఇది గాంధీగారికి, రాజాజీకి బొత్తిగా రుచించలేదు. హై కమాండ్ వారు అసఫ్ ఆలీ అనే అతన్ని పంపి కామరాజ్ మెడలు వంచి 30% సీట్లు రాజాజీ వర్గానికి యిచ్చేట్లు వప్పించారు. రాజాజీ వర్గం ఒకవేళ అన్ని సీట్లూ నెగ్గినా మెజారిటీలో రాకపోవడమనే పరిస్థితి గాంధీగారికి మింగుడుపడలేదు. అందువలన ఆయన రాజాజీని పుష్ చేయడానికి హిందీ ప్రచారసభ రజతోత్సవ సభ అంటూ మద్రాసు వచ్చారు. వస్తూ వస్తూ ఒడిశా, ఆంధ్ర ప్రాంతాల మీదుగా వచ్చారు.

మద్రాసు ప్రెసిడెన్సీలో అందరి కంటె ఎక్కువ పాప్యులారిటీ గల వ్యక్తి ఆంధ్రకేసరి ప్రకాశం. అయితే ప్రకాశం ఎవరికీ తల వంచే వ్యక్తి కాదు. ఆయనకు పోటీదారైన రాజాజీ ఆయనకు వ్యతిరేకంగా గాంధీగారికి బాగా చెప్పి పెట్టారు. ప్రకాశంగారికి తమిళ నాయకుల నుండే కాదు, ఆంధ్ర నాయకుల నుండి కూడా వ్యతిరేకత వుండేది. వారిలో ప్రముఖులు పట్టాభి సీతారామయ్య, ఆయన శిష్యుడు కళా వెంకటరావు.

ప్రకాశం గారు స్వాతంత్ర్య ఉద్యమంలో పూర్తిగా దిగడానికి ముందు చాలా పేరు, ప్రతిష'లు ఆర్జించిన బారిస్టరు. లక్షలాది ఆస్తి వుండేది. దాన్నంతటినీ ఉద్యమానికి ధారపోసి, ప్రాక్టీసు మానేసి ఆయన పోరాటంలోకి దిగారు. ఆయన జనంలోకి వెళితే విరాళాలు కురిసేవి. కవర్లలో పెట్టి డబ్బు యిచ్చేవారు. అవి ఆయన జేబులో పెట్టుకుని, స్వాతంత్ర్యోద్యమంలో జైలుకెళ్లిన వారి కుటుంబాల వారికి యిచ్చేసేవారు. ఎవరు తన వద్దకు వచ్చి అడిగినా నమ్మకం కుదిరితే చాలు యిచ్చేసేవారు. ఇచ్చినదానికీ, పుచ్చుకున్నదానికీ లెక్క వుండేది కాదు. దాంతో ప్రజలందరికీ ఆయన ఆరాధ్యదైవం అయిపోయారు.

అది ఆయన ప్రత్యర్థులకు కంటగింపుగా వుండేది. ప్రజలు యిస్తున్నది కాంగ్రెస్ కోసమనీ, ఆ విరాళాలు కాంగ్రెస్ పార్టీకి జమ కట్టాలనీ వాళ్లు వాదించేవారు, హై కమాండ్‌కు ఫిర్యాదు చేసేవారు. ప్రకాశం గారు అవేమీ లక్ష్యపెట్టేవారు కారు – 'వాళ్లు నా మొహం చూసి యిస్తున్నారు, వాళ్లిచ్చినదే నేను ప్రజలకు యిచ్చేస్తున్నాను. నాకోసం ఏమీ అట్టేపెట్టుకోవడం లేదు' అనేవారు. అదీ నిజమే, ఆయన జేబులో ఒక్కోప్పుడు డబ్బులేమీ మిగిలేవి కావు. పరిస్థితి యిలాగే సాగితే ఆయన రోజువారీ ఖర్చులకు యిబ్బంది అవుతుందని

భయపడి ఆయన అనుచరులు ప్రజలతో ప్రకాశం గారికోసం విడిగా యిమ్మనమని చెప్పారు. అలా 50 వేల రూపాయలు పోగుపడ్డాయి. వాటిల్లోంచి నెలకు వెయ్యి రూపాయలు ఆయన ఖర్చులకు గాను యిద్దామని వాళ్ల ఆలోచన. పట్టాభి, కళా వెంకటరావు యిత్యాదులు యీ ఏర్పాటు చూసి అసూయపడ్డారు. గాంధీగారికి ప్రకాశంపై ఫిర్యాదు చేయడానికి మరొక అవకాశం దొరికింది వారికి.

ఆంధ్రజ్యోతివారు శుక్రవారం ఓ న్యూస్ ఐటమ్ వేసేశారు. హై కమాండ్ ఆంధ్ర, తెలంగాణలకు చెరో రాజధాని యిచ్చేసి హైదరాబాదును యూటీ చేసేస్తారని. దానిపై వాళ్ల టీవీ ఛానెల్‌లోనే చర్చ కూడా పెట్టేశారు. తెరాసను చూసి భయపడేవారందరూ దీని గురించి చర్చలు విస్తృతంగా చేసి, ఏం యిలా చేస్తే నష్టమేముంది? అన్న ఆలోచనను కొనసాగించి, దానికై మొగ్గు చూపితే ఉద్యమకారుల కొంప మునిగిందే !

ఇవన్నీ జరగకుండా వుండాలంటే హైదరాబాదులో తెరాస తన బలం చూపించుకోవాలి. అందుకే ఉద్యమం ప్రారంభించిన 15 రోజులకు హైదరాబాదుపై దృష్టి సారించారు. ఇవాళ 30 న బంద్ ప్రకటించారు. ఇది నిజమైన బంద్. ఎందుకంటే దుకాణాలు కూడా మూశారు. ఇన్నాళ్లు సకల జనుల సమ్మె అంటూ ప్రభుత్వవాహనాలు, కార్యాలయాలు ఆపుతూ వచ్చారు కానీ దుకాణాలను నడుపుకోనిచ్చారు. ఇది చాలా విచిత్రంగా వుంది. హర్తాళ్ అంటే దుకాణాలు మొదట మూసేవారు. కానీ యీ సకల జనుల సమ్మెలో వ్యాపారస్తులు వ్యాపారం చేసుకుంటూ ఉద్యమానికి ఆర్థికంగా సహాయపడాలని కోరుతున్న 'తెలంగాణ ఇంజనీర్ల సంఘం' వారి కరపత్రం చూశాను.

మరి ఆ దుకాణదారులు, దుకాణాల్లో పనిచేసేవారు తెలంగాణవారు కారా? వారికి మాత్రం సమ్మె చేసే హక్కు లేదా? ఇలాటి గందరగోళ పరిస్థితిలో హైదరాబాదు బంద్ అన్నది కాస్త సిన్సియర్ బంద్. కాస్త అని ఎందుకన్నానంటే కేంద్రప్రభుత్వ కార్యాలయాలు, కార్పోరేషన్లు అన్నీ పనిచేస్తూనే వున్నాయి కనుక. ఇలాటి బంద్‌లు నాలుగు జరిగితేనే కేంద్రప్రభుత్వం కదులుతుంది అనుకుంటే అంతలోనే కెసియార్ ప్రకటన – 'ఇదే చివరి బంద్. మళ్లీ మళ్లీ చేయం. దీన్ని విజయవంతం చేయడానికి సహకరించండి.' అని. ఏమిటి దీని అర్థం?

అలా అంటూనే తెలంగాణ పై నిర?యం ఒకటి, రెండు నెలల్లో తేలిపోతుంది లెండి అని మనకు హామీ యిచ్చారు. సమ్మె మొదలుపెట్టి 18 రోజులైంది, ఎటుపోతోందో దిక్కూ మొక్కూ తెలీయక అల్లాడుతున్నాం. ఇంకా ఒకటి.. రెండు నెలలంటాడేమిట్రా బాబూ అని గుండెల్లో మనకు రాయి పడింది. ఈ రాయి మన మీద పడేసి ఆయన ఢిల్లీ విమానం ఎక్కేశారు. కాంగ్రెస్ కోర్ కమిటీలో ఏ నిర?యం రాదని ముందే ఆయనకు తెలుసులాగుంది. ఎలాగూ టైము అడుగుతారని తెలిసే రెండు నెలలు అన్నారేమో. మరి ఆ రెండు నెలలూ మనం ఏం చేయాలట? సమ్మె చేస్తూనే వుండాలా? ఈ లోగా ఆయన ఢిల్లీ వెళ్లి మాట్లాడతారట. ఏం మాట్లాడతారండీ, నాకు తెలియక అడుగుతాను.

ఉద్యమం తీవ్రంగా వుంది అనా? ఆ ముక్క చిదంబరం చెప్పేశారుగా. ఉద్యమం బాగా చేశారు, మీ ఉద్దేశం చాటి చెప్పారు, యిక చాలించండి అని. ఉద్యమం జరగటం లేదు అని ఆయన అంటే అప్పుడు గుడి మూసేసి, అర్చనలు మానేసి పూజార్లు ధ్వజస్తంభం వద్ద క్రికెట్ ఆడే ఫోటోలూ అవీ పట్టుకెళ్లి చూపించవచ్చు. అయినా ఎంతమంది ఆఫీసుకి వచ్చారో, ఎంతమంది రావటం లేదో రోజూ నివేదికలు వెళుతూనే వుంటాయి. జీతాలు యిచ్చాక ఖచ్చితంగా తేలిపోతుంది. ప్రతీనెలా అయ్యే జీతాల బజెట్‌లో ఎంత శాతం మిగిలిందో ! అలాగే కొత్తగూడెం బొగ్గు ఉత్పత్తి బట్టి అక్కడి లెక్కా తేలుతుంది. ఇక వెళ్లి విడిగా చెవిలో చెప్పేదేముంది?

జాతీయ మీడియా దృష్టికి తెస్తారట. అక్కడ మీడియా పాయింటు దగ్గర మాట్లాడితే సరిపోతుందా? రోజుకి పదిమంది అక్కడ మాట్లాడతారు. వాళ్లను యిక్కడికి రప్పించాలి తప్ప మనం అక్కడకు వెళ్లి చెప్పేదేముంది? సుష్మా స్వరాజ్‌ను కలిసి మాట్లాడతారట. బిజెపి వాళ్లను తెలంగాణ గురించి కన్విన్స్ చేయవలసిన అవసరం వుందా? వాళ్లే అందరి కంటె ముందు జెండా పట్టుకుని తయారవుతున్నప్పుడు!

ఇవేమీ కావు కారణాలు. కాంగ్రెస్‌వారు ఓ ఫార్ములా రూపొందిస్తున్నారని దాన్ని స్టేక్ హోల్డర్స్‌కు ఒవైసీ చేత 'సౌండ్' చేయించి చూస్తున్నారని నిన్న రిపోర్టులు వచ్చాయి. చిదంబరం నాలుగు పార్టీల అభిప్రాయం ముఖ్యం అని యివాళ కూడా అన్నారు. వాటిల్లో ఒకటి మజ్లిస్. అది వారితోనే మాట్లాడి వుంటారు. ఇంకోటి జగన్. అతనితో మాటలు లేవు కాబట్టి, మాట్లాడినా బాబు బాటలోనే నడుస్తున్నాడు కాబట్టి ఆటల్లో అరిటిపండే. ఇక ముఖ్యమైన వ్యక్తి బాబు. అతని కంటె ముఖ్యమైన వ్యక్తి కెసియార్. అందుకే ఒవైసీ వాళ్ల యింటికి వెళ్లి మాట్లాడారు. ముస్లిం కమిషన్ రిపోర్టు అమలు వంటివి ముఖాముఖీ మాట్లాడవలసిన విషయాలు కావు. పైగా వీళ్లు అధికారంలో లేరు. పేపర్లో ఒవైసీ దూతగా వెళ్లారని అనగానే రాగానే ఛ, ఛ వట్టి అబద్ధం అన్నారు. కానీ రెండు రోజులు తిరక్కుండా కెసియార్ ఢిల్లీలో తేలుతున్నారంటే ఆ రిపోర్టు నిజమేననిపించడం లేదా? అందునా కెసియార్ తన సైన్యం మొత్తాన్ని తీసుకెళ్లారు.

తెలంగాణకు ఓ ఫార్ములాను కెసియార్ ముందు పెట్టి అతని చేత ఒప్పిస్తే మొత్తం సానుకూలమవుతుందని కాంగ్రెస్ భావిస్తూండవచ్చు. కానీ కాంగ్రెస్‌వాళ్లను బలి వేయకుండా కెసియార్ తన మెడ ముందుకు సాచుతారా? అన్నది ప్రశ్న. చర్చల్లో ఎవరు ఘనాపాఠియో తేలుతుంది. ఆమోదయోగ్యమైన ఫార్ములా మాట ఎలా వున్నా 'తెలంగాణ యిస్తే మాకేంటి లాభం?' అని కాంగ్రెస్ కెసియార్‌ను అడిగితే ఆయన ఏం సమాధానం చెప్తారు? సొమ్ము మీద సోకు నాది అనా? బొమ్మ పడితే నేను గెలిచినట్టు, బొరుసు పడితే మీరు

ఓడిపోయినట్టు అంటారా? కాంగ్రెస్ నష్టపోవడానికి సిద్ధపడే తెలంగాణ యిస్తుందా? ఈ విషయం ఆయనకు మాత్రం తెలియదా?

అందువలన విలీనంపై చర్చలు జరిగితీరవచ్చు. అయితే కెసియార్ విలీనానికి ఒప్పుకుంటే ఆయన ప్రతిష' అడుగంటుతుందనే భయం ఉద్యమకారులందరికీ వుంది. చెన్నారెడ్డి వుదంతం ఎవరూ మర్చిపోలేదు. ఇప్పటికే కెసియార్ ఉద్యమం పేరు చెప్పి డబ్బు దండుకుంటున్నారని పాటకజనంలో కూడా వ్యాపించింది. విలీనం కాగానే టిడిపి చెలరేగుతుంది. అదిగో మేం చెప్పాం చూశారా అంటూ. ఆ పై ఏ ఫార్ములాకు అంగీకరించినా విశ్వసనీయత పోతుంది. అందువలన విలీనం యిప్పుడు కాకపోవచ్చు. నా అనుమానం – తెలంగాణలో బలమైన పార్టీ నిర్మాణం వున్న టిడిపిని సమూలంగా పెకలించి వేయడానికి కాంగ్రెస్ తెరాసను వాడుకోవచ్చు. ఇది కాంగ్రెస్‌కు కొత్తకాదు. గతంలో అకాలీదళ్‌ను మట్టుపెట్టడానికి పంజాబ్‌లో భింద్రన్‌వాలేను తయారుచేసింది. ఖలిస్తాన్ డిమాండ్ చేయించింది. బెంగాల్‌లో మార్క్సిస్టులను కొట్టడానికి నక్సలైట్లను ప్రోత్సహించింది. మహారాష్ట్ర మరాఠీలకే అనే నినాదంతో ఉ దయించిన శివసేనను కాంగ్రెస్‌లో ప్రత్యర్థి వర్గాలు అవతలివారిని ఎటాక్ చేయడానికి వాడుకున్నాయి. పారిశ్రామికవేత్తలు ట్రేడ్ యూనియన్ నాయకులను అణచడానికి వాడుకున్నారు.

ఇప్పుడు కాంగ్రెస్ తెరాస చేత ఆ పని చేయిస్తోందనిపిస్తోంది. లేకపోతే బాన్సువాడకి వెళుతున్న టిడిపివారిపై తెరాస ఆ దాడులు సబబా? తెలంగాణ కోసం విభేదాలు మరచి అందరూ ఉద్యమించాలి, తెలంగాణ బిడ్డలపై ఎవరైనా చెయ్యి ఎత్తితే చెయ్యి తీసేస్తాం అని నినాదాలు చేయడమేమిటి, మళ్లీ మీరే తెలంగాణ నాయకులపై చెయ్యి ఎత్తడమేమిటి? తెరాసకు ఓ పొలిటికల్ స్ట్రాటజీ వున్నట్టుగానే, టిడిపికీ వుంది. వారు దాన్ని అమలు చేసుకునే రాజకీయ స్వేఛ్ఛ రాజ్యాంగం యిచ్చింది. నిరసనగా ఎన్నికలలో పాల్గొనవద్దని చెప్పే హక్కు వుంది. దాన్ని హరించడానికి వీరెవరు? మొన్న సకలజనసమ్మెలో టిడిపివారు ఏదో నిరసన కార్యక్రమం చేపడితే తెరాసవారు అడ్డుకున్నారు. ఏమిటి దాని అర్థం? ఈ ఉద్యమంపై సకల పేటెంట్లు తమకే వున్నాయనా? ఇలా చేయడానికి దానికి కాంగ్రెస్ దన్ను వుండడంలో అసహజం ఏమీ లేదు. తెరాస ద్వారా టిడిపిని తుడిచి పెట్టాక, కాంగ్రెస్ తెరాసతో ఎలా వ్యవహరిస్తుందో చూడాలి. ఇప్పుడే చెప్పలేం.

ఇది తెరాస రాజకీయ భవిష్యత్తుకి సంబంధించిన విషయం. కానీ ఇవతల సకల జనుల సమ్మె ప్రకటించి, పండగ వేళ పూర్తి జీతాలు రాక ఉద్యోగులు అల్లాడుతూండగానే కెసియార్ బృందం ఢిల్లీకి వెళ్లడం మాత్రం వింతగా వుంటే, 'ఇది ఆఖరి బంద్' అని ప్రకటించడం మాత్రం వింతల్లో కల్లా వింత! ఇంతే వింతగా రేపు సమ్మెను హఠాత్తుగా విరమింపజేసినా ఆశ్చర్యపడనక్కరలేదు. 1969, 1972లో కూడా యిలాటి వింతలు చాలా జరిగాయి. రాజీనామాల అస్త్రం నిర్వీర్యం చేసి పుణ్యం కట్టుకున్నారు కెసియార్. ఇక సమ్మె అస్త్రాన్ని కూడా నిర్వీర్యం చేస్తారేమోనని శంక.

అసలు మహాలయపక్షాలలో ఏ శుభకార్యమూ మొదలుపెట్టరు మనవాళ్లు. అలాటిది సరిగ్గా భాద్రపద బహుళపాడ్యమినాడు మహాలయాలు ప్రారంభం అయిన రోజునే సమ్మె మొదలుపెట్టించారు. ఈ ముహూర్తం 'ఆడంబరం ఎక్కువైన ఆంధ్రపురోహితులు' పెట్టినా, 'నిష'గరిష్టులైన తెలంగాణ పురోహితులు' పెట్టినా, నైషి'కుడైన కెసియార్‌కు దీని లోతుపాతులు తెలిసే వుంటాయి. తెలిసీ దిగారంటే ఏదో మర్మం వుండేవుంటుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**

## సెప్టెంబరు 44 ఎమ్బీయస్ : రాయల్ తెలంగాణ

ఈ మధ్య రాయల తెలంగాణ గురించి రెండు రోజులు హోరెత్తించారు. అసలీ ఐడియాయే చాలా వింత ఐడియా. మజ్లిస్ వాళ్లు కృష?కమిటీ ముందు ఈ ఐడియా పెట్టినపుడే నవ్వు వచ్చింది. అసలు యిది కోరుకుంటున్నవారు తెలంగాణలో కాని, రాయలసీమలో కాని వున్నారా? కృష? కమిటీ ప్రజల్లో తిరిగినపుడు ఎవరైనా చెప్పారా? తెలంగాణవాళ్లు మాకు విడిగా తెలంగాణ కావాలన్నారు. తెలంగాణను అంటివున్న కర్నూలు జిల్లా వాళ్లు 'రాష్ట్రం విడగొట్టేస్తే మా సరుకులు అమ్ముకునే మార్కెట్ పోతుంది. ఇప్పటికే మమ్మల్ని రానివ్వటం లేదు. రేపు విభజన జరిగాక అస్సలు రానివ్వరు. మా ప్రాంతాలు కూడా తెలంగాణ అంత అభివృద్ధి చేసి అప్పుడు విభజన గురించి మాట్లాడండి. అప్పటిదాకా సమైక్యమే' అని స్పష్టంగా చెప్పారు. జెసి దివాకరరెడ్డి లాటి వాళ్లు ఈ ఐడియా చెప్పినపుడు తెలంగాణలో మండిపడ్డారు. వైయస్ హయాంలో రాయలసీమ తెల్లలుంగీ రౌడీలు బాంబులు పట్టుకుని వచ్చి మా ప్రాంతాలు కబ్జా చేయడం మొదలెట్టాకనే మాకు కడుపు మండసాగింది. అలాటిది పోయి పోయి యింకెవ్వరూ దొరకనట్టు రాయలసీమ వాళ్లతో కలుస్తామా? అని మండిపడ్డారు.

ఎవరైనా సరే అభివృద్ధి చెందిన ప్రాంతాలతో కలవడానికి ఉత్సుకత చూపుతారు. హైదరాబాదు బాగా డెవలప్ అయింది కాబట్టి తెలంగాణ వారెవరూ వదులుకోవడానికి యిష్టపడరు. రాయలసీమవారు ఓ పక్క మాది బాగా వెనుకబడిన ప్రాంతం అని మొత్తుకుంటూ వుంటే గణాంకాలు కూడా అదే చెపుతూ వుంటే పోయి పోయి, తెలంగాణవారు వారితో కలుస్తారా? ఎందుకు? వాళ్ల ఆదాయం పట్టుకెళ్లి రాయలసీమలో ఖర్చు పెట్టాలనా? కలుద్దామని ఆశ వుంటే గింటే రాయలసీమ వారికి వుండాలి. డెవలప్ అయిన హైదరాబాదుకి యాక్సెస్ పోకుండా వుంటుందని. జెసి గారు కాస్సేపు కరా?టకతో కలుస్తానంటారు. కాస్సేపు తెలంగాణతో అంటారు, ఎందుకంటే నీళ్లు రావాలనిట. వాళ్ల ప్రాజెక్టులకు తెలంగాణవాళ్లు నీళ్లు బిగబట్టకుండా యిస్తారనిట. అసలు ప్రత్యేక రాయలసీమ కోరేవాళ్లు కూడా

చాలా అనాలోచితంగా మాట్లాడతారు. నాలుగు జిల్లాలకు ఎవరైనా రాష్ట్రం యిస్తారా? అది వాళ్లకూ తెలుసు. అందుకే గ్రేటర్ రాయలసీమ అనసాగారు. సముద్రతీరం కావాలని ఇటు ప్రకాశం, అటు నెల్లూరు కలిపేసుకుంటారట. కలుపుకోవడానికి వీళ్లు రెడీయే ! కలవడానికి వాళ్లు రెడీ కావద్దా?

ఇలా ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకోవడానికి రాయల్ తెలంగాణ గురించి మాట్లాడితే మజ్లిస్ మాత్రం సీరియస్‌గా అది తమ రెండో ఆప్షన్‌గా చెప్పుకుంది. ఎందుకంటే రాయలసీమలో కూడా ముస్లిం జనాభా వున్నారు కాబట్టి కొత్త రాష్ట్రంలో ముస్లిం జనాభా చెప్పుకోదగ్గ సంఖ్యలో వుంటారని, వాళ్ల ఓటుబ్యాంక్‌గా మారతారని వాళ్ల ఆశ. రాయలసీమ ముస్లింలు కానీ, తెలంగాణ ముస్లింలు కానీ, కోస్తా ముస్లింలు కానీ విడిగా ఎప్పుడూ ఓటేయడం లేదు. తక్కినవాళ్లందరూ ఎవరికి ఓటేస్తే వాళ్లూ వాళ్లకే వేశారు. ఇందిరా గాంధీ హవాలోనూ కొట్టుకుపోయారు, ఎన్టీయార్ హవాలోనూ కొట్టుకుపోయారు, వైయస్ హవాలోనూ కొట్టుకుపోయారు. హైదరాబాదు పాతబస్తీలో మాత్రం మజ్లిస్ ఓ కోట కట్టేసి వారిది తప్ప వేరే ఎవ్వరి హవా చొరబడకుండా చూసుకున్నారు. ఆ కోటను రాయలసీమదాకా విస్తరించడం అయ్యే పనా?

1947లో జిన్నా కూడా ముస్లిం జనాభా అధికంగా వున్న ప్రాంతాలను పాకిస్తాన్‌గా యివ్వమన్నాడు. చూస్తే ఇండియాకు పశ్చిమాన పంజాబ్‌లో, తూర్పున బెంగాల్‌లో తేలాయి. అవే విడగొట్టి ఈస్ట్ పాకిస్తాన్, వెస్ట్ పాకిస్తాన్ అని యివ్వండి అన్నాడు జిన్నా. సరే అని అలాగే యిచ్చారు. రెండింటికి మధ్య రాకపోకలకై ఇండియా గుండా కారిడార్ యిమ్మన్నాడు. ఇవ్వడం కుదరదు పొమ్మన్నారు మనవాళ్లు. అందువలన పాకిస్తాన్ దేశంలో రెండు భాగాల మధ్య తిరగాలంటే విమానంలో వెళ్లాల్సిందే. ఓ చోట ఉర్దూ, పంజాబీ, సింధీ డామినేషన్. మరో చోట పూర్తిగా బెంగాలీ. వాళ్లకూ వీళ్లకూ పడేది కాదు. సంస్కృతిలో భేదం. మతం ఒక్కటే కామన్ ఫ్యాక్టర్. ఎన్నికల్లో ఈస్ట్ బెంగాల్ నాయకుడు ముజిబుర్ రెహమాన్‌కి మెజారిటీ వస్తే వెస్ట్ పాకిస్తాన్ వాళ్లు అతనికి అధికారం అప్పగించలేదు. మాదే రాజ్యం అన్నారు. దాంతో ఈస్ట్ పాకిస్తాన్‌లో అలజడి చెలరేగింది. వెస్ట్ పాకిస్తాన్ వాళ్లు వాళ్లని అణచివేశారు. వాళ్లు యిండియాకు శరణార్థుల్లా వచ్చిపడ్డారు. అప్పుడు ఇండియా రంగప్రవేశం చేసి ఈస్ట్ పాకిస్తాన్‌కు సైన్యసహాయం, ధనసహాయం చేసి 1971లో స్వతంత్ర దేశంగా ఏర్పడేందుకు సహాయపడింది. అలాగ రజతోత్సవం జరుపుకోకుండానే పాకిస్తాన్ రెండు ముక్కలైంది.

ఇప్పుడు మజ్లిస్ వారు కేవలం తమ ఓటుబ్యాంక్‌ను దృష్టిలో పెట్టుకుని రాయలసీమను తెలంగాణలో కలపమంటున్నారు తప్ప మరో కన్సిడరేషన్ లేదు. సరే వాళ్లు చెప్పారు కదాని కృష? కమిటీవారు తమ ఆప్షన్లలో దాని గురించి కూడా చర్చించి కొట్టి పారేశారు. దాన్ని కెసియార్ ఎక్కణ్నుంచో పట్టుకుని వచ్చి మొన్న బయటపెట్టారు. ఈ ప్రతిపాదనలో రాయలసీమలో రెండు జిల్లాలు మాత్రమే తెలంగాణలో కలుస్తాయని అన్నారు. ఈ ప్రతిపాదన ఢిల్లీ వర్గాలు ఎక్కణ్నుంచో వస్తోందని వెలిబుచ్చారు. ఇవాళ ఢిల్లీ వర్గాల వరస చూస్తే అసలు దీని గురించి ఆలోచిస్తున్నట్లే లేదు. నిన్న కోర్ కమిటీ, ఇవాళ మినీ కోర్ కమిటీ సమావేశాల తర్వాత ఆజాద్ కుండబద్దలు కొట్టి చెప్పారు – ప్రథమ దశ మాత్రమే అయింది, ఇంకా ఎన్నో దశలున్నాయి. ఢిల్లీ నాయకులు, రాష్ట్రంలో యితర పార్టీల నాయకులు.. అంటూ. మొదటిదశలోనైనా కామన్ గ్రౌండ్ అంటూ ఏర్పడిందా? లేదే ! ఎవరి స్టేటుమెంట్లు వాళ్లు చెప్పారు. అవి రికార్డు చేసి ఆజాద్ కోర్ కమిటీ ముందు పెట్టారు.

మరి అలాటప్పుడు రాయల్ తెలంగాణ గురించి ఆలోచించినది ఎవరట? ఇది కెసియార్ కావాలని సృష్టించిన గందరగోళంగానే అనుకోవాలి. టిడిపి ఎమ్మెల్యేలు మళ్లీ రాజీనామా చేసిన రోజునే యీ ప్రకటన చేసి ప్రజల దృష్టిని మరలిద్దామని చూశారు. నిజానికి పాపం టిడిపి వాళ్లు మళ్లీ రాజీనామా చేయడం రిస్కే కదా ! చటుక్కున స్పీకర్ ఆమోదించేస్తే ఉపయెన్నికలలో ఓడిపోయి వున్నవి పోగొట్టుకుంటారు కదా. అయినా ఏదైతే అది అయిందని రిజైన్ చేశారు. మీడియా దాని మీద ఫోకస్ చేయకుండా కెసియార్ యిదిగో ఈ ప్రతిపాదనను తెరమీదకు తెచ్చారు. ఇక రోజంతా దానిపై చర్చలు. టిడిపి వారికి గుర్తింపు లేకుండా పోయింది. శుక్రవారంనాడు ఆంధ్రజ్యోతివారు రెండు రాష్ట్రాలు, చెరో రాజధాని, హైదరాబాదు యుటీ అనే లీక్ యిచ్చారు. శనివారం నాటికి ఆంధ్రభూమి వారు యింకో అడుగు ముందుకేసి కెసియార్ ఎంత తెలివిగా ఢిల్లీలో పావులు కదపబోతున్నారో ఊహించేశారు.

హైదరాబాదును యుటీ చేయడం మజ్లిస్‌కు యిష్టం లేదు కాబట్టి ఆ ప్రతిపాదనను మజ్లిస్ ద్వారా అడ్డుకుంటారట. రాయల్ తెలంగాణ ప్రతిపాదన బిజెపికి, సిపిఐకు యిష్టం లేదు కాబట్టి ఆ ప్రతిపాదనను వారిద్వారా అడ్డుకుంటారట. ఇలా చేసి హైదరాబాదుతో సహా ప్రత్యేక తెలంగాణ యివ్వడం వినా వేరు మార్గం లేదని ఢిల్లీ వారిని ఒప్పించేస్తారట. అత్తతో అమ్మి కోడలితో కొన్నట్టు అటు బిజెపితో, యిటు మజ్లిస్‌తో ఏకకాలంలో సంసారం చేద్దామంటే కుదిరే పనా? ఒంటి అంకె ఎమ్మెల్యేలున్న బిజెపి, సిపిఐ వారి అభిప్రాయాలు ఢిల్లీవారు గణిస్తారా? మజ్లిస్ కాంగ్రెస్‌కు అండగా నిలుస్తోంది కాబట్టి వాళ్ల మాట కాస్త పట్టించుకోవచ్చు.

అయినా మజ్లిస్‌కు హైదరాబాదును యుటీ చేయడం యిష్టం లేదంటే నమ్మడం కష్టం. దానికి వారు తార్కికమైన కారణం ఏమీ యివ్వలేదు. 'మేం అలా చేయనివ్వం' అంటున్నారు తప్ప ! అలా చేస్తే తమ బలం హైదరాబాదుకే పరిమితం అయిపోయి తక్కిన తెలంగాణలో బిజెపి బలపడుతుందన్న భయమా? కానీ హైదరాబాదులో బాగా కన్సాలిడేట్ అవుతుంది కదా ! ఉద్యోగావకాశాలు , ఉపాధి కల్పన అన్ని వసతులు వున్న హైదరాబాదుపై పట్టు వదులుకుంటారా? ఏమో నాకు నమ్మకం చిక్కటం లేదు. యుటీ ప్రతిపాదనను వ్యతిరేకించడం పైపైన ఏమోనన్న అనుమానం వుంది. సమైక్యంగా వుంచలేని స్థితిలో యుటీకే వారు మొగ్గు చూపుతారనుకోవడం తర్కబద్ధం.

వీరి మాట ఎలా వున్నా కెసియార్ ఢిల్లీలో ఈ– ప్రతిపాదనలను అడ్డుకుందామని వెళితే మాత్రం వాళ్లు ఆశ్చర్యపడతారేమో ! మేం యింకా వాటి గురించి ఆలోచన మొదలు పెట్టందే, అప్పుడే ఏం తొందర అంటారేమో ! ఏది ఏమైనా కోమటిరెడ్డి రాజీనామా చేసి తన చిత్తశుద్ధి చూపించుకున్నారు. తెలంగాణ కాంగ్రెస్ వారు ఢిల్లీ క్యాంపు యిప్పట్లో ఎత్తేసే ఛాయలు కనబడటం లేదు. సమ్మె విరమణ అయ్యేదాకా అక్కడే తలదాచుకోవచ్చు. విరమించం అని కోదండరాం అంటున్నారు. ఇవాళ్టి కాంగ్రెస్ పార్టీ ధోరణి చూసి ఉద్యోగులు హతాశులై వుంటారు, ఇంకా ఎంతకాలం చేయాల్రా బాబూ అని. ఇక ఉద్యోగుల ఓపిక మీదనే సమ్మె కొనసాగింపు ఆధారపడి వుంది. ఇంకా హింసాయుతం చేసి రాష్ట్రపతి పాలన తెచ్చుకుంటారేమో చూడాలి. రాష్ట్రపతి పాలనలో యిలా మెత్తమెత్తగా డీల్ చేయడం వుండదు. వాళ్లకి రాజకీయ అవసరాలు వుండవు కాబట్టి పోలీసుల చేతికి పూర్తిగా అధికారాలు యిచ్చేస్తారు. పని చేసే వాళ్లని అడ్డుకుంటే తీసుకెళ్లి అరెస్టు చేసి లోపల కూర్చోబెడతారు. ఇది ఉద్యోగుల నాయకులకూ తెలుసు. ఈ పరిస్థితుల్లో పండగలు అయ్యాక కూడా సమ్మె కొనసాగితే ఆశ్చర్యపడాల్సిందే ! **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**